భారతి

సాహిత్య మాసపత్రిక

★

సంపాదకుడు

శివలెంక శంభుప్రసాద్

ఫిబ్రవరి 1955

సంపుటము 32 : : సంచిక 2

విడిపత్రిక వెల ఒక రూపాయి

విషయానుక్రమణిక

ఫిబ్రవరి 1955

త్రివర్ణ చిత్రము : పావంచాలు—చిత్రకారుడు : శ్రీ హెచ్. వి. రామగోపాల్

హిమసుందరి

శ్రీ ఉత్పల సత్యనారాయణాచార్య

అతి హిమమైన శీతల సితాంబుజ మాదలఁ దాల్చి, కోమలాం
చిత చరణారవిందముల నిర్మల నీల పథాల దాఁటి, ప
ర్వత శిఖరాల పైపయిని రమ్మ! ప్రఫుల్ల విశాల శాద్వలా
న్విత మృదులోర్వియం దడుగుఁ బెట్టుము చల్లదనాలు చిందఁగన్!

ఈ పెను మందులోన నిలువెల్లను దోఁగి పరిభ్రమింప నీ
పావటమీఁద కూఁకటులపైన రహించెను మంచుబొట్లు! ము
క్తాఫలరాశి ముద్గి కలధౌతపు దీవినిఁ దేలి ముందుగా
మా పురి కీవు వచ్చితివ? మౌక్తికముల్ వెదచల్లి పోవఁగన్!

నీదు తుహినాంబరాంచ లాచ్ఛాదనమున
నశ్రు పూర్ణమాధుర్యంబు ననుభవింతు!
మంచి ముత్యాల తలఁబ్రాలు మామకీన
శీర్షమందునఁగూడ వర్షించు మమ్మ!

సంజె

బాలగంగాధర తిలక్

గగనమొకరేకు కన్నుగవసోకు
ఎరుపెరుపుచెక్కిళ్ల విరిసినది చెంగల్వ
సంజవన్నెలబాల రంగుపరికిణీచెంగు
చీకటిని తాకినది—అంచుగా
చిరుచుక్క ప్రాకినది !

వాలునీడలదారి నీలిజండాలెత్తి
చుక్కదీపపువత్తి సొగయు బాటల నల్ల
నిదురతూలికనడక గదుముమైకపుకోర్కె
వచ్చునిశలోకరగి నవ్వు శశితోకలసి
సంజవన్నెలబాల రంగురంగు రుమాల
విసిరింది, కలలల్లు వెండితోటలమధ్య
వ్రాలినది, వ్రాలినది, తావిగా
సోకినది, సోకినది !

సంజపెదవులయెరుపు కదలిఅంచులవిరిగి
సంజపరికిణీచెరగు యెడదలోతుల మెరసి
ఏటికొంగలనిదుర యెర్రగా ప్రాకింది
బాతురెక్కలనీడ బరువుగా సోలింది
సంజవన్నెలబాట స్వర్ణ స్వర్ణదిధార
వయసుమైకపుజీర కరగుమబ్బులతేల
గగనమొకరేకు కన్నుగవసోకు.

పట్టు తెరలు

శ్రీ పురాణం సూర్యప్రకాశరావు

కొత్త ఊరు. మొదట్లో కొంత కంగారుపడ్డ మాట వాస్తవమే. అయినా అధికారులు చేసే పన్లన్నీ ఇలాగే ఉంటాయి. విశాఖపట్నంలో ఇరవై ఏళ్ళు నౌకరీచేసి ఇప్పుడిక కొద్దికాలంలో రిటైరయ్యే వయసులో బెజవాడ బదిలీ ఏమిటి చెప్పండి? మరి గత్యంతరం లేనప్పుడు నోరుమూసుకుని వాళ్ళ ఆజ్ఞానుసారం నడవవల్సిందే. నిన్ననే ఈవూరు వచ్చాను. నా చిన్నతనంలో ఎప్పుడో చూసిన పట్నం. మళ్ళీ ఇన్నాళ్ళకి చూస్తున్నాను.

నిన్న సాయంత్రం సత్యన్నారాయణ కనిపించాడు. వాడ్ని పట్టుకుని మంచివాటా ఏదైనా చూసి పెట్టమంటే ఇవ్వాళ సాయంత్రం వాళ్ళింటికి రమ్మన్నాడు. ప్రస్తుతం ఆఫీసులోనే మకాం. ఎలాగో రెండు రోజులు ఓపికపడితే సత్యన్నారాయణ ధర్మమా అని మంచివాటా ఏదైనా దొరుకుతే మకాం మార్చెయ్యాలి.

సత్యన్నారాయణింటికి వెళ్లాను. వాళ్ళింటి ముందే ఇల్లు. ఒక వాటా ఖాళీగా ఉందిట! అద్దె ముప్ఫై రూపాయలు. అయిదు గదు లున్నాయి. ఇల్లు విశాలంగా గాలీ, వెలుతురూ చొరటానికి వీలుగానే ఉంది. అయితే ఉన్న అసౌకర్యమల్లా ఇంటి ఉనికి ఊరికి చివరకావటం; నీళ్ళ ఎద్దడి. చివరి కెలాగో సర్దుకుని ఆ యింట్లోనే ఉండటానికి నిర్ణయించుకుని ఆఖరిమాటగా సత్యన్నారాయణని అడిగాను. "ఇంటి వాళ్లు మంచివాళ్ళేనా" అని.

కాసేపో నసుగుతూ "మన నోరు మంచిదైతే ఊరంతా మంచిదే. ఎలాగో సర్దుకోవచ్చు లెద్దూ. చాలా పేదవాళ్ళు. ఇంటిమీద అద్దే ఆధారం" అన్నాడు.

"ఇంటాయన పేరు? ఉద్యోగం?"

"ఇంటాయన కాదు. ఇంటావిడ. ఆయనపోయి చాలా రోజులయింది." అన్నాడు సత్యన్నారాయణ.

ఆరోజే ఇల్లు తాళంవేసి ఒకనెల అద్దె అడ్వాన్సుకట్టి కొంత ముఖాముఖీని ఆవిడతో మాట్లాడి మరీ చక్కా వచ్చాను. ఇందాక సత్యన్నారాయణ చెప్పిందాన్నిబట్టి ఆవిడ కొంచెం పేచీకోరుమనిషి కాబోలు అనుకున్నాను. వాడు చెప్పే తీరు అలాగుంది మరి. అయితే ఆవిడ మాటలధోరణి విన్నతర్వాత నా అభిప్రాయం సత్యదూరమైంది కాబోలు అనే సందిగ్ధావస్థలో పడ్డాను. ఎంతో మంచితనం, మర్యాద, అవసరంలేని అణకువ ఆమె ప్రదర్శించటంబట్టి నేనలాగే అనుకున్నాను.

రాత్రి పదింటికి సరస్వతికి ఉత్తరం రాయటం ఉపక్రమించాను. ఆ రోజంతా ఆకాశం కారుమేఘాలు కమ్ముకుని మసక మసగ్గా ఉంది. ఆరోజు హోటలు భోజనంకూడా అలాగే ఏడిసింది రుచీ పచీ లేకుండా. ఈ చిరాకులో భార్యని ఒచ్చెయ్యమని రాద్దామనిపించినా పురిటికంటూ మళ్లీ మూడునెలల్లో ఎలాగైనా పంపించక తప్పదు కాబట్టి ఎందుకొచ్చిన అనవసరపు శ్రమ అనుకుని ఆ ఉద్దేశం విరమించుకున్నాను. ఆ ఉత్తరం పూర్తిచేసి మరో అరగంట పుస్తకం చదువుకుని మరీ పడుకున్నాను.

తెల్లవారి లేచేసరికి బారెడు పొద్దెక్కింది. ఆఫీసు ప్యూనువచ్చి లేపేవరకూ మెలుకువే రాలేదు. ఆ సాయంత్రమే ఆఫీసునుంచి పెట్టె బేడా ఆయింటికి మార్చేశాను. ఇప్పుడు కొంత స్వేచ్ఛగా ఉంది. ఆఫీసులో ఉన్నందువల్ల వచ్చిన నష్టమేమీ లేదుగాని ఏమిటో పరాయివాళ్లదయా ధర్మాల మీద జీవించటంలా ప్రాణం చచ్చిపోయినట్టుగా ఉంటుంది. ముప్ఫైరూపాయిలు పడేస్తే హాయిగా

...చ్చు. ఇల్లు ఊరికి దూరమైనా ఆఫీసుకు దూరం ... అయితే హోటలుమటుకు దూరం.

...ప్రతిరోజూ సాయంత్రం చాలా సరదాగా ...వాళ్లం. సత్యన్నారాయణకోసం రోజూ ... వస్తానే ఉండేవారు. వాళ్లతో రాత్రి ...రేవరకూ మధ్య హాలులో పేకాట వేసేవాళ్లం. ...కాలక్షేపంఅయిపోయేది. కొత్తచోట ఒంటిగా ...న్నననే దిగులూ, తెంగా ఇప్పుడు లొంగదీసుకో...తున్నాయి నన్ను.

...చేతివాచీకేసి చూసి "అబ్బో! పది దాటింది. ...దాం" అన్నాడు సత్యన్నారాయణ. ఆతర్వాత ... రెండు మూడుసార్లు ఆవులించి చేతిలో ...లు నిద్రమత్తులో జారవిడిచాక గాని మిగతా ...కి అక్కడితో ఆటకట్టిపెడదామనే ధ్యాసే ...ంది. నేను మాత్రం ఏదో సభ్యతకోసం అన్న... ముంచుకొస్తున్న నిద్రని బలవంతాన అపు...—మధ్య మధ్య ఆ విషయం వాళ్లు గుర్తిస్తా...వని తెచ్చికోలు నవ్వులు నవ్వుతూ నటన సాగి...ను.

...చివరికి సత్యన్నారాయణ "మన మూలాన ...పొరుగు వాళ్లకి కూడా నిద్రాభంగం. ఈ ...ని కొద్ది రోజుల్లో ఇరుగు పొరుగు వాళ్లకి ...శ్లమయిపోతాం." ఉన్నట్టుండి గొంతు తగ్గించి ... మా పెల్లాగున్నా ఇంటావిడ మటుకు దీనికి ...ంచు కనిపెడుతూనే ఉంటుంది. పైవాళ్లం ...ందిలే! ఎటొచ్చీ నీ సంగతి చూసుకో" ...డు నన్నుద్దేశించి.

...ఆవిడ ప్రస్తావన వచ్చినప్పుడల్లా సత్యన్నారా... ఈ ధోరణి అవలంబించటం నాకు కష్టంగానే ... "ఫర్వాలేదులే. ఆ మందుకి విరుగుడు నాకు ... నువ్వేమీ బాధపడకు" అన్నాను.

..."ఆవిడ భర్త పోలీసు హెడ్డు. ఈ చుట్టు ... మాంచి పేరు మోసినవాడు. పాపం ఓ సుము...నైన ఆవిడ చేతి చీపురుదెబ్బలుకూడా రుచి ...డు. మళ్లీ చనిపోయేవరకూ ఆవిడ ముందు ... ఆవిడ అవునన్నది కాదంటే ఒట్టు. హెడ్డు ...టే ఈ ఊరంతా తెలుసు. మరో ఫార్సు జరుగు...ది. మాతో కలిసి పేకాట ఆడుకోవాలని మహా ఉబలాటపడేవాడు. అయితేనేం ఏ తలుపు చార నుంచో భార్య గుర్లుఎఱ్ఱ చేసిందంటే గబగబా ఏమీ ఎరగనివాడిలా జాబిరీలోంచి గదిలోకివెళ్ళి రాసుకుంటూ కూర్చునేవాడు. పాపం! అల్పజీవి!" ఈ చివరి వాక్యం హేళనగా పూర్తిచెయ్యటంతో మిత్రులంతా కొంచెం పెద్దగానే నవ్వారు. "జాగ్రత్త అవతల ఆవిడకి వినిపిస్తుంది" అన్నట్టుగా సౌంజ్ఞచేశాడు సత్యన్నారాయణ.

ఈవిడ చరిత్ర వినటానికి-వినోదంగా ఉంది కాబోలు అందరికీ నిద్రలు తేలిపోయాయి. సత్యనారాయణ వేపు రెప్పవెయ్యకుండా చూస్తున్నారంతాను.

చివరికి నేనే ఈ చర్చని ఓ కడకు చేరుస్తూ "ఇక పడుకుందాం. పదకొండు దాటింది" అన్నాను.

అంతటితో ఈ పరనింద ఆగిపోయింది. ఎవరికి వారు తోచినట్టుగా అభిప్రాయాలిస్తూ సత్యన్నారాయణని అనుసరించారు.

ఆ తర్వాత చాలా సేపటివరకూ నా మెదడంతా మా ఇంటావిణ్ణి గురించిన ఆలోచనలతో నిండిపోయింది. మర్నాడు ఎలాగైనా వీలుచేసుకుని ఆవిడతో మాట్లాడాలనుకున్నాను. ఎందుకో తెలియదు కాని సత్యన్నారాయణ చెప్పిందాన్నిబట్టి ఆవిణ్ణి గురించి పూర్తిగా తెలుసుకోవాలనే పట్టుదలా, ఉత్కంఠా నాలోనూ కలిగాయి.

ఉదయం ఏడు దాటి ఉంటుంది. వాళ్ళ జాబిరీకి మా జాబిరీకి మధ్య ఓ తడికమాత్రం అడ్డం. పడకకుర్చీలో కూర్చున్నాను. అవతల్నుంచి వాళ్ళెంత నెమ్మదిగా మాట్లాడినా నా చెవులో చెబుతున్నట్టే ఉంటుంది.

ఇంటావిడ ఎవరితోనో మాట్లాడుతోంది. ప్రసంగ విషయం స్పష్టంగా బోధపడుతోంది.

"పోనీలే తల్లీ. ఈ ప్రపంచంలో ఎవరుమటుకు శాశ్వతంగా ఉండబోతున్నారు. ఏదో పెంచిన మమకారం అలా అనిపిస్తుంది. మీ శాయశక్తులా మీరు కష్టపడ్డారు. భగవంతుడు తప్పదలిచాడు. దాని ఆయుర్దాయం అంతటితో సరి"—అనునయంగా మాట్లాడుతోంది ఇంటావిడ.

"అయ్యో! చెట్టంత కూతుర్ని నా పొట్టను పెట్టుకున్నాను తల్లీ దాన్నుంచి నన్నన్నా తీసుకుపోయాడుకాడు భగవంతుడు."

ఆవిడ కూతురు చనిపోయింది. ఆ బాధనంతా ఒకళ్లముందర వెళ్ళబోసుకుని ఎదటివాళ్ళ సానుభూతి, అనునయ వాక్యాలతో కొంత ఉపశమనం పొందటంకోసం ఆవిడ ఆ ప్రస్తావన తీసుకొచ్చింది కాబోలు.

“అవునుగాని మీ అల్లుడుగారు మళ్లీ పెళ్ళిచేసుకుంటున్నారని విన్నాను. అదెంతవరకూ నిజం?” ఇంటావిడ అడిగింది.

“నేనూ విన్నాను. అయితే కావచ్చు. ఎవరెలాపోతే నాకేం తల్లీ! నా కూతురుకి నూరేళ్లూ నిండిపోయాయి.” అంది బొంగురు గొంతులో ఆమె.

“మీరు మరీనండీ ఎలాగో ఓర్చుకోవాలిగాని పోయినవాళ్లతో మనమూ పోతామా? మనిషై పుట్టింతర్వాత చావు తప్పతుందా భగవంతుడి దయ”—నాకీ చివరివాక్యం విన్న తర్వాత సత్యన్నారాయణ చెప్పింది జ్ఞాపకం వచ్చింది. తరచు ఆవిడ భగవంతుడి ప్రస్తావన లేకుండా ఏ విషయమూ ప్రస్తావించదని సత్యన్నారాయణ చెప్పాడు. వాడు చెప్పింది అక్షరాలా నిజం!

ఆ తర్వాత ఆమె చాలా విషయాలు చెప్పింది. ఇంటావిడ శ్రద్ధగానే వింటోంది కాబోలు మధ్యమధ్య ఈ జాలిగాథకు కరిగిపోయినట్టుగా నిట్టూర్పులు విడుస్తోంది.

ఇంతట్లో వంటగదిలోంచి చిన్నకొడుకు కేకేశాడు. “ఒస్తాను పనుందంటూ ఇంటావిడ లోపలికి పోవటంతో ఆ అపరిచితవ్యక్తి లేచి వెళ్లిపోయింది. ఆవిడ వ్యధిత హృదయాన్ని అర్థంచేసుకున్నానేమో నాకూ చాలా జాలివేసింది. నాకు నా చిన్నతనం జ్ఞాపకం వచ్చింది. తెల్లవారి లేచింది మొదలు అమ్మ ముఖం కడగాలి, అమ్మ కాఫీ తాగించాలి, అమ్మ బట్టలు కట్టాలి ఇలా నా దైనందిన కృత్యాలన్నీ నా ప్రయత్నం, ప్రమేయం లేకుండానే జరిగిపోయేవి. రాత్రి అమ్మ అన్నం తినిపించేటప్పుడు, అమ్మ ఒడిలో కూర్చుని రాజకుమారుడి కథ వింటూన్నప్పుడూ, రాత్రి జోకొడుతూ, పాడుతూ నిద్రపుచ్చేటప్పుడు, ఎందుకో ఒక్కసారి ఆమె కంఠం కాగలించుకుంటేగాని తృప్తిగా ఉండేదికాదు. ఇవన్నీ గడిచిపోయిన గాథలు, నిరంతరం జ్ఞాపకముండే మధుర స్మృతులు. ఆ రోజుల్లో అనుకునేవాణ్ణి “అమ్మని విడిచిపెట్టి ఒక్క నిముషం ఉండగలనా” అని.

ఆ తర్వాత కొన్నాళ్లకి “పుట్టిన ప్రతి ప్రాణీ చనిపోతుందన్న పరమసత్యం తెలుసుకున్న తర్వాత అమ్మ చనిపోతే ఈ ప్రపంచంలో జీవించటం ఎలా” అనుకుని బాధపడ్డాను. అప్పుడప్పుడు ఈ తలపు వచ్చినప్పుడల్లా లోపల్లోపల ఏడ్చేవాణ్ణి కూడా. ఎందుకో “అది అసంభవం, అలా జరగటానికి వీల్లేదు” అనుకునేవాణ్ణి.

నా ఇరవయ్యో ఏట ఆమె చనిపోయింది. అప్పటి కామె వయస్సు నలభైఅయిదేళ్లే. చాలా మందికి మల్లేనే ఆమె బాధపడి మరీ చనిపోయింది. అసంభవం, అలా జరగటానికి వీల్లేదు అనుకున్నదే చాలా సామాన్యంగా జరిగిపోయింది. ఆ తర్వాత తర్వాత అప్పుడప్పుడు జ్ఞాపకం వచ్చి నన్ను కలవరపరచే స్మృతిగానే మిగిలిపోయింది.

“ప్రకాశం!”—సత్యన్నారాయణ పిలుపుతో ఆలోచనలన్నీ చెల్లాచెదరయిపోయాయి.

“రా! కూర్చో”

సత్యన్నారాయణ నేరుగా లోపలికి వచ్చి కుర్చీలో కూర్చున్నాడు. “ఆఫీసుకు వేళ కాలేదూ?” అని అడిగాడు.

“ఇవ్వాళ ఒంట్లో అదోలాగుంది. భోజనం కూడా మానేద్దామనుకుంటున్నాను. ఆఫీసుకు పోవాలని లేదు” అన్నాను.

“సరే అయితే సెలవుచీటీ రాసియ్యి. తీసుకుపోతాను.” రాసిచ్చాను. అతను వెళ్ళిపోయాడు.

పదకొండు గంటలవరకూ పుస్తకం చదువుకుంటూ గడిపాను. ఆతర్వాత నిద్రపోయాను. తిరిగి మెలుకువ వచ్చేసరికి పన్నెండు దాటింది. ముఖం కడుక్కుందామని పెరట్లోకి పోయేసరికి వాళ్ళ వంటింట్లోంచి మాటలు వినిపిస్తున్నాయి. భోజనం చేస్తున్నారు కాబోలు.

తడికవారగా వెళ్ళి నిలబడ్డాను.

“బంగాళాదుంపలకూర వేసుకోవుటే? పోనీ కాబేజీ కూరన్నా తిను—ఛీ! పాడు పిల్లలు! ఎంత ఖరీదైన వంటకాలు చేసుకున్నా మట్టుకోరుగదా

...అందుకే అలాగ ఏడుస్తున్నావు వుసూరు
..."
– కొద్దంటే ఎందుకే బలవంత పెడతావు"
...ఆ చిన్న కూతురు.
...నికైనా రాసిపెట్టుండాలి, అనుభవించటా
...ది ఇంటావిడ.

...కు మొదట్లో సత్యన్నారాయణ చెప్పిన
...జ్ఞాపకం వచ్చాయి. పేదవాళ్ళనీ, ఇంటి అద్దె
... అనీ చెప్పాడు. ఇప్పుడు వాళ్ళ ధోరణి
...సత్యన్నారాయణ చెప్పిందానికి పూర్తిగా
... ఉంది. మా యింట్లో కూడా ప్రతీ పూటా
...ంపల కూరా, కాబేజీ కూరా వండుకోవటం
...ము.

...న్న కూడా వీళ్ళు చాలా ఖరీదైన వంటకాలే
...న్నారు. సత్యన్నారాయణ అన్నంత పేద
... కారు, ఇంటి అద్దే ఆధారంగా జీవిస్తున్న
...వారు" అనుకున్నాను. బహుశా కొంత ఆస్తి
...ండిఉండాలి.

...ను ఉండబట్టలేక ఓ చిలిపిపని చేశాను. తడిక
...ంచి వాళ్ళ వంటగదిలోకి చూశాను. క్షణం
...య్యాను.

...ళ్ళు తాగుతున్నది ఉత్తి గంజి! పచ్చి గంజి!
... ముందూ మూడు కంచాలున్నాయి. ఆ
... ఒకటి రెండు రొట్టెలకంటె ఎక్కువ
...ఆ రొట్టెలు తిని ఆ గంజి తాగేసి వాళ్ళు
... లేచారు. అంతా నటన! ప్రతిరోజూ ఈ విధ
...టకం ఆవిడ ఎందుకు ఆడుతున్నట్టో! వలు
...ఆవిడ్ని పేదవాళ్ళు అనుకోవటం నామోషీ
...! గొప్పగా మాట్లాడినంతమాత్రాన ఆవిడ నిజ
...లియకుండా ఉంటుందా? సత్యన్నారాయణ
... వాస్తవం! వాళ్ళు పేదవాళ్ళని మనం పాను
...రూపించటానికి ఇష్టపడదు. తమాషా వ్యక్తి!

...తర్వాత తర్వాత వాళ్ళేది మాట్లాడుకుంటున్నా
...నిపించేది. ఓ రోజు నేను మరో విషయం
...వాను. ప్రతి దినం భోజనానంతరం వాళ్ళు
... మధ్యహాల్లో కూర్చుని ఎవరైనా ఆపూట
...లుగురించి అడిగితే ఏ కేవి చెప్పాలో ముందు
...డాలుక్కునేవారు. అమ్మలక్క లెవరైనా

ఆ ప్రస్తావన తెస్తే తడుముకోకుండా ఏవేవో చెప్పేసేవారు.

అప్పుడప్పుడు రెండు మూడు రోజుల కోమారు ఆ ముసలావిడ వచ్చి కూతుర్ని తల్చుకుని కంటనీరు పెట్టుకునేది. ఒకనాడు ఆవిడముందు ఇంటావిడ ప్రదర్శించిన వైఖరి చూస్తే నాకు అమిత ఆశ్చర్యంవేసింది. అంత నిష్కర్షగా, నిర్మొహమాటంగా ఎలా మాట్లాడగలిగిందా అనిపించింది.

"ప్రతినిత్యం అయిన వేళా కాని వేళా వచ్చి నట్టింట్లో ఇలా కన్నీరు కారిస్తే ఈ కొంపలో సుఖంగా బ్రతకలేమండీ. నీ కూతురు పోతే నాకేమిటి మధ్యని. నా కూతుళ్ళూ, కొడుకూ సుఖంగా ఉండిపోయారని మీకేదో దుగ్ధగా ఉన్నట్టుంది. ఇకనించీ మా గుమ్మంలో అడుగుపెట్టకండి" అంది ఇంటావిడ.

ఆ ముసలావిడ మారుమాట్లాడకుండా వెళ్ళిపోయింది. నా నోట మాట పెగల్లేదు.

ఆ రోజు ఆదివారం. సాయంత్రం సత్యన్నారాయణా నేనూ సినిమాకని బయల్దేరాము. ఇంటావిడ బయట కూచున్నదల్లా లేచి లోపలికి వెళ్ళిపోయింది.

తీరా సినిమా మొదలుపెట్టే సరికి సగంలో ఇంటికి వెళ్ళిపోతే బాగుండు ననిపించింది. సభ్యత కోసం కళ్ళుమూసుకుని ఆట అయేవరకూ ఓపిక పట్టాను.

బయటికొచ్చింతర్వాత సన్నసన్నగా వాన తుంపర ప్రారంభమైంది. ఇంటికి చేరేసరికి పదిన్నర యింది. ఇంటి కొచ్చినతర్వాత సరస్వతి పేర ఉత్తరం రాశాను. "ఒక కొత్తరకం మనిషిని ఈ ఉత్తరం ద్వారా పరిచయం చేస్తున్నాను. ఇప్పుడు నే ఉంటున్న ఇంటావిడే ఆ వ్యక్తి. చాలా తమాషా మనిషి. చాలామందితోపాటు నువ్వూ ఆవిడ్ని అపహ్యాసించుకుంటావు. నెలకో ఏభైరూపాయిలు అద్దెల మీద వస్తాయి. ఆపైన ఆదాయం చిల్లిదమ్మిడీ లేదు. భర్త చనిపోయాడు. ఒక ఆడపిల్లకి పెళ్ళయిపోయింది. ఆమె అత్తవారింటికి వెళ్ళిపోయింది. ఇంకో ఆడపిల్ల పెళ్ళికి ఎదిగిఉంది. ఇంకో మొగపిల్లవాడున్నాడు. వాడికి చదువూ సంధ్యా లేదు. ఇలాటి నిత్యకాటకపు రోజు ఏభైరూపాయిల్తో గుట్టుగా అంత సంసారం గడుపు కొస్తోందంటే నాకే మొదట్లో ఆశ్చర్యం

చేసింది. నమ్మలేకపోయాను. కాని అది యథార్థం. ఆవిడ గురించి ఎవరూ జాలిపడకూడదు; అందు కావిడ ఒప్పుకోదు కాబట్టి. ఓపూట తినీ, ఓపూటా తినకా అలా గడుపుకొస్తోంది. బైటవాళ్ళకి మటుకు తన నిజ స్థితి తెలియకుండా గొప్ప కబుర్లు చెబుతూంటుంది." —ఇలా ఆమెగురించి రాసుకొచ్చాను. రైలు పదకొండు దాటింది. నిద్ర ముంచుకొస్తోంది. తలుపులు వేసి పక్క మీద చారబడ్డాను.

* * * *

"మా ఇంటావిడకు ఈ ఊళ్ళో బంధువు లెవరూ లేరా ఏమిటి?" అని అడిగాను సత్యనారాయణని.

"అలా అని ఆవిడందా?" అన్నాడు సత్యనారాయణ.

"అబ్బే! లేదు. నేనే అడుగుతున్నా"

"చాలామంది ఉన్నారు. అన్నగారు, తండ్రి, అప్పగారు. పెద్దకొడుకు అంతా ఈ ఊళ్ళోనే ఉన్నారు."

"అహాఁ!" అన్నాను ఆశ్చర్యంగా. నేనొచ్చి పదిహేను రోజులయింది. ఒక్కనాడు వాళ్ళనిగురించిన ప్రస్తావన ఆ యింట్లో రావటం నే వినలేదు. నే నేదో అడగాలని ప్రయత్నించే లోపునే "అయితే మాత్రం ఏం ప్రయోజనం? ఇంతమందిలోనూ ఏ ఒక్కరూ ఆవిడ దృష్టిలో ఆప్తులుకారు." అన్నాడు సత్యనారాయణ.

"బహుశా వాళ్ళవల్ల ఆవిడ కొంత నష్టపోయి ఉండొచ్చు." అన్నాను.

నా తలకాయ! ఎవరూ దాని కేవిధమైన అన్యాయమూ చెయ్యలేదు." అన్నాడు సత్యనారాయణ.

"ఆ విషయం నీ కెలా తెలుసు?"

"నేనూ ఆవిడ బంధుకోటిలో ఒకణ్ణి కాబట్టి."

నే నాశ్చర్యపోయాను. సత్యనారాయణ ఆవిడ ఆత్మీయుల్లో ఒకడన్నవిషయం నా కింత వరకూ తెలియదు. "అయితే నీతోనూ ఆవిడకి మాటల్లే వేమిటి?" అని అడిగాను.

సత్యనారాయణ తల అడ్డంగా ఊపి "మాటల్లేవు" అన్నాడు. ఆవిడను గురించి సత్యనారాయణ చెప్పే ప్రతి విషయం ఆశ్చర్యకరమైందిగానే ఉంటోంది. ఇంతమందితో ఆవిడెందుకు తెగతెంపులు చేసుకున్నట్టు? ఏదో ప్రబలమైన కారణం ఉండి ఉండాలి అనుకున్నాను. అయితే ఆ కారణాలు ఏమిటో వాటిగురించి ఊహించి ఆ ఊహని ఆధారం చేసుకుని తర్జన భర్జనలు చెయ్యటానికి తగినంత సావకాశం నాకు లభించలేదు. హోటల్నుంచి నేరుగా ఆఫీసుకు వెళ్ళిపోయాను. సాయంత్రం భోజనంచేసి ఇంటికొచ్చే సరికి దీపాలవేళయింది. ఇంటివాళ్ళ గుమ్మంలో ఏవో కొత్తముఖాలు కనిపించాయి. తర్వాత వాళ్ళ ధోరణిబట్టి ఆ వచ్చింది ఇంటావిడ పెద్దకూతురని గ్రహించగలిగాను. ఆపూటే వచ్చి ఉంటారు.

కాళ్ళు కడుక్కుని కుర్చీలో కూర్చుని పుస్తకం చదువుదామని తెరిచాను. కళ్ళముందు పేజీలు తిరిగి పోతున్నాయన్న మాటేగాని విషయం మటుకు బుర్ర కెక్కటంలేదు. పక్క వాటాలో వాళ్ళమాటలు వినాలనే ఉత్సాహాన్ని ఇవేవీ ఆటంకపరచలేక పోతున్నాయి.

"ఒకటా రెండా? అరవై రూపాయలు! నీ కిద్దామనే జాగ్రత్తచేశాను. తీరా బండి ఎక్కబోయేముందు చూసుకుంటే అంత డబ్బూ మాయం అయి ఊరుకుంది. అత్తగారు తియ్యకపోతే ఏమైయుంటాయి చెప్పు. అడుగుతే 'నాకేం తెలుసూ' అంటూ బుకాయించింది" పెద్దకూతురు చెబుతోంది.

ఇంటావిడ ఊరంత గొంతుచేసుకుని "ఏమో! అదే తీసిందో, లేకుంటే నువ్వాడేదే అబద్ధమేమో!" అంది కఠినంగా. పెద్దకూతురు "అదేమిటే అలాగంటావు. తేపా వచ్చినప్పుడల్లా పాతికా ముప్ఫై నీ కిచ్చిపోవటంలా? అబద్ధం ఆడాల్సిన అవసరం నా కేమిటి?" అంది.

"ఏమో నాకెలా తెలుస్తుంది. ఒక్కమాట చెబుతున్నాను విను: నువ్వింటికి రాదల్చుకుంటే, నువ్వెన్నాళ్ళిక్కడ ఉండదల్చుకున్నావో అన్నాళ్ళకీ నీకయ్యే ఖర్చులు నువ్వే భరాయించుకోవాలి. లేకుంటే మనుమల్నందర్నీ పోషించటం నాతరం కాదు. ఈ కుంటిసాకులు నాదగ్గిర పనికిరావు."

"సరేలే అలాగయితే రేపే వెళ్ళిపోతాను. ఒక్కరోజుకూడా ఉండను"—పెద్దకూతురు గొంతు రుద్ధమయింది.

ఇంటావిడ దృఢమైన స్వరంతో "మంచిది
చెయ్యి" అంది.

ఏమిటీ మనిషి! రాకరాక సంవత్సరానికోమారు పుట్టింటికి వస్తే ఎంత ఆదరణ, ఎంత ఆప్యా చూపెట్టాలి! అది లేదు సరిగదా ఆమె వచ్చి ల్లా ఆమె తిండికయ్యే ఖర్చు ఆమె భరించుకో నాకంతా అయోమయంగా కనిపించింది. రించి ఆలోచించాలని ప్రయత్నిస్తే వాటికో దరీ అంటూ కనుపించవు.

మర్నాడు ఉదయమే పెట్టే బేడా సర్దు లతో సహా తిరిగి అత్తవారిపూరు వెళ్ళిపో నిన్న సాయంత్రం వచ్చి ఈ ఉదయం వెళ్లి దంటే ఆ వెళ్ళటం ఆమె కెంతకష్టం కలిగి నాకు తెలుసు. ఆమె ముఖమంతా నిగారించి కట్టిఉంది. రాత్రంతా ఏడ్చిఉంటుంది. డ మటుకు నిశ్చలంగా గుమ్మందగ్గర నిలబడి చ్చింది.

గంట పోయింతర్వాత ఎవరితోనో "మా మావగారికి సీరియస్ గా ఉందిట. టెలిగ్రాం అందుకని వెళ్లిపోయింది" అనటం విన్నాను. యంత్రం సత్యన్నారాయణలో ఇలా జరిగిం ప్పను. ఇదేదో చాలా సామాన్య విషయం గా చప్పరించి ఊరుకున్నాడు. క్షణం ర్వాత "నీకో మంచివార్త" అన్నాడు యణ ఉన్నట్టుండి.

విటది?"

హుశా ఒకటి రెండు నెలల్లో నీకు విజయ బదిలీఅవుతుందనుకుంటున్నారు. నీకిష్టమేనా"?

ంతకంటే కావాల్సిందేముంది?" అన్నాను.

దట్లో ఈ వార్త నమ్మలేకపోయాను గాని ఫీసులో కనుక్కుంటే నిజమే అని తేలింది. పుడా అనుకున్నాను.

* * *

యం ఏడుదాటింది. గుమ్మంలో కూచుని టున్నాను. గుమ్మంముందు ఆ కాస్తజాగా శుభ్రంచేసి వెళ్లిపోయింది. పెరుగువాళ్లూ, ళ్ళు, కూరగాయలవాళ్లూ అరుచుకుంటూ రు.

"బాబూ!"—ఈ కంఠం విని ముఖమెత్తి చూశాను. ముష్టివాడు! జేబులో అర్ధణా ఉంది. అది వాడిచేతిలో పడేశాను. అక్కణ్ణించి వెళ్లి పక్క వాటా గుమ్మంముందు నిలబడి పిలుస్తున్నాడు. ఇంటావిడ గుమ్మం వారగానే కూర్చుని ఉంది. నేను అర్ధణా ఇవ్వటం ఆవిడ చూసే ఉండాలి. నాకు వినపడేట్టుగా వాణ్ణి పొమ్మని కసిరి కొట్టి "పాడు వెధవలు! తినమరిగి ఈ కొంప విడిచిపెట్ట లేకపోతున్నారు. ఎంత డబ్బు! ఎన్నెన్ని బట్టలు ఎలా దానంచేసేవా రాయన! (ఆవిడ భర్తగారన్న మాట!) పెట్టేకొంపేదో, పెట్టనికొంపేదో వాళ్లిట్టే పసిగడతారు. అంతా మోసం! ఈ బియ్యం తీసుకెళ్లి బజార్లో అమ్ముకోవటం నా కళ్లతోనే చూశాను. ఇటువంటి వాళ్ళకు దానంచేస్తే పాపం చుట్టుకుం టుంది కూడాను."—పుస్తకం ఎప్పుడో మూసేశాను. పగలబడి నవ్వాలనిపించినా బలవంతాన అణచుకు న్నాను. ఏ క్షణాని కాక్షణం ఆవిడ్ని ఆవిడ రక్షిం చుకుందుకు ప్రయత్నిస్తూనే ఉంటుంది. కేవలం వాళ్లు తన్ని మోసం చేస్తున్నారని తెలిసింతర్వాతే ఆవిడ దానధర్మాలు ఆపుకుందనీ, ముష్టివాళ్లంటే ఆవిడా ఒకప్పుడు ఆదరణ చూపించనీ, ఆవిడెంతో సహృ దయురాలనీ మనం అనుకోవాలని ఆవిడ తాపత్రయం. ఎవరైనా ఆవిడగురించి తేలిగ్గా అభిప్రాయపడతా రేమోనని ముందుగానే జాగ్రత్తపడుతూంటుంది. ఆతర్వాత ఆవిడ కూతురికి ముష్టివాళ్లగురించి చాలా కట్టుకథలు చెప్పింది.

నేను తాళంవేసి హోటలుకు బయల్దేరాను.

* * * *

ఓనాడు ఉదయం మధ్య హాల్లో కూర్చుని ఇస్త్రీ బట్టలు సర్దుకుంటున్నాను. ఇంటావిడ చిన్న కొడుకు వచ్చి గుమ్మం వారగా నిలబడ్డాడు. అతనొచ్చి చాలసేపయి ఉంటుంది. నే తలెత్తి చూసేసరికి గుమ్మంవార నిలబడి వీపు గోక్కుం టున్నాడు. ఒంటిమీద బనీనైనా లేదు. నెత్తిమీద జుట్టు పెరిగిపోయి చెవులమీదికి పడుతోంది.

"ఎంతసేపయిందోయ్ వచ్చి. పిలవలేదేం?" అన్నాను. అతనక్కడే చతికిలబడి "ఈపూటకి మా యింట్లో బియ్యం నిండుకున్నాయి. ఓ రూపాయి ఉంటే ఇస్తారా?"—అతను చెప్పబోయేది ఇంకా

పూర్తికానేలేదు. లోపల్నించి 'చలపతీ!' అంటూ కేకేసింది ఇంటావిడ. ఆవిడ గొంతువిని నేనే చాలా కంగారుపడ్డాను. వాడు పిల్లిలా ముడుచుకుపోయాడు. ఆవిడ మళ్లీ కేకేసింది. జేబులో రూపాయితీసి అతనికి ఇవ్వబోయే లోపునే చరచరా వెళ్లిపోయాడు చలపతి.

హఠాత్తుగా కుర్రాడి ఏడుపు వినిపించింది. ఆవిడ కొడుతోంది. ఎంతెంత దెబ్బలు! వాడు తట్టుకో గలడా! వాడి గోల వినలేక కలగజేసుకుందామని క్షణం యోచించాను. ఆవిడ సరైన మనిషి కాదు. పొరబాటున 'నీ జోక్యం అనవసరం' అంటే ప్రాణం చచ్చిపోతుంది. తటపటాయించాను. ఆమె స్వభావం తెలుసుండబట్టి ఆ క్షణంలో అమానుషంగా ప్రవర్తించకుండా ఉండలేకపోయాను.

ఆవిడ మాటలు వినిపించాయి. "ఇంట్లో బియ్యం లేవని నీకు నేను చెప్పానా? వంద రూపాయిల నోటుకు చిల్లర లేక పూజ ఆగిపోతుందని ఓ రూపాయి అప్పు తీసుకురమ్మంటే ఉన్నవీ లేనివీ అనవసరపు కూతలు కూస్తావూ?" అని తెగ తిడుతోంది.

ఆ తర్వాత పనిమనిషిచేత రూపాయి పంపించాను. ఆవిడ తలుపువార నిలబడి బాబుగారూ!" అని పిలిచింది.

"వచ్చేనాండీ!" అన్నాన్నేను.

"అవునండి. దేముడికి పూజ చేయిద్దామని అనుకున్నాను. దగ్గర వందరూపాయిల నోటు తప్పించి చిల్లరలేదు. ఈ చుట్టుపక్కల దొరకదు. అలా అని చెప్పరా అంటే వాడేదో వాగేశాడు." అంది.

ఇదే ఆవిడతో మొదటిసారి మాట్లాడటం ఈ ఇంటికి వచ్చింతర్వాత. అంతకుముందు ఓమారు మాట్లాడాననుకోండి. ఆ తర్వాత అప్పుడప్పుడు పోస్టుమన్ ఉత్తరా లిచ్చేటప్పుడు మీ ఊళ్లో అంతా క్షేమంగా ఉన్నారాండి" అని యోగక్షేమాలు కనుక్కుంటూంటుంది.

'అంతా బాగానే ఉన్నారండి' అంటూండే వాణ్ణి.

అప్పుడప్పుడు ఏ సాయంత్రం పూటో తీరిగ్గా కూచున్నప్పుడు పలకరిస్తూండేది. పిల్ల పెళ్లివిషయంలో ఆమె కేమీ దిగులు లేదుట! అనువైన సంబంధం చూసి త్వరలోనే ముడిపెట్టేస్తుందిట. పిల్లవాడి చదువుగురించి మాత్రం నింద వాడిమీదే తోసేసింది. వాడే చదువుకోమంటే చదువుకోలేదుట. ఇలా చాలా జాగ్రత్తగా తన నిజస్థితి కప్పుకుంటూ తెలివిగా మాట్లాడుతూంటుంది.

పిల్ల పెళ్ళి విషయంలో ఆమె కేమీః బెంగ లేదంటే నమ్మలేకపోయాను. ఆమె స్వభావం నాకు తెలుసు కాబట్టి అలాగే మాట్లాడుతుం దనుకున్నాను. డబ్బుకు సంబంధించిన పనేదైనా సరే తను చాలా సునాయాసంగా నిర్వహించగలదని మనం అనుకోవాలని ఆవిడ ప్రయత్నం.

ఆవిడ చెప్పేదంతా శ్రద్ధగా విని ఆవిడ అభిప్రాయాల్తో ఏకీభవిస్తున్నట్టే నటించేవాణ్ణి. ఓనాడు చొరవ చేసుకుని "మీ అబ్బాయిని రోజూ ఉదయం నాదగ్గిరికి రమ్మనండి. చదువు చెబుతాను" అన్నాను.

"అంతకంటేనా తప్పకుండా పంపిస్తాను." అంది.

ఒక్కొక్కప్పుడు ఆవిడ మాట్లాడే విషయాలు వినటానికి నాకే సిగ్గుగా ఉండేది. అసహ్యం కూడా వేసేది. పరాయివాణ్ణి, కాస్త చొరవ ఉందికదా అని అయిదారేళ్లనించీ వైధవ్యం అనుభవిస్తూ ఏభై ఏళ్లు నెత్తిమీది కొచ్చింతర్వాత ఇప్పుడిక తన పెళ్లినాటి సంగతులన్నీ ఎత్తుకొస్తే వినటానికెలాగుంటుందో ఆలోచించండి. అతర్వాత తర్వాత ఆవిడతో మాట్లాడాల్సివస్తే తప్పించుకుందుకు సాధ్యమైనంతవరకూ ప్రయత్నించేవాడిని. ఆఫీసు టైముకు ఓ గంట ముందునే బయటికి వెళ్ళిపోయేవాణ్ణి. తిరిగి ఆఫీసునుంచి వచ్చినప్పుడు నేరుగా లోపలికి వచ్చేసేవాణ్ణి.

*　　　*　　　*　　　*

రోజూ ఉదయం ఏడు కొట్టేసరికి చలపతి నాదగ్గర చదువుకుందుకని వస్తున్నాడు. ఓ గంట అతనితో గడుపుతున్నాను. కుర్రాడు తెలివైనవాడే. చదువంటే చాలా శ్రద్ధా, పట్టుదలా ఉన్నట్టు గ్రహించాను. ఓనాడు పాఠం చెబుతూంటే చలపతి అడిగాడు "ఈ ఏడాది నన్ను స్కూల్లో చేరిపించరూ?" అని.

"ఏం? నీకు స్కూల్లో చేరాలని ఉందా?" అన్నాను.

...ఇంత ముఖం చేసుకుని అవునన్నట్టుగా తల ...డు.

"అలాగే చేరిపిస్తాను. నువ్వు బాగా చదువు ...లి మరి."

"ఇప్పుడుమటుకు బాగా చదువుకోటం లేదూ" ...పతికి అభిమానం వేసింది.

"అబ్బే!. ఆ మాట నే నన్నా నా! బాగానే ...కున్నావు" అన్నాను అనునయ స్వరంతో.

అత నేదో చెప్పబోయి నలువైపులా భయం ...గా చూసి "మా అమ్మ నడిగితే కొడుతుంది" ...డు రహస్యంగా.

...ఆప్యాయంగా అతని తల నిమురుతూ "ఫర్వా ...నే చేరిపిస్తాలే" అని హామీ ఇచ్చాను. అయితే ...ఒప్పించటం ముఖ్యం. ఆవిడతో ఈ విషయం ...చాకచక్యంగా ప్రస్తావించాలి. చలపతితో ... "నేనేది, చెప్పినా, అడిగినా ఊ కొట్టి ఊరు... తెలిసిందా?" అని.

...మీవాడు ఎలాగైతేనేం స్కూల్లో చేరటా...ప్పుకున్నాడండీ. అతన్ని ఒప్పించేసరికి ...దిగొచ్చారు" అన్నాను ఇంటావిడతో.

ఆవిడ ముఖం ముడుచుకుపోయింది. ...ప్పించుకుంటూ "మంచిది, చేర్పిస్తాను" అంది ...గా. నే వెళ్ళిపోయింతర్వాత వాణ్ణి చాత ...దని నాకు తెలుసు. వాణ్ణి రక్షించాలనే ... "మీవాడు ససేమీ ఒప్పుకోలేదండీ. భయ ... ఒప్పించలేకపోయాను," అని అబద్ధం ...వాడు కేవలం నా బలవంతంమీదే అంగీక... గాని ఆవిడ అభిమతానికి వ్యతిరేకంగా ...లేదని నచ్చ చెప్పాను. ఆ తర్వాత చదువు ...ట్లో ఇప్పటి పరిస్థితుల్లో ఎలా చెలామణీ ...వివరించాను. ఆవిడ మనసు కరిగేట్టుగా ...్పను.

...కి ఆరోజు చలపతికి దెబ్బలపెళ్ళి తప్పినం... సంతోషించాను.

...జు ఆదివారం. నేను గుమ్మంలో కూచుని ... ఇంటావిడ కూడా తడికవారనే కూర్చుని ...కుట్టుకుంటోంది. చలపతి ఇంటిముందు ...న్నాడు. ఇంటికి మూడువైపులా కాంపౌండు గోడలున్నాయి. ముందుభాగం మాత్రం వెదురు కర్రల్తో కట్టిన దడిమాత్రం ఉంది. అదైనా నామమాత్రంగా వీధికీ, స్థలానికీ హద్దుకోసమన్నట్టుగా కట్టుకున్న బాపతు. కుక్కలూ పందులూ తరుచు ఆ దడిని నాశనం చేస్తూనే ఉంటాయి. తిరిగి బాగుచేస్తున్నాడు చలపతి. నేను ఆమెకు వినిపించేట్టుగానే అన్నాను. "మీవాణ్ణి చూస్తే నాకు చాలా ఆశ్చర్యం వేస్తుందండి. ఆ వయసు కుర్రవాళ్ళకి ఆపాటి తెలివితేటలుండటం చాలా అరుదు. దానికి అనుగుణంగా మంచితనం, నెమ్మదీ ఉన్న కుర్రాడు. చదువులోపడితే ఎంతవాడైనా కాగలడు." అన్నాను.

ఆవిడ అపరిమితానందంతో "మీ ఆశీర్వచన ప్రభావంవల్ల వాడు అంతవాడు కావాలనేగా నేనూ కోరేది" అంది.

"ఎందుక్కాకు? స్కూల్లో చేరిపించి చూడండి ఆ తర్వాత మీకే తెలుస్తుంది. ఇటువంటి కుర్రవాళ్ళకి ఉచితంగా చదువు చెబుతారు కూడాను."

ఆవిడకి అర్థం కాలేదు కాబోలు "అంటే?" అంది.

"బీదపిల్లలకి, తెలివైన పిల్లలకి డబ్బు పుచ్చుకోకుండా ఉచితంగా చదువు చెబుతారు. వాళ్ళకయ్యే ఖర్చు ప్రభుత్వమో, లేకుంటే ఏ ధనికులో భరిస్తుంటారు." అని వివరంగా చెప్పాను.

ఆవిడ చఱ్ఱుమని లేచింది. "అటువంటి ప్రారబ్ధం మావాడికి పట్టలేదులెండి. నే నే జీతంకట్టి స్వయంగా చెప్పిస్తాను. ఒకళ్ళ దయాధర్మాలమీద ఆధారపడే కర్మ వాడికేం పట్టింది." అంది తీవ్రంగా. నేను నాలిక కొరుక్కున్నాను. పొరబాటున బీద పిల్లలకి అని నోరు జారాను. కొంప లంటుకుపోయాయి. ఆ తర్వాత సద్దుకోబోయాను. "మన పిల్లవాడికి వాళ్లు ఉచితంగా చదువు చెబుతున్నారంటే మనవాడు చాలా తెలివైనవాడన్న మాట. అంతేకాని బీదవాడని కాదు." అని.

ఆవిణ్ణుంచి నేనేమీ సమాధానం అందుకోలేదు. కొద్దిసేపు పోయింతర్వాత అంది: "పోనీలెద్దురూ నేనే చెప్పిస్తాను. ఏమంత ఖర్చవుతుంది లెండి. ఎటొచ్చీ ఆ బాధ్యత మీరు నెత్తిన వేసుకోవాలి." అని. మనసులో నన్ను నేను అభినందించుకున్నాను. 'తప్పకుండా' అని హామీ ఇచ్చాను.

మా సంభాషణ వినవచ్చే తన పనిలో తను నిమగ్నుడైపోయాడు చలపతి.

చలపతిని స్కూల్లో చేరిపించటం విషయం సత్యనారాయణతో మాట్లాడాను. "నువ్వు నీకెందుకీ అనవసరపు బెడద" అన్నాడు. "అలా అనకు నా స్వంత వ్యవహారం అనుకో. కుర్రవాడు తెలివైనవాడూ, బుద్ధిమంతుడూను. ఇలా పాడయిపోవటం మంచిదికాదు." అని మరీ మరీ చెప్పాను.

"సరే చేర్పిస్తాలే" అని హామీ ఇచ్చాడు సత్యనారాయణ.

* * *

రాత్రి సినిమాకి వెళ్లొచ్చేమో ఉదయం లేచేసరికి బారెడు పొద్దెక్కింది. జాబిరీ గుమ్మంలో కూర్చుని చదువుకుంటున్నాడు చలపతి. తలుపు తీసి లోపలికి వచ్చి కూర్చున్నాను.

కాలకృత్యాలు తీర్చుకుని నేనూ పాఠం చెప్పటానికి ఉపక్రమించేసరికి ఎనిమిది దాటిపోయింది. ఒకటి రెండు లెఖ్ఖలు చేయించి పాతపాఠం అప్పచెప్పుకుని ఆనాటి చదువు అంతటితో ముగించేశాను.

పుస్తకాలు సర్దుకుంటూ చలపతి అన్నాడు. "మా అక్కయ్యకి పెళ్లిసంబంధం వచ్చింది. ఇవాళ సాయంత్రం అక్కయ్యని చూట్టానికి వస్తారుట" అని.

ఆ సాయంత్రం ఇంటికొచ్చేసరికి చాలా పొద్దుపోయింది. అందువల్ల పెళ్లికొడుకుని చూట్టానికి పడలేదు. ఇక ఇంటావిడ ధోరణి విని తీరాలి. ఈ ఊరులో రెండు మేడలున్నాయిట. వాళ్ల స్వగ్రామంలో భూమికూడా ఉందిట. ఇలా ఏవేవో చెప్పుకొచ్చింది. వాళ్లు బాగా ఉన్నవాళ్లనీ, తమ అంతస్థుకు తగినవాళ్లనే నిశ్చయించుకుందనీ చెప్పింది.

"మంచిది" అన్నాను.

"మీలాంటి పెద్దల ఆశీర్వచన ప్రభావం వల్ల అదో ఇంటిదైపోతే కొంత బాధ్యత తీరిపోతుంది. ఏమంటారు?"

"కాదుమరీ; ఇంతకీ ముహూర్తం ఎప్పుడో చెప్పారు కారు?"

"ఈ నెల ఆఖరువారంలో జరుగుతుంది," అంది ఆవిడ.

మూడొంతులు అప్పటి కింకా తనకి వెళ్లటం పడదు. పెళ్లికి ఇక్కడే ఉంటాడన్నమాట.

ఇంకా పెళ్లికి ఇరవైరోజుల వ్యవధానం లేదు. నే నాశ్చర్యపోయాను. రెండు నెల్లు ముందుగానే మనవాళ్లు నానా హడావుడీ చేస్తూంటారు. ఆమె నిశ్చింతగా నిమ్మకి నీరెత్తినట్టుగా ఉండటం చూస్తే అసలీ పెళ్లి జరిగేనా, అసలు నిజమేనా? అనిపించింది. ప్రతిరోజూ వంట చిన్నకూతురే చెయ్యాలి. ఆమె మాత్రం అధికారం చెలాయిస్తూంటుంది. పైపని ఒక్కటి కూడా ముట్టుకోదు. ఎంతసేపూ కబుర్లు. ఏదో ఈ పది రోజులూ ఓర్చుకుంటే ఆమె అదృష్టం బాగుంటే అత్తవారింట్లోనైనా సుఖపడుతుంది. చేసుకున్న భర్త మంచివాడు కావాలి. లేకుంటే ఆడదాని జీవితం ఏముంది? ఎవరి అవసరాలకి వాళ్లు వినియోగించుకుంటారు. ఆమె అదృష్టం ఎలాగుందో మరి.

ఇంకా ముహూర్తం పదిహేనురోజులుందనగా ఓనాడు ఇంటావిడ పెద్ద పాకెట్ ఒకటి తీసుకొచ్చి నాముందు పెట్టి "అల్లుడికి బట్టలు కొన్నాం. ఎలా వున్నాయో చూడండి" అంది.

రెండు సూట్లకి సరిపోయే వులన్ క్లాత్. ఒకటి కాఫీరంగు, మరొకటి సిమ్మెంటు రంగు. రెండూ చాలా బాగున్నాయి. నాలుగు చొక్కాగుడ్డలు తీసుకుంది. మొత్తానికి ఓ వంద రూపాయిలు ఖరీదుచేసే గుడ్డ కొంది. "చాలా బాగున్నాయి" అని మెచ్చుకున్నాను. ఈ ప్రశంసకి ఆవిడ చాలా సంతోషించింది.

* * * *

"పెళ్లి తాలూకు బాధ్యతలు నీ నెత్తినా పడ్డాయా?" అన్నాడు సత్యనారాయణ.

నాకు కోపం వచ్చినమాట నిజం. "ఏదో ఆ కుర్రాడి విషయంలో కలగచేసుకున్నానుగదా అని వాళ్లకు సంబంధించిన ప్రతి వ్యవహారంలోనూ వేలు పెడుతున్నాననా నీ ఉద్దేశం?" అన్నాను.

వాడేమీ సమాధానం చెప్పలేదు. నవ్వి ఊరుకున్నాడు.

"నీకు బదిలీ అయిందని మీ ఇంటావిడకు తెలుసా?"

ఏమో మరి? నేనుమటుకు చెప్పలేదు.

సత్యనారాయణ వెళ్లిపోయాడు. ఆ రాత్రి ఎందుకనో వెంటనే నిద్రపట్టింది. ఉదయం ఆరింటికే

వచ్చేసింది. కారణం చలపతి కిటికీ అవతల
లేచేవరకూ అరుస్తూనే ఉన్నాడు.

ఎందుకు చలపతీ?" అన్నాను కళ్లు తుడుచు
ు. అప్పుడే సూర్యోదయం అవుతోంది.

ూ బావని మీరు చూళ్లేదుగా. రండి మాయిరు
మ్మ పిలుచుకురమ్మంది." అన్నాడు చలపతి.

లాగే నని అతన్ని పంపించేసి నీళ్లు పుక్కి
పైన ముఖం కడుక్కుని పాచిముఖంతోనే
ుకుని మాట్లాడానికి బయల్దేరాను.

ండి. ఇలా కుర్చీలో కూర్చోండి అంటూ
చేసింది ఇంటావిడ. నేరుగా వెళ్లి కుర్చీలో
ాన్నాను. పెళ్లికొడుకు నల్లగా ఉన్నాడు.
ర్ఖకంగా, నీరసంగా కూడా కనిపించాడు.
గుమాస్తాగా పనిచేస్తున్నాట్ట. మనిషి మంచి
నే ఉన్నాడుకాని ఈ అతిమంచి అతన్ని
ముందు ఎలా లాంగదీస్తుందో అను
ు. ఇంటావిడ చెప్పినట్టుగా చూట్టానికి
స్థితిమంతుడిలానే కనిపించాడు. వయస్సు
ాతికేళ్లకు మించవు. ఈడూ జోడూ అయిన
్యం అనుకున్నాను మనసులో. మనిషి
ికి అతి మంచిగా కనిపించినంత మాత్రాన
లేనివాడనీ, అసమర్థుడనీ ఎందుకనుకోవాలి?
తమా వెళ్లిపోగానే నేనూ వచ్చేశాను.

* * *

ాయంత్రం ఆరుగంటలయింది ఇంటి కొచ్చే
ంటినుండి పెద్ద గలభా జరుగుతోంది. ఇంటా
ధ్యంలో నిలబడి గొంతు చించుకుని అరు
ఆవిడకంటే కొంచెం పెద్దగా కనుపించే మరో
ురుగా నిలబడి నిప్పులు చెరిగే కళ్లతో
గా చూస్తూ సాభినయంగా తిట్టిపోసేస్తోంది.
అయిదారుగురు పైవాళ్లు మూగారు.

ోపలికి వెళ్లి తిడికవార పడకకుర్చీలో కూర్చుని
కూర్చున్నాను.

నీలాటి దగుల్బాజీని నా చెల్లెలంటే కూడా
తక్కువ. ఎంతసొమ్ము! ఎంత సొమ్ము!"
ండే వాదుకుంది. ఈ వాక్యాన్ని బట్టి ఆమె
ిడ అక్కగారని తేలింది. అంతకు రెండింతలు
హెచ్చించి ఇంటావిడ అడ్డమైన తిట్లూ తిట్టి
పోస్తోంది. అసలు తగాదా ఏమిటో స్పష్టంగా బోధపడకపోయినా అదేదో డబ్బుకి సంబంధించినదే అనుకున్నాను. స్వయానా ఓ కడుపున పుట్టిన అప్పచెల్లెళ్లిద్దరూ ఇలా వీధిని పడి నానా మాటలూ అనుకోవటం ఎంత అసహ్యకరమైన విషయం!

ఇంతట్లో తుపానులా ఆ కొత్తవ్యక్తి నన్ను సమీపించి "మీరు వినండి. దీని మాయమాటలు, మాయ నటనకి మోసపోయి ఒకటి కాదు రెండు కాదు నాలుగొందలు దీని చేతిలో పోసాను. రెండేళ్లయిపోయింది. దమ్మిడీ వడ్డీ లేదు సరికదా అసలుకే ఎసరు పెడుతోంది. ఇంత సొమ్ము కాజేసింది కాక పైగా నే నెప్పుడో దీని మొగుడుదగ్గర ఆరొందలు తీసుకున్నానుట! దానికీ దీనికీ చెల్లుట! ఎంతలా కల్పించిందో చూశారా? అంతా అబద్ధం!"—ఆవిడ మాట్లాడుతూంటే గొంతునాళాలు ఉబ్బుతున్నాయి. ముఖం ఎర్రబడిపోయింది.

ఇంటావిడ ఉన్నట్టుండి నోరు జారింది: "ఈ విషయంలో ఇంకొకళ్ల జోక్యం అనవసరం" అని. "నాకు వచ్చేటంత అభిమానం వేసింది. నాకేం తెలుస్తుందమ్మా! మీ వ్యవహారం నే చూశానా? కొత్త వాణ్ణి" అని చెప్పి అవిణ్ణి వదిలించుకున్నాను. ఆతర్వాత ఇద్దరూ చాలాసేపు ఘర్షణపడ్డారు. పర్యవసానం, వాచిపోయిన గొంతుతో, ఉత్తి చేతుల్తో ఆ కొత్త వ్యక్తి వెళ్లిపోయింది. ఆమెకి దక్కిందల్లా తిట్లూ, చీవాట్లూ మటుకే.

ఆతర్వాత చాలా రోజులు ఇంటావిడతో నేను మాట్లాడనే లేదు. ఆ విషయం ఆవిడ గ్రహించిందనటానికి నిదర్శనంగా చలపతి చదువుకుందుకు రావటం మానేసాడు.

అక్కగారివద్ద అయిదొందలూ అప్పుగా తీసుకున్నమాట నిజమేననీ, ఆ సొమ్ముతోనే మూడు వైపులా కాంపౌండు గోడ కట్టించిందనీ, ఆ అప్పు తీర్చటం ఇష్టంలేక అలా అబద్ధం ఆడిందనీ సత్యనారాయణ చెబుతుంటే నే నాశ్చర్యపోయాను.

"నే ననేదేమిటంటే ఆ అప్పు ఆవిడ తీర్చలేకపోయినట్టయితే మనసులో ఉన్నది ఉన్నట్టుగా తన అశక్తతని వ్యక్తం చేసుకుని మంచిగా మాట్లాడితే ఆ అక్కగారు ఆ సొమ్ము ఎప్పుడో వదులుకునేది.

అయితే అందుకు ఈవిడ పౌరుషం అడ్డొస్తుందిగా మరి. అక్కడే ఒచ్చిన చిక్కల్లా" అన్నాడు సత్యన్నారాయణ.

"పెళ్లికి పిలుస్తే వెళ్తావా?" అని అడిగాను.

సత్యన్నారాయణ పెద్దగా నవ్వుతూ "నీకు మతిపోయిందా ఏమిటి? నిన్నెందుకు పిలుస్తుంది? కల్లోకూడా అలా జరగదు." అన్నాడు.

*　　*　　*　　*

ఇంటావిడతో మాట్లాడటం మానేసి ఇవ్వాళ్టికి వారం రోజులయింది. పెళ్లి వారం పదిరోజు లుందనగానే నాకు ట్రాన్స్‌ఫర్ ఆర్డరు వచ్చేశాయి. ఇలా జరుగుతుందేమోనని అనుమానిస్తానే ఉన్నాను. ఇలా అని చెప్తే ఆవిడ అపార్థం చేసుకుంటుందేమోనని అదో బాధ. ధైర్యంచేసి "రేపు సాయంత్రం నేను విజయనగరం వెళ్ళిపోతున్నాను. బదిలీ అయింది. అలా అని మీ అమ్మగారితో చెప్పు" అన్నాను చలపతితో.

చీకటి అప్పుడప్పుడే పడుతోంది. ఇవ్వాళ సాయంత్రం కొద్దిగా వానకూడా పడిందేమో కొద్దిగా ఉక్కపోస్తోంది. దీపం వెలిగించి కొంకికి తగిలించి బట్టలు తీసి పెట్టెలో సర్దుకుంటున్నాను. ఏదో అనిర్వచనీయమైన ఉత్సాహం నన్నావరించింది. ఇల్లూ వాకిలీ, భార్యా, పిల్లలూ అంతా కళ్లముందు మెదులుతున్నారు.

"బాబూ!" ఉన్నట్టుండి నా జాలిరీలోంచి ఇంటావిడ గొంతు వినిపించింది. ఆలోచనలు మంచు మాయమయినట్టుగా మాయమయాయి. లేచి గుమ్మంలోకి వెళ్లాను.

"నేనేదో పొరబాటున తప్పుచేస్తే మీ రిలా శిక్షించటం న్యాయమా చెప్పండి? ఆడదాన్ని. మీరు క్షమించకపోతే నా కెవరు దిక్కు. ఒంటరిగా ఇంత పెద్ద బాధ్యత నే నొక్కతినీ నిర్వర్తించగలనా? మిమ్మల్ని వేడుకుంటాను. వెళ్లిపోకండి" అంది రుద్ధ కంఠంతో.

నాకేమి చెప్పాలో పాలుపోవటంలేదు. ఉద్యోగ ధర్మాలు ఆమెకి బోధపడవు. ఆవిడమీద కోపగించి మరో ఇంటికి పోతున్నానని ఆవిడ అనుమానం కాబోలు. "నాకు మావూరు బదిలీ అయింది. నిన్ననే వెళ్లాల్సినమాట. ఇదిగో ఆర్డర్సు చూడండి" అంటూ జేబులోంచి కాగితాలు తీసి ఆమె కివ్వబోయాను.

ఆవిడ చెయ్యి అడ్డంపెడుతూ "అక్కర్లేదు. మీ మాటలు నేను నమ్మను. ఒక్క వారంరోజులు ఆగటానికి వీల్లేదూ?" అంది ప్రాధేయపడుతున్నట్టుగా.

"క్షమించండి. నే వెళ్లితీరాలి" అన్నాను గత్యంతరం లేక.

"సరే అయితే ఇవ్వాళ తారీఖు ఇరవైమూడు కదూ. మీ అడ్వాన్సు ముప్ఫైరూపాయిల్లో మీకే నేను ఏడురూపాయిలు బాకీఉంటాను" అంటూ ఆమె నే నెంత అభ్యంతరం పెడుతున్నా వినకుండా ఏడురూపాయిలూ కుర్చీమీద పెట్టి "మీవాళ్లనందర్నీ అడిగానని చెప్పండి. నేను మళ్లీ పొద్దున్నే ఊళ్లోకి వెళ్లిపోతున్నాను. నే నొచ్చేసరికి మీరు ఉంటారో ఉండరో. తాళాలు మా చలపతి వేస్తాడు." అంటూ ఆమె వెళ్లిపోయింది.

నేను మావూరు వెళ్లిపోవటం ఈవిడ్నింతగా బాధిస్తుందని నే నూహించలేదు. ఆమె ఎందుకు అయినవాళ్లందరితో విరోధం పెట్టుకుందో, కన్నకూతురు విషయంలో కూడా ఆవి డంత ఖచ్చితంగా ఎందుకు మసులుకుంటుందో నే నర్థంచేసుకోకపోలేదు. ఇంత చెడ్డతనాన్ని (చాలామంది దృష్టిలో) ఆవిడ బలవంతాన అలవర్చుకున్నదని నాకు తెలుసు. ఆ స్వభావమే ఆ చిన్నకుటుంబానికి శ్రీరామరక్ష! ఎవరితోనూ పరిచయం వృద్ధిచేసుకోవటానికి ఆవిడ ప్రయత్నించదు. తల్లైనా తండ్రి అయినా, ఆమె అనుసరించే విధానం అదే. అందువల్ల ఎవరూ ఆమె గుమ్మం ఎక్కరు. ఇంటిమీద అద్దెపెట్టుకుని తినో తినకో కాలక్షేపం చేస్తోంది. ఆ సంపాదనలోనే ఓ కూతురు పెళ్లిచేసింది. ఇంకో కూతురుపెళ్లి చెయ్యబోతోంది. అలాటిది సాధ్యమా అంటే సాధ్యమే అని ఆమె ఋజువుచేస్తోంది. చుట్టాల మనుకుంటూ వచ్చి తిష్టవెయ్యటానికి వాళ్లకాయింట్లో పచ్చి మంచినీళ్లు పుట్టవు. కనకనే ఆ సంసారం అలా నెట్టుకొస్తోంది గుంభనగా.

బండి కదలబోయేవరకూ, చలపతి నా కూడా కూడా తిరిగాడు. సత్యన్నారాయణకూడా స్టేషనుకి వచ్చాడు. బండి కదలబోయేముందు జారిపోతున్న

గా పైకి లాక్కుంటూ "నన్ను స్కూల్లో ఎవరు
స్తారూ?" అన్నాడు.

పక్కనే నిలబడ్డ సత్యనారాయణకి చలపతిని
చేరిపించటం విషయం జ్ఞాపకం చేశాను.
నున్నానుగా. నే చేరిపిస్తాలే" అన్నాడు సత్య
రాయణ. చలపతి ముఖం ఇంతయిపోయింది.

రైలు కదిలింది. చలపతి మరి కనుపించలేదు.
యాణం రద్దీలో, చోటుకోసం చేసే పెనుగు
ల్లో, కునికిపాట్లలో ఇంటికి చేరుకున్న
టివరకూ ఇంటావిడ నాకు జ్ఞాపకం రాలేదు.
కి చేరగానే చలపతికీ, సత్యనారాయణకీ ఇద్దరి
ఉత్తరాలు రాశాను.

వారం రోజుల తర్వాత ముందుగా చలపతి
ఉత్తరం అందింది. ఉత్తరం విప్పిం తర్వాత
ావిడ రాసిందని తెలుసుకున్నాను. కింద సంతకం
కు లేదు.

ంగారిక్కి!

నమస్కారాలు. మీరు దయతో రాసిన ఉత్త
అందింది. ఈ ఊరు పొలిమేరలు దాటిం తర్వాత
జ్ఞాపకం ఉంటామనుకోలేదు. చాలా సం
ంచాను. ఇక అమ్మాయి పెళ్లి గురించి. చాలా వైభ
జరిగిందనే చెప్పాలి. ఇంటిముందు పెద్ద పందిరి
ంచాను. బాజా బజంత్రీలకే అయింది రెండొందల
. బంధువులు చాలామంది వచ్చారు. వీళ్ళంద
ూడు రోజులూ భోజనాలూ, టిఫిన్లూ, కాఫీలూ
ు త్తంమీద పదిహేనొందలదాకా తిండికిందే
యిపోయింది. ఖర్చెంత అయితే అయింది. ఏదో
ంటూ జరిగిపోయింది. అదే సంతోషం!"—

పెళ్లి వైభవంగా జరిగినందుకు సంతోషించాను. ఇంత సొమ్ము ఎక్కణ్ణుంచి తెచ్చిందో మరి.

ఆతర్వాత రెండు రోజులు పోయింతర్వాత సత్యనారాయణ రాసిన ఉత్తరం అందింది.

నువ్వు రాసిన ఉత్తరం చదివాను. నువ్వెళ్లిం తర్వాత రెండు రోజులు ఒంట్లో అనోలాసుండి ఆఫీసుకే వెళ్లలేదు. అన్నట్టు మరో విషయం! మీ ఇంటావిడ చిన్న కూతురు పెళ్లి అయిందీ అనిపించింది. ఎలా జరిగిందని అడక్కు. ఆమెగురించి నీకు తెలియని దేముంది? ఇంటిముందు నాలుగుగడలు పాతి వాటిమీద రెండే రెండు పచ్చికొబ్బరిఆకులు పరిచింది. ఆ బ్రహ్మాండమైన పందిట్లోనే ఆ రాత్రి వివాహం జరిగింది. ఒచ్చిన బంధువులే కొద్దిమంది. ఒక్కపూట వాళ్ళ కాయింట్లో అన్నప్రాప్తి లేకపోయింది. పెళ్లయిన మర్నాడు ఉదయమే వాళ్లు పెట్టీ బేడా సర్దుకుని వెళ్లిపోయారు. పెళ్లికొడుకు మంచివాడు కాబట్టి సరిపోయింది. ఆమెనికన్న తండ్రి గాని, తోబుట్టువు గాని, ఎవరూ ఆ పెళ్లికి ఆహ్వానించబడలేదు. ఒక్క పునిస్త్రీ పసుపు పాదాలకి ఇంత పసుపు రాసి ఓ రవికల గుడ్డయినా పెట్టలే దావిడ. అంతా ముక్కుమీద వేలు వేసుకున్నవారే! ఇదా పెళ్లంటే!......"—

నివ్వెరపోయాను. మరుక్షణంలో ఎందుకో విపరీతమైన జాలి పుట్టుకొచ్చింది. మా ఇంటావిడ గురించి నా భార్య కొద్దిగా నాద్వారా విని ఉన్నా ఈ రెండు ఉత్తరాలూ మటుకు ఆమెకి చూపించదల్చుకోలేదు. ఇంకా కొంతమందిచేత ఆమెను తిట్టించి, అపహాస్యం పాలు చెయ్యటంవల్ల నా కొరిగే దేమిటి? నా దృష్టిలో ఆమె నూటికి డెభ్భైపాళ్ళు మంచిమనిషిలాగానే కనిపించింది.

ఆర్ష రసాయన శాస్త్రము

శ్రీ హరి ఆదిశేషువు

నేడు మనం విజ్ఞానయుగంలో జీవిస్తున్నాము. విజ్ఞాన శాస్త్రాభివృద్ధికి మనం ఏపాటి కృషిచేశామో తెలుసుకోవడం, ఉత్తరోత్తరా ఇంకా ఎక్కువ కృషిచేసి విజ్ఞానశాస్త్రాల చరిత్రలో మనకు అర్హమైన స్థానాన్ని పొందడం అవసరం. విజ్ఞానం అనంతమైనది. అఖండమైనది. అభ్యసించేవారికి గల అవకాశాల్ని బట్టీ, వారు ఆ కృషికి వినియోగించ గలిగే కాలాన్ని బట్టీ ఆయాతరహాల వారి శక్తి సామర్థ్యాల్ని బట్టీ విజ్ఞానాన్ని శాస్త్రవేత్తలు వేర్వేరు శాస్త్రాలుగా విభజించారు.

గడచిన మూడువందల సంవత్సరాల్లో పాశ్చాత్యదేశాల్లో విజ్ఞాన శాస్త్రాలు ఎంతో అభివృద్ధి చెందాయి. ఈ మూడువందల యేండ్లు మనం పరిపాలనకు లోబడిపోయాము. రాజకీయ వ్యవహార భాష అయిన ఇంగ్లీషు మన సంస్కృతికీ ప్రాచీన విజ్ఞానానికీ ఎందునా పొందని దయింది. ప్రాచ్య శాస్త్రాభ్యాస విధానాల ననుసరించిన పట్టాభద్ర వేత్తలు శాస్త్రాల్ని మననం చెయ్యడానికే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. తర్వాత వాటికి వ్యాఖ్యాన ప్రాయమైన వివరణలు చెయ్యడంలో మాత్రమే వారు శ్రద్ధవహించారు. ఇక పాశ్చాత్య విధానాన్ననుసరించి విజ్ఞానశాస్త్రాలలో కృషి చేసినవారు సంస్కృత భాషాజ్ఞానానికి దూరం అవడంచేత ప్రోత్సాహం లేక దేశీయభాషల్లో అధునిక విజ్ఞాన వ్యాప్తికి విరివిగా కృషిచెయ్యకపోవడం జరిగింది. అందుచేత 'ఎవరికి వారే యమునాతీరే' అన్నట్లయిపోయారు. అంతేకాదు. శాస్త్రీయ పరిభాషల్లోనూ, దృక్పథంలోనూ గల భేదాలు ఈ స్థితికి తోడై ఎన్నో అపోహలకీ ప్రవాదాలకీ, చివరికి భారతీయ విజ్ఞాన శాస్త్రాలు శాస్త్ర దృష్టికి అగపడవేమోననే అభిప్రాయాలకి ప్రోద్బలం కలుగజేశాయి. రాజకీయంగా న్యాయసమ్మతమైన స్థానం సంపాదించుకొన్న మనం సాంస్కృతిక వైజ్ఞానికరంగాలలో కూడా మన స్థానాన్ని మనం పొందేటందుకు కృషి చెయ్యడం అవశ్యమూ, విధీ అవుతుందికదా! ఈదృష్టితో రసాయన శాస్త్రచరిత్రను పర్యాలోకించి ఆ శాస్త్రంలో మన వారసత్వాన్ని దిఙ్మాత్రంగా ప్రదర్శించాలని ఉద్దేశిస్తున్నాను.

పాశ్చాత్య దేశాల్లో రసాయన శాస్త్రం మొదట రసవాద శాస్త్రాన్నీ, తరువాత ఎక్కువగా వైద్య శాస్త్రాన్నీ ఆశ్రయించి వృద్ధిపొందింది. అందుచేతనే ఆ శాస్త్రానికి కెమిస్ట్రీ అన్న పేరూ, అది వైద్యశాస్త్రానికి చేదోడు అనే బిరుదూ లభించాయి. మనదేశంలో కూడా ఆ పంథాలోనే రసాయనశాస్త్రవిజ్ఞానం అభివృద్ధి అయింది. 'వాద (రసవాద) శ్రేష్ఠో వైద్య శ్రేష్ఠః' అన్న నుడి ఈ విషయాన్నే నిరూపిస్తుంది. వేమన్న పద్యాలలోని ముక్కలుకొన్ని, ముఖ్యంగా 'ఇహమున సుఖియింప హేమతారకవిద్య', 'ఇంగిలీకమహిమ హేమింప నేరక, చిత్రపటము వ్రాసి చెరచినారు', 'తాళకం బెరుగరో తగరంబు నెరుగరో'. కరువదేల వచ్చె కాపులార ?' అనేవి రసవాదంలో మనవారి నమ్మకాన్ని తెలుపుతాయి.

రసవాదం అనేటప్పటికి మనకి సిద్ధనాగార్జునుడు స్ఫురణకి వస్తాడు. మహాయనబౌద్ధమత ప్రవర్తకుడైన ఈ ఆచార్యుడు రససిద్ధిని పొందాడనే గాథలు మన వాఙ్మయంలో కనిపిస్తున్నాయి. అంతేకాదు. ఈ రససిద్ధుడు అమృతసాధకుడైన తన పోషకుడైన శాతవాహనన్నృపతికి దానిని సేవింపనిచ్చాడనీ, నిగ్రహానుగ్రహసమర్థుడై ప్రాణాన్ని తృణప్రాయంగా ఎంచి తన యువరాజ కుమారుని కోరికపై ఆత్మశిరం చాలించాడనీ కూడా కథలవల్ల తెలుస్తోంది. ఈ కథలవల్ల నాగార్జునుడు వాదశ్రేష్ఠుడు

కేడనీ రససిద్ధుడనీ తెలుస్తుంది. 'రస రత్న సముచ్చ
యు' అనే నాగార్జునరచిత గ్రంథము అతడు
యుర్వేదంలో రసౌషధ యోగాల కిచ్చిన ప్రాధాన్య
తెలుపుతుంది. గౌరన రచించిన నవనాథ చరి
, పరికిస్తే ప్రథమ గణ్యుడగు ఈ తెలుగు రసా
శాస్త్రవేత్త కేవలం ఊహాగానం చేసినవాడు
నీ ప్రయోగ విజ్ఞాన కౌశలాన్నే ఎక్కువగా
న ఆధునిక విజ్ఞానులకు ఆదిపురుషుడనతగిన
నీ అనిపిస్తుంది. నాగార్జునాచార్యుని తంత్రశాలనీ
ల్లో జరిగిన కార్య కలాపాల్ని గౌరన ఎంత
గా వర్ణించాడో చూడండి.

సములైదును ఉపరసము లెన్మిదియు
సరులు మందులు పాషాణములును
లవణంబులును జాలగా సమకూర్చి
లయు మంత్రౌషధావళులకు బలియు
సి మనోజయ సిద్ధి పెంపొంది.
సీనుడై లులాయాజిన రచిత
రు భస్త్రికల నివ్వగ్రోవులు నిలిపి
రములు పొందుగా సంధించి భక్తి
రునాథు తలచి తద్గురుని భజించి
రభైషజాది దైవములకు మ్రొక్కి
కూర్చిన మందులన్నియును వైచి అగ్ని
గూర్చి పుటంబుల గ్రక్కున బెట్టునపుడు
స నూరు వారును విసువక రసము
సరులు గరపి పాల్పడ నూరువారు
ను పొందగా మూస లమరించువారు.
మునసి క్రమ్మఱ పుటంబుల పెట్టువారు
లమిపై పెను బ్రోవు లీడ్చెడివారు
సంభ్రమించుచు నయ్యయి పనుల
సన్నులై శిష్యులందరు మెలగ

లు గొనుచు, తంత్రశాలలో (*Laboratory*)
గ విజ్ఞానాన్ని సాధించి సూత్రరూపమున
స్థము చేసిన విజ్ఞానియట నాగార్జునాచార్యుడు.
నాగార్జునుడే కాదు. ప్రాచీన ఆయుర్వేద
క్తలందరూ ఆ పద్ధతికి చెందినవారే నేమో
లసివుంటుంది. ఆరోగ్యశాల అనే పేరున
న వలసిన ఫార్మసీ ఎలాంటిది అయివుండాలని
యించారో ఆ శాస్త్ర కారులు చూడండి.

అథ సాధారణే దేశే వివిధౌషధ వీరుధి
దేశే నదీవనాద్రీణాం నాతి దూరే నిరామయే
ప్రాగుదీచ్యోర్దిశోర్భాగే ప్రశస్తాం వాస్తువిస్తరైః
గుప్తాం పూర్వోత్తరద్వారాం గంధపుష్పోపహారిణా
సమాంశే వాతాం సర్వత్ర ప్రవాతామేకదేశతః [ప్
సర్వోపకరణైర్యుక్తాం సర్వేష్వతతిశోభితామ్
ఆరోగ్యశాలాం కుర్వీత నిత్యన్యస్త బలిక్రియామ్
తస్య ప్రాగ్దక్షిణే భాగే సర్వోపకరణాన్వితమ్
బహువాతాయన చ్ఛిద్రం విశాలి జనసేవితమ్
సర్వేషా మౌషధాదీనాం పచనాగారమిష్యతే
తత్రౌషధం యథా యోగం
మాత్రావచ్చ ప్రకల్పయేత్.

వివిధౌషధులు లభించే స్థానంలో, నిరామయ మైన చోట, కాంతి వాయుప్రసారయుక్తమై, సర్వోపకరణయుక్తమైన ఔషధశాలను నిర్మించాలనడం వారు వాడిన ఉపకరణాలకీ, నేటి రసాయనికులు వాడే సాధన సామగ్రికీ పోలికలు కల్పించడమూ మనవారి శాస్త్రీయ దృక్పథాన్ని చెప్పక చెప్పే రుజువులు.

మనవారు దేశకాల ఋతుభేదాలవల్ల మూలికల స్వభావ గుణాదుల్లో భేదాలు కలుగతాయనే విషయం గుర్తించినట్లూ, ఔషధులు పెరిగిన భూసారం యొక్క ప్రాముఖ్యాన్ని గుర్తించి ఔషధీ గ్రహణ యోగ్య భూమినీ, వర్జ్య భూమినీ నిర్ణయించినట్లూ మనకు వారి వ్రాతలలో ద్యోతకమవుతున్నది. ఈ విషయాలను నేటి వ్యావసాయిక రసాయన శాస్త్రవేత్తలూ కూడా అంగీకరిస్తున్నారు. వీటిని వారు ప్రయోగ విజ్ఞానంవల్ల రుజువుచేసి నిర్వచించారు. ఆయుర్వేద శాస్త్రవేత్తలు :

'సంపూర్ణం కారణం కార్య
మాయుర్వేద ప్రయోజనం
హేతవశ్చైవ దోషాశ్చ
భేషజం సంగ్రహేణచ'

అనే వాక్యంలో వారిలక్ష్యాన్ని సూచించారు. రోగాలకు హేతు భూతులైన దోషాల్ని వాటిని అణిచే భేషజాల్ని (మందుల్ని) అన్వేషించడం, సంపాదించడం లక్ష్యాలుగా గల ఆయుర్వేద శాస్త్రం ఆధునికశాస్త్ర నిర్వచనాల ప్రకారంకూడా విజ్ఞాన శాస్త్ర గౌరవానికి తప్పక అర్హమైనదే అవుతుంది.

గ్రహించిన ఓషధులూ, వాటితో తయారైన మందులూ ఎంతకాలంపాటు వీర్యవంతంగా ఉంటాయో కూడా మనవారు గుర్తించారు. ఆవిషయమే:

గుణహీనం భవేద్వర్షా
దూర్ధ్వం తద్రూపమౌషధమ్
మాసద్వయాత్ తథా చూర్ణం
హీనవీర్యత్వ మాప్నుయాత్
హీనత్వం ఘుటికా కాలే
హ్యాలభేత వత్సరాత్పరమ్
హీనాస్యుర్ఘృత తైలాద్యా
శ్చతుర్మాసాధికా స్తథా
ఓషధ్యో లఘుపాకాస్యు
ర్నిర్వీర్యా వత్సరాత్పరమ్
పురాణాస్యుర్గుణైర్యుక్తా
ఆసవా, ధాతవో రసాః.

అన్న శ్లోకాలవల్ల స్పష్టం అవుతోంది. రెండు మాసాలు దాటిన తర్వాత చూర్ణములూ, సంవత్సరం దాటినంతటే లేహ్యాలూ. మాత్రలూ (మూలికలతో కూడినవి,) ఔషధాలూ, శతపాకంతో తయారుచేసిన మందులూ, నాలుగుమాసాలుదాటితే తైలాలూ, ఘృతాలూ సత్వహీనములయి పోతాయి. కాని ద్రుతులూ, స్వర్ణాది ధాతుభస్మములూ, రసాయనాలూ, కేవలం పాదరసంతో తయారైన మందులూ, ఆసవాదులూ మాత్రం పాతబడినకొద్దీ గుణాధిక్యంకలవవుతాయి అని ఈవాక్యాల తాత్పర్యం. అల్లోపతీ వైద్యులు వాడుకచేసే డిజిటాలిస్ మొదలైన మూలికా చూర్ణాలు కాలాతిక్రమణం అయినట్లయితే నిర్వీర్యం అవుతాయనీ, కాలంగడచి పాతబడినకొద్దీ స్కాచ్ విస్కీ మజా ఎక్కువవుతుందనీ తెలిపే పాశ్చాత్యుల విజ్ఞానం అనుభవ విజ్ఞానమై, శాస్త్రీయమై పైవాక్యాల్లో సూచింపబడిన మనవారి విజ్ఞానం క్వాచిత్కం అని గుడ్డి గుర్రపుతాపులాంటిదనీ అనడం ఎవరూ హర్షించరు గదా!

కేవలం ఇప్పటివరకూ చెప్పిన ఉదాహరణల మూలంగా ఆయుర్వేదీయ శాస్త్రవిషయాలు అధునిక విజ్ఞానశాస్త్రబద్ధములనే అవకాశం ఉందని రసాయన శాస్త్రవేత్తలని నమ్మించలేను. ఆయుర్వేదీయ విధానా శుద్ధి విధానాలు వారికి చాలా అసందర్భమైనవిగా కన్పిస్తాయి. వాటిలోని అసందర్భంతాయమైతేనేగాని అధునికరసాయనిక వేత్తలు సహృదయతతో ఆయుర్వేదీయ యోగాల్ని అధునిక శాస్త్రదృష్ట్యాసమన్వయం చెయ్యడానికి వీలుందేమోనన్నైనా చూసేటందుకు వా రుత్సహించరు. అందుచేత ఆ విధానాలనుగురించి ముందుగా ఒక మాట చెప్పవలసి ఉంది. శుద్ధి అన్నమాటయొక్క అర్థానికి కాకుండా మనం శుద్ధి విధానాల యొక్క ప్రయోజనానికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చి అర్థం చేసుకోనేటందుకు ప్రయత్నిస్తే ఈ సందర్భం గర్హ్యసమస్యగా నిలిచిపోదు. ఆయుర్వేదీయ శుద్ధివిధానాల లక్ష్యం రాసాయనికశుద్ధిని సాధించడంకాదని ఆయా మూలికలయొక్కా ధాతువులయొక్కా భైషజ్య పారమ్యాన్ని సాధించడం అనీ మనం నిర్వచనం చేయవలసి ఉంటుంది. ఈ నిర్వచనాన్ని అంగీకరిస్తే మనకి ఆయుర్వేద శాస్త్రంలో వివరింపబడిన శుద్ధివిధానాలు అర్థవంతమైనవనీ, ప్రయోగజన్యవిజ్ఞానలబ్ధములూ, అనుభవైక వేద్యములైనవీ అని ద్యోతక మవుతుంది.

అసంఖ్యాకములైన మూలికల, ధాతువుల శుద్ధివిధానాల అన్నింటిలోని మూలసూత్రాలనీ వివరించడం పరిమితమైన అవకాశంగల వ్యాసంలో సాధ్యంకాదు. కాని స్థాలీపులాకంగా వాటిలో కొన్నింటినిమాత్రం విజ్ఞుల గుణాగుణవిచార నిర్ణయానికి వదులుతూ వివరించ దలచుకొన్నాను.

ఉల్లిపాషాణ శుద్ధి

శ్లో॥ మధునా పాచయేద్ యామం
శనైర్మృద్వగ్నినాతతః
ఉల్లిపాషాణ శుద్ధిస్స్యా
ద్భవే దేవం విశారదః.

ఉల్లిపాషాణాన్ని తేనెలోవేసి మందాగ్నిచేత ఒకఝాము మెల్లి మెల్లిగా వండితే శుద్ధి అవుతుంది. అల్లోపతీ వైద్యులు సంయోగశక్తి 5 గల ఆర్సెనిక్ కంటె (*Penta valent arsenic*), సంయోగశక్తి 3 గల ఆర్సెనిక్ (*Trivalent arsenic*) రోగనివారకముగా ఎక్కువ త్వరగా చురుకుగా పనిచేస్తుందని ప్రయోగ విజ్ఞానంవల్ల గ్రహించారు. ఆర్సెనిక్ ట్రయాక్సైడు అనబడే

...పాణంలో కొద్దిపాటి ఆర్సెనిక్ పెంటాక్సైడు ...గా ఉంటే అవకాశం ఉందని రసాయని... ఒప్పుకొంటారు. ఈ కొద్ది మలినాన్ని ఆక్సీ...చి (*Reduct*) ట్రయాక్సైడుగా మార్చవచ్చు. ఆక్సీహరణ సమర్థమైన తేనెవల్ల ఈ శుద్ధివిధా... సాధిస్తోన్నదని అని అంటే రసాయనశాస్త్ర...గా కన్పించదు. పరిశోధనార్హమైనవిషయం ...టికూడా ఉంది. ఆర్సెనిక్ ట్రయాక్సైడు, ...నిక్ ట్రైయా అయొడైడు మొదలగువానికంటె ...య పదార్థములలో (*organic compound*) ఆర్సెనిక్ ఎక్కువ ప్రయోజనకారియని ...ంది. ఈ శుద్ధివిధానంలో అలాంటి సేంద్రియ ...నిక్ పదార్థము తయారయేటందుకు అవకాశం ...లేదనిపిస్తోంది. పొటాషియము ఆసిటేటుతో ...పాణాన్ని కలిపివేడిచేస్తే అత్యంత విషాక్త ...కాకొడైల్ ఆక్సైడు అనే సేంద్రియ పదార్థం ...రవుతుందని రసాయనికులందరికీ తెలిసినదే. ...కల హైడ్రోజనులతో ఆర్సెనిక్ ట్రయాక్సైడుని ...గ్నిలో కాచినట్లైతే విషాక్తంగాని సేంద్రియ ...నిక్ యౌగికపదార్థం ఏర్పడేటందుకు అవకాశం ...లేదని పోలికలనుబట్టి ఊహించవచ్చు. ఈశుద్ధి ...లో అలాంటిదేమైనా జరుగుతోందేమో ...చడం అవసరమని నేను నమ్ముతున్నాను.

ఆముదపు విత్తుల శుద్ధి

॥ గంధర్వహస్త బీజాని
నారికేళోదకాన్తరే
యామ మత్యక్ పచేద్బుద్ధి
ర్దన్తి బీజం పచేత్తథా.

ఆముదపు విత్తనాల్ని, నేలదంతి విత్తుల్ని ...పై పొట్టుతీసివేసి కొంకాయనీళ్ళల్లో ఒక ...ముఉండినట్లైతే శుద్ధి అవుతాయి అని ఆయుర్వేద...ం తెలియజేస్తోంది. ఆముదపు పొట్టులో విష...వంగల (*Enzyme*) ఎంజైము ఒకటి ఉందని ...ణఅయింది. అందుచేతనే ఆముదపుపిండిని పొర...కూడా పశువుల ఆహారంలో కలియనీయ...ు. విరేచనకారిగా ఆముదము సేవించినవారిలో ...ప్పుడు కలిగే విపరీతపు దుష్ఫలితాలకి ఈ ఎం... మలినమే కారణం అయివుంటుందని ఊహించడం సత్యదూరంకాబోదు. ఆ ఎంజైము పొట్టులో ఉంటుందని ఏమాత్రమూ మిగిలిపోకుండా దాని విషస్వభావాన్ని విరిచే కార్యకలాపంకోసమే నారికేళజలంలోని ఆక్సీహరణస్వభావమైన చక్కెరలలో పచనం సూచింపబడినది కాబోలు.

లోహశుద్ధి

లోహంలో మూడు రకాలున్నాయనీ అవి ముండము, తీక్ష్ణము, కాంతలోహము అనునవి అనీ చెప్పబడింది. వీటిలో తీక్ష్ణము ముండముకన్న శతాధిక గుణం కలదనీ దానికంటె కాంతలోహం శతాధిక గుణవంతమనీ నిర్ధారణచేయబడింది. ఈ లోహభేదాలు ఆధునిక రసాయనికులు గుర్తించినవే. వీనిలో కాంత లోహమును అయస్కాంత గుణంగల మాగ్నటైట్ అనవచ్చును. అది జాఠర రసములతో యోగించినపుడు ఫెర్రస్ అణువుల నిచ్చును. అవి త్వరితగతిని దేహములో వినియోగమగుచున్న విషయము పాశ్చాత్య వైద్య విజ్ఞానమువలన రుజువైనదే. లోహశుద్ధి విధానాన్ని చర్చించేముందు లోహ యౌగికములు ఎలా దేహంలో వినియోగమవుతాయని పాశ్చాత్యవైద్యులు భావిస్తున్నారో తెలుసుకోవాలి. మనం పుచ్చుకొనే మందులలో గాని, తినే ఆహారపదార్థాల్లో గాని ఉన్న లోహం దేహానికి అవసరం ఉన్నప్పుడే వినియోగం అవుతుంది. అక్కరలేనప్పుడది వినియోగంకాకుండా విసర్జింపబడుతుంది. అంతే కాదు. దానితో పాటు కొద్దిపాటి రాగికూడా కలిసివుంటే మరింత చురుకుగా జీర్ణమై రక్తకణాల నిర్మాణం జోరుగా సాగుతుందని కూడా తేలింది. ఆరోగ్యవంతుడైన మానవుని రక్తంలో ఒక లీటరు (సుమారు 88 ఔన్సుల)లో .132 మిల్లిగ్రాములు (రెండు చిన్నములలో నయోగ్యవంతు ఎత్తు) రాగి ఉంటుందనీ, అందులో సగభాగం ఎర్రటి రక్తకణాల్లోనే ఉందనీ తేలింది. రాగితో పాటు కొద్దిపాటి మాంగనీసు కూడా కలిసివుంటే లోహం వినియోగమవడం మరింత చురుకుగా జరుగుతుందని కూడా జీవరసాయనశాస్త్ర ప్రయోగాలవల్ల గ్రహించడానికి వీలైంది. జీవజంతువులలోనే కాదు. నవనవలాడుతూ ఏపుగా మొక్కలు పెరగాలంటే కూడా వాటికి బోరన్ మొదలైన పదార్థాలు అత్యల్ప ప్రమాణాలలో సరఫరా కావాలని నిర్వివాదంగా తేలింది.

లోహశుద్ధి విధానము :—లోహపు రేకులకి కుంకేటి సెగ్గుగ పట్టించి, కొలిమిలో కాచి, త్రిఫల కషాయంలో తడపాలి. అలా మూడుసార్లు చేసిన తర్వాత చింత బెరడుని జిల్లేడు పాలతో నూరి పూసి కొలిమిలో కాచి త్రిఫల కషాయంలో చల్లార్చాలి. ఇలా మూడుసార్లు చేస్తే లోహం శుద్ధి అవుతుంది. ఈ ఆయుర్వేదీయ లోహశుద్ధి విధానంలో దాన్ని మరింత గుణవంతం చేసేవీ, దాన్ని దేహంలో కావలసిన చోటికి త్వరగా సరఫరా చేసేటందుకు సహాకరించే రాగి, మాంగనీసు లాంటి ద్రవ్యాలు అత్యల్ప ప్రమాణంగా (*Trace elements*) చేర్చబడటమే జరుగుతోందేమోనని ఊహించడం పైన వివరించిన విషయాల దృష్ట్యా అసంభావ్యం కాబోదు.

ఆయుర్వేదశాస్త్రంలో వివరించబడిన ఇతర ద్రవ్యాల శుద్ధివిధానాల ప్రయోజనాల్ని అవగతం చేసుకొనేటందుకు ప్రయత్నించడం అవసరం. అది పూర్తిగా జరిగిననాడు వైద్య విజ్ఞానపు ఎల్లలు ఇతోధిక దూరం వ్యాపిస్తాయని నమ్మవచ్చు.

భస్మీకరణము

ఆయుర్వేదీయ విధానాల్లో భస్మీకరణము ప్రధానమైనవాటిలో ఒకటి. ఆ విధానాల్ని, భస్మములను శోధించేటందుకు మనవారు వాడిన విధానాల్ని, అనుపానభేదంవలన ఒకే భస్మాన్ని వేర్వేరు రోగాలను కుదిర్చేటందుకు వాడే ఆచారాన్ని పరిశీలిస్తే మనకి మనవారికి రసాయనశాస్త్రంలోగల ప్రజ్ఞా, వైదుష్యమూ గోచరిస్తాయి.

భస్మములయొక్క రాసాయనిక స్వభావాన్ని గురించి ఆచార్య ప్రఫుల్ల చంద్రరాయ్ ఆయన అనుయాయులూ శోధించారు. స్థూలంగా చర్చించే సందర్భంలో వాటిలో ఎక్కువ ఆక్సైడులని భావించవచ్చు. వాటి రసాయనిక స్వభావం ఏదైనా వాటి కొల్లాయిడు స్థితిలోనుండే కణములరూపంగా తయారు చెయ్యడమే ప్రధానమని మనవారు భావించినట్లు కన్పిస్తుంది. ఈ విషయం భస్మశోధనకోసం వారు వాడిన సామాన్యవిధుల్ని పరిశీలిస్తే స్పష్టమవుతుంది. అందుచేత వాటిని వివరిస్తాను.

వారితరవిధి :

శ్లో॥ మృతంతరతి యత్తోయే
లోహం వారితరంహితత్

భస్మాన్ని నీటిమీద చల్లి అది తేలుతోందో లేదో చూడాలన్నారు. తర్వాత అంతటితో ఆగిపోకుండా అలా నీటిమీద తేలుతోన్న భస్మంమీద ఒక వడ్లగింజని వేసి అది భస్మంమీద హంసతూలికా తల్పంమీద పండుకొన్నట్లుగా ఉందో లేదో చూడమని హంసతూలికావిధానాన్ని

శ్లో॥ తస్యోపరి గురు ద్రవ్యం
ధాన్యం చోపవరేత్ స్థిరమ్
హంసవత్తీర్యతే వారి
ఉత్తమం పరికీర్తితమ్.

అనే శ్లోకంలో వర్ణించారు. ఉత్తమభస్మం వారితరమై హంసతూలికా విధానానుగుణంగా ఉండాలని ఆయుర్వేద శాస్త్రవేత్తలు నిర్వచించారు.

రేఖాపూర్ణవిధి :

ఒక చిటికెడు భస్మాన్ని వేళ్ళతో గ్రహించి భస్మరేణువుల పై ఈ రేఖా పూర్ణంగా ఉందో లేదో శోధించాలని 'అంగుష్ఠ తర్జనీ స్పృష్టం యత్ రేఖాంతరే విశేత్' అన్న శ్లోకార్థంలో సూచించారు.

స్వచ్ఛమైన సువర్ణభస్మం మయూరకంఠ సదృశమైన కాంతిగలిగి ఉండాలని 'స్వర్ణం మయూర కంఠాభం' అన్న పాదార్థంవల్ల సూచితమవుతోంది. ఏకపరమాణు ప్రమాణ మాత్రపు దళసరిగల రేకులు గాని తైలబిందు సందోహంగాని అలాంటి కాంతు లీనుతూంటుందని లాంగ్ మ్యూర్ పరిశోధనల వలన తెలిసింది. నీటిమీద తేలుతూండే పెట్రోలు బిందువులలాంటి కాంతులు చిమ్ముతూండడం సర్వజనైక వేద్యమే. అందుచేత స్వర్ణభస్మము పరమాణు ప్రమాణ కణమయంగా ఉండాలనే మనవారి నిర్ణయం అనిపిస్తుంది.

భస్మసాధనకోసం వాడుకలో ఉన్న విధానాల్లో తరతమ విభేదాల నేర్పరచడం వల్లకూడా మనవారు ముఖ్యంగా సాధ్యమైనంతమట్టుకి కొల్లాయిడు స్థితిలోనున్న ధాతువులనే వాడాలని అనుకున్నారనీ అది సాధ్యంకాకపోతేనే ఇతర భస్మసాధన యోగాల్ని ఆశ్రయించాలని భావించారనీ కూడా తెలుస్తోంది.

శ్లో॥ లోహానాం మారణం శ్రేష్ఠం
సర్వేషాం రస భస్మనా

మధ్యమం మూలికాభిశ్చ
కనిష్ఠం గంధకాదిభిః

అన్ని లోహాలవిషయంలోనూ రసభస్మసంబంధం ...స్మీకరణం చెయ్యడం శ్రేష్ఠమైన విధానమనీ, ...ం మూలికల వాడి భస్మం చెయ్యడం అనీ, ...ధానం గంధకాదులను వాడి భస్మీకరణం ...డం అని శాస్త్రవేత్తల అభిప్రాయం. లోహాలు ...ర్యంగా పాదరసంతో కలిసి సులువుగా రస ...ంగా (*amalgum*) మారడం ఆ రసద్రావణ ... అంతటా వ్యాపించిన లోహాణువులు పర ...ప్రమాణంగా విభాగమై ఉండడం శాస్త్రవేత్త ... విషయమే. ఆ రసద్రావణాన్ని భస్మంచేసే ... రసం ఆవిరియైపోయి లోహాణువులో, దాని ...సు అణువులో పరమాణుప్రమాణకణరూపంగా ...వడం జరుగుతుంది. మూలికల్ని, గంధ ...ని వాడి భస్మీకరణం చేస్తే ఇతర మలిన పదా ... కలవడం వాటిని తొలగించడం అసాధ్యం ...ం జరుగడానికి అవకాశం ఉంది. అందుచేతనే ...ానాలతో తరతమ భేదాలు కలిగాయి.

...కొల్లాయిడుస్థితిలోనున్న ద్రవ్యకణాలకు విద్యు ...ం ఉంటుంది. ఆ గుణాన్ని శోధించిన శాస్త్ర ...లో లిండర్, పిక్టన్ లనేవారు ప్రథములు. వారి ...ాలంగా మనకి ఎన్నో కొల్లాయిడు స్థితిలో ...పదార్థాల విద్యుదావేశ స్వభావం బోధపడింది. ... ప్లాటినమ్ రజనూ, పెండి కణాలూ, స్వర్ణ, ...లోహకణాలూ మొదలైనవి ఋణవిద్యుదావేశం ... ఆనోడు వైపు కదిలిపోతుంటాయని తెలి ... తామ్ర, రజత, లోహధాతువులయొక్క ...డాక్సైడులూ, హీమోగ్లోబిన్, మెథిల్ వయొ ... మెథిలీను బ్లూ రంగులు ధన విద్యుదావేశ పూరి ...ీ యుండి కాథోడువైపు ప్రయాణమై పోతూం ...ని తేలింది. అంతేకాదు. నీటిలో ఉన్న కొన్ని ...యిడు కణాలు ధన విద్యుదావేశ పూరితములై ...ప్పటికీ అవే కర్పూరతైలంలో తేలి ఆడుతూ ...ం ఋణ విద్యుదావేశం కలవై ఉంటాయని ... వారు కనుగొన్నారు. మొత్తుకి కొల్లాయిడు ...ం విద్యుదావేశపూరితములనీ, ఆ విద్యుదావేశ ...వం, పరిసరాలమీదా కణంయొక్క స్వభావం ...కూడా ఆధారపడి వుంటుందన్నది నిర్వివాద ...ం.

కొల్లాయిడుస్థితిలోనున్న పదార్థాల గుణాలుగా మన ఆయుర్వేద శాస్త్రవేత్తలు ఇచ్చిన అలబ్ధ ప్రతినిధి ద్రవ్యాలపట్టికనూ పరిశీలించి చూచామంటె మనవారి విచక్షణా వైశిద్యం గోచరిస్తుంది. 'సువర్ణే రజతం లోహం తదన్య రజతేపిచ' అన్న వాక్యంలో బంగారం లేకున్న వెండీ, వెండి లేకున్న లోహం వాడవచ్చునని సూచితమైంది. ఆయుర్వేద వైద్యుల దృష్టిలో ఈ మూడు ధాతువులూ తుల్యవైద్య యోగిత్వము గలవన్నమాట. ఇలా వాటి కొల్లాయిడు కణాల విద్యుదావేశ స్వభావంవల్లనే నిర్ణయించడానికి సాధ్యమవుతుంది. ఈ నిర్ణయంలో మరో విషయంకూడా స్పష్టమవుతోంది. అది వారి లోకజ్ఞత. రాజవైద్యంలో స్వర్ణభస్మాన్ని, సంపన్నగృహస్థులకు చేసేవైద్యంలో రజతభస్మాన్ని, కష్టజీవులకు చేసే వైద్యంలో లోహభస్మాన్ని వాడి రోగులకు మనశ్శాంతిని చేకూర్చడం, నిరోగుల్ని చేసి తగిన కట్నం పొందడం సాధ్యమని వారు గుర్తించినట్లు ఊహించడానికి వీలుంది.

ఏకకణాత్మక నిర్మాణంగల నానావిభేదములు, శాకప్రాయములైన సూక్ష్మజీవులూ ధనవిద్యుదావేశం గలవి. అందుచేత రోగకారకములగు వేర్వేరు సూక్ష్మజీవులుకూడా వాటిస్వభావానుగుణంగా విద్యుదావేశం కలవై ఉంటాయనీ అందుచేత ఆ ఆవేశాన్ని కూలదోసి క్రుంగదీసేటందుకు వాటి ఆవేశానికి వ్యతిరేకావేశం గల కొల్లాయిడు కణాలనే మనవారు ముందుగా వాడేవారనీ తలపోయడం సబబు. అవసరమైన విద్యుదావేశం కలిగించేటందుకే వారు వేర్వేరు సందర్భాల్లో ఒకే పదార్థాన్ని అనుపానంలో భేదాలతో వాడగలిగారనిపిస్తుంది.

మన ఆయుర్వేదశాస్త్రవేత్తల రసాయనిక విజ్ఞానాన్ని వారు సూచించిన క్షారపదార్థ సాధన (*alkali carbonates*), మరొక భస్మశోధన విధానంలో ఇమిడియున్న క్లోరైడుప్రమాణావధి నిర్ణయమూ వెల్లడిస్తాయి.

క్షారను తీయదగిన ద్రవ్యాన్ని బాగా ఎండించి ముక్కలుగాకొట్టి బూడిదచేసి దానిని 4 రెట్ల నీటిలో 24 గంటలు నానబెట్టి మరునాడు పైకి తేలిన నీటిని వడియబోసికొని ఇనుపపాత్రిలో గాని మట్టిబానలో గాని పోసి నెమ్మదిగ కలియబెట్టుచు కాచినయెడల

చివరకు తెల్లనిపొడి మిగులును అని మనవారు కను గొన్నారు. దీనిని వారు ప్రతిసారిణీయక్షారమని పేర్కొనిరి. ఇది అల్కలీ ధాతు కార్బొనేటు మిశ్రమని రసాయనికులు అంగీకరింతురు. క్షారములలో మృదు (*alkali bicarbonate*), మధ్య (*alkali carbonate*), తీక్ష్ణ (*Caustic alkali*) క్షారములని మూడు రకములున్నవని కూడ మన ఆయుర్వేదశాస్త్ర వేత్తలు గుర్తించియున్నారు.

స్వచ్ఛమై ఉత్తమమైన భస్మంలో ఏవిధమైన ఉత్పాతనశీలమై వాయుపదార్థం గా మారే (*volatile*) మలినము ఉండకూడదని మనవారు నిర్వచించారు. అందుచేత చే తయారైన భస్మాన్ని అగ్నిమీద వేసి నట్లైతే రంగు భేదించకుండా నిలవాలని వారు నిర్ణ యించారు. సామాన్యంగా ధాతువుల లవణాలన్నింటి లోనూ వాటి క్లోరైడులు ఉత్పతనశీలము కలవని అంద రికీ తెలుసు. అందుచేత భస్మంలో ఏదైనా క్లోరైడు మలినం ఉంటే అది త్వరలో వాయుపదార్థంగా మారి ధాతు సమాజమైన రంగుగల జ్వాల కల్గిస్తుందన్నది శాస్త్రవిజ్ఞానవేద్యం. రంగుభేదించకుండావుండే క్లోరైడు మలినం లేదని స్థూలంగా రుజువైనట్లు, భావించవచ్చు. రంగు భేదించినట్లైతే భస్మంలో ఇంకా పచ్చిదనం ఉందని నిర్ణయించి దాన్ని పోగొట్టేటందుకు మరో పుటాన్ని వెయ్యవలెనని ఆయుర్వేద శాస్త్రవేత్తలు నిర్ణయించారు. ఈ శోధనవిధానంలో భస్మాలలో క్లోరైడు మలిన ప్రమాణావధి నిర్ణయమైంది. ఇది అనంగీకృతిమై, ప్రిటిమ ఫార్మకోపియా నిర్వచించే ప్రమాణావధులు మాత్రమే శాస్త్రీయము లనగలమా?

ఆయుర్వేద శాస్త్రవేత్తల కౌశలాన్ని తెలిపే విషయాలన్నింటిలోనూ వారు కావించిన పరమాణు నిర్వచనం ఘణిభూషలాంటిది. వారు:

> శ్లో॥ జాలాంతరగతే భానౌ
> యత్సూక్ష్మం దృశ్యతే రజః
> తస్య త్రింశత్తమో భాగః
> పరమాణుస్స ఉచ్యతే.

అని కిటికీ కమ్ముల మధ్యనుంచి పడే సూర్య కాంతిలో నాట్యంచేస్తూ ద్యోతకమయే కణాలలో సూక్ష్మాతి సూక్ష్మమైన కణంలో ముప్ఫయ్యోవంతు ఉండే కణానికి పరమాణువని పేరుపెట్టారు.

సూర్యకాంతిలో నాట్యంచేస్తూ మన కంటికి కన్పించే కణజాలం ఆ కణాలు చిమ్మిన (*Scattered*) కాంతివల్ల ద్యోతకమవుతాయి. అందుచేత వాటిలో సూక్ష్మాతి సూక్ష్మమైనవాటిని అల్ట్రామైక్రోస్కోప్ సాధనంవల్ల కంటిమాపునకు ఆనే కొల్లాయిడు కణ జాలమని అనేటందుకు ఎవరూ సంకోచించ నక్కర లేదు. కొల్లాయిడు కణాల ప్రమాణం 10^{-5}—10^{-7} సెంటి మీటర్లమధ్య ప్రాంతంలో ఉంటుందని X-కిరణా లను వాడి శాస్త్రవేత్తలు నిర్ణయించారు. 10^{-4} సెంటి మీటరుని μ (మ్యూ) అనే సంకేతంతో మైక్రాన్ అని దీనిలో వెయ్యోవంతు 10^{-7} సెంటిమీటరు $m\mu$ మిల్లి మైక్రాన్ అని వ్యవహరిస్తారు. అతి పెద్ద కొల్లాయిడు కణం మైక్రానులో పదోవంతూ, అతి చిన్న కొల్లాయిడు కణం మైక్రాన్‌లో వెయ్యో వంతూ ఉంటాయన్నమాట. కొల్లాయిడు కణంలో ముప్ఫయ్యోవంతు అంటే .3 మిల్లీ మైక్రాన .3 $m\mu$ నుంచి .033 $m\mu$ అని లెక్క తేలింది. దీనినే మన వారు పరమాణు వన్నారు. ఆధునిక రసాయన శాస్త్ర వేత్తల ప్రయోగ ఫలితాల్ని బట్టి అతి పెద్ద పరమాణు ప్రమాణం (5 $m\mu$) 5 మిల్లిమైక్రానులని రుజు వైంది. అందుచేత పరమాణువుయొక్క ప్రమాణం విషయంలో ఆయుర్వేద శాస్త్రవేత్తల నిర్వచనానికీ, ఆధునిక విజ్ఞానవేత్తల నిర్ణయాలకీ సామాప్యం ఉందన్న విషయం స్పష్టము. ఈ సాదృశ్యం మన వారు ఏ మార్గాన్ననుసరించి సాధించిరా ఆ ప్రజ్ఞ ప్రశంసనీయమని ప్రాచీన భారతీయ విజ్ఞానం తఱచి తఱచి మాచుకోవలసిన బాధ్యత మనపై నున్నదని తెలుపుతుంది.



సత్యమూర్తినగర్ ముఖద్వారం
ఆవడి కాంగ్రెస్
ఛాయాగ్రహణం : శ్రీ యస్. రాధాకృష్ణ

ఆకాశానికి నిచ్చెనలు

278

4B3

శ్రీ కొమ్మూరి వేణుగోపాలరావు

ఊహా చిత్రం

* * ఒక రసాయన పరిశోధనాగారంలో పరిశోధనలు జరుగుతూ వుంటాయి. పరిశోధన జరిపేది యిద్దరు డాక్టర్లు. వాళ్లు మాట్లాడే ధోరణిలో ఒక రికీ యింకొకరికీ సంబంధం వుండదు. ఎవరికి వారేగా వుంటుంది వాళ్ల ధోరణి. వాళ్ల పరిశోధనలు కూడా ఒకటి కావు. ఎవరిగోడవ వాళ్లది.

ఒకటవ డాక్టరు: (తన ధోరణిలో) చిక్కింది! ఇన్నాళ్లుగా రాత్రింబవళ్లు కృషి చేసి సాధిస్తున్న దానికిపర్యవసానం యిప్పటికు కనిపించింది. నాఆశయంఫలించింది. (బిగ్గరగానవ్వుతాడు) ఇహ! డబ్బు! ఎక్కడ చూసినా డబ్బు! ధనరాసులమీద పడి పొర్లుతాను. కోట్లకోట్లు డబ్బు తయారుచేసి విరజిమ్ముతాను. (మళ్లీ పరిశోధన చేయడంలో మునిగిపోతాడు)

రెండవ డాక్టరు: (ఒకక్షణం విరామం తర్వాత) చిక్కబోతూంది! సంవత్సరాల తరబడి నిద్రాహారాలు మాని నిర్విరామంగా చేసిన కృషికి యిప్పటికు ఫలితం కనిపించబోతూంది. ఇహ! అందం! సౌందర్యం! ప్రపంచమంతా సౌందర్యమయంగా చేసివేస్తాను. మానవులందర్నీ అద్భుతమైన సుందరరూపులుగా చేసివేస్తాను. భూలోకాన్ని స్వర్గలోకంగా తయారుచేస్తాను.

ఒ. డా: (కొంచెం ఆగి) నా పరిశోధన ముగియబోతూంది. నా శ్రమ ఫలించబోతూంది. కాని...అబ్బ! తలుచుకుంటే భయం వేస్తూంది! ఆశ్చర్యం వేస్తూంది! ఎన్నాళ్లు దీన్ని సాధించటంలో మునిగిపోయాను. (విచారంగా) నా అన్నవాళ్లందర్నీ వదులుకున్నాను. సుఖాల్ని మరిచిపోయాను. ఆఖరికి దీంట్లోనే ముసలివాణ్ని అయిపోయాను. నా జుట్టంతా తెల్లబడిపోయింది. నా శరీరమంతా ముడుతలు పడింది...ఇది ఏ సంవత్సరం? ఇవాళ ఏంవారం? ఎన్నో తారీఖు? ఇవన్నీ ఏం తెలీదు. వాటిని తెలుసుకోవాలన్న ఆసక్తికూడా అంతరించిపోయింది... మళ్లీ యిప్పుడిప్పుడే కలుగుతోంది.

రెం. డా: సౌందర్యాన్ని సంపాదించాలని నా శరీర దారుఢ్యాన్ని, సౌందర్యాన్ని కోల్పోయాను. నన్ను నేను బలిచేసుకున్నాను. నా జీవితాన్ని యీ ఆశయంకోసం అంకితం చేశాను. కాని...యిదంతా అనవసరం. ఇవాల్టితో దీన్ని సాధించగలిగితే అవన్నీ మరిచిపోయి హాయిగా...అబ్బ ఎన్నెన్ని సౌఖ్యాలు!

[దూరంగా ముసలివాడి దగ్గు వినిపిస్తుంది. క్రమక్రమంగా దగ్గరగా వినబడి ఆగిపోతుంది]

ముసలివాడు: హు! మీ పరిశోధనలు యింకా ముగియలేదా? అర్థంలేని ఆశల్నీ, ఆశయాల్నీ సాధించాలన్న తృష్ణ యింకా తీరలేదా? అవును. ఎలా తీరుతుంది? మీ చావుతో కాని తీరదు. ఏం? మాట్లాడరేం?

[ఎవరూ మాట్లాడరు]

ముస: నేనూ డాక్టర్నే; మీలాంటి తెలివిగలవాణ్నే; కాని నా తెలివితేటలు యిటువంటి కుక్క-

ప్రయత్నాల్లో వ్యర్థంచేయలేదు. మానవులకు సేవచేయటంలో ఉపయోగించాను. ఇంకా నా తెలివితేటల్ని మానవసేవలోనే వినియోగిస్తున్నాను. మీలాగా అందని ఫలాలకోసం ఆశించే కోర్కెలు నాకు లేవు వింటున్నారా?

[ఎవరూ మాట్లాడరు]

ఓయ్. ధనపిపాసీ!

: (విసుగ్గా) ఊ—

నా మాటల్ని విన్నావా?

: విన్నాను. చాలా రోజుల్నించీ వింటున్నాను. ఈ విషయంలో శోకం కలిగించుకోవద్దని అనేకసార్లు చెప్పాను.

మీరీ వ్యర్థ ప్రయత్నాలు మానేవరకూ నేనిలా వాగుతూనే వుంటాను.

: నా ప్రయత్నం ఫలించేవరకూ నేను కొనసాగిస్తానే వుంటాను.

అనవసరంగా నీ జీవితాన్ని వ్యర్థంచేసుకుంటున్నావు.

నా జీవితాన్ని సార్థకం చేసుకుంటున్నాను.

నీ తెలివితేటల్ని, శక్తిని మరో మార్గంలో ఉపయోగిస్తే ఎనలేని కీర్తి, డబ్బూ సంపాదించేవాడివి.

నీ తెలివితేటల్ని, శక్తిని ఆ మార్గంలో వినియోగించి ఎంత కీర్తి, ఎంత డబ్బు సంపాదించావు?

ఆఖరికి నీ కోరిక నెరవేరకుండానే చచ్చిపోతావు.

నాకంటే చాలా వృద్ధుడివి. నా కళ్ళముందు నీవే చచ్చిపోతావు.

నీకు మతిపోయింది.

నా మతి స్థిరంగా వుంది.

నీకు ఘోర నరకం ప్రాప్తిస్తుంది.

అదేనో యిదివరకే ప్రాప్తించింది.

(నిస్పృహతో) హుఁ! పిచ్చివాడికి ఎంత చెప్పినా తలకెక్కదు......పోనీ. ఓయ్! సౌందర్య పిపాసీ!

రెం. డా: నాతో మాట్లాడకు.

ముస: ఇంకెవరితో మాట్లాడేది?

రెం. డా: ఎవరితోనూ వద్దు.

ముస: నీకూ మతిపోయిందేమో?

రెం. డా: పోయిందేమో—

ముస: చెడిపోతావు.

రెం. డా: పోతేపోతాను.

ముస: నామాటల్ని వినవా?

రెం. డా: వినను.

ముస: ఇప్పటికయినా నీ బుద్ధిమార్చుకోవా?

రెం. డా: మార్చుకోను.

ముస: (నిర్వేదంగా) ఈలోకంలో యిద్దరు అద్భుతమైన పిచ్చివాళ్లున్నారు, ఒకడు ధన పిపాసి. ఇంకొకడు సౌందర్యపిపాసి. వీళ్లకి యీ లోకంతో సంబంధం లేదు.. వీరు మానవులు. దేవతలు కారు. మానవాతీతమైన కోర్కెల్ని సఫలం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని గుర్తించటం లేదు. వీళ్ళ ప్రయత్నాలు భయంకర పరిణామానికి దారితీస్తాయని గ్రహించటం లేదు. ఈ విపరీతపు ప్రయత్నాలవల్ల లోకానికి కీడు కలుగుతుందని తెలుసుకోవటంలేదు. మానవత్వపు అంచుల్ని, మనుషుల శక్తుల్ని అంచనావేయటంలేదు. వీళ్ళు మనుషులు. నేనిక చెప్పవలసింది అయిపోయింది. వీళ్లతో వృథాసంభాషణకు దిగి నా కాలాన్ని వ్యర్థంచేసుకోను. వెడతాను.

[వెళ్లిపోతాడు]

[కొంచం సేపు నిశ్శబ్దం తర్వాత బయటనుంచి గట్టిగా ఒక యువకుడు వేస్తున్న కేక]

ధనం డాక్టరుగారూ! ధనం డాక్టర్ గారూ!

ఒ. డా: లోపలికి రావచ్చు.

యువకుడు: (హడావుడిగా) అయిపోయిందా డాక్టర్? మీ రన్నట్లు యివాల్టితో మీ పరిశ్రమ ఫలించిందా?

ఒ. డా: (తొణకకుండా) అవుతుంది. అయిపోవచ్చింది.

యువ: (నిరాశగా) ఇంకా అవుతూనేవుందా? పూర్తికాలేదూ? డాక్టర్! ధనం డాక్టర్!

ఒకప్పుడు నేను లక్షాధికారిని. ప్రపంచంలో బాగా డబ్బువున్న వాళ్లలో ఒకణ్ణి. కాని యిప్పుడు బికారిని. మా తండ్రీ, తాత సుత్తారిలూ గడించియిచ్చిన ధనమంతా మీకోసం, మీ పరిశోధనకోసం ధారపోశాను. నిజంగా యీ యోజన అది పూర్తిఅయిపోతుందంటారా డాక్టర్!

ఒ. డా: (నవ్వి) నువ్వు చాలా పిచ్చివాడివి యువకుడా! ఈ శ్రమఅంతా నేను ఎవరికోసం పడుతున్నా నంటావు? నీకోసం—నిన్ను ప్రపంచంలోకల్లా ధనవంతుడిని చేద్దామని. వింటున్నావా?

యువ: వింటున్నాను డాక్టర్.

ఒ. డా: నిన్ను దృష్టిలో పెట్టుకునే యీ పరిశోధనకి దిగాను. నిన్ను సర్వశక్తివంతుణ్ణి చేద్దామనుకున్నాను. అందుకే నా తాపత్రయం. తెలిసిందా?

యువ: తెలిసింది. మీరన్నట్లు రేపట్నుంచి నేను చెప్పలేనంత ధనవంతుణ్ణి అయిపోతాను. నా డబ్బుతో ప్రపంచాన్ని కొంటాను... కాని మా సుందరికి యీ విషయం లేవీ తెలీవు. ఆమె ఏమంటుందో తెలుసా డాక్టర్?

ఒ. డా: (విసుగ్గా) ఊఁ.

యువ: "మనకి వున్న డబ్బు చాలదా సుఖంగా జీవించటానికి" అంటుంది. ఆమె అందానికి, ఆమెను సుఖపెట్టటానికి, మా ఆనందానికి ఎంత ధనం అయితేమట్టుకు ఏం సరిపోతుంది? ఉహుఁ నేనీ విషయం ఆమెకప్పుడే చెప్పను. ఒక్కసారిగా సుందరిని ఆశ్చర్యపడేటట్లు చేస్తాను. కాని డాక్టర్! నే చెప్పిన విషయం మీకు గుర్తువుందా?

ఒ. డా: ఏమిటి?

యువ: ఊఁ—మీరప్పుడే మరిచిపోయారు. మీకు కావల్సిన పరికరాలన్నీ కొని మీచేత యీ పరిశోధన చేయిస్తున్నది నేను. కష్టమంతా నాది. మీరు యిది చేయటం ముగిశాక డబ్బును ఆ యంత్రంద్వారా తయారుచేసే విధానం నాకు ఒక్కడికే తెలియజెప్పాలి. ఇంకెవరికీ చెప్పకూడదు.

ఒ. డా: అలాగే.

యువ: అయితే డాక్టర్! నేనిప్పుడు ఏం చేయాలి? కొండంత ఆశతో వచ్చాను. మీరు చేస్తున్న పని ముగిసి ఫలించటానికి యింకా కొన్ని గంటలేనా వ్యవధి? అప్పటిదాకా నే నిక్కడే కూర్చు నేదా?

ఒ. డా: (నవ్వి) కూర్చుంటావా యువకుడా? ఉహు—నువ్విప్పుడు ఒక పని చేయాల్సి వుంది.

యువ: (భయంగా) ఏమిటి?

ఒ. డా: పరిశోధన ముగియబోతున్న సమయంలో శక్తివంతమైన ఒక ద్రావకాన్ని ఉపయోగించాలి. దానిని కొని తీసుకురావాలి.

యువ: (సందేహంగా) అది ఎంత ఖరీదు డాక్టర్?

ఒ. డా: ఒక లక్ష.

యువ: అఁ! ఇంకా లక్ష రూపాయలా? నాకున్న సర్వదాస్తి దీనికోసమే ధారపోశాను. నాదగ్గర యిప్పుడొక చిల్లిగవ్వకూడా లేదు.

ఒ. డా: అయితే యింతా ఖర్చుచేసింతర్వాత ఒక లక్ష రూపాయలకోసం వెనుకాడి యింతకు ముందు పడిన శ్రమనంతా నిష్ఫలం చేసుకుంటావా? (కోపంగా)

యువ: (భయంగా) ఏమంటున్నారు డాక్టర్?

ఒ. డా: ఆ డబ్బు ఎలాగో సంపాదించి, ఆ ద్రావకాన్ని కొనుక్కురాకపోతే యింతవరకూ చేసిందంతా ధ్వంసమై వూరుకుంటుందంటున్నాను.

యువ: అంతేనా?

ఒ. డా: అంతే.

యువ: (బలహీనంగా) తెస్తే?

ఒ. డా: (నవ్వి) తెస్తే? ఇంకేమిటి? రాసులకిరాసులు ధనం. నీకు కావలసినంత ధనం. (యింకా వికటంగా నవ్వుతూ) ధనం, ధనప్రవాహం!

(పులకితుడై) ధనం కావలసినంతధనం... ధనం...ధనం. రాసులకి రాసులు.

[అతని ఊహాప్రపంచంలో జరుగుతున్నట్లు జంత్రధ్వనులు. తరువాత ధనం నాణాలు కుప్పలు కుప్పలుగా పడిపోతున్నట్లుశబ్దాలు]

(ఊహాప్రపంచంలోనే) హాహాహాహా! నేను లక్షాధికారిని; ఊహూ, కోటీశ్వరుణ్ణి, ఊహూ, ప్రపంచానికి అధిపతిని. నేను ముట్టుకున్నదల్లా బంగారం! డబ్బు! హాహాహాహా! దీంతో యీలోకాన్ని జయిస్తాను. నన్ను మించిన భాగ్యశాలి ఎవరు...ఎవరున్నారీ భువిలో?... ఓయ్ సుందరీ! అలా చూస్తావేం? తెల్లబోతావేం? ఇదుగో డబ్బు! నీ యిష్టం వచ్చినట్లు ఆడుకో! నీ అందానికి తగ్గ ఆనందం లభిస్తుంది. ఏం కావాలి నీకు? కార్లా? (వేగంగా కార్లు పరుగిడుతున్న శబ్దాలు) రైళ్ళా? (రైళ్లు పోతున్న శబ్దాలు) విమానాలా? (విమానాలు ఎగురుతున్న శబ్దాలు) హాహాహాహా! ఇంకా ఏమిటి? ఏంకావాలి నీకు? ఇదిగో నీకు ప్రపంచంలో కల్లా విలువైనదుస్తులు. నీ కిరీటంలోని వజ్రం ఖరీదెంతో తెలుసా? ఇదిగో యీ జగతిలోకల్లా ఎత్తయిన మేడ! చెప్పు, చాలా? యీ సుఖంచాలా? ఈ ధనరాసుల మీంచి దొర్లి ఆడుకుందాంరా! రా! ఇసుక దిబ్బలమీద దొర్లినట్లు దొర్లుదాం. హాహా హాహా! ఏం? బావుళ్ళేదూ?

డా: ఏమిటి ఆలోచిస్తున్నావు?

: (తేరుకుని) ఏమీ ఆలోచించటల్లేదు. నాకింక ఆలోచించటం అనవసరం. తెస్తాను డాక్టర్! నానా అవస్థా పడి, తల తాకట్టు పెట్టి అయినా సరే మీరు చెప్పిన డబ్బు తెస్తాను. ఒక్కగంటలోనే తిరిగివస్తాను.

డా: ఉండు. డబ్బు తెస్తే నాకెందుకు? ఈ చీటిలో రాసివున్న ద్రావకం కొనుక్కురా.

: వస్తాను డాక్టర్. (వెళ్లిపోతాడు).

డా: (ముందు మెల్లగా, తర్వాత కొంచం బిగ్గరగా, యింకా బిగ్గరగా నవ్వుతాడు)

[కొంచం సేపు నిశ్శబ్దం; తర్వాత బయట నుంచి ఓ స్త్రీ పిలుపు]

"సౌందర్యం డాక్టరుగారూ! సౌందర్యం డాక్టరుగారూ!"

రెం.డా: లోపలికి రావచ్చు.

సుందరి: (లోపలికి వస్తూ, హడావుడిగా) అయిపోయిందా డాక్టరుగారూ. ఇవాల్టితో మీరు చేస్తున్న పరిశోధన ముగిసిందా?

రెం.డా: ముగియబోతూంది.

సుంద: (నిరాశగా) ఇంకా ముగియలేదా?

రెం.డా: అవుతుంది. శీఘ్రంగానే పూర్తికాబోతూంది. నా కష్టం ఫలించబోతూంది. ప్రపంచానికి ఒక మహోపకారం జరగబోతూంది.

సుంద: (విస్తుపోయి) ప్రపంచానికా? అలా అంటారేం డాక్టరుగారూ?

రెం.డా: ఏం?

సుంద: మీరు నాకు ఏమని వాగ్దానం చేశారు? మీ కృషివల్ల లభించబోయే సౌందర్యాన్ని నాకు ఒక్కదానికే దత్తం చేస్తానన్నారుగా.

రెం.డా: అవును—మరిచిపోయాను—అయితే అంతా నీకే—

సుంద: లేకపోతే యీ శ్రమంతా నేనెందుకు పడతాను డాక్టరుగారూ? నా రక్తమంతా మీ పరిశోధనలకోసం అంకితం చేశాను. నా శరీరమంతటా సూదిపోట్లు పొడిపించుకున్నాను. రక్తం లేక పాలిపోయి నా సహజ సౌందర్యాన్ని కోల్పోయాను. కాని డాక్టర్ గారూ! ఒకవిషయం ఆశ్చర్యంగా లేదూ?

రెం.డా: (విసుగ్గా) ఏమిటి?

సుంద: నా సహజ సౌందర్యంమీద నాకేం నమ్మకం లేదు. ఈ అందం ఒక లెక్కలోదని నా ఉద్దేశం కాదు. కాని ఆయన...ఆయన ఏమంటారో తెలుసా?

రెం.డా: ఊ?

సుంద: నేను అద్భుత సౌందర్యవతినట. నా అందానికి తగిన ఆనందం లభించటానికి ఆయన దగ్గరవున్న ధనం సరిపోదుట, వట్టి పిచ్చి! (నవ్వి) నా ముఖం? నా అందమెంత? మొన్న కల్లో చూశాను. ఓహ్! ఆమెకు ఎంత సౌందర్యం! ఎంత కళ! ఆమె దేహం బంగారంలా మెరిసిపోతూందంటే నమ్మండి డాక్టరుగారూ. (జాలిగా) నేనుకూడా అంతటిదాన్ని అవుతా నంటారా?

రెం.డా: ఊఁ—అందుకోసమేగా అమ్మాయి! నా శక్తి నంతా ధారపోస్తున్నాను. నిన్ను ప్రపంచ సుందరిని చేయటానికి నాయువ్వనమంతా కోల్పోయాను. ఇంకా కొన్ని గంటల్లోనే మన యిద్దరి కోర్కెలూ ఫలించబోతున్నాయి. కాని...కాని...

సుంద: (ఆతృతగా) కాని......ఏమిటి చెప్పండి డాక్టర్ గారూ?

రెం.డా: ఏం లేదు. ఈ పరిశోధన ముగియటానికి యింకా ఒక వస్తువు అవసరమై వుంది అమ్మాయ్!

సుంద: (భయంగా) ఇంకానా? ఇంకా నాదగ్గర ఏముంది?

రెం.డా: ఉంది. నీదగ్గర వున్నదే నేనడుగుతున్నాను.

సుంద: (బలహీనంగా) ఏమిటి?

రెం.డా: నీ రెండు కళ్ళూ యివ్వాలి.

సుంద: ఆఁ!

రెం.డా: అవును. భయపడి ప్రయోజనం లేదు. నా కృషికి ఫలితం కనిపించాలంటే నువ్వు యిచ్చి తీరాలి.

సుంద: లేకపోతే?

రెం.డా: (కోపంగా) లేకపోతేనా? ఈ ప్రశ్న కేమయినా అర్థం వుందా? ఇన్ని సంవత్సరాలుగా పడుతున్న శ్రమ అంతా నిష్ప్రయోజనమైపోతుంది. ఇక యీ పరిశోధన ఎందుకూ పనికి రాదు.

సుంద: ఇచ్చినట్లయితే?

రెం.డా: మన ప్రయత్నం సఫలీకృతమౌతుంది. అద్వితీయమైన అందం నీకు అవతరిస్తుంది.

సుంద: (తన్మయంగా) ఆఁ!

రెం.డా: నీ శరీరం, బంగారువన్నెగల నీ శరీరం విరజిమ్ముతున్న కాంతి యీ జగత్తు అంతా వ్యాపిస్తుంది.

సుంద: ఆఁ!

రెం.డా: అందం చందం లేని యీ కళ్లు పోయి కమల నయనాలు అవతరిస్తాయి. నీ కళ్ళకాంతితో ముల్లోకాల్నీ వశపర్చుకుంటావు.

సుంద: ఆఁ!

రెం.డా: ఇంకా ఏమిటి? జీవకోటిసర్వస్వం నీకు దాసోహం అంటుంది.

సుంద: (తన్మయంగా) నా యీ పాడురూపం పోయి నిరుపమాన సౌందర్యవతి నవుతాను. రంభ, ఊర్వసి, హెలీనా వీళ్లంతా నాముందు సౌందర్య విహీనలు. అప్పుడు...అప్పుడు...

[ఊహాప్రపంచంలో జరుగుతున్నట్లు జంత్ర ధ్వనులు]

(నేపథ్యంలో ఎనౌన్సర్ మాటలు): ఇప్పుడు యిక్కడ అందాలపోటీ జరగబోతూంది. ప్రపంచంలోని సుందరీమణులుగా పేరు పొందిన నారీరత్నాలు వరుసగా మీముందు ప్రదర్శించబడతారు.

[ప్రేక్షకుల్లో కలకలం]

ఎనౌ: మొదట కుమారి మనోహరి మీ ముందుకు వస్తుంది.

[జంత్రధ్వనులు. ప్రేక్షకుల్లో సంతోష ధ్వనులు. "ఆహా! ఏం సౌందర్యమోయ్!" "ఏం అందమోయ్!" "బలే లావణ్యం" యిటువంటి మాటలు]

ఎనౌ: ఇప్పుడు కుమారి సువర్ణ మీ కళ్లముందు అవతరిస్తుంది.

[జంత్రధ్వనులు మళ్లీ సంతోషధ్వనులు. "నిజంగా బంగారంలానే వుందోయ్!", "ఎల• మెరిసిపోతోందో!" "ఇందాకటి

ఆమెకన్నా యీమే బాగుంది" యిటువంటి మాటలు.]

: కుమారి సువర్ణను చూశారు. తరువాత కుమారి రతీదేవిని చూస్తారు.

[జంత్రధ్వనులు; "ఫర్వాలేదు." బాగానే వుంది; "ఏ మయినా యింకొకటి వాళ్లే బాగున్నారు లెద్దూ", "ఉహు. రతీదేవి నామం సార్థకం చేయలేదురా" యిటువంటి మాటలు]

: జాగ్రత్తగా కూర్చోండి. ఇప్పుడు శ్రీమతి సుందరి మీకు దర్శనమిస్తారు.

[జంత్రధ్వనులు. "హాయ్ హాయ్", "బలే బళే", "ఏ మందం ఏం చందం!", "సువర్ణాగివర్ణా మనోహారి గినోహారీ అంతా బలాదూర నుకో", "ఇటువంటి సుందరి నాకు భార్యగా వుంటేనా!"; "నీమొహం, నీకు భార్యగా వుండటమేమిటి! అతనిదీ, అక్కడ నిల్చొన్నా ఆ యువకుడు అతనిదీ అదృష్టం, అతనిభార్య"; "అప్రతిమానఅందాలలత", "నిరుపమాన సౌందర్య విరాజిత", "వనజగంధి" యిటువంటిమాటలు, కరతాళ ధ్వనులు]

: అందాలపోటీ పూర్తయింది. శ్రీమతి సుందరినే అందాలరాణిగా, ప్రపంచసుందరిగా న్యాయాధిపతులు నిర్ణయించారు.

[తిరిగి, కరతాళధ్వనులు.]

వ: (గట్టిగా) సుందరీ! సుందరీ...అబ్బ. ఈ సందడిలో నిన్ను చూడటం అసంభవమేమో ననుకున్నాను. నీ కింత అందం ఎలా వచ్చింది! నిజంగా...నిజంగా నే నదృష్టవంతుణ్ణి.

ద: (తన్మయంగా) నా జన్మ తరించింది.

వ: అదిగో! నీ ఫొటోలు తీసుకోవటంకోసం, నీ ఆటోగ్రాఫులు తీసుకోవటం కోసం ప్రజలు గుంపులు గుంపులుగా ఎలా వస్తున్నారో!

ద: ఇదంతా మీ కోసమే! మీ ఆనందంకోసమే!

[పోహో ప్రపంచం అయిపోయిన జంత్ర ధ్వనులు]

రం. డా: ఏమిటి ఆలోచిస్తున్నావు! నీ కళ్లు యీయటానికి యింకా సంశయిస్తున్నావా?

సుంద: (తేరుకుని) సంశయమా! ఉహు. లేదు. ఏది యిమ్మన్నా యిస్తాను. నా రెండు కళ్లూ మీరు యిప్పుడే తీసుకోండి.

రం. డా: (నవ్వి) నాకు తెలుసు నువ్వు అంగీకరిస్తావని. అయితే ఆ గదిలోకి పద.

[ఒక క్షణం నిశ్శబ్దం. తరువాత గదిలోనుంచి దూరంగా విని వినిపిస్తున్నట్టు భయంకరంగా జంత్రధ్వనులు, వాటిలో కలిసిపోతూ సుందరి బాధాకరమైన ఆర్తనాదాలు.]

రం. డా: (దూరంగా) అయిపోయింది. నీ కళ్లు తీసుకున్నాను. నువ్విప్పుడే లేవకూడదు. నీబాధ తగ్గేవరకూ యిక్కడే విశ్రమించు. (మళ్లీ దగ్గరకు వచ్చేస్తాడు) ఇహ నా పరిశోధనలో చివరి అంకాన్ని యిప్పుడే సంపూర్తి చేస్తాను. నా ఆశయం ఫలింపచేసుకుంటాను. అతిరాత్రి...తిరాత్రి (గట్టిగా నవ్వుతాడు పరిశోధన చేస్తున్నట్లు ధ్వని)

[బయటనుంచి కేక "ధనం డాక్టర్ గారూ! ధనం డాక్టర్ గారూ!]

ఒ. డా: లోపలికి రావచ్చు!

యువ: (వచ్చి) వచ్చేశాను డాక్టర్! నానా తిరుగుడూ తిరిగాను. నానా అగచాట్లూ పడ్డాను. ఆత్మాభిమానాన్ని కూడా చంపుకుని భిక్షుకుడిలాగా దేవురించాను. తినరాని తిట్లు తిన్నాను. పడరానిపాట్లు పడ్డాను.

ఒ. డా: ఇంతా చేసి వట్టిచేతుల్తో తిరిగివచ్చావా?

యువ: (నవ్వి) మీకు ఎటువంటి మనిషో మీ రింకా గ్రహించలేదు డాక్టర్! ఏదయినా చేయటానికి సంకల్పిస్తే ఆపని నెరవేరాలిసిందే. హుం! వట్టిచేతుల్తో తిరిగివస్తానా!... ఇదిగో ...మీరు తెమ్మన్న ద్రావకం.

ఒ. డా: శేష్! నీవు చాలా సమర్థుడివి యువకుడా!

యువ: ద న్నిప్పుడేం చేయమంటారు డాక్టర్?

ఒ. డా: నీవు చెయ్యవలసింది యిక ఏమీ లేదు. మిగిలిన పనంతా నాది. చివరి ఘడియల్లో జరగబోతున్న యీ పరిశోధన చాలా ప్రమాదకరమైనది. నీవు చూడలేవు. కొంతసేపు ఎక్కడికయినా పోయి మళ్ళీ రా.

యువ: అలాగే డాక్టర్! నేను వచ్చేటప్పటికి మీరు నాకు శుభవార్త చెప్పాలి. ఎనలేని ధనం నాముందు నాట్యమాడాలి. ఈలోగా ఒకసారి సుందరిని కలుసుకుని వస్తాను. వెళ్ళి వస్తాను డాక్టర్! చాలా కొద్దిసేపట్లో తిరిగి వచ్చేస్తాను. (వెళ్ళిపోతాడు)

ఒ. డా: ఇదో నా పరిశోధన పరిసమాప్తి చెందబోతూంది. ఇంకా కొన్ని ఘడియల్లో నే ధనం రాసులు రాసులుగా అవతరించబోతూంది.

[జోరుగా యంత్రం పనిచేస్తున్న శబ్దం]

రెం.డా: (కొంచెం ఆగి) ఇన్ని సంవత్సరాల నా కష్టం ఫలించబోతూన్న యీ సమయంలో నేను ఏం చూడగలుగుతున్నాను? పొరలు పొరలుగా, తెరలు తెరలుగా ఉద్భవిస్తున్న యీ సౌందర్య రేఖలు, మామూలు కంటికి కనిపించకుండా గంటకు లక్ష మైళ్ళ వేగంతో ప్రవహిస్తున్న యీ అందాన్ని సృష్టించే తరంగాలు నా మతి చలింపచేస్తున్నాయి. వీటిని చూస్తుంటే నా కళ్లు మిరుమిట్లు గొల్పుతున్నాయి.

ఒ. డా: నా యంత్రం యిప్పుడు కామధేనువులాగా ధనరాసుల్ని పుట్టించగలుగుతుంది. గంటకు కొన్ని లక్షల మైళ్ళ వేగంలో పోతున్న యీ కన్వేయర్ బెల్టు నా గుండెల్లో తిరుగుతున్నట్లే వుంది. ధనం, రకరకాల ఆకారాలలో తయారుకాబోయే ధనం ద్రావకంగా తయారవుతోంది. ప్రపంచంలో దేనికి వున్నాయి దీనికి వున్న కాంతులు? ఇది విరజిమ్ముతున్న కాంతిలో సూర్య కాంతి కూడా సరిపోతుందా? ఇది గడ్డకట్టాలి. అప్పుడు...అప్పుడు...

[మళ్ళీ పరిశోధనలో మునిగిపోతాడు]

రెం.డా: ఇంతవరకూ మానవుడు కనీ వినీ ఎరుగని శక్తుల్ని నేనిప్పుడు సృష్టిస్తున్నాను. ఇంతవరకూ కృత్రిమాలంకారాలవల్లే మానవులు సుందరులుగా కనిపించగలుగుతున్నారు. ఇక— యీ అద్భుత శక్తులతో స్వభావసిద్ధమైన సౌందర్యాన్ని సంపాదించగలుగుతారు.

ఒ. డా: ఎవరు కనిపెట్టారు! ఇటువంటి వింతను ఎవరు కనిపెట్టారు! డబ్బు లేక దరిద్రంతో లోకం చస్తోంది. ఆ డబ్బు నా చేతుల క్రింద యిప్పుడు తయారు కాబోతోంది. సమస్తజీవరాశినీ చకితుల్ని చేసివేసే బ్రహ్మాండమైన ఆయుధం తయారవుతోంది.

రెం.డా: కాని ఆలోచిస్తుంటే ఒక విషయం స్ఫురిస్తోంది. నేను సృష్టించబోయే శక్తుల్ని ప్రపంచానికి ఎందుకు ధారాదత్తంచేయాలి!

ఒ. డా: నా అంతరాత్మ నన్ను ప్రబోధిస్తున్నట్లుగా వుంది. ఇన్నేళ్లు శ్రమించి వశపర్చుకున్న యీ ఆయుధాన్ని యితరుల క్షేమంకోసం ఎందుకు వినియోగించాలి?

రెం.డా: ఈ సుందరి ప్రపంచ సుందరిగా మారి ఆమె భర్తతో ఎందుకు ఆనందంగా గడపాలి?

ఒ. డా: ఈ యంత్రంలోని కీలకాన్ని తెలుసుకుని ఆ యువకుడు ఎందుకు ఎంతో ధనానికి అధికారి కావాలి?

రెం.డా: ఈ శక్తుల ప్రభావాలవల్ల నేను వృద్ధాప్యాన్ని పోగొట్టుకుని యవ్వనం సంపాదిస్తాను.

ఒ. డా: ఈ యంత్రంచేత నిర్విరామంగా పని చేయించి కోట్లకొద్దీ డబ్బు రాసులకి రాసులుగా సేకరిస్తాను.

రెం.డా: నా అందంచూసి స్త్రీలు మూర్ఛపోతారు. నావెంట పడతారు.

ఒ. డా: నా భాగ్యంచూసి మానవులంతా అసూయతో కుళ్లిపోతారు.

రెం.డా: సుందరి యిష్టపడితే ఆమెను రంభా, ఊర్వశిలను తలదన్నే మనోహరిగా మార్చి పెళ్లి చేసుకుంటాను.

ా: ఆ యువకుడు అంతగా ఏడిస్తే వాడిమొహాన ఒక లక్షరూపాయలు పారేస్తాను.

ా: ఈ సుందరి కాకపోతే మరో సుందరి! నాకేం కొదవా? నా అందచందాల్తో పురుషుల్ని, స్త్రీలను సహితం సమ్మోహపరుస్తాను.

ా: ఎవరేని ధనానికి అధికారినైనప్పుడు నాకు తీరని కోరికలు ఏముంటాయి? నాకు నచ్చిన ప్రతివస్తువునూ ధనంతో కొంటాను.

ా: నేను నడుస్తుంటే ఆడవాళ్లంతా నావెంట పడాల్సిందే.

ా: నేను భువనంమీద నిల్చుంటే ప్రతివాడూ నాముందు మోకరిల్లాలిసిందే.

ా: నే వలచిన స్త్రీ నా స్వంతం.

ా: నే తలచిన వస్తువు నా స్వంతం.

ా: మానవుల్ని వెర్రెత్తిస్తాను.

ా: మానవుల్ని ఏడిపిస్తాను.

ా: నా అందం

ా: నా భాగ్యం

ా: (బిగ్గరగా నవ్వుతాడు)

: (యింకా బిగ్గరగా నవ్వుతాడు)

ా: (నవ్వాపి) ఏమిటి? వారేవా! నా కళ్లముందేమిటి కనిపిస్తూంది? ఈ యింద్రజాలమంతా ఏమిటి? నేనే సమ్మోహితుడనై యిలా చలించిపోతున్నానేమిటి?

: ఏం జరగబోతోంది? నే నెందుకిలా స్తంభీభూతుణ్ణయిపోతున్నాను? ఎటువంటి అద్భుతమైన సంఘటన నాముందు సంభవిస్తోంది?

ా: (భయంకరంగా నవ్వుతూ) హాహాహాహా! అయిపోయింది. అంతా తయారయిపోయింది. జయించాను!

: నాకళ్లి యిలా తిరిగిపోతున్నా యెందుకు? నా ఆశలన్నీ నిరాశలయి పోతున్నాయా? నాకు తెలివి తప్పిపోతోందేం? (భయంగా)

: హాహాహా! జయించాను. హాహాహాహా!

: ఓడిపోయానా? ఈ చివరి ఘడియల్లో ఓడిపోయానా?

రెం. డా: (సంతోషంగా) హాహాహాహాహా!

ఒ. డా: (వెటకారంగా, ఉక్రోషంగా) హాహాహాహా!

రెం. డా: ఏమిటి. ఏమిటోయ్. (నవ్వు)

ఒ. డా: నవ్వు. ఇంకానవ్వు... ఇంకా ఎంతసేపు నవ్వగలవో చూద్దాం!

[పిడుగు దూకినట్లు ఏదో గందరగోళం జరిగినట్లు శబ్దాలు. బాధగా, భయంకరంగా, చచ్చిపోతున్నప్పుడు మానవుడు చేస్తే ఆర్తనాదాలు, యంత్రాలు పగిలిపోయినట్లు చప్పుడు, భయంకరంగా జంత్రధ్వనులు. ఒక క్షణం విరామం. లోపలనుంచి హడావుడిగా తడుముకుంటూ సుందరి వస్తుంది.]

సుంద: (దూరంగా) ఏమిటి? అయ్యో. ఏం జరిగింది? (దగ్గరగా) ఏమిటి? ఎవరూ మాట్లాడరేం? డాక్టరుగారూ? మీరెక్కడున్నారు? ఏంచేస్తున్నారు?

[నిశ్శబ్దం]

సుంద: నాకేదో భయంగావుంది. ఏదో మహాఘోరం జరిగిపోయినట్లు అనిపిస్తోంది. (గాద్గదికంగా) డాక్టరుగారూ!

[బయటనుంచి యువకుడి కేక.]

"ధనం డాక్టర్ గారూ! ధనం డాక్టర్ గారూ!"

యువ: (లోపలికివస్తూ సందేహంగా) ఎవరూ పలకరేం? డాక్టర్ ఏమయ్యాడు? (గట్టిగా) డాక్టర్! మీ రెక్కడున్నారు?

సుంద: (గొంతు గుర్తుపట్టి) మీరా?

యువ: (ఆశ్చర్యంగా) సుందరీ.

సుంద: (ఏడుస్తూ) మీ రిక్కడికి ఎలా వచ్చారు? ఎందుకు వచ్చారు?

యువ: (కటువుగా) నువ్వా ఆ ప్రశ్నలకే జవాబు చెప్పాలి... ఆఁ అదేమిటి? నీ కళ్లు. తామరపూవుల్ని మరిపించే నీ కళ్లు ఏవీ?

సుంద: (యింకా ఏడుస్తూ) అదంతా ఏదో జరిగిపోయింది, ముందు యిక్కడ ఏమయిందో చెప్పండి, నాకు గాబరాగా వుంది.

యువ: ఏం జరిగిందో నాకుమాత్రం ఏం తెలుసు? (చూసి, భయంగా) ఆఁ! యిదేమిటి?

అంతా తల్లక్రిందులయిపోయింది. రసాయన పరికరాలు, యంత్రాలు అన్నీ తునాతునక లయిపోయాయి...ఆఁ ఇక్కడ డాక్టర్లిద్దరూ చచ్చిపడి వున్నారు.

సుంద: ఆఁ!

యువ: (ఏడుస్తూ) అయ్యో డాక్టర్! నా ఆశలన్నీ ఏంచేసిపోయావు? నేను యిచ్చిన డబ్బంతా ఏం చేసిపోయావు? అదంతా మట్టిపాలేనా? నా ఆశలన్నీ నిరాశలుగానే మిగిలిపోవ ల్సిందేనా నే నిలా బికారిలా వుండిపోవ ల్సిందేనా.

సుంద: (ఏడుస్తూ) డాక్టరుగారూ. నా రక్తం అంతా యిందుకేనా ధారపోసింది? నే కన్న కలలన్నీ కల్లలయి పోవల్సిందేనా? (వెక్కి వెక్కి ఏడుస్తూ) నా కళ్లు మళ్లీ యిస్తానని తీసుకుని మీరు చివరకు యిదా చేసింది? అయ్యో!

యువ: (తృళ్లిపడి, ఆశ్చర్యంగా) అయితే నీకళ్లను ఆ రెండో డాక్టరుకి యిచ్చేశావా?

సుంద: నాలాగే మీరూ మోసపోయి మీ ధనమంతా ఆ డాక్టరుగారికి దానంచేశారా?

యువ: నువ్వు నాతో చెప్పకుండా రోజూ వచ్చేది యిక్కడికే నన్నమాట. నీ సౌందర్యాన్ని నువ్వు నమ్ముకోలేక ఎంతపని చేశావు సుందరీ?

సుంద: ఏంచేయను? నేను పూర్తిగా పిచ్చిదాన్ని అయిపోయాను. మీరు...

యువ: ఇందాకే అన్నావుగా నువ్వు మనకున్న భాగ్యం కరిగిపోతుందని ఎంత మొత్తు కుంటున్నా వినక డబ్బుపిచ్చిలో పడి పోయాను.

[దూరంగా, క్రమక్రమంగా దగ్గరగా, ముసలి వాడి దగ్గు]

ముస: (వస్తూ) ఏమిటది? ఏదో దారుణం జరిగి నట్లుగా వుంది...సర్వం నాశనమయింది ఈ మూల యిద్దరూ చచ్చిపడివున్నారు. ఆమూల ఎవరు? ఎవరో యువతీ యువకులు ...ఓహో. మీరేనా యీ పిచ్చివాళ్ల ప్రేరేపణలో పడిపోయి వాళ్లని ప్రేరేపించింది కూడా.

యువ:
సుంద: (ఒకేసారి, గద్గదంగా) చిత్తంస్వామీ!

ముస: ఇంకో యిద్దరు పిచ్చివాళ్ళు! హుం! నలుగురూ చచ్చిపోయారు. ఇద్దరు భౌతికంగా మరణించారు. ఇద్దరు నైతికంగా మరణించారు. కాని—నా చావు చూడకుండానే వాళ్ళిద్దరూ యిక్కడినుంచీ వెళ్లిపోవటం—నిజంగా విషాదకరం!

యువ: మేము మూర్ఖులం స్వామీ!


ముస: మీరేనా మూర్ఖులు! ఇంత పెద్ద ప్రపంచంలో మీరేనా మూర్ఖులు? కాదు. ఇంకా చాలామంది వున్నారు. కాని మీలోని మూర్ఖత్వానికి చాలామంది - మూర్ఖత్వానికన్నా ఎక్కువ తెగింపు వుంది. దానికి దురాశ అనే పదార్థం ఒకటి మెరుగు పెట్టింది. దాంతో మీరు...మీరంటే మీ నలుగురూ మానవులు అనే పదానికి అర్థం మరిచి పోయారు. పొండి! మీ యిద్దరి పరిస్థితీ యిది వరకటికన్నా ఎంత భిన్నంగావుందో మీకు తెలుసు. పోయి అలాగే నికృష్టంగా కాలాన్ని గడపండి. ఈ దౌర్భాగ్యజీవుల శరీరాలకి నేను అంత్యక్రియలు జరిపిస్తాను. వెళ్లిపొండి. ఈ నరకంనుంచి సాధ్యమయి నంత త్వరలో వెళ్లిపొండి. అత్యాశ, అన్యాయం—వీటికి దూరంగా వుండండి. అవే వీళ్లిద్దర్నీ సర్వనాశనం చేసి మిమ్మల్ని నాశనం చేశాయి. ఇహ వెళ్లండి!

యువ:
సుంద: (ఒకేసారి) నమస్కారం స్వామీ!


[వెళ్లిపోతారు]

ముస: హుం! మానవులు!

ఆఖరు అతిథి వెళ్లాక...



నేను గాథ నిట్టూర్పు విడిచాను. అదొక సందడి
ాని నా ప్రయత్నాలన్నియు ఫలించాయి. అందరు
ంచ్చుకొన్నారు.



రెండువందలమంది పెళ్లి విందులో కూర్చు
న్నారు. అంతా సవ్యంగా జరగాలని నా
సహజ ఆదుర్దా. అయితే మొదటి భోజనం
నుండి ఆఖరువరకూ ప్రశంసే విన్నాను.
ప్రతివారు అమోఘం అన్నారు.

డాల్డా వనస్పతికి నా అభివందనాలు. అది పెద్ద
దివ్యమైనది. ఎందుకంటే దానిని ప్రతి వంటకూ
వాడవచ్చు. డాల్డా ఆహారమునుండి తీసుకొనివచ్చు
న సహజ రుచిని మా అతిథులంతా మెచ్చుకొన్నారు.
సీలు డబ్బాలోని డాల్డా మలినమువల్లగాని, ఈగల
అపరిశుద్ధము చేయబడదని నాకు తెలుసు. డాల్డా
నపుడు ఎల్లప్పుడూ క్రొత్తగాను, పరిశుద్ధముగాను,
ముగాను నుండును.

వెళ్లడానికి లేచినపుడు రుచైన భోజనానికి తమ
సంతసమును చెల్పారు. మీరు చూచియుండొచ్చు నా భర్త



గర్వంతో ఉప్పొంగిపోయారు. ఆ అమోఘ
రోజున దిగ్విజయం డాల్డాదే అని నాతలంపు.
పెళ్లిగాని, పెద్ద విందుగాని చేసేవారు
వంటలన్నిటిని డాల్డా వనస్పతితో వండమని
నా సలహా. ఒక్క టిన్నుతో ఎన్ని వంటలు
చెయ్యగలరో, మీ రాశ్చర్యపడుతారు. నా కుమార్తెకిలా సలహా
నిచ్చాను: "ఎల్లప్పుడు నీ ఆహారమును డాల్డా వనస్పతితోనే
వండు. అప్పుడు నీవు ఎల్లప్పుడు సంతోషముగా నుంటావు.
ఇది నా అనుభవము!"

డాల్డాలో ఇప్పుడు విటమినులు ఏ, డి ఉన్నాయి.


విందులో తక్కువ ఖర్చుతో రుచైన వంటలను ఎలాగ చేయుట?

ఉచిత సలహాకు ఇవ్వాళే క్రింది
అడ్రసుకు వ్రాయండి:
దీ డాల్డా అడ్వైసరీ సర్వీస్
పోస్ట్ బాక్స్ నంబరు 353, బొంబాయి 1

ు, 5 పౌనులు, 2 పౌనులు, 1 పౌను మరియు ½ పౌను డబ్బాలలో దొరకుచున్నది.

డాల్డా వనస్పతి

వంటకు దివ్యమైనది—ఖర్చు తక్కువ



చెట్టుతోనున్న
డబ్బాకై చూడండి

HVM. 222-X32 TL

రససంఖ్య

శ్రీ పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రి

శృంగారమునకు అనుకారరూపము, ఆభాసయగునది హాస్యమని భరతుడనుచున్నాడు. విభావాభాస, అనుభావాభాస, వ్యభిచారి భావాభాస అనువానివలన రత్యాభాస ప్రతీతముకాగా కలుగు చర్వణాభాససారమే శృంగారాభాసము. కామనాభిలాషమాత్ర రూపముతో నిచటగల రతిని వ్యభిచారి భావముగానే గ్రహింపవలెను. రతియను వ్యభిచారి భావము స్థాయిభావమువలె భాసించుటచే విభావాద్యాభాసత, రతిస్థాయిభావమున కాభాసతసిద్ధమగుచున్నవి. రావణునకు సీతావిషయక రతిస్థాయిభావము ఆభాసమాత్రమగుటచే మనకిచట హృదయసంవాదము కలుగుటలేదు. హృదయసంవాదము కలుగవలెననిన రావణునకు పరిచ్ఛిన్నాత్మభావన తొలగవలెను. కామజనితమగు మోహమే ఇచట కన్పించుటవలన నీరతిస్థాయి భావము శుక్తిరజతమువలె భాసించుచున్నదన వలెను. రావణ వయః ప్రకృతి విరుద్ధముగా సీతాలక్ష్మణ విభావముకలదు. చింతా, దైన్యమోహాదికములగు వ్యభిచారిభావములు, అశ్రుపాత, పరిదేవితాదికములగు అనుభావములు నిచట అనుచితములగుటచే తత్తదాభాస రూపములతో నున్నవి. వికృత పరవేషాలంకారాది లక్షణముగల హాస్యమునవే ఏవం విధమగు ఆభాస ఉండగలదు. కాని రౌద్రాభాసము కరుణయని, వీరాభాసము అద్భుతమని, బీభత్సాభాసము భయానకమని చెప్పినప్పుడు కరుణాద్భుత భయానకములలో అనౌచిత్యము నంగీకరించవలసియున్నది. అనౌచిత్యమును హాస్యములో ప్రధానముగా చెప్పుటచే కరుణాద్భుత భయానకములను హాస్యరసరూపములుగా స్వీకరింపవలసి యున్నది. అనౌచిత్య ప్రవృత్తికృతమగు నది హాస్యవిభావత్వమని భరతునకు సమ్మతమైనట్లు కన్పించుచున్నది. సమస్త రసములయందు విభావానుభావాదుల కనౌచిత్యము కలుగగా హాస్యత్వము సంప్రాప్తమగును. మోక్షహేతువుకాని శాంతమును శాంతాభాసగా ఎంచవలయుటచే నిచటగూడ హాస్యత్వమును చెప్పవలెను. ఇట్టి ఆభాస హాస్యరసములోనున్న హాస్యాభాసవచ్చును. కాని హాస్యమే ఆభాసరూపమైనప్పుడు, ఒక ఆభాసకింకొక అభాసవంటగట్టుట వైపరీత్యమే యగును. ఏదియెట్లున్నను శృంగారహాస్యములకు జన్యజనక భావముగాని, అనుకార్యానుకర్తృ భావముగాని, అభాసత్వ సంబంధముగాని సిద్ధించజాలదు.

రౌద్రకరుణలకేవిధమగు సంబంధముకలదో విచారించిన శృంగారహాస్యముల సంబంధము బోధపడగలదేమో చూడవలెను. రౌద్రరసమున వధబంధాదులు ఫలితములుగాగలవు. రౌద్రరస విభావమున కరుణరస విశిష్టమగు శోకము కన్పించనిచో రౌద్రరసము సిద్ధించదు. అనగా రౌద్రమువలన భయానకముగాని, శృంగారమువలన కరుణగాని ప్రప్రథమమున జనించజాలదని తాత్పర్యము. కాని కరుణ ఉత్పన్నమగు సమయమున క్రోధము విచ్ఛిన్నమగుటగలదు కనుకనే "నిర్వాణవైరిదహనాః ప్రశమాదరీణాం నందంతు పాండుతనయాః" అని భట్టనారాయణుడనినాడు. రౌద్రకరుణల కన్యోన్యాభావము, అత్యంతవైలక్షణ్యము చెప్పవలసియున్నది.

"హృదయే వససీతి మత్ప్రియం
యదవోచ స్తదవైమి కైతవమ్
ఉపచారపదం నచేదిదం
త్వమనంగః కథ మక్షతా రతిః"

అని మొదలుగాగల రతీవిలాపమున కరుణరసమునకు శృంగారమే జీవితముగా కన్పించుచున్నది.

వీరరసమునుండి అద్భుతరసము ఉత్పన్నమగుచున్నదని భరతుడనినాడు. కాని "కర్ణస్యాత్మజమగ్రతః శమయతో భీతం జగత్ఫల్గునాత్" అని

...రాయణు డనినట్లు వీరరసమునుండి భయానక,
...ప్పన్నమగుచున్నట్లు కన్పించుచున్నది. ఇట్లు
...భయానక ప్రతీతిలో ఉత్సాహమనుస్థాయి
...ంలేదని శంకపడనినాడు. కాని వీరరసము
...లగు భయానక ప్రతీతిలో ఉత్సాహస్థాయి
... లేనిచో నీ భయానకమును వీరరసజనితమని
...దు. యుద్ధవీరమున పరపరాజయ జనితము,
...హృదయ దాహదాయి, అనుప్రతాప మనబడు
...హము శత్రుస్త్రీలకు భయానకప్రతీతి నొసగు
... మహాపురుషుని ఉత్సాహము జగద్విస్మయ
...ంధానవశమున ప్రతీతమగుటచే వీర, భయానక,
...ములకన్యోన్య సంబంధము కలదనవలెను.

...తుల్యవిభావత్వ నియమము లేకుండా ఒకరసము
...కరసమును తీసికొనిరాగల్గుట బీభత్సమున
...ంచున్నది. బీభత్సవిభావములగు రుధిరాదు
... భయహేతువులే అగుచున్నవి. బీభత్సరసము
...అనుభావ వ్యభిచారి భావములు సహితము
...తువులే యగుటచే "సంస్తభ్యంతాం నిహత
...ర పీతశేషశోణితస్నపిత బీభత్సవృకోదర
...వైక్లవ్యస్ఖలితప్రహరణాని రణాద్విద్రవంతి
... అని భట్టనారాయణుడనినాడు.

...ృంగారముయొక్క అనుకృతి హాస్యమున
...ంగారమువంటి అనుకృతియని చెప్పినను మనకు
...నము కన్పించుటలేదు. "దృశః పృథుతరీ
... అని రత్నావళిలో హర్షుడనినపుడు శృంగా
...ది అద్భుతముత్పన్నమగుట లేదాయను వాశంక
...న్నది. కాని అద్భుతము శృంగారమువంటిది
...టచే శృంగార జనితమని చెప్పజాలము.
...రరసమునుండి 'అద్భుతమేగాక శృంగారము
...ప్పన్నమగుటలేదా ? ద్రౌపదీ స్వయంవరమున
... శృంగారములు కలవని విస్మరించలేము.

...్తు నాలుగు జన్యరసములని మిగిలినవి జనక
...చెప్పు భరతుని వాదమున మనకు ఇంతవర
...్య మవగతము కాలేదు. కాని అభినవ
...ాలుగు పురుషార్థములతో సమన్వయించుటకే
...ప్రధానరసములు చెప్పబడినట్లు వ్యాఖ్యా
...న్నాడు. ఏరసమున కారసము స్వతంత్ర
...ని, రసములన్నిటిలోను తుల్యవ్యభిచారి
... కన్పించుచున్నవని, రసముల కన్యోన్య
సంబంధము గలదని మాత్రము అభినవభారతిలో స్పష్టమగుచున్నది.

2

భయము, జుగుప్స, క్రోధము, విషాదము మొదలగు భావములు వీర రసమున సమనుగతములై ప్రతీయమానములగుచున్నవి. భయానకము, బీభత్సము, శోకము, రౌద్రము అనబడురసములు వీర రసముతో సన్నిహితసంబంధము కలిగియున్నవి. సమగ్రమైన వీరరసమున యత్కించిత్ అద్భుత ప్రతీతిగలదు. అద్భుతము వీర రసమున పర్యవసితముగాక, వీర రసమే అద్భుతముగా పర్యవసితము కాగలదు. కావున అద్భుతమొక విలక్షణమగు రసము. భయానక, బీభత్స, రౌద్రములతో సమనుగతమగు వీర రసము రెండవది. శృంగార, హాస్య, కరుణలు అని మూడురసములు రాగా ఐదుప్రధానరసములు సిద్ధించగలవు. ఇది ఎంత వరకు యుక్తియుతమో గమనించవలెను.

రస చర్వణలోగల ప్రమేయము భావరూప సంయోజన గలిగియున్నది. భావరూపముల కవినా భావ సంబంధముండుటచే భావభేదము ననుసరించి రూపభేదమువచ్చును. విషాద రూపకము, హాస్య రూపకము, అద్భుత రూపకము అని మొదలుగా గల విభేదములు తత్తద్భావాధీనములై వచ్చుచున్నవి. రూప భేదము ననుసరించి సంగీతము, నృత్యము, చిత్రలేఖనము, శిల్పము, కావ్యము అను లలిత కళావిభాగము వచ్చును. సమగ్రమై, స్వయంపోషకమై, స్వయం సిద్ధమై, అర్థవంతమై ప్రతీతమగు విషయమును సౌందర్యమని, రసమని వ్యవహరించుచున్నాము. రస చర్వణా యోగ్యమగు హృదయసంవాద మెచటగలదో అచట సౌందర్యముగలదని ఎంచుచున్నాము. అనగా సౌందర్య విరుద్ధమగు అత్యంత హేయత్వ విశిష్టమైనవిషయ ముండజాలదు. అర్థవంతమగు రసచర్వణకు యోగ్యము కాని విషయ మసాధువని కావ్యజగమున పిలువ బడుచున్నది. కొన్ని కావ్యములనుగాని, చిత్రములను గాని అసాధువులు (*Ugly*) అని పిలచునపుడు వీటిని దురవగాహములని మాత్రమే భావింపగలుగుచున్నాము. నిష్పన్నమైన రూపమువలనగాని, ఉపహితమైన భావమువలనగాని ఈ దురవగాహత్వము (*ugliness*) వచ్చుచున్నది. వివిధాంశములకు సమన్వయము కుదురు

నట్లు విన్యాసమును గావించినచో దురవగాహత్వము నశింపగలదు. అనగా దురవగాహమగు విషయమున సౌందర్యము సమగ్రముగా అభివ్యక్తమగుటలేదని తాత్పర్యము. సత్తాత్రైవిధ్యమువలె సౌందర్యాభివ్యక్తిగూడ అనేకవిధములగలదని మనమంగీకరించక తప్పదు. "బొసాంకెట్" (*Bosanquet*) అనినట్లు పూర్తి దురవగాహమగు విషయము కావ్యజగమున లేదు. సౌందర్యాభివ్యంజకభావములను, రూపములను విభజించునప్పుడే దురవగాహత్వము వలన క్లిష్టసమస్యలు బయలుదేరజాలవు.

సౌందర్యాభివ్యంజకము లనేకములని విభజించి చెప్పుట అశాస్త్రీయమని "క్రోచే" (*Croce*) వాదము. కాని భిన్న లలితకళలకు భిన్న రూపములు కన్పించుట, ఒకే ఒక లలితకళలో భిన్నమార్గములు కన్పించుట మన అనుభవమునందే కలదు. అనేక విషయములలో, అనేక విధములుగా అభివ్యక్తమగు సౌందర్యము అనుభూతమగుచున్నది. ఈ అభివ్యక్తులన్నింటియందును సౌందర్యమే ప్రతీతమగుటచేతను, తత్త్వము సచ్చిదానందరూపములలో భాసించుటచేతను, పారమార్థిక తత్త్వమే సౌందర్యముగా పరిచ్ఛిన్నమై ఈ అభివ్యక్తులయందు సంవేద్యమగుచున్నదని "హెగెల్" (*Hegel*) పలికినాడు. అనగా కరుణాద్భుతాది రసములు ఆత్మవికాసము పొందు వివిధరూపములని చెప్పవలెను.

శృంగారాది రసము లెనిమిదిగలవని భరతుడనినాడు. వీటిలో నాలుగు జన్యరసములని, మిగిలినవి జనకరసములని చెప్పి తర్వాత జన్యరసములు అనుకరణ రసములని, జనకరసములు అనుకార్యరసములని వివరించినాడు. ఇంతటితో గూడ తృప్తిచెందక రెండేసి రెండురసములకు కొంత సామ్యముగలదని మూడవ శ్లోకమున చెప్పినాడు.

శృంగారమున కనుకృతి హాస్యమని భరతుడనినాడు. పరచేష్టానుకృతి హాస్యముయొక్క లక్షణము. అట్టిచో వీర రసానుకృతి గూడ హాస్యమేలకాదు? అని భోజుడు ప్రశ్నించినాడు. శృంగారముగాని, హాస్యముగాని తుల్యానుభూతినే ఇవ్వగలవని మూడవ శ్లోకమననుసరించి చెప్పితిమేని హాస్యమునకు భరతుడు చెప్పబోవు లక్షణము వర్తింపజాలదు. అనుకరణగాగాని, ఆభాసగాగాని హాస్యమును గ్రహించితిమేని హాస్యము సర్వరస వ్యాపియగుచున్నది. కాగా హాస్యమున కితర రసములలో నంతర్భావమును చెప్పవీలులేదు. హాస్యమొక ప్రధానమైన రసమని గ్రహించవలెను.

క్రోధము పరిపుష్టమై రౌద్రరసముగా పరిణమించుచున్నది. వధనాశాది రూపమును పొందు రౌద్రము నాధారముగా చేసికొని శోకవిషాదములు బయలుదేరుచున్నవి. ధైర్యస్థైర్యాది రూపమును పొందు రౌద్రము వీర రసముగా పరిణమించుచున్నది. రౌద్రవీరములు ప్రవృత్తములు కాగా నితరులకు బీభత్సభయానకములు కలుగుచున్నవి. భయము, జుగుప్స, క్రీడ, గౌరవము, అభిమానము, మొదలగు భావముల కలయికతో అద్భుత ప్రతిపత్తి కలుగును. కాగా శృంగారము, హాస్యము, కరుణ, అద్భుతము, వీరము అను ఐదు రసములే అన్యాంతర్భూతములు కాకుండా కన్పించుచున్నవి.

రసచర్వణలో నాలుగు అవస్థలు కలవని చెప్పు సందర్భమున

"స్వాదః కావ్యార్థసంభేదా దాత్మానందసముద్భవః
వికాసవిస్తరక్షోభవిక్షేపైః స చతుర్విధః"

అని ధనంజయుడనినాడు. ఆత్మానంద సముద్భవము, ఏకఘనవిశ్రాంతి రూపము నగు రసాస్వాదము సందర్భవశమున విక్షేప, క్షోభ, విస్తర, వికాసరూపములతో ప్రతీతమగుచున్నది. శృంగారహాస్యములలో చిత్తవికాసము, వీరాద్భుతములలో చిత్తవిస్తారము, రౌద్రకరుణలలో చిత్తవిక్షేపము, భయానక బీభత్సములలో చిత్తక్షోభముగలవని వ్యాఖ్యానించినాడు. శృంగారహాస్యాదికమగు నాలుగుజంటలలో ప్రతిజత కారణాంతరజన్యమగుటచే నొకటి కారణమని, రెండవది కార్యమని చెప్పరాదని అవలోకమున గలదు. సంబంధాపేక్ష ననుసరించి మాత్రమే హేతుహేతుమద్భావము చెప్పబడినది. ఈ కారణాంతరము ఆత్మయే.

చిత్తక్షోభ, చిత్తవిక్షేపములకు సన్నిహిత సంబంధము కన్పించుటచే వీటిని రెండుఅవస్థలుగా గ్రహింపరాదు. ఈ రెంటిని చిత్తద్రుతిగా తీసికొనవలెను. ఈ చిత్తద్రుతి అతి ప్రధానముగా కరుణలో కన్పించుటచే కరుణ రసమును అప్రధానముగా ఎంచవీలులేదు. వీరరసము లౌకిక జగమునగూడ ప్రధానముగా కన్పించుటచేతను కావ్యజగమున వీరసమునకెక్కుడు వైశిష్ట్యము కన్పించకపోవుటచేతను కావ్యలోకమున శృంగార, హాస్య, కరుణాద్భుతములే ప్రధానరసములని చెప్పవలెను.

నిరంతరత్రయం

బుచ్చిబాబు

[గతసంచిక తరువాయి]

...ను సెల్లతర్వాతగాని, మళ్లా కామేశాన్ని ...మాస్టం పళ్ళేదు. అతనికి పూర్తిగా నయమై, ...నుంచి విడుదలవుతా డనుకున్నా. కాని ...గలేదు. నే వెళ్లినప్పుడు, వ్యాధి పరిస్థితి ...రంగా పరిణమించిందన్నారు డాక్టర్లు, ...సీవ్ ఇన్‌జక్షన్ల కలను శెట్టుకోలేకపోయాడ ...ంగుచేత కొంతకాలం వాటిని నిలుపు చేశా ...కున్న ఇన్‌జెక్షన్లు, అతని శరీరాన్ని మరింత ...యి. శల్యంలా అయి, చూడ్డానికి భయంగా ...కామేశం. రెండుమూడు వారాలు ఎదిగిన ...ంహాన్ని చిన్నదిగా చేసేసింది. మంచంమీద ...లేవ లేకపోతున్నాడు. మాట, మాటిలోం ...న్ను, నీరసంగా వుంది. శరీరం లోపలిభాగం, ...ట్టు తోచింది. ఆయాసం, గుండెలు కొట్టు ...కృతమైన దగ్గు,—అవన్నీ చూస్తే, అతనొక ...వున్నాడు గాని, మనిషిలా లేడు.

...సుణకూడా చిక్కినట్లు కనిపించింది. ఇది ...లాకీ, ఉత్సాహం, అంతగా లేవు. కరుణా ...టీగానే వున్నాడు. డాక్టర్లు, వొక 'లంగ్' ...పడకుండా, చేసెయ్యడం అవసరమంటు ... కాని కామేశం మాత్రం, ధైర్యంగానే ... మరో నెలరోజుల్లో నయమవుతుందనే ... చెబుతున్నాడు. నయమవగానే, తనేం ...ళ్లా నాతో చెప్పడం సాగించాడు. క్రాస్ ...్ కడుతున్నాడు.

...న్యాకుమారి పూసి, కొలంబో వెళ్లడానికి, ... వేస్తున్నాడు. నాకు జాలేసింది. జీవితంపై ...ృత్యువుతో పెనుగులాట,—అవి చూస్తే, ...ట అప్రయత్నంగా నీళ్ళొచ్చేశాయి.

"నిన్నా తీసుకెడతాలే—ఏడవకు" అని నీరసంగా నవ్వాడు కామేశం.

"సుగుణకి కాశ్మీరం వెళ్లాలనుంది. కాశ్మీర్ కూ్యరియోస్ కాటలాగ్ తెప్పించాను. కాశ్మీర్ స్టైల్ లేడీస్ వోవర్‌కోట్ సుగుణ తొడుక్కుంటే చూడాలనుంది. ఏడిచేవాళ్లెవ్వరూ నాముందు వుండొద్దు—పొండి—పో—సుగుణా—వెళ్లండి—బైట హాయిగా విహరించండి—మీ బ్రదుకు మీరు, నా బ్రదుకు నేను—ఎవళ్లబ్రదుకు వాళ్ళు బ్రదకాలి ...జీవితం ఎవరికోసం నిల్చిపోదు...పొండి..."

మొహాన్ని తలగడాలో కప్పేసి, ఏడ్వసాగించాడు కామేశం.

"నాలుగైదు రోజుల్నుంచి, పరాకు మాటలు." అని సుగుణ దిగులుగా చూసింది. అతని మంచం దగ్గరగా వెళ్లి, నుదురు రాస్తోంది.

"అమ్మో—సెంటు—ఇంత మంచి సెంటెక్కడిదీ—నాకూ రాయి..."

"ఏమ్మాటలవి? కళ్లుమూసుకు పడుకోండి." అని కసిరింది.

"కళ్లు మూసుకుంటే నా కన్నీ కనిపిస్తాయి. తెరిస్తేనే నీకు మంచిది."

"మీరూరుకోకపోతే, మత్తింజన్క్షన్ ఇమ్మంటా డాక్టర్ని."

"అప్పుడు హాయిగా వుండొచ్చును."

"ఇట్లాగైతే, నే వెళ్ళిపోతాను."

అని సుగుణ లేవబోయింది. అత నామెని గట్టిగా పట్టుకున్నాడు.

"అమ్మో—వెళ్లొద్దు. వన్నొదిలెయ్యకేం. వొదిలిపెడితే, నే చచ్చిపోతాను..."

పట్టు విడిలించుకుని సుగుణ, వెళ్ళిపోయింది. కరుణాకరం, అతనిదగ్గరగా వెళ్ళి, వుపచారం సాగించాడు. నేను కళ్ళు తుడుచుకుంటూ వరండాలోకొచ్చేశాను.

కామేశం నిద్రపోయ్యాడు. నేనూ, కరుణాకరం, యింటివైపు నడవడం సాగించాం. ఆ విషాద పరిస్థితిలో ఏది మాట్లాడినా, అసభ్యంగా వుంటుంది. కరుణాకరం పలకరించాడు.

"ఈ జబ్బు నాకు రాగూడదూ" అన్నాడు.

"అవేం మ్మాటలు!"

"జ్ఞాపకం వుందా—వెనక నన్నొక ప్రశ్న వేశావు."

"ఆ"

"దానికి సమాధానం యిప్పుడు చెప్పగల్ను. నన్ను నేను దగాచేసుకోలేకపోయ్యాను. ఆమెను ప్రేమించినట్లు వొప్పుకోకతప్పదు. నేనూ, సుగుణా దగ్గరగా వొచ్చినకొద్దీ, అతని జబ్బు తీవ్రమవుతోంది. విషాదం కాదూ!"

నేనేం మాట్లాడకపోయినా, వినడానికి సిద్ధపడినట్లు సూచించాను.

"ఆర్థికస్వాతంత్ర్యం వుంటే, మిగతా అన్నింటిలోనూ, స్వతంత్రులు కావొచ్చు ననుకుంటారు గాని, నిజానికి, ఊహాలో తప్ప, మనుషులు స్వతంత్రజీవులు కారు. కొన్ని నిర్ణయాలు, వాటంతటవే, సామీ రొచ్చి పడ్డాయి. తీసుకోడానికీ, నిరాకరించడానికీ, నాకేమీ స్వేచ్ఛ లేదు. నిర్ణయం అసంభవం అవడంలోనే ట్రాజడీ వుందనుకుంటా. ఒక రాత్రి, ముఖాముఖిని, యీ విషయం సుగుణతో ప్రస్తావించాను. చాలా ధైర్యం తెచ్చుకుని అడిగేశాను.

"సుగుణా—నన్ను నువ్వు ప్రేమిస్తున్నావు. అవునా?"

"కామేశంగారికి జబ్బుతగ్గింతర్వాత, ప్రేమిస్తే తప్పు లేదంటున్నావు. అవునా?" అన్నది.

"హాస్యధోరణి కాసేపు విలపగూడదూ?"

"నిజం చెప్పేస్తే, హాస్యంగా తోచొచ్చు. నువ్వూ నన్ను ప్రేమిస్తున్నావు. అదెందుకు చెప్పవు? ఎటొచ్చీ, ప్రేమ రహస్యంగా సాగాలంటావు. అంతేగా."

అంటూ సుగుణ చీరకొంగు రాతిబండమీద వొత్తుగా పరిచి, దానిమీద తలెట్టుగుని, గడ్డిలో పడుకుంది.

"నీకు వివాహమైంది. భర్త వుండగా, నువ్వు మరొకర్ని ప్రేమించటం దుర్నీతంటాను."

"ప్రేమించడం, ప్రేమించకపోడం మనిష్టమా? జీవితం ఎవరికోసం నిల్చిపోదన్నారు మా వారు. విన్నావుగా. నువ్వు చెప్పిందే పాటించడం జరిగితే, భర్తలు భార్యల్నీ, భార్యలు భర్తల్నీ, హత్యచేస్తూ కూర్చోవాలి."

"ఇప్పుడు మనం చేస్తున్నది అతని హత్యకిందే వొస్తుంది." అన్నాను.

"సరే—నేరస్థురాల్ని నేను, నన్నురిదీస్తారు, అంతేగా."

"భర్త అల్లా బాధపడుతుంటే, నీ మనస్సులో కాస్తైనా, దిగులు, విచారం, లేవన్నమాటే?"

"కరుణాకరం,—యిట్లా చూడు—" ఆమె రెండుచేతులూ నా మెడచుట్టూ వేసి, తొడమీద తల ఆనించి, తల ముందుకు లాక్కుని, కళ్ళల్లోకి చూసింది.

'కామేశం చాలా మంచివాడు. అంత మంచి భర్త ఎవ్వరికీ లభించడు. అతనికి నయమవాలని వెయ్యిదేవుళ్ళకు మొక్కుతున్నాను. నిజంగా నువ్వు మాకు చాలా సాయపడ్డావు. నీ ఋణం మేం ఎప్పుడూ తీర్చుగోలేం. కాని, దానికీ మన ప్రేమకీ సంబంధం లేదు. నువ్వు నన్ను ప్రేమించావని ఏనాడో తెలుసు. లేకుంటే నేనింత స్నేహంగా వుండే వుండను. మనల్ని మనం దగా చేసుగోడం దేనికి? రహస్యం లేకపోవడమే, ప్రేమ లక్షణం. కాసేపు, మనం మనంగా వుండిపోకూడదూ—"

ముఖం పైకి తిప్పింది. అనుకోకుండా, నా చేతులు ఆమె దేహను స్పృశిస్తున్నాయి. నా వొళ్ళు వేలికైంది. పాదాలకింద భూమి చీలి, ఎక్కడికో దిగిపోతున్నట్లైంది. సృష్టి మా యిద్దరిమధ్యా స్తంభించినట్లు, వొక్కసారి గుండెలు నిల్చిపోయ్యాయి. ఆకృతిలేని రెండు శక్తులుగా, అనంత విశ్వాన్ని,

...క్కుంటూ, మళ్లా పాత శరీరాలలోకే చేరుకున్న
...ది.
...మొహాన్ని ముందుకు లాగింది. నేను తొల
...ను. దూరంగా జరిగాను.

"సుగుణా! నీముందు ఏదీ దాచలేను. కామేశం
వుండగా, ప్రేమ ప్రకటించుకోడానికి మనక్కు
...ం లేదు."

"ఆయనకి తగ్గింతర్వాత, ప్రకటించుకుండా
...వా?"

"తగ్గితే, అసలే కూడదు. లోలో ప్రేమించు
దూరంగా వుండటంలో అందం లేదూ?"

"నాకా అందం తెలీదు. అదంతా దగా అను
..."

"కాదు. ప్రేమ వున్నతమైందే, కాదన్ను.
మలినం చెయ్యకూడదు...

"అంటేఁ...?"

"మన మిల్లాగే, దూరంగా వుండాలి—ఉండా
ప్రమాణం చెయ్యి..."

"ఎంతకాలం?"

"జీవితాంతం వరకూ?"

"ఎవరి జీవితాంతం? కామేశమా?"

"ఎంతమాటేనా అనెయ్యడానికి నువ్వు
..."

"ప్రేమకి రహస్యం వుండకూడదనుకున్నాంగా.
...ంక బ్రతకరు. నెలల్లో కాకపోయినా, కొన్ని
...లో వుంది. అయన చనిపోయింతర్వాత, మనకి
...క సరేనా?"

"ఇంకే మన్నా?"

"ప్రమాణం చెయ్యమన్నావుగా. ఆయన
వున్నంతవరకూ, మనం దూరంగా వుందాం.
..., దగ్గరగా వుందాం. చెయ్యి పట్టు, ఒట్టు."
...చేతిలో చెయ్యేసింది. లేచాను. ఉద్రేకంలో
...న్నో, ఏం చేశానో, నాకు తెలీదు. ఏకు
...ది. ఆమె యింట్లో కెళ్ళింది. నేను పరుగెత్తు
..., హాస్పిటల్ కెళ్ళి కామేశాన్ని చూశాను.
...గా నిద్రపోతున్నాడు. అమ్మయ్య అని నిటూ
..."

కరుణాకరం కళ్లంట నీళ్ళు కారడం చూశాను. "నువ్వేమీ జెంగపడొద్దు కరుణాకరం. ఇప్పట్లో మనం చెయ్యవల్సింది కామేశాన్ని సరిగ్గా చూడటమే. మీ ప్రేమలో నిరసించవల్సిం దేమీ లేదు. మీరు చేసుకున్న నిర్ధారణ హర్షించవలసిందే..."

కామేశం, డాక్టర్లు చెప్పినదాన్నిబట్టి ఎన్నో రోజులు జీవించ డనిపించింది. అతను పడుతున్న బాధ చూస్తే, మృత్యువు తొందర్లో రావడమే మంచిదనిపించింది. రోగికల్లా వుండదని నాకు తెలుసు. ఇతరులనుగురించి, తీర్పులు చెయ్యడం లోకజ్ఞానం లేనివాళ్లకి కూడా సులువే!

ఆ మర్నాడు, కరుణాకరం, బెంగుళూరు ప్రయాణమయ్యాడు. అక్కడ టి.బి. స్పెషలిస్ట్ వొకాయన, కొత్తగా, స్విట్జర్లాండ్‌లో నాలుగేళ్లు తర్ఫీదు పొంది వొచ్చాడుట. అయన్ని తీసుకొచ్చి, కామేశం విషయంలో సలహా పొందడం మంచిదని డాక్టర్ల సలహా. రానూ పోనూ, ఫస్ట్ క్లాస్, ఖర్చులూ పెట్టి, అతన్ని తీసుకొచ్చాడు. స్పెషలిస్, 'లంగ్' కొలాప్స్ చెయ్యనక్కర్లేదనీ, శరీరం తట్టుకోగల్దు కాబట్టి, ఇన్‌జెక్షన్లు, వరసగా యివ్వొచ్చుననీ సలహా యిచ్చి, అతను స్విట్జర్లాండ్‌నుంచి తెచ్చిన ఇంజక్షన్ల బాచ్, శానిటోరియమ్ డాక్టర్లకిచ్చి, బెంగుళూరు వెళ్ళిపొయ్యాడు. ట్రీట్‌మెంట్ సాగుతోంది. ఆ నాలుగు రోజులూ అక్కడే వుండి, ఎల్లా వున్నదీ వ్రాస్తూండమని, శెలవు తీసుకుని, నే వెళ్లిపొయ్యాను. కామేశాన్ని మళ్ళా చూడననుకున్నాను. నా శరీరం అతనిముందు దిగవిడిచి వెళ్ళిపోయినట్లుగా వుంది. జీవితం ఎవ్వరికోసమూ నిల్చిపోదన్న కామేశం, పరాకు మాట నే నెన్నడూ మరిచిపోను.

నే వూళ్ళో లేకపోవడంమూలాన, కరుణాకరం వ్రాసిన రెండుమూడు త్తరాలూ చూడ్డం పడనేలేదు. అది వేసంగి—పెళ్లిళ్ల ముహూర్తాల కాలం. కావల్సిన వాళ్ళవి నాలుగైదు పెండ్లిండ్లకి వూళ్ళు తిరుగుతుండడంమూలాన, కామేశంగురించిన వార్త, నా కందలేదు. శుభసమయాల్లో, వ్యాధిగ్రస్తుని ప్రశంస ఎత్తడం, స్మరించడం మంచిది కాదని, అంతగా పట్టించుకోకపోయినా, నా వూహాలో ఆ వ్యక్తులు సంచారం చేస్తూనేవున్నారు. కామేశం చనిపోయిన పక్షంలో, సానుభూతి లేఖ ఎల్లా వ్రాయాలో కొంత

నుకున్న మాట నా స్తకం. స్నేహాలకూ, అంతరంగికా
సా, యీ యుగంలో ఎవరికీ తీరుబడి లేనట్లుంది.
ంతా రిలో కెరటంపైనా, ఎక్కడికో కొట్టుకు
ోతున్నాం.

మన సామీప్యంలో తేలిపోతున్న యే రబ్బరు
త్తినో, ఏ కొయ్యనో, ఏ గడ్డిపోచనో కాసేపు
ట్టుకోడం, అది మనల్ని మొయ్యలేదని గ్రహించి
ాదిలెయ్యడం, చివరికి ఏకో రాతిబండ, శాశ్వ
ంగా కనబడితే దాన్ని పట్టుకోడం, అది కరిగి,—
నం, అదీ, అందరం మునిగిపోవడం. ఇదే జరుగు
ోంది. మునిగిపోతున్న వాళ్ళని చూడ్డం తప్ప,
వశ్యం చెయ్యగలరు?

మా కృష్ణమూర్తి పెళ్లికి వెళ్లినప్పుడు, తెలిసింది.
ామేశానికి, నయమైందనీ, 'డిశ్చార్జ్' చేశారనీ—
ందరూ వాళ్ల స్వగ్రామం వెళ్లిపోయారనీ. నాకు
ాలా ఆశ్చర్యం వేసింది. సంతోషంకూడా కలి
ంది. వెంటనే, సంతోషం ప్రకటిస్తూ, కామేశాని
ొక ఉత్తరం వ్రాశాను. దానికి జవాబు, రెండు
ారాల తరవాతొచ్చింది. నన్ను వాళ్లగ్రామం
ొచ్చి, వొక వారంపాటు గడపమన్నాడు. అతను
ెయ్యదల్చిన యాత్రల విషయంలో నా సలహా
ావాలిట. వీలవుతే, నేనూ, వాళ్లతో ప్రయాణం
ావాలిట. నా కివ్వవల్సిన బహుమానం మాట నిర్ధా
ణ చేసుకుని మరీ రమ్మన్నాడు. ఉత్తరంలో కరుణా
రం మాట ఏమీ లేదేమిటా అనుకుంటుండగా,
యీ చివరి వాక్యాలు కనబడ్డాయి.

“మళ్లీ కరుణాకరం—వెర్రి వ్యక్తి—హరాం
సాగించాడు. డబ్బు జనాన్ని ఆకర్షిస్తుందంటారు.
అదేం కర్మమో, నా దగ్గరనుండి అంతా పారిపోతుం
ారు; నువ్వూ అంతే. నేనేం పాపం చేశాను.?
వ్యాధిగ్రస్తుని సావాసం ఎవరికీ నచ్చదు; వొప్పు
కుంటాను. ఇప్పుడేం వ్యాధిలేదుగా. ఎన్సైక్లో
పీడియా కోసం ఇంగ్లండ్ వ్రాశాను.”

నా ప్రెజెంట్ విషయం—ఏమడగాలా, అని
మళ్లా ఆలోచనలు సాగించాను. సుగుణ నాకు భార్య
కావాలన్నమాట జ్ఞాపకమొచ్చింది. భార్య కావాలని
వెంటనే సమాధానం వ్రాశాను.

వ్రాసిన రెండు వారాలదాకా, కామేశాన్ని
చూడ్డం పడలేదు. సాయంత్రం నాలుగైంది. వర్షం
పడుతోంది. బండిదిగి యింట్లో కెళ్లేలోగా, తడిసి
ముద్దయ్యాను. కామేశం, పొడుగాటి సోఫాలో
కూర్చుని బత్తాయి పండ్లరసం త్రాగుతున్నాడు. నన్ను
చూడగానే మందహాసంచేసి, లేవబోయాడు. నేను
కూర్చోపెట్టాను.

“సోఫా పాడవుతే సుగుణ చంపేస్తుంది.”
అన్నాడు. లోపలికి కేకేసి, పంచె, తువ్వాలు
తెమ్మన్నాడు. నేను పక్క హాల్లోకెళ్లి దుస్తులు
మార్చుకున్నా. హాలంతా చిందరవందరగా వుంది.
కట్టేసిన హోల్డాల్స్ రెండున్నాయి. సామాన్లబుట్ట,
రెండు సూట్కేసులూ కనిపించాయి. శంకరయ్య
టిఫిన్ కారియర్ సర్దుతున్నాడు.

“ఏమి టిదంతా కామేశం?—ప్రయాణ సన్నా
హంలా వుంది?” అన్నాను.

శంకరయ్య టీ తెచ్చాడు.

కామేశం తేరుకుని బాగానే కనిపించాడు.
ఎటొచ్చీ కళ్లకింద, కాస్త చర్మం జారి బంతిలా
గైంది. కళ్లు, యింకా లోతుగానే వున్నాయి.
క్రాపు చేయించుకోడం మూలాన కాబోలు, మొహం
మరీ చిన్నదిగా,—సైజ్ తగ్గించినట్లుగా—కనిపిం
చింది. స్వచ్ఛంగా, కొత్తగా, నిర్మలంగా కనిపిం
చాడు.—తాకితే ఏమవుతాడో ననిపిస్తుంది.

“ఆరు గంటలకు ప్రయాణం” అన్నాడు.

“ఎక్కడికని అడక్కూడదనుకో...”అన్నాను.
చమత్కారానికి నవ్వుకున్నాము.

“నీకింకా తెలీదు కాబోలు. కరుణాకరానికి
క్షయని తేలిపోయింది. శానటోరియమ్లో వుండి
పోయాడు.”

నేను నిర్ఘాంతపొయ్యాను. ఆలోచన సాగలేదు.
మాట రాలేదు.

“అంతా చిత్రంగా జరిగింది. ఇక్కడి
కొచ్చామా—వొచ్చిన వారం పది రోజులకే, కాస్తంత
టెంపరేచర్ రావడం, అన్న హితవు పోవడం, కాళ్లు
చేతులు తిమ్మెర్లనడం—వెంటనే డాక్టర్ ఫిలిప్కి
వైరిచ్చి పిలిపించా. ఎక్స్రే టెస్టు చేశాడు. నాలుగు
రోజులు అబ్జర్వేషన్లో వుంచుతానని, శానటోరి
యమ్లో చేర్పించాడు. నిన్ననే ఉత్తరం వొచ్చింది.
టి.బి.యేట. చాలా ఎర్లీ స్టేజ్; నువ్వు రాగూడదూ,
చూసొద్దువుగాని.” అన్నాడు.

ఈ వార్తకి కాని, ప్రయాణానికి కాని సిద్ధ డు. "మీరువెళ్ళి ఎల్లా వున్నదీ వ్రాయండి,— ంత నింపాదిగా, నాలుగు రోజులుండే ఏర్పాటు సనొస్తాను. మా బాబయ్యగారి కోర్టు వ్యవహారం టుంది" అన్నాను.

సుగుణ బైటకొచ్చింది.

"మీకేదో వొంక దొరుకుతూనే వుంటుంది"

ఆమెలో చెప్పుకోతగ్గ మార్పేమీ లేదు. దిగు వుందేమో, నాకల్లా అనిపించలేదు. గొంతు హైంది—కంఠంలో జీర—రొంపవల్లేమో. తల్లో న్నాయి; నెమల్ని జరీ తెల్లచీర; ఎర్ర ప్లాస్టిక్ లు—అప్పట్లో ఫాషనవుతుంటూ—ఎర్ర ముఖ స్లిప్పర్స్, ఇదివరకులేని గీటు, అరంగుళం పొడు —గడ్డంకింద కనిపించింది. ప్రశ్నార్థకంగా ను.

"ఇదేనా?—మొన్న ఏపిల్ కోస్తుంటే, చెలికి ర్ క్లాత్ అడ్డమొచ్చి, చాకు పైకి దూసుకుపో ది" అంది, గడ్డంకింద మానిపోయిన గాయాన్ని క్రే . నా మనస్సులో వున్న ఆలోచల్ని సుగుణ పసి పుంది. కాని ఆమె మనస్సులో ఆలోచనల్ని, ్మదేవుడు కూడా తెలుసుకోలేడనుకుంటా.

నన్ను ప్లీడర్ గారింట్లో దింపేసి, వాళ్ళు ర కల్లిపొయ్యారు. నాకారాత్రి నిద్రపట్టలేదు. ం అంటే భయమేసింది. వొకటి తెలుసు న్నను—భాగ్యవంతులకే టి. బి. వొస్తుందన్న తిలో యథార్థంలేదని.

నారంరోజుల్లో కరుణాకరం దగ్గర్నుంచి రం వొచ్చింది. నాతో ఎన్నో చెప్పాలిట— గు రోజులుండేలా వీలుచేసుకుని రమ్మన్నాడు.

ఉత్తరం వొచ్చిన పదిరోజులకి నేను కరుణా న్ని చూడ్డానికి వెళ్ళగలిగాను. కామేశం, శంక య్య, స్టేషన్కొచ్చి, నన్ను 'సంతోషి' కి తీసు రు. కామేశం మరి కొంచం తేరుకున్నట్లు కని డు. మొహంలో నిగనిగ, కళ్ళల్లో కొత్త ్సాహం కనబడ్డా, పూర్తిగా మామూలు మనిషిగా పించింది. వ్యాధినుంచి తేరుకున్నవారిలో, గా, ఎక్కువ చనువుగా వుండలేం కాబోలు.

"నీకు పెళ్ళాం కావాలన్నమాట —!" అన్నాడు కామేశం బిగ్గరగా నవ్వుతూ.

"ఎవరేనా నీ ఎరికిలో వున్నారా?"

"ప్రయివేట్ వార్డు కావడం మూలానా, మా ఆవిడ సపర్యలమూలానా, మా నర్సుల్ని అంత క్లోజ్ గా తెలుసుకోలేదు." అన్నాడు.

"నే నిల్లావుండటం నీ కిష్టంలేదా?"

"అంటే?"

"నర్సుని చేసుకున్నవాడు, సుఖపడాలంటే, ఏదేనా జబ్బు తెచ్చుకోవాలి కదా!"

"నిజమే—నాకు జబ్బుగా వున్నరోజుల్లో, నా కొక్కవల్సినవాళ్లందరికీ, టి. బి. వొస్తే బాగుండు ననిపించేది చెప్పొద్దూ."

భోజనం చేసి తాంబూలం వేసుకుంటుంటే సుగుణ కనిపించింది.

"ఎల్లావున్నా డీపూట?" అని అడిగాడు కామేశం. "ఆ—అట్లాగే వున్నారు. షేవ్ చేసు కోడు—బద్ధకంట. దాంతో మరీ చీదరగా కనిపి స్తాడు." అన్నది సుగుణ. ధోరణిలో కాస్తంత విసుగు ధ్వనించింది నాకు.

"షేవ్ చేసుకోడం, ఆరోగ్యంగా వున్న వాళ్లకే యాతన. నీకేం తెలుస్తుంది. అదొక ఆపరేషన్ లాంటిది."

"ఆరోగ్యంగా వున్నవాళ్ళకి లక్ష వ్యాపకా లుంటాయి. క్షురకర్మకి తీరికుండక విసుక్కోటం— రోగి కంటావా—అతనికి—శరీరాన్ని చూసుకో డంలోనే తృప్తి, ఆనందం వుంటాయి" అన్నాను నేను.

"బాగా చెప్పారు."

కాసేపు నెన్ను వాల్చి లేచేప్పటికి, నాలు గైంది. శంకరయ్య ఉప్మా చేశాడు—కాఫీ ఇచ్చాడు. సుగుణ కొత్త బిస్కట్స్ పాకెట్ విప్పింది.

"అవి అతనికోసం తెప్పించినవి" అన్నాడు కామేశం.

"అవుతే నేం?"

"అవన్నీ మనమే తినేస్తే ఎల్లాగ!"

"ఎందుకు తినకూడదు? మనం మనుషులమే."

"గొప్ప డిస్కవరీయే—నోబెల్ బహుమానం యిస్తార్లే."

"మంచిప్రవర్తన బహుమానం మీకు యిస్తారండి."

"ఛట్."

అని కామేశం విసుక్కుని, బల్లమీద వార్తాపత్రికని దూరంగా గిరవాటెట్టాడు. నాకేం చెయ్యాలో తెలీక, అరుశైట కొచ్చేశాను. వెనకాలే, కామేశం వొచ్చేశాడు.

"చాలా న్యూసెన్స్‌గా వుంది" అన్నాడు, స్వగతంగా.

నేనేమీ మాట్లాడలేదు. నడుస్తున్నాం. అతనే చెప్పడం సాగించాడు.

"నేను మంచానపడ్డ మూడునెలలూ, కుక్కలా, మమ్మల్ని కాచుకుని, అడ్డమైన చాకిరీచేశాడా కరుణాకరం. ఇప్పుడతన్ని వొదిలేసి ఎల్లా వెళ్ళగలం చెప్పు. పోదామనుంటుంది. ఊటీ పోదాం, మహాబలేశ్వరం పోదాం, మైసూర్ పోదాం..."

"అంటే యీ ఆస్పత్రివాతావరణం నీకంత మంచిది కాదని కాబోలు."

"నా మంచి నాకు తెలీదంటావా?"

"అహహ, అది కాదు. ఇన్నాళ్ళా ఆమె కూడా, సరిగ్గా తిండీ, తిప్పలూ లేకండా, అవస్థపడిందా,—విశ్రాంతిగా, ఎక్కడేనా, రెస్ట్ తీసుకుందామని వుండటం, అసహజం కాదనుకుంటాను." అన్నాను.

"ఇప్పుడిక్కడ రెస్ట్ కాక ఏముంది? అంతా డాక్టర్లూ, నర్సులూ చూస్తున్నారు—ఊరికే, మనం పైపై హంగామా. మోరల్ సపోర్ట్, కాస్త ధైర్యం చెప్పడం."

నాలుగైదు నిమిషాలదాకా, ఎవ్వళ్ళం మాట్లాడలేదు. ఒక్కసారిగా కామేశం:

"స్త్రీలకి మర్యాద తెలీదు." అన్నాడు. నేను చకితుడనయ్యాను. భయంతో గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి.

"అతనెల్లా బాధపడుతుంటే, మనం నవ్వుతూ, పేలుతూ వుండటం తప్పు—తప్పేమిటి—పాపం అంటాను."

ఇంతట్లో శానటోరియమ్‌కి చేరుకున్నాం. కరుణాకరం, జనరల్ వార్డ్‌లోనే వున్నా, చివరగా వున్నాడు. మేం మంచంపక్కన, రెండు బల్లలు లాక్కుని కూర్చున్నాం.

కరుణాకరం, గడ్డం, క్షౌరం పదిరోజులనుంచి చేసుకున్నట్లులేదు. దట్టంగా పెరిగింది. అక్కడక్కడ, గడ్డంలో నెరిసిన వెండ్రుకలుకూడా కనిపిస్తున్నాయి. లోతునూతిలో కనిపించిన ప్రతిబింబంలా, నవ్వినప్పుడు, పళ్లు దూరంగా, మసగ్గా, మెరుస్తున్నాయి. మాట బలహీనంగా వుంది. టి. బి—మనుషుల్లోని ప్రత్యేకతని తొలిగించి, సమంగా చేసేస్తుంది. ఆ లక్షణాలు నే చెప్పడమూ మరిచిపోను. కణతలకి అతుక్కుపోయిన చర్మంలోనుంచి, ఆకుపచ్చ దారంలా వొంకర్లు తిరిగిన పచ్చనరాలు, లేస్తూ పడుతూ, కొట్టుగోడం, కళ్లకింద ముడతల్ని సహితం పీల్చుకుని కరిగించి, అస్థిపంజరానికి అతికేసిన బుగ్గలపై చర్మం,—శరీరం యంత్రంపై, తెరలా—జీవితరహస్యాన్ని, సృష్టిలో ఇంద్రజాలాన్ని, మన కళ్లముందు ప్రదర్శించినట్లు అదిరిపడే స్థూలకాయం...

కరుణాకరం, క్రాస్‌వర్డ్ పజిల్‌లో నిమగ్నుడయ్యాడు.

"గాడిద—అనే అర్థం వొచ్చే, మూడక్షరాల మాట చెప్పు" అన్నాడు.

"ఇది పాతదే—ఇంగ్లీష్‌లో 'యాస్'" అని కామేశం నవ్వడం సాగించాడు.

కరుణాకరం, అతని జబ్బునుగురించి వివరాలు చెప్పాడు; లక్షణాలు వర్ణించాడు. తగ్గిపోతోందట. రెండు మూడు వారాల్లో లేచి తిరుగుతాడట. క్రాస్‌వర్డ్ పజిల్ విప్పేటందుకు తగినంతటి తీరుబడి, మనోనిశ్చలత్వం కుదిరాయిట. తప్పకుండా నెగ్గుతాడుట. ఆ డబ్బుతో, అతను చెయ్యదల్చుకున్నవన్నీ ఏకరువు పెట్టాడు. అమెరికన్లు చచ్చిపోయిం తర్వాత, పారిస్ వెడతారన్నట్లుగా, భారతీయులు మరణించింతర్వాత, హాలీవుడ్ వెడతారు కాబట్టి, తను 'లాసాంజలీస్' పట్నం వెడతాడుట. ముఖ్యంగా చూడవల్సినవాళ్ళు, లెస్లీ హూవార్డ్, మిర్నాలాయ్, జీనాటయిర్నీ; ఏదేనా, పత్రికలో ఏర్పాటుంటే, చేరిపోయి, అక్కడే వుండిపోతాట్ట."

"ఇంతకీ కరుణాకరానికి, పెండ్లి చేసేస్తే, యీ రాకపోను. మనస్సంతా, హాలీవుడ్ తారలమీద ోంది" అన్నాడు కామేశం.

"బ్రహ్మచారులకి యీ జబ్బు రాదంటారు ్లు" అన్నాను.

"అల్లా, లేడీ డాక్టర్లనాలి" అని, కామేశం బిగ్గ నవ్వాడు.

చుట్టుపక్క రోగులు మాకేసి వింతగా మాశారు. ంది మొహాల్లో బీభత్సం, మరికొందర్లో భయం, కా కొందర్లో, కొంచెతనం కనిపించాయి. ంశం, చనువుగా దగ్గర్లోవున్న రోగులని పలక , భలోక్తులు వేస్తున్నాడు. అతని ధోరణి స్తే, వాళ్ళని చూసి అనూయపడినట్లుంది. అప్పుడే స్వేచ్ఛనంతా వొదులుకొని, సంసారం బురదలో యినందుకు రోగులంతా, అతన్ని చూసి జాలి నిపించింది. ఇంతలో శంకరయ్య చక్కా ్చాడు. అమ్మగారు చప్పున రమ్మన్నారన్నాడు. శం విసుక్కుని, మళ్లీ వొస్తానని చెప్పి, వెళ్ళి ్యాడు.

సూర్యుడు నర్సెస్ క్వార్టర్స్ వెనక ు. గాయం పడినట్లు ఆకాశంలో సంధ్య ంది. బాండేజ్‌లు, తీసుకొచ్చినట్లు, మేఘాలు తున్నాయి. రక్తాని కవన్నీ తడిపినట్లు, వల్లగా, ా, ఊదాగా మారి చీకట్లో కరుగుతున్నాయి.

కరుణాకరం, నేనూ, బైటికొచ్చాం. వార్డ్ పడక్కుర్చీలు తెచ్చాడు.

"నీ కిట్లాగవుతుందని ఎప్పుడూ అనుకోలేదు" ను.

"నేనూ అనుకోలేదు. కాని అవుతే బాగుండు నేవాణ్ణి." అన్నాడు.

"అంటే?"

"టి. బి. వల్ల బాధపడేది రోగికాదు—అతన్ని ుకునేవాళ్లే సమస్య. భర్తకి జబ్బుచేస్తే, కి, పిల్లలకి నరకం; భార్యకి చేస్తే, భర్తకి నరకం. దగ్గరగా రాకూడదు; దూరంగా వుండలేరు: ానాలు, మనస్పర్థలు.—ఆశ, నిరాశ—నిరం నసిక క్షోభ. కాలనిర్ణయంలేదు; తొందర్లో తప్పులు, దిద్దుకోడానికి లేదు. నిజంగా యీ సమస్యని ఎవ్వరూ తీర్చలేరు. ప్రభుత్వం ఏం చేస్తుంది? రోగి తాలూకు వాళ్ల భుక్తిని చూడాలి; చూడగల్దు; కాని వారి ఆంతరంగిక జీవితాన్ని, హృదయాలని, వుద్రేకాలని తాకలేరు. టి. బి. కోసం త్యాగం, యీ మనుషులు చెయ్యలేరు. ఒకవేళ చేసినా, దానికి ఫలితం లేదు, హర్షించేవారు లేరు. నిష్కామకర్మలాంటిది. నా విషయం తీసుకో. నాకోసం కాచుకున్నవాళ్లులేరు. నేనొక సమస్య కాను."

"కామేశం, సుగుణ..." అన్నాను.

"అవును. కాని వారి ఆప్యాయం, వారి కెంత హానికరమైందో నే నూహించగలను. కామేశానికి జబ్బుగా వున్న రోజుల్లో, నేనూ, సుగుణ, ఏమైనా చేసివుంటే, యిప్పుడు నా కట్లావుంటుందో ఆలోచించు. కామేశం చూపుతున్న ఆదరణకి, నేను జీవించగలనా?..."

కంఠం నీరసించి, గొంతులో తన్నుకుంటున్నట్లుంది. చీకటి రగ్గులా మమ్మల్ని కప్పేసింది. అతని కళ్లు బాధతో ఎట్లా మూసుకు పోతున్నాయో, నేను చూడలేకపోతున్నాను.

"సుగుణ మళ్లా ఆ విషయంలో ఏమంటోంది...?"

"సుగుణ.—మొదట్లో నాలుగైదు రోజులు, తరుచు యిక్కడే గడుపుతూ, కనుక్కునేది. తరవాత యిక్కడికి రావడం తగ్గించింది. నీకోటి చెబుతాను, మనస్సులో పెట్టుగో. నే మంచాన పడింతర్వాత, నాకు సుగుణ పరిచయం కావల్సివొచ్చింది. కామేశానికి జబ్బుగా వున్నప్పుడు, నేను చేసిన త్యాగానికి, ప్రతిఫలం యిప్పుడు కోరుతున్నానేమో తెలీదు.—ఎందుకో ఆమెపై వొక హక్కు నాకు వున్నట్లు అనిపిస్తుంది. కాని చిత్రం—సుగుణ పెడమొహం పెడుతోంది. పెద్ద మంటని, నీటి బిందువుతో ఆర్పేసినట్లుగా, చప్పున చల్లారింది; ...ఈ విషయాలు ఆమెతో ముచ్చటించే సాహసం నాకు లేదు; ఆమెకీ యిష్టం లేదు.

"జబ్బువల్ల, పోగొట్టుకున్న స్థానాన్ని మళ్లీ ఆమె, కామేశంలో ఆక్రమించుకుంటోందేమో?" అన్నాను.

"నువ్వింత సరిగ్గా ఎట్లా కనుక్కున్నావు?"

"వాళ్ల మాటల ధోరణి అట్లాగనిపించింది"

"కాని, కామేశంహృదయంలో ఖాళీస్థలం వున్నట్లు లేదు. ఏదన్నా కొంత వుంటే, అది నాకోసం వుంచేశాడు. సుగుణని అందులోకి ప్రవేశించనీడం లేదు..."

"అవును. ఆ విషయం, యిక్కడికి రాక్ముందే, అతను నాతో చెప్పాడు..."

"నా జబ్బు వాళ్లిద్దర్నీ కలవనీకుండా చేసిందనే నా బాధ. నావల్ల కామేశం తన సుఖాలని త్యాగం చెయ్యాల్సి వొచ్చింది; చేస్తున్నాడు. దానికి, ఆమె నన్ను క్షమిస్తుందంటావా? అతను, నన్నెంతగా, లోలోన తిడుతూంటాడో. నాకీ జబ్బు లేకుండా, మామూలు మనిషినైవుంటే, యిట్లాంటి పర్యవసానానికి, ఆత్మహత్య చేసుకునుందును. కాని, యీ జబ్బులో ఏముందో నాకు జీవించాలనే వుంది. నా కెవ్వరి పరిచయం అక్కర్లేదు. ఊరికే, ఆకాశంలో నక్షత్రాలకేసి చూస్తుండడమే గొప్ప అనుభవం. ఈ మనుషులు—వారి రాగద్వేషాలు, రాజకీయాలు, కలహాలు—ఏవీ నన్నంటవు. నేనూ దూరంగావుండి, వాటిని చూసి, జాలిగా నవ్వగలగడం జీవితలక్ష్యం..."

అరుబైట యింక కూర్చోడానికి వీల్లేదని కరుణాకరాన్ని లేవదీసి లోపలికి తీసికెళ్లారు, ఎటెండెంట్స్. ఖశ్శాృ ఉదయం వొస్తానని చెప్పి, నే వెళ్ళిపొయ్యాను. దూరంగా, రోగుల నవ్వులు, మాటలు, దగ్గులు, ఆవలింతలు—సన్నగిల్లుతున్నాయి. వాళ్ళందరూ నన్ను చూసి, వొక రోగిలా భావిస్తున్నట్లైంది. జీవితప్రవాహంలో కొట్టుకుపోతుంటే, కాసేపు ఏవో, అంచులు, దరులు చేతులకి తగిలినట్లైంది. అదొక వింత స్పర్శ—వొక కదలిక—అదేమిటో తెల్సుకునేలోగానే, అదంతా మాయమై మాటుమణుగుతుంది.

ఆ మర్నాడు రాత్రి, మరోటి జరిగింది. భోజనాలు చేసి, నేనూ, కామేశం, సుగుణ, బైట మంచాలు వాల్చుకుని కూర్చున్నాం. ఆ సాయంత్రం కరుణాకరం టెంపరేచర్ మరో డిగ్రీ హెచ్చిందని, యిదివరకుమల్లే గంటసేపుండి పోవడంకాక, మూడు గంటలపైగా వుంటోందని తెల్సింది. టి. బి. టెంపరేచర్ విషయం, కామేశం చెబుతున్నాడు.

"తగ్గుతూ, హెచ్చుతూ అల్లాగే వుంటూంటుంది. దీనికేమన్నా అంతంటూవుంటేగా...?" అంది సుగుణ.

"ఎందుకు లేదు. నా విషయంలో మాత్రం చూశావుగా. నాకంటె, ఎర్లీస్టేజ్ కాబట్టి నాకంటె తొందర్లోనే కరుణాకరానికి, టి. బి. కన్య విడాకులిస్తుంది." నేను నవ్వేశాను.

"వివాహం, విడాకులు—అంటే, మనవాడికి నవ్వు!" అని కామేశం నన్ను హేళనచేశాడు.

"ఎందుకు నవ్వడం. అతను మామూలు మనిషి. మీకింకా రోగం తగ్గినా, రోగి మనస్తత్వం పోలేదు." అంది. కామేశానికి కోపం వచ్చింది.

"అంటే?"

"అంటే ఏముంది మనమింకా యిల్లా కొంత కాలం యీ రోగులమధ్య గడిపామంటే, మనందరికీ, ఆఖరికి యీయనకికూడా, పిచ్చెత్తిపోతుంది. మనమిట్లా, విచారం నటిస్తూ, అన్నీ వొదులుకుని యీ పీడ యెప్పుడు విరగడవుతుందా అని లోలోపల అనుకోడం, అసహజం—అన్యాయం. ఈ నాటకం యింక మనం ముగించవచ్చు" అంది వుద్రేకంతో.

"ఎవరిది నటన—నీది నటనకావొచ్చు. నువ్వు చెప్పింది నిజమైతే, నా జబ్బులో నువ్వుచేసిన వుపచారం అంతా నటనే. ఇంకా నీదే నాటకం..."

సుగుణ కళ్లల్లో కన్నీరు, దీపం వెలుగులో సన్నగా కదిలింది. చివాలున లేచి, మంచం మడిచేసి, వరండాలో కెళ్లింది.

"నాటకం అనీ, నటననీ,—వొప్పేసుకున్నందుకు సంతోషించండి. అమాత్రం నిజాయితీ మీ కేదీ?"

"ఛీ, ఛీ—ఆడజాతికి లేదు నీతి, నియమం." అని కామేశం కూడా లేచాడు. నేను అతని బుజం మీద చెయ్యివేసి, సవరించి బుజ్జగించాను. ఇద్దరం—అల్లా మైదానంకేసి నడుచుకుంటూ వెళ్లాం.

పావుగంటవరకూ ఎవ్వరం మాట్లాడలేదు.

"అవతల వాడు చావుకి సిద్ధమయ్యాడు. తన
ను, షోకులు, షికార్లు, శృంగారం కావా
!" అని వెక్కిరింపుగా, దూషణగా అన్నాడు.
వాలో నాకు తెలీలేదు.

"వాడు చావనూ చావడు, బ్రతకనూ బ్రతకడు.
కున్నంతవరకూ, నేనల్లా సుఖించలేను. కాని
గాధ లేదు. అసలా సెంటిమెంటే లేదు. అనే
బాధ."

"సుగుణ అల్లా వుండడంలో కొంత సబబు,
యం లేదంటావా? ఆలోచించు, చాలా రోజులు
కనిపెట్టుకునుంది. నీకు తగ్గింది. ఆమె కధి,
సంతోషాన్ని కలగచేస్తుంది. భర్తతో విసో
ాలని వుబలాట పడడంలో దోషం ఏముంది?

"నాకు నయంకాకపోతే, ఏం చేసుండేది?"

"అది వూహించి యివడం దేనికి?"

"అట్లాంటి పరిస్థితులలోనే మనుషుల శీలం,
వేది. ఉత్తప్పుడు, అందరం మంచివాళ్లమే.
రులమే."

"కాని, కామేశం—నీతి, శీలంకూడా, మాన
సహజమైందిగా, సాధ్యమయ్యేదిగా వుండా
ంటాను."

"అది నీతేకాదు—కేవలం మర్యాదనిపించుకుం
." ఆ రెంటికి తేడా ఏమిటో నాకు తెలీలేదు.
, నేనా విషయం పైకలేదు.

"మీ రుంటున్నది వొకరకంగా అసహజమైన
వరణమే—కామేశం! ఆమె సలహో నామా
, వో నెలపాటు ఎక్కడికేనా వెళ్ళిరావడం
ది. కరుణాకరానికిది, నెలలో తగ్గే వ్యవహారం
. మార్పు మంచిదనుకుంటాను" అన్నాను.

"తను వెడతానంటే నా కభ్యంతరంలేదు.
రమ్మని చంపుకుతింటూంది." నాకు నవ్వొ
ది.

"నువ్వు లేకుండా ఆమె వెళ్ళి చేశేదేముంది?"

"అట్లా దూరంగా వులకడం నాకు చేతగాదు.
హృదయంవుంది. కరుణాకరం జబ్బుతో
ంతకాలం నేనా పని చెయ్యలేను..."

తనకి జబ్బుగా వున్నప్పుడు, సుగుణ ఎట్లా
రించిందో కామేశానికి తెలుసా? తెలుస్తే, అతి
నిట్లా అంటాడా? అతను భార్యపై, శరీర సుఖాలపై చూపే విముఖత్వం, జబ్బువల్ల జనించిందా, నిజమైందా? నిజమైందైతే దాని విలువెంత? ఇల్లాంటి ప్రశ్నలొచ్చాయి. వాటికి సమాధానాలు తెల్సుకునే నిశ్చలత్వం లేకపోవడం మూలాన, వాటిని వొదిలేశాను.

కాని, కామేశంపై నాకున్న గౌరవం, పెరుగుతోంది. ఆ త్యాగంలో నాకు పరిపూర్ణత కనిపించింది. అందులో నిండుతనం వుంది: గొప్పతనం వుంది. మానవుడు ఎంత ఎత్తైన శిఖరాన్ని అందుకోగలడో మూచిస్తుంది. ప్రతిఫలాపేక్షలేని స్వార్థరాహిత్యం, త్యాగం నన్ను ముగ్ధుణ్ణిచేశాయి. సంస్కారం, కళలు, వేదాంతం,—వీటి ప్రాబల్యం, జీవితంలో ప్రవర్తనపై కనబడాలి. అట్లా కనబడనినాడు, యివన్నీ వృధా. సంస్కారం, కళ, వేదాంతం, అన్నింటిని పరిపూర్ణంగా సాధించడంలో ఘనతలేదు. ప్రవర్తనలో వ్యక్తం చెయ్యగలగడంలోనే, గొప్పతనం వుంది. ఆవిధంగా కామేశం, గొప్పవాడిలా కనిపించాడు. లేక, నాకట్లాంటి అభిప్రాయం కలగచెయ్యాలన్న సంకల్పంతో, అలవరుచుకున్న విముఖత్వమా? నాకు నవ్వొచ్చింది. నే నెంత చెడ్డవాణ్ణి! గొప్పతనానికి, వొటిపువాదులు తప్పుతాను. ఏదో లోపం చూపి తృప్తిపడతాను. ఇతరుల మంచితనాన్ని హర్షించలేం, ఎందుచేతనో!

అప్పుడే అక్కడికొచ్చి నాలుగురోజులైంది. మరో రోజుకూడా అదనంగా వుండిపొయ్యాను. రాత్రిబండికి ప్రయాణం స్థిరపరుచుకుని, మధ్యాహ్నం, కరుణాకరాన్ని చూడ్డానికెళ్ళాను. మనిషి కుంగి చాలా నీరసించిపొయ్యాడు. నన్ను చూడగానే లేచి కూర్చున్నాడు. నాకు చేతనైనట్టుగా, ధైర్యం చెప్పి, వోదార్పు మాటలాడాను. ఇతర రోగుల సంసారం గొడవలు చెప్పాడు. వాళ్లలో కొందరితో అతనికి బాగా స్నేహం ఏర్పడింది. వాళ్లల్లో వారికి, యీర్ష్యలు లేకపోలేదు. తగ్గిందని డాక్టర్లు హామీయిచ్చి, ఎవర్నైనా పంపించివేస్తే, ఆ రోగిని చూసి ఘోషణ చేస్తారుట; కొత్తగా వొచ్చినవాణ్ణి, విరోధిగా భావించి, దూరంగా వుంచుతారుట. ఎక్కువ రోజులు శానటోరియమ్‌లో వున్న

వాడికి వారిలో గౌరవం, పలుకుబడి, ఓరకం నాయకత్వం కూడా లభిస్తుందిట.

సాయంత్రమైంది. నేను వెడతానని లేచాను. అతనూ లేచాడు.

“ఇంకా గంటదాకా యిక్కడే గడపొచ్చు” అన్నాడు.

నా కింక, కామేశం, సుగుణల విషయం, అతనితో ప్రస్తావించి మనస్తాపం కలగచెయ్యకూడదనుకుని నిశ్చయించుకున్నాను.

“నాకు తప్పకుండా, నెలరోజుల్లో కుదిరిపోతుంది. ఎప్పుడు యిక్కడనుంచి బైటపడదామా అని ఘడియలు లెక్కపెడుతున్నాను. నాకోసం కాదు. కామేశంకోసం.” అని తల వాల్చాడు.

“ఇప్పుడవన్నీ ఎందుకు తల్చుకుంటావు. అవన్నీ గడిచిపోయినాయి. నీ వొళ్లు విషయం చూసుకో.”

“నా కిక్కడ బందిఖానా వున్నంతకాలం, వాళ్లకూడా, బందిఖానాయే. నేను వొంటిగాణ్ణి—ఎక్కడికో ఏకాంతంగా పోయి బ్రతుకుతాను.”

కన్నీటితో కళ్లు తడిసినాయి—కాని బొట్లు కింద కారే తీవ్రత లేదు. చర్మం ఎండిపోయి, పొడిపొడిగా అయింది—ఆవిరిగా మారిపోతూన్న కన్నీరు బైటకి రావడంలేదు. నా కళ్లు చెమ్మగిల్లినై. రుమాలు కళ్ళకి అదుముకున్నాను.

“కరుణాకరం—ఆ ప్రశ్న మళ్లా అడుగనా?”

“నాకు తెలుసు. సుగుణని ప్రేమించలేదు.”

“మరి...?”

“ఆ రోజుల్లో ఆమెకి ప్రేమ, ఆదరణ, కావాలి. నేను వాటి నివ్వడానికి యత్నించాను. అతనికి వుపచారం చేసినట్లే, అతని శరీరంలో వ్యాధి—ఆమె హృదయంలో గాయం రెంటినీ మాన్పడానికి నా యత్నం ఎవరి కర్థమవుతుంది?”

“ఆమె చేసిన ఒట్లు, ప్రమాణాలు...?”

“హృదయం క్షణక్షణం జీవిస్తుంది, ఆశిస్తుంది, అనుభవిస్తుంది—అంతే. శాశ్వతాన్ని ఆదేశించదు. మనం శాసిస్తాం. శరీరాలకి లేని అమరత్వం, ఆత్మలకెల్లా వొస్తుంది! రావాలని కోరడం మనం ఆత్మకిచేసే అన్యాయం. అసలు యీ లోకంలో, ఎవ్వరూ, ఎవ్వర్నీ ప్రేమించలేరు. మనుషులకి కావల్సింది ప్రేమకాదు. ప్రేమ శరీరానికి కావాలి. హృదయం కోరేది కాస్తంత దయ, కొంచెం ఆప్యాయత, ఆదరణ—అంతే...”

రెండుచేతులు కళ్ళకి అదుముకున్నాడు. ఏడ్పువల్ల అతని శరీరం వింతగా ఒణికిపోయింది. మనిషి అవయవాలన్నీ విడిపోయి, నగ్నహృదయాన్ని బైటపడేశాడు—టి. బి. వొదిలేసిన హృదయం తునక.

నా కెందుకో వొక్కసారి సుగుణమీద సానుభూతి బయలుదేరింది. ఆమె హృదయాని క్కావల్సింది, దయ, ఆదరణ భర్తనిమ్మని కోరుతోంది. అంతే. కామేశం దాన్ని కామం అనుకుని తృణీకరిస్తున్నాడు. అప్పుడు కరుణాకరం తృణీకరించాడు. ఆ వ్యక్తులు, ఆ పరిస్థితులు, మళ్ళా ఎప్పుడూ రావు, అవి అపూర్వం. వాటిని విమర్శించి విలువలు కట్టడం అవివేకం.

కరుణాకరం బాధచూస్తే నాకు భయమేసింది. అతనేమన్నా అఘాయిత్యం చెయ్యడుకదా! ఆహారమేమీ లేదు మళ్లా. అతన్ని లేవదీసి మంచం దగ్గరకు తీసుకువెళ్ళాను.

“ఇందులోంచి ఏదేనా కథల్లుదామనుకుంటున్నావా? నే జీవించివుండగా అల్లా చెయ్యకుసుమా.”

“నాకా అభిప్రాయంలేదు. అనుభవం స్వంతదైనప్పుడే, దాన్నుండి విముక్తి పొందటంకోసం వ్రాస్తానేమో. పైగా, మరీ మహత్తరమైన అనుభవాన్ని, ఎవరూ కళకోసం వుపయోగించుకోలేరనుకుంటా.” అన్నాను.

“అనుభవం బాగా జీవించడాని కుపయోగపడనప్పుడు, కళకిమాత్రం ఎట్లా వుపయోగపడుతుందిలే...”

అని నవ్వి, ఒరగిల్లాడు. మళ్లా పదిరోజుల్లో వొస్తానని చెప్పి, నే వొచ్చేశాను.

సరిగ్గా పదిరోజులతర్వాత, నే కథ వ్రాద్దామని కూర్చుండగా, అతనిదగ్గరనుంచి రమ్మనమని టెలిగ్రాం వొచ్చింది. ఎందుకు రమ్మన్నాడో నేను వూహించలేనా? ఈ కథ ప్రారంభంలో నే చెప్పేశాను. వెంటనే బైలుదేరాను. అతనికి తగ్గిందనీ, శానటోరియమ్‌నుంచి డిశ్చార్జ్ చేశారనీ, మళ్ళా, సుగు

ఏదో చేసి వొచ్చిందనీ, నా సలహాకోసం న్నాడనీ, వూహించాను.

కాని నేను పొరబడ్డాను. 'సంతోషి' లో శం లాడ్జిలో ఎవ్వరూ లేరు. వారుభయులూ క్రితం వూరెళ్లిపోయారుట. తొందరగా టోరియమ్ కెళ్లాను. వార్డ్ బోయ్ చెప్పాడు. నమే కరుణాకరం చనిపోయాడని. డాక్టర్లనీ, నీ కనుక్కున్నాను. వారందరూ కూడా, చనిపోయాడా అని, ఆశ్చర్యపడ్డారు. నాలుగు ల క్రితంనుంచి, జబ్బుధోరణి మారిందనీ, బాగు నీ, టెంపరేచర్ పూర్తిగా నిల్చిపోయిందనీ, న్నారు. లోపల హెమరేజ్ అయివుండాలని ంచినా, ఆ సమాధానం వారికే తృప్తిగా లేదు.

అతని బెడ్డింగ్, హోల్డాల్—అన్నీ సర్ది నాకు చెప్పారు. నాకో వుత్తరం పోస్టుకి సిద్ధంచేసుంది. చించి చదివాను.

"నాకు పూర్తిగా నయమైందన్నారు, డాక్టర్లు. మరో వారంలో డిశ్చార్జ్ చేస్తారుట. నా కెంతో ఆనందంగా వుంది. కామేశంకూడా, హాయిగా భార్యతో వూరికెళ్లాడు. ఇక్కడంతా టి. బి. రోగులు. నాసంతోషం ఎవరితో పంచుకోను—? టెలిగ్రాంకూడా యిద్దామనుకుంటున్నాను. ఇన్నాళ్లకి ముక్తి—కరుణాకరం."

నేనల్లా, ఎక్కడికో తెలీకుండా నడిచి పోతున్నా. హాస్పిటల్ వాన్, రోగి కాండ్రించి వుమ్మేసినట్లు ధ్వనించి, పక్కనుంచి వెళ్లింది. దూరంగా, రైలుకేసి, పట్టాల్లోకి నడిచిపోయాను.

ఆనందం పంచుకుంటానని, దుఃఖం దిగవిడిచి పోయాడు కరుణాకరం.

చటుక్కున నా మనస్సుకి వో భావం స్ఫురించింది. అదేమిటో చెప్పేసి, తర్కించి, నా పాఠకుల కాలం వృథాపర్చడం అన్యాయమని వొదిలేస్తున్నా.

తెలుగుసామెతలు

శ్రీ బేకుమళ్ల కామేశ్వరరావు

తెలుగుసామెతలను అనేకమంది సేకరించి పుస్తకాలుగా ప్రకటించేరు. ఇప్పటికి కొన్నివేల సామెతలు చేరేయి. వీటిలోంచి తెలుసుకోవలసిన విశేషాలు అనేకమున్నాయి ; సామెతల తత్వం బోధపరచుకోవలసుంది. ఇతర దేశస్థులు—అంటే పాశ్చాత్యులు—తమ సామెతల వాఙ్మయాన్ని మథించి అనేక అంశాలు తెలుసుకున్నారు. మనంకూడా ఆపద్ధతులే అవలంబించి తెలుగుసామెతలలోనుంచి అనేక సంగతులు తెలుసుకోవాలి.

ఇతర దేశస్థులు ఏపద్ధతి అవలంబించారో ఆ పద్ధతి ఇక్కడ తెలియజేస్తాను. ఆపద్ధతిని ప్రయోగించి సామెతలను మథించడం ప్రత్యేకమైన పని. కొన్ని ఏళ్లు తంటాలు పడితే నేగాని ఆపనిపూర్తికాదు. ఇతరులకు ఆపని విడిచిపెడుతున్నాను. ఒక్కొక్క అంశం చెప్పి ఉదాహరణకి సుమారు రెండు మూడు సామెతలు చూపిస్తాను.—

కెప్టెన్ ఎమ్. డబ్ల్యు. కార్ అను ఆంగ్లేయుడు తెలుగు సామెతలు కొన్ని "ఆంధ్ర లోకోక్తి చంద్రిక" అను పేరున 1868 లో ప్రకటించాడు. అతనికంటే ముందు కొంతమంది సామెతల పుస్తకాలను ప్రకటించేరన్న సంగతి కార్ పుస్తకంయొక్క పీఠిక నుంచి తెలుస్తూంది. కాని ఆపుస్తకాలు ఎక్కడా మిగిలినట్టు కనబడవు. ఉన్న సామెతల పుస్తకాలలో కార్ యొక్క ఆంధ్ర లోకోక్తిచంద్రికే మొదటిది. ఈపుస్తకంలో చాలా సామెతలున్నాయి. ఈ సా వ్యాసానికి అవసరమయిన సామెతలు చాలామట్టుకు 'ఆంధ్ర లోకోక్తి చంద్రిక' లోనుంచి తీసుకొన్నవే.

సామెతలలో చూడవలసిన అంశాలు నాలుగు.

1. సామెతల ఉత్పత్తి
2. సామెతల వస్తువు (*Matter*)
3. సామెతల శైలి.
4. పదబంధపు (*Phrase*) సామెతలు; శుకోక్తి సామెతలు; ఉపమానపు సామెతలు.

మొట్టమొదట సామెతల ఉత్పత్తిని గురించి చూద్దాం.

సామెతల ఉత్పత్తి

సామెతను నిర్వచించడం చాల కష్టం. ఏఒక్క నిర్వచనం కూడా పరిపూర్ణంగా ఉండడంలేదు. అందుచేత సామెత అంటే లోకులయొక్క ఉక్తి అని మాత్రం చెప్పి ఊరుకొందాం.

సామెతలు అనేక మోస్తర్లుగా సృష్టించబడుతున్నాయి. ఆయా విధాలన్నీ ఇక్కడ తెలియజేస్తాను.

సూత్రపు సామెతలు:

మొట్టమొదట సంఘంలో కొన్ని వాక్యాలు లేక సూత్రాలు వాడబడతాయి. ఈ సూత్రాలే క్రమేపీ పక్వమయి సామెతలుగా స్థిరమవుతాయి. వీటికే సూత్రపు సామెత లని పేరు. ఈ సామెతలలో భావాలంకారాలుండవు. ఇటువంటి సామెతలయొక్క వయస్సు నిర్ణయించడం చాల కష్టం. పుస్తకాలలోని ప్రయోగాలను బట్టి ఇవి ఎంతకాలం కిందటి నుంచీ ఉన్నాయో చెప్పవచ్చు. ఈ మోస్తరుగా ప్రయోగించబడనటువంటి వాటి వయస్సును నిర్ణయించలేము.

సూత్రపు సామెతలలో మరొక చిక్కు కూడ ఉంది. ఇప్పుడు వాడుకలో ఉన్న సూత్రాలనే మనం సామెతలని చెప్పగలం కాని, వాడుకలో లేని వాటిని గురించి చెప్పలేము. పుస్తకాలలో కనబడే ఇటువంటి సూత్రాలగురించి అవి సూత్రాలని మాత్రమే అనుకోడాని కవకాశముంది. కాని అసూత్రాలనే ఎక్కువ మంది గ్రంథకర్తలలో ఎక్కువ లేదా లేకుండా ఉన్నా లేక అసూత్రాలే ఇతరభాషలలో సామెతలుగా ఉన్నా,

అవి ఒకప్పుడు మనభాషలో కూడ సామెతలుగా ఉండేవని నిశ్చయంగా చెప్పవచ్చు.

ఈ సూత్రపు సామెతలలో కొన్ని నీతులుకూడ ఉన్నాయి.

సూత్రపు సామెతలలో ఏరకమైన భావాలం కారాలూ ఉండవు అనిచెప్పేను. కాని, ఈ సూత్రాలయొక్క మొట్టమొదటి అర్థం పూర్తిగా తెలియకపోవడంవల్ల, క్రమేపీ వేరువేరు అర్థాలలో ప్రయోగించ బడతాయి. అంటే, క్రమేపీ వీటిలో ధ్వని ప్రవేశిస్తుంది. కాని అవి మెచ్చుకోదగిన రూపకపు సామెతలు అవవు.

సూత్రపు సామెతలకు ఉదాహరణాలు :

కలిమిలేములు కావటి కుండలు.
చెరపకురా చెడేవు, ఉరకకురా పడేవు.
నిజం నిలకడమీద తేలుతుంది.
నిజమాడితే నిష్ఠూరం.
అంత్య నిష్ఠూరం కంటే ఆది నిష్ఠూరం మేలు.
డబ్బుపోయినవాడు పాపాన్ని పోతాడు.

ధ్వని సామెతలు:

ఈరకం సామెతలు చాలా ఆశ్చర్యంగా వుంటాయి. ఏదో ఒక చరిత్ర లేక అంశమో అలంకారికంగా ప్రయోగించ బడడం వీటి లక్షణం. ఇవి ఎంత పురాతనమైనవో చెప్పడం కష్టం. పుస్తకాల ఆధారం వల్ల కొంత చెప్పవచ్చు. ఇంకా చుట్టుపట్ల ఉండే భాషలను పరిశీలించికూడా కొంతవరకూ వీటి వయస్సును నిర్ణయం చేయవచ్చు. ఈ సామెతలలో కొన్ని ఇటీవల పుట్టినవికూడ ఉంటాయి. కొత్తవాటి వయస్సును గురించి తగాదా లుండవు.

ధ్వని సామెతలు అనేక వృత్తులలోనుంచి కూడ బయలుదేరుతాయి. పరిశోధనచేసి ఏయే వృత్తులలోంచి ఎక్కువ సామెతలు వచ్చాయో తెలుసుకోవలసుంది.

ఉదా :

అందనిపూలు దేవుని కర్పణం.
కమ్మరివీధిని సూదులమ్మినట్లు.
కుడితే తేలు కుట్టకపోతే కుమ్మరి పురుగు.
పంది ఎంతబలిసినా నందితో సమ మవుతుందా ?
హనుమంతుని ఎదుట కుప్పిగంతులా !

మాదిరి సామెతలు :

పాత సామెతల మీదే మరికొన్ని కొత్త సామెతలు బయలు దేరుతాయి. వీటిలో ఏది మొదటిదో ఏది తర్వాతిదో తెలుసుకోడం కష్టం. ఆ పాత సామెతలనబడేవి ఒకొక్కప్పుడు ఇతర భాషల లోవి కావచ్చు. వాటి మూర్తులమీద మనభాషలో కొత్త సామెతలు బయలుదేరి ఉండవచ్చు. పరిశోధన మీద సంగతులు తేలుతాయి.

ఈ మోస్తరుగా బయలుదేరిన కొత్తసామెతలకు, ఒకొకప్పుడు పాతవాటికుండే చెలామణీ ఉండదు. అన్ని సామెతలలోంచీ ఈ మోస్తరుగా కొత్త సామెతలు ఉత్పత్తికావు.

ఉదా :

(1) చల్దికంటే ఊరగాయి ఘనం. దీనిమీద తయారైన సామెత — ఉపన్యాసంకంటే ఉపోద్ఘాతం యెక్కువ.

(ii) ఇంటిపేరు కస్తూరి వారు ఇంట్లో గబ్బిలాల కంపు.

ఇంట్లో ఈగలమోత బయట పల్లకీలమోత.
ఇల్లెల్లా కొడితే తట్టెడి పెంకులు లేవు.
కాసుకుగతిలేదు కోటికి పడగ ఎత్తాడు.
నాంబడా, దర్శన్ థోడా.
పేరు గంగానమ్మ, తాగబోతే నీళ్లు లేవు.
మూర్తికొంచెమయినా కీర్తివిస్తారం.
వీటిలో తొలిసామెతను కనుక్కోవలసుంది.

(iii) ఆ తండ్రికి కొడుకు కాడా !
ఆ బుర్రలో విత్తనాలేనా ?
తల్లి చాలు పిల్లకు తప్పతున్నదా !
విత్తనమొకటివేస్తే మొక్క ఒకటి వస్తుందా !

వీటిలో ఆదిమ సామెతను వెతక వలసుంది.

సామెతలలోని వ్యత్యాసాలు :

ఎక్కడా వ్రాసిఉండక నోటితోనే చెప్పబడుతూన్నందువల్ల, సామెతలలో అనేక చిన్నమార్పులు వస్తూంటాయి. ఇవి అనేక మోస్తర్లు - ఒక అంశం మరొక అంశం చేతా, సామ్యభేదాల వల్లా, వృద్ధి చేయబడీ, కొంత విడిచి వేయబడీ, ఇంకా అనేక మోస్తర్లుగా అనేక మార్పులు వస్తాయి. ఒకొక్క

ప్పుడు ఇతర భాషలలోని సామెతలే ఈ మోస్తరుగా మన భాషలో మార్పు చెందుతాయి.

ఉదా :

(i) కందకు లేదు, చేమకు లేదు, తోటకూరకు వచ్చెనా దురద !
కందకు లేని దురద బచ్చలికేమి !

(ii) కాలు పట్టుకులాగితే చూరు పట్టుకు వేలాడేడుట.
మెడ పట్టుకు గెంటితే చూరు పట్టుకు వేలాడిందిట.

(iii) దొంగ చిక్కెనోయి అంటే కరిచెనోయి అన్నట్టు.
కరవకురా దొంగాడా !

కథల సామెతలు :

కొన్ని సామెతలు కథల మీద ఆధారపడి ఉంటాయి. వీటిలో కొన్నిటి కథలు మనం ఎరగం. మరికొన్ని కథలు సామెతల మీదే కల్పనచేయబడి ఉంటాయి. ఈ తరగతి సామెతలకు ఎన్ని ఉదాహరణలయినా ఇవ్వవచ్చు. ఇక్కడ కొన్నిటిని ఇస్తాను.

ఉదా :

కాదు కాదు అంటే నాదివాది అన్నాడుట.

వంగివంగలు మేస్తే, నారికేళాలు దూపిలు మేశాయి అన్నాడుట.

ముసలి బాబా కడిమి వేరాయెగాని కాలయినా ఇంతే కదా. (కడిమివేరు = కడిమిచెట్టు వేరు)

వంకర టింకర కాయలు ఏమిటంటే చిన్నవాడు అమ్మిన చింతకాయలు అన్నాడుట.

అన్నమంతా సున్నం అప్పాలన్నీ కప్పలు.

రాజాంకాయ పిచ్చికొండ, యామన్నగారికి భపాపంకం.

సామెతలు, సంప్రదాయికపు పాటలు :

సామెతలు కొన్ని సంప్రదాయికపు పాటలలో కనబడు తున్నాయి. సామెతలే ఈమోస్తరుగా చరణాలుగా మార్చబడ్డాయో లేక ఈ పాట చరణాలే సామెతలుగా వాడబడుతున్నాయో పరిశోధించి తెలుసుకోవలసుంది.

ఉదా :

(1) ఉడకకే ఉడకకే ఓ ఉల్లి గడ్డా నీ వెంత ఉడికినా నీ కంపుపోదు.

(2) మొండికెక్కినదాన్ని మొగుడేమి చేసు
రచ్చకెక్కినదాన్ని రాజేమిచేసు

(3) వాడ వదిసెలకేల వాలి వర్తనలు.

సామెతలు, కర్తలు :

లోకులు సామెతలను వాడుతూన్నా, ఒక్కొక్క సామెతను సృష్టించిన వాడు ఒక్కొక్కడే. పదిమంది కలిసి సామెతను సృష్టించడమంటూ ఉండదు. వేమన పద్యాలలోని చరణాలు కొన్ని సామెతలుగా వాడబడుతున్నాయి. కాబట్టి వేమన కొన్ని సామెతలు సృష్టించేడని చెప్పవచ్చు. నీతిశతకం లోని కొన్ని చరణాలు కూడా సామెతలుగా వాడబడుతున్నాయి.

ఉదా :

ఇనుము విరిగితే అతకవచ్చుగాని మనసు విరిగితే అతక కూడదు.

కంచు మోగినట్లు కనకము మోగునా !

తన బలిమికన్నా స్థాన బలిమి మేలు.

పుట్టడం చావడం కొరకే,

పెరుగుట విరుగుట కొరకే.

అనువుగానిచోట అధికుల మనరాదు.

చీమలు పెట్టినపుట్టలు పాముల కిరవవుతున్నాయి.

చెరువు నిండితే కప్పలు చేరుతవి.

తర్జుమా చేయబడ్డ సామెతలు :

ఒక భాషలోని సామెతలు మరొకభాషలో చేరడం సులువైన పనికాదు. ఆరెండు భాషలకీ ఒకప్పుడు ఎంతో చేరిక ఉంటేనేగాని అలాగు జరగదు. అంటే, అభాష మాట్లాడే రాజులు ఈ భాష మాట్లాడే ప్రజలను కొంతకాలం ఏలి ఉండాలి. అటువంటప్పుడే అకలయిక జరుగుతుంది. తెలుగుభాష పరిశీలిస్తే తర్జుమాచేయబడ్డ సామెతలు చాలా కనబడతాయి. మనకి దగ్గిరలో ఉండేభాషల లోని సామెతలు మనభాషలో కనబడడమేకాదు, ఎంతోదూరాన్ని ఉన్న స్పానిష్, ఇటాలియన్,

ఫ్రెంచి, ఒలంద మొదలైన భాషలలోని సామెతల లాంటివి కూడా మన భాషలో కనబడతాయి. అటువంటివి కేవలం విచిత్ర సంఘటనలని ఊరుకోరాదు. పరిశీలించి చూసి అవి తర్జుమాలు ఔనో, కావో తెలుసుకోవాలి.

పౌరాణికపు సామెతలు :

రామాయణకథ, భారతకథ, లోని అంశాలను గురించి చాల తెలుగు సామెతలు ఉన్నాయి. వీటిని పౌరాణికపు సామెతలని అందాము.

ఉదా :

ఆవుల మళ్ళించినవాడు అర్జునుడు.

కానికాలానికి పయిబట్ట పక్షులెత్తుకు పోయాయి.

సామెతల వస్తువు

ఇంక సామెతలయొక్క పదార్థాన్ని పరిశీలిద్దాము. అటువంటి పరిశీలనవల్ల ఈ క్రింది సంగతులు తేలుతాయి.

ఆచారాలు, మూఢవిశ్వాసాలు.:

తెలుగు సంఘంలోని ఆచారాల మీదా, మూఢ విశ్వాసాల మీదా కొన్ని సామెతలు బయలుదేరాయి. ఈ సామెతలు పరిశీలించి ఎటువంటి మూఢ నమ్మకాలు మనలో ఉన్నాయో తెలుసుకోవలసుంది. వాడుకలో లేని కొన్ని సామెతల యొక్క ఆచారాలూ, విశ్వాసాలు ఇప్పుడు మనకు బోధపడవు. కాని ఇప్పుడు వాడుకలో లేని కొన్ని మాటలు కూడా వాటినుండి తెలుస్తాయి. ఇటువంటి సామెతలలో కూడా తులనాత్మక పరిశీలన (*Gomparative study*) చేయాలి.

ఉదా :

కరివేపాకు కోసేవాడు వాగినట్టు.
పిల్లిని చంకపెట్టుకుని పెళ్ళికి వెళ్ళినట్టు.
పురిటిలోనే సంధి కొట్టింది.
మంచివానికి మరణమే సాక్షి.
రాచపీనుగ తోడులేకుండా చావదు
అశ్వద్ధ ప్రదక్షిణంచేసి కడుపు పట్టి చూసు కొన్నదట.

దేశచరిత్ర సామెతలు :

ఇటువంటి సామెతలలో దేశచరిత్ర కొంత తెలుస్తుంది. కాని అది సత్యమో, అసత్యమో పరిశీలించి తెలుసుకోవాలి. దేశచరిత్రసామెతలు ఇంత వరకూ వాడుకలో ఉండడం అరుదు. సాధారణంగా అవి ఆ పరిస్థితులతోనే అంతమొందుతాయి. కాని అలాగున నశించకుండా మిగిలినవి కూడ ఉన్నాయి. వీటి వయస్సును గురించి మనకేమీ సందేహాలుండవు.

ఉదా :

అక్కన్న మాదన్నగార్లు అందల మెక్కితే సాటిసరప్ప చెరువు గట్టెక్కాడు.

ఆపస్తంబులా, అశ్వలాయనులా అంటే ఆప స్తంబులం కాము, అశ్వలాయనులము కాము అప్పారావుగారి హార్కారులము అన్నాడుట.
ఏమి అప్పాజీ అంటే కాలంకొద్దీ రాయాజీ అన్నాడుట
ఓరిస్తే ఓరుగల్లు పట్టణమవుతుంది.
పుంగనూరు సంస్థానం.
వింతలేని ఆవలింత పుట్టదు.

ఆక్షేపణ సామెతలు :

ఒకరినొకరు వెటకారం చేసుకోడం, కొన్ని వృత్తులవాళ్లను వేళాకోళం చేయడం, ఒకజాతి మరొక జాతిని ఆక్షేపించడం, వస్తువుగాఉన్న సామెతలు అనేకమున్నాయి. వీటికి ఆక్షేపణ సామెతలని పేరు. న్యాయస్థానాలలోని తీర్పులను ఆక్షేపించే సామెతలూ, వైద్యాన్ని ఆక్షేపించే సామెతలూ, పురోహితులను, కంసాలులను మొదలైన వాళ్లను ఆక్షేపించే సామెతలు ఎన్నో ఉన్నాయి.

ఉదా :

కమ్మనీచు కడిగినాపోదు, కాకి నలుపు చిప్ప పెట్టి గోకినాపోదు.
కొండమీది గోలేమిటంటే కోమటివాళ్ల రహ స్యాలు.
కొండమీది గోలేమిటంటే అరవవాళ్ల రహ స్యాలు.
చెవిటి పెద్దమ్మ చేంతాడు తేవేఅంటే చెవుల పోగులు నాజన్మానా ఎరగ నన్నదట.

వైదికపు పిల్లి ప్రశ్న పలకవే అంటే మ్రావు మ్రావు అందిట.

అడ్డగోడమీద రొట్టె వున్నది, అతడు వస్తే ఖావుకావా, ముంగిట్లో ఏమో మూలుగుతూ వుండాది, మూలవున్న మువగక్రా లావుకావా.

ద్రావిడానాం ఘృతం నాస్తి మిర్లే మిర్లే నిరంతరం.

నాడువుంటే నవాబు సాయబు, అన్నంవుంటే అమీరు సాయబు, బీదపడితే పకీరు సాయబు, చస్తే పీరు సాయబు.

కంసాలి గగ్గిర వుండాలి, కుంపట్లో వుండాలి.

తల్లి బంగారయినా కంసాలివాడు దొంగి లించక మానడు.

దారిపొయ్యే వ్యాజ్యం కొని తెచ్చుకున్నట్టు.

అటయితే కందిపప్పు, ఇటయితే పెసరపప్పు.

అటయితే వైద్యకట్నం, ఇటయితే వైతరిణీ గోదానం.

నాచేతి మాత్ర వైకుంఠయాత్ర.

ఆకలి కాకుండా ఔషధమిస్తాను, నీ యింట్లో చద్ది నాకు పెట్టు అన్నాడుట.

న్యాయం సామెతలు, వైద్యం సామెతలు :

మన భాషలో ఇటువంటి సామెతలు విశేషం ఉన్నట్టు కనబడవు. పాశ్చాత్యభాషలలో పై సామెతలు చాలా ఉన్నాయి. పైగా పాశ్చాత్య భాషల్లో ఈ రెండు వృత్తుల్ని ఆక్షేపించే సామెతలు ఉన్నాయి. న్యాయాన్ని, వైద్యాన్ని గురించి తెలుసు సామెతలు ఎక్కువగా లేకపోవడానికి కారణమేమై వుంటుంది? మనదేశంలో ధర్మశాస్త్రాలు ఏర్పడి ఉన్నందువల్ల న్యాయం సామెతలూ, అనేక శతాబ్దాల కిందటే వైద్యశాస్త్రాలు తయారయి ఉండడంవల్ల వైద్యం సామెతలూ లేక పోయి ఉండవచ్చు. ఏదైనా తెలుగులో ఉన్న అన్ని సామెతలూ సరిగా పరిశీలిస్తేగాని ఆసంగతి నిర్ధారణగా చెప్పలేం.

ఉదా :

భూమికి రాజు న్యాయం తప్పితే గ్రామం వారు అందరూ ఏమి చెయ్యగలరు.

ఎవరు ఇచ్చినది ఈ మాన్యమంటే నేనే ఇచ్చుకొన్నా నన్నాడుట.

సంతలో కొట్టినందుకు సాక్షులెవరు?

సాక్షి కాళ్లుపట్టుకోవడంకన్నా వాది కాళ్లు పట్టుకోవచ్చు.

ఉల్లి పదితల్లుల పెట్టు.

కుక్కకాటుకి చెప్పుదెబ్బ.

శీతోష్ణస్థితి సామెతలు :

శీతోష్ణస్థితిని తెలిపే సామెతలు తెలుగులో చాల ఉన్నాయి. కాని, కెప్టెన్ కార్ ప్రకటించిన పుస్తకంలో మాత్రం కనబడవు. ఈరకం సామెతలలో సాధారణంగా ఋతువులు, వాన, గాలి, చలి, వేడి, ఏకాలం ఏపంటలకు మంచిదో మొదలైననాటిని గురించి ఉంటుంది. ఈరకమైన సామెతలు ఒక భాషలోంచి మరొక భాషలోకి తీసుకోబడవు, నిరుపయోగం కాబట్టి. శీతోష్ణస్థితిని తెలిపే సామెతలలోనుంచి మనం కొన్ని సంగతులు తెలుసుకోవచ్చు. అవేమంటే : మనజాతివారు ఏదేశంనుంచి ఈదేశం వచ్చారో, అప్పటి వారి విశ్వాసాలు ఏమిటో మొదలయినవి. ఈ సామెతలయొక్క వయస్సుకూడా కొంత శ్రమమీద తెలుసుకోవచ్చు.

సామెతల శైలి

సామెతలు ఈమోస్తరు శైలిలో ఉంటాయని చెప్పలేము. ప్రతి సామెతలోను తప్పకుండ యతో ప్రాసో ఉంటుందని చెప్పలేము. ఈ శబ్దాలంకారాలు లేని సామెతలు కూడా చాల వున్నాయి. సామెతలలోని అర్థాలంకారాలు బాగా పరిశీలించాలి. అటువంటి పరీక్షవల్ల సామెతలయొక్క వయస్సు, అవి పుట్టిన దేశం కూడ ఒకొక్కప్పుడు నిర్ణయం చేయవచ్చు.

సంభాషణ సామెతలు :

సామెతలు ఒకొక్కప్పుడు సంభాషణ రూపంగా ఉంటాయి. ఈ సంభాషించే వ్యక్తులు మనుష్యులే అయుండాలన్న నియమం లేదు. చేటి చేటికైనా సంభాషణ జరిగినట్టుగా ఉండవచ్చు.

ఉదా :

ఏటికి ఎప్పుడు వెళ్లావు, ఇసక ఎప్పుడు తెచ్చావు అని అడిగితే, అడవాళ్లు తలుస్తే అదెంతసేపు

అందిట ; మొగాళ్లు తలుస్తే ఇదెంతసేపు అని బాదేశుట.

గరుడాయిలెస్స అంటే, శేషాయిలెస్స అన్నట్టు.

ఎవరివల్ల చెడ్డావోయి వీరన్నా అంటే, నోటి వల్ల చెడ్డానోయి కాటంరాజా అన్నాడుట.

ఏవూరే ఏతామా అంటే దువ్వూరే దూఁగామా అందిట.

చమత్కారపు సామెతలు :

ఈ రకమైన సామెతలలో అనేక సంగతులు సంగ్రహంగా చెప్పబడడంగాని, పరస్పర విరుద్ధమైన అంశాలు విచిత్రంగా చెప్పబడడంగాని ఉంటుంది.

ఉదా :

ఇల్లు యేడ్చే అమావాస్య, ఇరుగు పొరుగు యేడ్చే తద్దినం, వూరుఏడ్చే పెళ్లీ లేదు.
రాతికుండకు ఇనుపతెడ్డు.
ఎండ పడితే వుండ పడుతుంది, వుండ పడితే వండ పడుతుంది, వండబడితే తిండ బడుతుంది, తిండ బడితే పండ బడుతుంది.
పండగతొలినాడు గుడ్డల కరువు, పండగనాడు అన్నం కరువు, పండగ మన్నాడు మజ్జిగ కరువు.
యోగికీ భోగికీ, రోగికీ నిద్రలేదు.

జాతుల, తెగల లక్షణాలు :

జాతుల, తెగల లక్షణాలు తెలియచేసే సామెతలు మన భాషలో ఉన్నాయి. వీటిలో చెప్పబడ్డ గుణాలన్నీ నిజమే అని చెప్పడానికి వీలు లేదు.

ఉదా :

అరవ లేని దేశం కాకి లేని దేశం లేదు.
ఉల్లిపాయంత బలిజవుంటే ఊరంతా చెరుస్తాడు.
పాములలో మెలగవచ్చుగాని స్వాములలో మెలగలేము.
అరవ చాకిరి.

నైతిక లక్షణాలు :

సామెతలలో ఎంతసేపూ మంచిగానే ఉండాలని చెప్పబడుతుందిగాని, క్రూరంగా ఉండాలనీ, ఖూనీ పనులు చెయ్యవచ్చునీ చెప్పబడదు. మనలను నిరుత్సాహ పరిచే సామెతలు కూడ ఉండవు.

ఉదా :

దుష్టుడికి దూరంగా వుండాలి.
నీతికాని మాట రాతి వేటు.
నీతి లేనివాడు కోతికన్న హీనం.

అశ్లీలపు సామెతలు :

అశ్లీలపు సామెతలు చాల ఉన్నాయి. కాని ఇవి పుస్తకాలలోకి ఎక్కవు. సభలో ఉచ్చరించబడవు. ఒకొక్కప్పుడు వీటిలోని అశ్లీలపదాలు తీసివేయబడి మంచిమాటలు వేసి సంస్కరింపబడి, సభలో ప్రయోగించబడతాయి. ఈ కింది సామెతలు అటువంటివే.

ఉదా :

బొజ్జనమ్మ నీటిలో దిగినట్టు.
కాని కాలానికి కర్ర పాముపు గుంది.
ఇంటికొక పువ్వం ఈశ్వరుడికొక మాల.

పదబంధపు సామెతలు, శుకోక్తి సామెతలు, ఉపమానపు సామెతలు

పదబంధపు సామెతలు :

ఈ సామెతలు పదబంధాలు (*Phrases*). కాబట్టి వాక్యాలలో అనేక మోస్తరుగా చేరతాయి. వీటినన్నిటినీ పరిశీలించి ఏయే వృత్తులలోంచి ఏయే సామెతలు వచ్చాయో, వీలయితే, ఎప్పుడు జన్మించాయో మొదలైన సంగతులు తెలుసుకోవలసుంది.

ప్రత్యేకంగా పదబంధపు సామెతలంటూ మన భాషలో లేవనే చెప్పవచ్చు. ఎందుచేతంటే ఈ సామెతలు ప్రత్యేకంగా చెప్పబడక ఏదో ఒక వాక్యంలో కలిపి చెప్పబడతాయి ; కాని అవి ఇక్కడ వేరుగా పదబంధాలుగానే రాస్తున్నాను.

ఉదా :

గుడ్డి గుర్రానికి పళ్లతోమడం.
తడిగుడ్డలతో గొంతుక కోయడం
పట్టపగలు చుక్కలు పొడవడం

పాలుతాగిన రొమ్మున గుద్దడం
కళ్లల్లో దుమ్ము కొట్టడం

శుకోక్తి సామెతలు :

'కూర్చుని లేవలేదు గాని వంగుండి తీర్థ మేళతా' నన్నాడు; 'కూకుసుడ్డ అడగకపోతే బిడ్డను సాకినట్టు సాకుతా' నన్నాడు; ఈరకమైన సామెతలకు శుకోక్తి సామెతలని పేరు. అంటే ఏ ఒకడో, ఒకర్తో అన్నాడు, అంది అనే సామెతలకు శుకోక్తి సామెతలని పేరు. ఈరకమైన సామెతలలో మొట్టమొదట ఫలానావాడో, ఫలానాదో అన్నాడు, అంది అని ఉండేది. కాని క్రమేపీ ఆ పేరు జ్ఞాపకం పెట్టుకునే శ్రద్ధలేక, అన్నాడు అంది అన్నదానితోటే వాక్యం పూర్తి అవడం వల్లా, ఈ సామెతలు సాధారణంగా అన్నాడు, అంది అన్న మాటలతోటే పూర్తిఅవుతూంటాయి. వీటిలోకూడా తులనాత్మక పరిశోధన అవసరం. వీటిలో మొట్ట మొదటివి సాధారణంగా జంతువులు చెప్పినట్టుగా ఉంటాయనీ, ఆటుతర్వాత మనుష్యులు చెప్పినవి ఏర్పడ్డాయనీ ఒక శాస్త్రజ్ఞుని అభిప్రాయం. చిన్నకథలు సంగ్రహంగా ఈ సామెతలలో చెప్పబడ్డాయని మన మనుకోరాదు. ఈ శుకోక్తి సామెతలకు పోలిక సామెతలు సామాన్యంగా ఉండవు. ఒకొక్కప్పుడు మునుపున్న సామెతలే శుకోక్తి సామెతలుగా మారడం కూడా ఉంది. శుకోక్తి సామెతలు సాధారణంగా చాలకాలం నిలిచి ఉండవు. ఎందుచేతంటే, ఆ సామెతలకు సంబంధించిన అంశాలన్నీ జ్ఞాపకముంటేనేగాని అవి అట్టే సరదాగా ఉండవు.

ఉదా :

'అయ్యో పోతున్నావా' అని పచ్చాకు పండాకును చూసిఅంది.

'అరుంధతి కనబడదు, అధ్వాన్నం కపపడదు, అరవై వరహాల అప్పుమాత్రం కనబడుతూంది' అన్నాడు.

'జీతమూ భత్యమూ లేకుండా తోడేలు మేకలను కాస్తా'నన్నట్టు.

'మూడుజన్మాల సంగతి చెప్పగలను. పూర్వజన్మాన ఇచ్చిపెట్టుకోలేదు. కనుక ఈ జన్మాన దేవుడు నాకు ఇయ్యలేదు. ఈ జన్మాన వకరికి యియ్యలేదు కనుక ముందుజన్మానకు నాకుఏమీ లేదు' అన్నాడుట.

ఉపమానపు సామెతలు :

'నీళ్లు నీలం ముక్కల లాగున్నాయి', 'పాలలా తెల్లగా ఉంది', 'తల ముగ్గు బుట్టలాగుంది' మొదలైనవి ఉపమానపు సామెతలు. ఈ సామెతలలో ఒకొక్కప్పుడు గుణాలుకూడా కొన్ని వస్తువులతో పోల్చ బడతాయి. ఇవి అనేకం కవిత్వంలో వాడబడి ఉంటాయి. వీటి చరిత్రకూడా తెలిసికోవలసిందే. వీనిలోకూడ తులనాత్మక పరీక్ష అవసరం.

ఉదా :

గంగా బొండాలలాంటి నీళ్లు.
వడగళ్లలాంటి నీళ్లు.
చింత పువ్వులాంటి బియ్యం.
పిల్లలు గారకాయల లాగున్నారు.
గానుగరోలు లాంటి నడుము.
నల్లగా బొంతకాకిలాగు.

తెలుగు సామెతల పుస్తకాలు

తెలుగులో అనేక సామెతల పుస్తకాలున్నాయి. అంతేకాదు కొన్ని పత్రికలు సరదాకోసం సామెతలను సేకరించి ప్రకటిస్తూ వచ్చేయి. ఆ విశేషాలు ఇక్కడ తెలియజేస్తాను.

1868 లో కాప్టన్ కార్ ఆంధ్ర లోకోక్తి చంద్రికను అచ్చువేసినట్టుగా ఇది వరకే తెలియజేసేను. అదేపుస్తకాన్ని, అదే పేరున నందిరాజు చలపతిరావుగారు 1906 లో ప్రకటించేరు. కార్ పుస్తకంలో 2700 సామెతలున్నాయి. నందిరాజు వారు కార్ పుస్తకాన్నే తిరిగి ప్రకటించినా కార్ మాట ఎత్తలేదు. అంతేకాదు: కార్ చేసిన కొన్ని లోపాలే దీనిలోకూడ కనబడుతున్నాయి. పరిశోధనలకు పనికివచ్చే అనేక అంశాలు కార్ పుస్తకంలో ఉన్నాయి. అట్టివి నందిరాజువారి పుస్తకంలో లేవు. కార్ 485 సంస్కృతలోకోక్తులను ప్రకటించేడు. వాటికి మరి మూడు చేర్చి నందిరాజు వారు సంస్కృత లోకోక్తి చంద్రిక అను పేరున 1906 ప్రకటించేరు. కాప్టెన్ కార్. వేసిన మొదటి సంపుటలో 1185 సామెతలు మాత్రమే ఉన్నాయి. వీటినే వావిళ్లవారు తెనుగు సామెతలు

అను పేరున 1922 లో అచ్చువేసేరు. వ్యవసాయపు సామెతలు అను పుస్తకాన్ని గవర్నమెంటువారు అచ్చువేసేరు.

కాశీనాథుని నాగేశ్వరరావుగారు ప్రకటించిన ఆంధ్రవాఙ్మయ సూచికలో ఉన్న సామెతల పుస్తకాల పేర్లు ఈ కింద తెలియజేస్తాను.

పుట సంఖ్య	పుస్తకం పేరు	కర్త పేరు
23	లోకోక్తిముక్తావళి	యస్. సోమసుందర కవి
24	హైదరాబాదు తెలుగు సామెతలు (ముద్రిత గ్రంథ పట్టిక)	
15	ఆంధ్రలోకోక్తి చంద్రిక	కార్
"	"	నందిరాజు చలపతిరావు
"	ఆంధ్రలోకోక్తి పంచాశత్తు	పణుతుల నృసింహ శాస్త్రి
"	ఆంధ్రలోకోక్తి ముక్తావళి	
83	తెలుగు సామెతలు	
"	"	
97	నానాదేశపు సామెతలు	
204	సంస్కృత లోకోక్తి చంద్రిక	
223	సామెతలు	

నాళం కృష్ణారావుగారు 7000 సామెతల వరకును, నేను 4000 వరకును ఇదివరలో చేర్చేను. జయంతి భావనారాయణకవి: లోకోక్తి ప్రకాశికను అచ్చువేసేరు.

పత్రికలలో కొన్ని సామెతలు అచ్చయేయి. వినోదినీ పత్రికలో చమత్కారమైన సామెతలు (2 సం. 9 సంచిక) అనీ, మనోరమ పత్రికలో కొన్ని పడ్డాయి. అముద్రిత గ్రంథ చింతామణి, మార్చి 1902 లో కొన్ని, అదేపత్రికలో 1896 లో కాళహస్తీశ్వర మహాత్మ్యంలోని లోకోక్తులు పడ్డాయి. కోట సూర్యనారాయణగారు ఉపాధ్యాయోపయోగిని పత్రికాధిపతి. ఈ పత్రికలో సెప్టెంబరు 1896 వరకు కొన్ని సామెతలు అచ్చయేయి. తెలుగు జనానా పత్రికలో కొన్ని సామెతలు అచ్చయేయి. టి. ఎ. స్వామినాథ అయ్యరు సంపాదకుడుగా అచ్చువేసిన సత్యసాధని పత్రికలో చిత్ర రామస్వామి నాయుడు నానా దేశపు సామెతలను ప్రకటించేరు.

మనకు లభిస్తున్న పుస్తకాలలో మొదటిది కాప్టెన్ కార్ 1868 లో ప్రకటించిన ఆంధ్రలోకోక్తి చంద్రిక. ఇతడు దీనికి ఆంగ్లంలో ఒక ఉపోద్ఘాతాన్ని కూడా వ్రాసేడు.

చట్టము : సమస్య

శ్రీ కవికొండల వేంకటరావు

పాత్రలు

సంక్రందనశర్మ — రామామణి

సుగుణాలవాలుడు — విరజాజిమనోజ్ఞ

సంభ్రమ సింగ్ — భవాని

సాధూ సహదేవ్

భూపాలతేజ్

మొదటి రంగము

** సంక్రందనశర్మగారి యిల్లు; సమయము సాయంకాలము

సం. శ: చట్టంలో ఎన్నడూ ఏ సమస్యా పరిష్కారం కాలేదు.

సాధూ: సాంప్రదాయం కూడా ఎన్నడూ ఏ సమస్యనూ పరిష్కారం చేసింది లేదు.

సంభ్ర: శాస్త్రం అంతకంటే చేసింది లేదు.

భూపా: ఏవిధంగా చూసినా వ్యక్తియే ఏ సమస్యనూ పరిష్కరించేవాడుగా తోస్తాడు.

రామా: ఇక్కడ ఒక స్త్రీకూడా ఉందని తెలుసుకోండి! అందరూ మగవాళ్లే కారు. ఈమె అభిప్రాయానిక్కూడా కొంచెం ప్రాముఖ్యత ఇవ్వండి; పాతసమస్య వొకటి వొదిలిపోతూ వుంటే కొత్తసమస్య వొకటి బయలుదేరుతూనే వుంటుంది, ఎన్ని చట్టాలొచ్చినా, ఎన్ని శాస్త్రాలు మారినా, ఎంత సంప్రదాయవిరుద్ధంగా సంచరించినా. మరేక వ్యక్తి అన్నారో, "అతగాడే" అవనివ్వండి, "ఆమె" అవనివ్వండి, ఈ భూమ్మీద తల్లక్రిందులుగా నడవరుగదా కాళ్లు పైకిపెట్టి? అందరూ రెండు బుజాలమీద తమ తలకాయలు మోసేవారేగా! వారి సమస్యే మన సమస్య. వారి బుఱ్ఱల్లో అనుక్షణమూ క్రొంగ్రొత్త సమస్యే! ఏ సమస్య కాసమస్యే వ్యక్తిగతంగా మహా గడ్డుసమస్య అయిపోయి, పెనుభూతంలా కనిపిస్తూ వుంటుంది. అదే మంచులా కరిగిపోయి, ప్రపంచంతో పాటు తానైనప్పుడు, మళ్లో పంచను మళ్లో క్రొత్త సమస్య పుట్టుకొస్తూవుంటుంది. ఇలాగ్గా సమస్యా ప్రపంచం ఇదంతా!

సాధూ: బాగా అన్నారు తల్లిగారూ! తమరు. ఇది అంతా సమస్యా ప్రపంచం.

సంభ్ర: పూర్వం వేదాంతులిదంతా మాయా ప్రపంచం అని అన్నట్టే, ఇప్పుడు మీరంతా దీన్ని సమస్యా ప్రపంచం అనండి!

భూపా: ఈవేళ అంటే అన్నారుగాని మరెప్పుడూ ఇంక అనబోకండి! నేను వ్యక్తికున్న బాధ్యత, వానిమీద నున్న బరువు, మరే దేనిమీదా లేదు. వ్యక్తిగత ప్రపంచమేగాని సమస్యా ప్రపంచం కానేరదు.

రామా: అందుకే అంత పిలగా తయారవుతూవున్నారు నేటి ఆడపిల్లలు!

సం. శే: మగపిల్లలు మాత్రం అంకన్న లావుగా ఏడి శారా ఏమిటి?

సంభ్రమ: అసలు శరీరవ్యాయామమే లేదు నేటి పాఠశాలల్లో!

సాధూ: ఉండవలసినంత మనోపరిశ్రమ మాత్ర ముందని అనుకొంటున్నారా ఏమిటి?

భూపా: మీ రందరూ ఐ. ఎ. ఎస్. ఎఫ్. ఆర్. సి. ఎస్.,లు 'ప్యా'సయి వేలకు వేలుగా నెల జీతా లుచ్చుకుంటూ, ఇప్పుడేమైనా అన గలరు.

సాధూ: మే మేమైనా ఒకర్ని మాలా కృతార్థులు కావద్దన్నామా?

సం. శే: ఒకరంటే ఒకరు కృతార్థులై, కావద్దంటే మరొకరు కాకపోతారా? అసలు ఆ తెలివి ఆ బుర్రల్లో వుండాలి.

సంభ్ర: అలాగే వొంటిలో కండకూడా జన్మతః రావాలి.

రామా: అవునులే చెట్టునపుట్టిన కాయలన్నీ ఒకలా గుంటాయా?—మా సుగుణాలవాలుణ్ణి చూడు.

[ప్రవేశము సుగుణాలవాలుడు, విరజాజి మనోజ్ఞ]

విరజాజి: అస్తమానం మా అత్తగారికిదేపని, "మావాణ్ణి చూడండి! మావాణ్ణి చూడండి" అనడం.

రామా: ఏం కోడలా? అలా అంటున్నావు? మావాణ్ణి పిల్లాడివా ఏమిటి?

విరజా: అదే, అమాటే అనవద్దంటాను. ఎప్పుడూ అమాటే అంటారు. మీ రత్త పూర్వాచార పరాయణులు.

రామా: అవునులే! ఈ కాలంవాళ్లకు ముహూర్త మప్పుడు కాని మెలుకువ లోచదు.

సుగు: అమ్మా! మగడూ పెళ్లాం కావడానికి ముహూర్తమంటూ రావాలా ఏమిటే?

సం. శే: ముహూర్తం కాకపోతే, మా మిత్రా! ఒకానొక స్త్రీని, ఒకానొక పురుషుణ్ణి దంపతులుగా చేసేది?

సాధూ: మనీన్నీ ఆశీర్వదించేవారు కూడా ఎప్పు డబ్బీ ఆశీర్వదించేది ముహూర్తమప్పుడు కాకపోతే?

సుగు: హృదయాల కలిమిడిలోనే వుంది సుము హూర్త మన్నది!

విరజా: మ అనీన్నీ మాటల కలిమిడిలోనే వుంది ఆశీ ర్వాద మన్నది!

సంభ్ర: అయితే "పాణిచరామి" అన్న వేదవాక్కు?

సం. శే: "జానకాయాః కమలామలాంజలి పుటే" అన్న మంగళాష్టకం?

రామా: ఇవన్నీ ఉక్క ప్రియాలూ కావ్యశాస్త్రాలూ అనేనా మీ వూహ?

[ఆ మాటలు వినిపించుకోకుండా సుగు ణాలవాలుడు విరజాజి మనోజ్ఞ వెళ్ళి పోతారు.]

భూపా: మీ రనుకొనేమాటలు వాళ్ళకు వినిపించనే లేదు. అప్పుడే ఆమడదూరం వెళ్ళిపోయి నారు.

సాధూ: ఇలాగే మా అమ్మాయి ఒకమ్మాయి ఎదిగి "శారదా ఆక్టు"కు సరిపడే వయస్సుకు మల్లో అంత వయస్సుదైయుంది. పి. హెచ్. డి. ప్యాసయింది. ఎంతమందినో మగవాళ్ళను చూపించి అందులో ఏ కొక్కర్నో ఒక్కర్ని భాగస్వామిగా గొనవమ్మ అంటాను. అంటే "ఆత్మప్రేమ" కుదరా లని అంటుంది. ఈ "జాతిక ప్రేమ" పనికి రాదని ఆమె పట్టుదల.

భూపాల: దాన్నే మరోలా చెప్పవచ్చు. ఆమె కోరేది "మోహం" కాదు, "ముద్దు" కాదు, గుండెల సామరస్యం వుండాలి అని. కాదం టారా?

సం. శే: నాకూ రామామణికి ఇన్నాళ్లూ గుండెల సామరస్యం లేకుండానే, ఈ సంసారం ఇలా సాగింది అంటారా? భూపాలశేఖ గారూ?

రామా: అమాటకొస్తే మా యిరువురకూ వున్నంత గుండె సామరస్యం మాలో [illegible] లేదు. మళ్ళీ మావారు ఐ. సి. ఎస్., రిటైర్డు; నేను అయిదో కళాసువరకు మాత్రమే చది విన దాన్ని.

సం. శే: అదిలే వొకటివుంది. మాకు చాలా చిన్నప్పుడే పెళ్ళి అయింది.

రామా: మా పెద్దబ్బాయి నా పదునాలుగో ఏటే పుట్టాడు.

సం. శే: నేను తరువాత ఇంగ్లండుకువెళ్ళి, ఐ. సీ. ఎస్, పాస్సయ్యాను.

భూపా: అనగా మీ యిరువురిలోను కాగిన పాలు అప్పటికప్పుడే బాగా చల్లారిపోయినాయి అన్నమాట.

సం. శే: ఏం పాలో? ఏం కాగి చల్లారడమో? మొన్నటిదాకా కంటూనేవుంది, ఇది ఒక ఆడపిల్లనో ఒక మగపిల్లవాడినో.

రామా: మఱింతమందిని కనిపెంచినా, నాకు కానుపంటే అసహ్యం పుట్టలే! ఆ విషయమై సలహా లిమ్మంటే ఇప్పటికీ ముందకును వాడే. దాన్నిగూర్చి ఏలాంటి సందేహాలు వచ్చినా మావారు నన్నే అడిగి తెలుసుకుంటారు. మఱెది ఎవరైనా గుండెల సామరస్యం కాదనగలరా?

భూపా: కాదనలేం గాని, మా గుండెల్లో ప్రవహించేది మీ గుండెల్లో ప్రవహించే నెత్తురుకాదని నా తాత్పర్యం. మీకు పెళ్లి అయిన రోజుల్లో, అమెరికా కొలంబసు కనిపెట్టి వున్నాడన్న సంగతి, ఈ భరతఖండములో తెలియకపోవచ్చు. మఱిప్పుడో? విజ్ఞానం ఎంతవఱకూ పెచ్చు పెఱిగి వుందంటే, ఒక్క ఉదాఃసు మీద చంద్రబింబం, ఒక్క లగాంమీద అంగారక గ్రహం చూఅగొనేటట్టుంది. ప్రస్తుతం గుండెల సామరస్యం కావాలని అనుకొంటూ వున్నది, అక్కడి ప్రజకు ఇక్కడి ప్రజకు అని బోధపఱచుకోండి.

రామా: అంత అలా చెట్టాపట్టా లేసుకున్నట్టు తిరుగుతాలే మా సుగుణాలవాలుడూ విరజాజి మనోజ్ఞా, వా రిద్దఱేపీ లలాయి పాత్తులే అంటావా, భూపాలతేజ్!

సం. శే: ఆతణ్ణి అడిగితే అతడేం సమాధానం చెబుతాడే ఒకళ్లి ప్రేమనుసరించి? ఆ మనవాణ్ణే కనుక్కో!

రామా: కనుక్కున్నాను! కనుక్కుంటూనే వున్నాను. కాని కనపడడం లేదండీ ఈ కంటికేమీని!

సాధూ: కనబడ్డంలేదూ అంటే తల్లిగారూ! మీకు సరియైన సమాలోచన ఆ యిరువుర్నీ గురించి లేదన్నమాట. కొందఱు ఆడగాను, కొందఱు మగగాను, ఈ లోకంలో కనిపించినప్పటికీ, కావచ్చు, కాకపోవచ్చు, మన మనుకునే లాంటివాళ్లు. కొంద ఱిట్టే పట్టుబడవచ్చు.

భూపా: వారన్నమాట నిజమే, కాని, పురుషుడి పని తీసేసి రికాబులతో గ్రుచ్చబడే గుఱ్ఱంలా అయిపోయింది, అట్టలమధ్య పొదుగబడ్డ ఆధునిక చట్టాల మూలకంగా.—చూడండీ —'విడోమారియేజ్ చట్టం' అని, 'శారదా ఆక్టు' అని, సివిల్ మారియేజ్ 'చట్టం' అని, 'హిందూ మారియేజ్ డిస్ ఎబిలిటీస్ రిమూవల్ ఆక్టు' అని, 'బహు భార్యాత్వము మఱెన్నీ విడాకుల చట్టం' అని,—ఇలా ఇలా ఎన్నెన్నో చట్టాలువచ్చి "పురుషుడో తుమ్మెదో" అన్న సామెతను వెనక్కి నెట్టేశాయి. ఇప్పుడు భార్యతోపాటు మఱో బాగా ఆస్తివున్న వితంతువు కూడా వంటకు పంటకు ఉండేది కానరాదు. ప్రతీవితంతువు పునః పెళ్లాడేగే కానవస్తుంది. పోనీ పెళ్లాడుదామా అంటే బహు భార్యాత్వము, శారదాఆక్టు వచ్చాక పెళ్లిళ్లన్నీ, ఎఱిగినవాళ్లమధ్య ఎదిగినవాళ్ల మధ్య అవడం మూలంగా, విడాకులకు తగు కారణాలు కనబడవాయిరి. పోనీ విడాకులు ఇచ్చివేసి, స్వేచ్ఛగా ఉందామా అంటే అప్పటికప్పుడే అన్నీ వుడిగి అయ్యవార్లంగారిలా వుంటారు పంతులుగారు. ఇలా దేనికదే అనుకూలం, దేనికదే ప్రతికూలమై, యీ చట్టాలు నేటి మగవాణ్ణి ఆడదాన్ని కూడా చతికిలబడేటట్టు చేస్తూవున్నాయి. ప్రతిదీ వ్యక్తిగతమై జాతిని హతమారుస్తూ వుంది. ఏమైనా అంటే—నా యిష్టం! కష్టపడతావోయి అన్నా తనిష్టమేనట! ఒకత

నన్నాడు "కార్మికుడు కష్టపడ్డంలే? కర్షకుడు కష్టపడ్డంలే?" అని. అదీ అతని వాదం. అతిగా ప్రతిఘటిస్తే కన్నీరు గారుస్తూ తన ప్రేయసిని తలపోసి నిట్టూర్పు వదుల్తాడు. ఇదంతా నేను స్వయంగా నేడు చూచే వ్యాపారం. ఇందులో ఎంతమాత్రం అతిశయోక్తిలేదు. ఇంతకాలం మీరంతా నా యీ యుపన్యాసంలాంటి ఉద్ఘోష తలూపుతూ విన్నారు. నిండా సంతోషం! సెలవు!

[నిష్క్రమించును]

సాధూ: అతని ఉపన్యాసంవల్లను, మనలను మన జాతిని కల్లోలపెడుతూవున్న సాంఘిక సమస్యలు ఏమీ తెగలేదు. అతని వాదం ఎంతసేపూ జగత్తంతా వ్యక్తిగతం అన్నట్టు అగుపిస్తుంది.

సంభ్రమ: అగుపించడమేమిటి? అవును కూడాను. పూర్వం మన సంఘములో వెలి అని, ఆంక్ష అని ఇన్ని వుండేవి. ఇప్పుడేవి చెప్పండి! ఇద్దలొక అంతర్వర్ణో, అంతఃఖండో, వివాహంచేసుకు తేనీటికి పిలిస్తే మనమంతా పరుగెడుతున్నామా లేదా?

రామా: అదింకా మెఱుగే! పదిమాట్లు పది విధాలుగా, దశవిధ దోహదాలు పొందిందా అన్నట్టు, అగపడ్డ స్త్రీ, ఒక్కమాటు ఒక్కర్ని పెళ్లిఅయి కుంకుం బొట్టు పెట్టుకోవడంలోటే, మా ఆడవాళ్ళందరూ ఆమెను పేరంటానికి పిలుస్తూవున్నారు. "మీరు" అని గౌరవిస్తూవున్నారు!

సం. శే: సరి నీకంతే తెలుసును కాబోలు; అసలు కొందఱు స్త్రీలు మగవాళ్ళనుకూడా పేరంటానికి పిలుస్తున్నారు.

సంభ్రమ: బహుశా దానిపేరు పేరంటం కాదనుకుంటాను. 'సోషల్ ఎక్స్కర్షన్' అని అనుకుంటాను.

సాధూ: ఇంతకూ నే వచ్చిన కార్యం గురించి మీరాలోచించనేలేదు.

సం. శే: ఆలోచించడాని కేముంది? చూడనే చూచారు మీరు మా అబ్బాయిని, మా అబ్బాయి ప్రేమించే పిల్లనూ.

రామా: అయినా సహదేవన్నయ్యగారూ! ఇంకా నిదానించాలి మేము. ప్రేమ అన్నది అనేకమోస్తర్లది కావచ్చు. ప్రతీది భార్యాభర్తల ప్రేమే కాబోదు.

సంభ్రమ: అవునమ్మా తల్లీ తవరన్నట్టు ప్రేమ పలుతరహాలు. సోదర సోదరీలమధ్య నుండే ప్రేమనుండి రాధాకృష్ణుల ప్రేమదాకా ప్రేమ అనే నిర్వచింపబడుతూవుంది.

సాధూ: నేడూ—ఇంగ్లీషుభాష వచ్చి "లవ్" అన్న పదం మన కళ్ళకు గంతలుకట్టేశాక!

సం. శే: పూర్వం?

సాధూ: పూర్వం వేఱువేఱు పదాలు వాడేవారు.— పాతివ్రత్యము అని, భక్తి అని, సేవ అని, వలపు అని, మోహం అని, తలపు అని—

రామా: ఊరికే అని, ఉత్తిత్తి అని—ఎఱుగనట్టుంటారేం? ఆయన అన్ని సికరువుపెడుతూవుంటే?

సం. శే: ఆయన మాట్లాడేది 'సీరియస్ టాపిక్' అని నేను మౌనం దాల్చాను.

సంభ్ర: ఆమెకూడా దాన్ని ఏమాత్రం "లైట్"గా తీసుకు మాట్లాడ్డంలేదు.

రామా: నాకామాత్రం చోటువుంటే ఈ వాదం ఇంకా పొడిగించగలను. ప్రేమ అన్నది సర్వమానవ సౌభ్రాతృత్వమునుండి సాంఘిక సేవ వఱకూ 'రేంజి' అవుతూనేవుండేది పూర్వమున్నూ — బౌద్ధమత సన్యాసులు ఎలా చిత్రించారంటారు అజంతా బొమ్మలు? —కేవలం సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని అనుసరించే. అవకోజనులు చూపినప్పుడు నిశ్చలభావం పూనడంవల్లనే.

సాధూ: రామామణిగారూ! మా అందఱికంటే మీరే తెలివైనవారూ తెలిసినవారూను. అందుచేతనే ఆమాట చెప్పగలిగారు.

సం. శే: నిజంగా మనరొక్క, ఫుటఫుట త్రిప్పి చూచే జ్ఞానంకన్న,.. చినిక్కిడిమీద సంపాదించిన ఈ అమాయకురాలి విజ్ఞానమే మిన్న.

రామా: అవితే, సంభ్రమసింగుగారూ! తెలియ కడుగుతాను—మనోహర్రావు ఆ అమ్మాయినికూడా వివాహం చేసుకున్నాడా?

సంభ్ర: బహు భార్యాత్వము పనికిరాదని చట్టం చాటుతూ వున్నప్పుడు, పిల్లమీద పిల్లనెలా చేసుకుంటాడు?

సం. శే: అటువంటప్పుడు మొదటి భార్య విడాకులు కోరవచ్చుగా.

రామా: ఆమే, ఈ యువకుడే కావాలంటూంది కామోసు!

సాధూ: మఱి మీరు వేఱే ప్రసంగంలో పడుతూ వున్నారు!

సం. శే: ప్రసంగానికేముంది? లోకాభిరామాయణం. —మీకు తొందరపని వుంటే వెళ్లవచ్చు. మేమింకా ఈలాగే మఱో పది నిమిషాలు మాట్లాడి చెట్టుమీద పక్షుల్లా కసుకోతాం!

సాధూ: సంభ్రమసింగుగారూనా?

సంభ్రమ: నేనూ మీ వెనకాలే రాగలను. పదుస్తూ వుండండి. నేను చెట్టుమీద పక్షిని కాదు. చెట్టులేని పక్షిని.

సాధూ: సెలవు! మీ అందరినుండీ!

[సాధూసహదేవ్ నిష్క్రమించును]

రామా: బాగా అన్నారు సింగుగారూ!—అయితే ఈ యువ యువతీగణం ఈ పద్ధతి అవలంబించి చట్టాన్ని ఓడిస్తూవున్నారన్నమాట?

సంభ్రమ: చట్టాలెన్ని వున్నా, వ్యక్తి వ్యక్తేనని తోల్తనే వచించలే?

సం. శే: అందుకే పుట్టైను బుట్టిన బుద్ధి పుడకలతో గాని పోదన్నాడు! ఊరికే అన్నాడా?

సంభ్రమ: ఊరికే అనలేదనుకోండి! అలాంటి సామెత ఊరికే ఒకానొక భాషలో పుట్టదనుకోండి! అయినా గానీ ఇవన్నీ మహా సమస్యలు. గుండెకాయలయొక్క పరస్పర సామరస్యాలు వైమనస్యాలున్ను — వాళ్లిద్దఱూ ఆ వెళ్ళడం వెళ్ళడం సినీమాకు వెళ్లారనుకుంటాను.

రామా: మా సుగుణాలవాలుడూ విరజాజిమనోజ్ఞేనా? ఏమీ వాళ్ళు ఇలా తిరుగవస్తారేమో అని మీ రాశిస్తూవున్నారా?

సంభ్రమ: లేదండీ! నాలో ఏ ఆశా లేదండీ! ఊరికేనే అడిగాను. సెలవు. [నిష్క్రమించును]

సం. శే: ఈ ఊరికే అడగడమనేదే మన హైందవ జాతియొక్క కొంప తీసేస్తూవుంది.

రామా: అసలీ జాతికి కొంపంటూ వొకటుంటేగా?

సం. శే: లేకేం? మనం చూడు ఒక యిల్లు కట్టి చక్కగా కాపురమున్నాము!

రామా: కొంప అన్నా ఇల్లు అన్నా నేనిలాంటి కట్టడాన్ని గురించి మాటాడ్డంలే.—ఇలాంటి కట్టడాలే లేకపోతే ఇన్ని నగరాలు, ఇన్ని పల్లెటూళ్ళు వెలిసేనా?

సం. శే: మఱెలాంటివి కావాలనేవు?

రామా: ఎలాంటి ఇబ్బా మఱక్కఅలేదు. ఈవేళకు ఇది చాలు. అవలింత వస్తూవుంది.

సం. శే: అవలింత కావలింత అన్నట్టు నాకూ వస్తూ వుందేవ్!

రామా: అదే కామోసు, ఇందాకట్నుంచీ అతగాడు వాక్రుచ్చిన గుండెల సామరస్యము!

సం. శే: అత నన్నది జాగ్రదవస్థలో గుండెల సామరస్యము.

రామా: మనది?

సం. శే: మనది సుషుప్త్యవస్థలో ఉండేది.

రామా: అంతమాత్రమే అనేరా ఆ పైది కూడా అనేరా?

సం. శే: ఏమో ఎవడు చూచాడూ? ఏదాకా పొడిగించినా పొడిగించవచ్చు ఈ వేదాంతం. ఎంతలో కుదించినా కుదించవచ్చు దాన్నే!

రామా: ఐ. సి. ఎస్. ప్యాసయి రిటైరైన మీకేం చేతగాదు?

సం. శే: అదిగో! మళ్లీ మానవకృత కృత్రిమాలకు విలువ ఇస్తున్నావు! అదే కూడదన్నాను. నీవు నేను సమానం అని ఎన్నిసార్లుచెప్పను?

రామా: మీకేమంటే అంతే! మఱి పదుండండి! నాదం పెంచను.

రెండవ రంగము

*** * సంక్రందన శర్మగారి యింటి పెరడు: సమయము, రాత్రి.**

సుగుణా: "ఆల్ మెన్ ఆర్ మోరల్" అన్నట్టు, మనుష్యులందరూ పెళ్ళాడ్డానికి పిల్లలను కనడానికి పుట్టినట్టు భావిస్తుంది! ఈలోకం!

విరజాజి: అందుకే నాకీ లోకం అంటే పరమాసహ్యం.

సుగుణా: లోకం అంటే నాకూ పరమాసహ్యమే కాని, లోకంలో నిన్ను చూచినప్పుడు శోకాలన్నీ మఱచిపోతాను.

విరజాజి: నాకూ నిన్ను చూచినప్పుడాలాగే అనిపిస్తుంది. ఏముందో నీ ముఖంలో?

సుగుణా: ఏముంటాయి? నీ ముఖంలో ఏమున్నాయో నా ముఖంలోనూ అవే ఉన్నాయి.

విరజాజి: ఇద్దఱి ముఖాలు మనుష్యముఖాలు అని నా విశ్వాసము.

సుగుణా: అంతేకాదు. ఇద్దఱి గుండెలూ కూడా మనుష్యత్వంగల గుండెలని కూడాను! చూడు! కొందఱి కొందఱి గుండెకాయలు పశుత్వభూయిష్ఠమై యుంటాయి. అవి చూసినప్పుడల్లా నాకు వెగటు!

విరజాజి: అలాగే! స్నేహానికి మొదటి కారణం గుండెకాయలయొక్క అన్యోన్య సామరస్యమనే నా అభిప్రాయమూను.

సుగుణా: అందుకనే మన యిద్దర్నీ ఒకచోటికి చేర్చాడు భగవంతుడు.

విరజాజి: అవి లే నీకు భగవంతునిలో నమ్మకముంది?

సుగుణా: లేదని ఎప్పుడైనా నీతో చెప్పానా?

విరజాజి: స్పష్టంగా విడమర్చి ఎన్నడూ చెప్పలేదు కాని,—అంతా ప్రణయం, ప్రజ్ఞ అనే అంటావులే! అందుకని అడిగాను.

సుగుణా: మళ్ళీ ప్రణయమనీ ప్రజ్ఞ అనీ నాకు జ్ఞాపకం చేసి, అదో గాథలోకి, అదో శోధనలోకి దింపేస్తున్నావు.

విరజాజి: దింపేదాన్ని నేనే అయితేనా?

సుగుణా: నీవు దింపకపోతే, నేను యదృచ్ఛ దిగుతూ వున్నాననా?

విరజాజి: తిరుగ వితండవాదం ఎందుకు నీకూ నాకూ?—ఇలా ఈ పచ్చికమీద కూర్చుని ఈ పొద్దు గడపడమే, నా మహదాశయం!

సుగుణా: నా మహదాశయం అంతేకాని—యిరువురు కూర్చుని మౌనంగా ఏలాగు కాలం వెళ్ళబుచ్చగలరు?

విరజాజి: మౌనంగా కాకపోతే పద్యం చదువు! ఒక పాట విసురు!

సుగుణా: అదే, అడుగుతావో లేదో అని ఈదాకా వేచి కాచి ఘడియ ఘడియ నిరీక్షిస్తూ వున్నాను. ఇటువంటి సామరస్యం పేరే గుండెల సామరస్యం. ఇదే మనోవికాసాలయొక్క అన్యోన్యాలింగనం. దీని పేరే జాబు-జవాబు. ఇది సర్వసామాన్య జడులకు ఎల్లా రాగలదు? రాదు, తగిన చదువు, అందుకు తగిన సాహసము, దాటు, తరుణో పాయం అన్నీ వున్నప్పుడే అలాంటివి అన్నీ కుదిరి కూర్చోపెడతాయి ఒకచోట! లేనప్పుడు ఎదో ఏ బరాకులు వుంతనుపోయే మచ్చుగా వెళ్ళిపోగలదు వేళ!

విరజాజి: నేను పద్యం చదవమంటే ఇవన్నీ చదువుతా వెందుకు?

సుగుణా: నేను చదివితే నిజంగా నీకు వినాలనివుందా?

విరజాజి: లేకపోతే అడుగుతానా?

సుగుణా: "తరిరిలోం"...

విరజాజి: అదేమిటి?

సుగుణా: రాగాలాపము!

విరజాజి: పంచమంలోనా? (ఆవల కోకిల కూత) షడ్జమంలోనా? (అవల నెమలి కూత) ఆబోతు అంకెవేసిన క్రియా? (దూడ అరుస్తూ గెంతిన మువ్వలచప్పుడు.)

సుగుణా: అవేమీ కావు! అమరం బట్టీ పట్టినవత్! ఆంధ్రనామ సంగ్రహం వల్లించినలా!

విరజాజి: అదంతా అక్కర్లేదోయి! భావం క్లుప్తంగా కాపడేలా ఒక్కపదం పాడు!

సుగుణా: అదే తెలియకుండావుంది. ముందు నీవు ఒకటి పాడి చూపించు!

విరజాజి: నీవంటే నీవు!—ఇదే నీదగ్గరున్న గాడు! సరిగ్గా పురుషుడు పాడినట్టు పాడవోయి! చాలు నాకు!

సుగుణా: నీవు స్త్రీ పాడినట్టు పాడతావా నా తరువాత?—అదిగో చెయ్యి నొక్కావా? మరి విశ్వవిపంచే మోగదు.

విరజాజి: అబ్బో! పెద్దపేరెట్టావు నీ జంత్రానికి.

సుగుణా: పేరంటే జ్ఞాపకం వస్తూవుంది. నీకు విరజాజి మనోజ్ఞ అని ఎవరు పేరుంచారు?

విరజాజి: ఇలా వెఱ్ఱివెఱ్ఱి ప్రశ్నలువేసి తుదకు తుర్రో మందామనా భాయీ!

సుగుణా: లేదు సిస్టర్!

సౌందర్యం ఒక చైర్యం
అందులోనే మనస్థైర్యం
బాగోగులు, వరుస వావు
లందకపోవుట అంటే
అందులోనే కలదో చౌర్యం"

విరజాజి: భేష్ భేష్! కడమాట బాగా అన్నావోయ్ ఎక్కడచూచినా చౌర్యమేనోయి ఈ రోజుల్లో.

సుగుణా: విసుగులేదు ఈ దొంగతనానికి.

విరజాజి: ఆస్తినుండి ఆత్మదాకా చోరీపద్ధతిని గ్రహించడమే లోకానికిప్పుడు పరిపాటి అయింది.

సుగుణా: అందుకే ఆస్తి అంటూ ఆత్మ అంటూ ఉండకూడదని నా వాదన.

విరజాజి: ఆ రెండూ లేకుండా ఎలావుంటాయి?

పూవులు పడిపో
అలముకొన్న దొక అనిలకిశోరం వనమంతా:
అనిలకిశోరం
ప్రణయాంకురమై కనిపించినదా మనమంతా:

సుగుణా: ఏ మనసు?

విరజాజి: ఆ మనసే! మన మూహించుకోవాలి. కవి చెప్పిచేస్తే అందులో పసే లేదు.

సుగుణా: అన్యోన్యం ముద్దుగొన్న మనమనుకుంటాను.

[అని ఆమెను ముద్దిడఁబోవును]

విరజాజి: అలాంటి పనులే చేయవద్దంటాను నిన్ను.

సుగుణా: నీవు చదివినదాన్ని తన్మూలంగా వ్యాఖ్యానించాను. అంతే.

విరజాజి: మన హృదయాలంత తాదాత్మ్యంగా ఆ దద్దమ్మల హృదయా లుండగలవంటావా?

సుగుణా: ఏలా ఉండగలవు? వాళ్లిద్దఱూ ఎ. బి.సి. లు రాని పల్లెటూరి మూర్ఖులు.

విరజాజి: కాని వారిద్దఱకూ ప్రేమ కుదిరిందని అందఱి అభిప్రాయమూను.

సుగుణా: పెళ్ళి అయినంతమాత్రాన ప్రేమ కుదిరింది అని లోకం అనుకోవడం పెద్ద పొరబాటు.

విరజాజి: అందులోనూ ఒక పెళ్ళి కాదు ఆమెకు. అదివఱలో రెండు పెళ్ళిళ్లు అయినాయి. ఇది మూడవ పెళ్లి.

సుగుణా: ఎన్ని పెళ్లిళ్లు చేసుకున్నా చేసుకోవచ్చు వితంతువు. వీడు భార్య పోతే భార్యను చేసికోవచ్చు. ఇది చట్టం ఒప్పుకొంటూ వున్నది. లోకంలో వస్తూవుంది ఈ నడవడి. అయితే దాన్ని అంతమా ప్రేమ అని లోకం మురిసిపోవడం నేను ఆమోదించను.

విరజాజి: కాని వాళ్లే చదువుకొని, ఒకరొకరి నర్థంచేసికోగల పరిజ్ఞాన మలవరచుకొని పరిణయమైయుంటే?

సుగుణా: అప్పుడు ఆ యిరువురి మధ్య తాదాత్మ్యమి ముండగలదా అనా నీ ప్రశ్న?

విరజాజి: ఊఁ—ఏమిటి ఆలా అంతరాళంలోకి తొంగిచూస్తున్నావు?

సుగుణా: ఏమీ లేదు. పవిత్రమైన ప్రేమలతను, ఇలా లవిత్రం పుచ్చుకు, ముక్కలు ముక్కలుగా, తెగ్గోసి లోపలి లోతుపాతు తెలుసుకో గల్గుమా ఏనాటికైనా అని.

విరజాజి: అందుకే తొలిప్రేమనే ప్రేమ అన్నాడు ఒక కవి.

సుగుణా: తొలిప్రేమ అంటే ఏమిటి నీ భావం? తెలియని ప్రేమ అనా?

విరజాజి: ప్రేమ తెలియకుండా ఎలావుంటుంది? అసలు దాని స్వరూపమే కిరకిరలని నా వూహ.

సుగుణా: అక్కడేవుంది నీకూ నాకూ జగడము. నా ఊహలో ప్రేమ అన్నది ఆత్మలాగే మనకు తెలియకుండా ఈ బొందిలో ప్రవేశిస్తుంది. అది ఆద్యంతములు లేనిది అని, స్వరూప రహితమని.

విరజాజి: చాల్లే; మరి చదవక విజ్ఞానము, అసలు రూపం లేకుండా ప్రేమ అన్నది ఏలా పుట్టుకొస్తుందోయి? భాయీ!

సుగుణా: ఏలా గేమిటి?
నిండు కొలంకులో నీలోత్పలంబట్టు,
అందగా అల నొకటి చేసికొని చేసికొని
అమృతబిందువులాగ కరిగిపోతూ వచ్చి,
అవధి లేని బ్రతుకు నావరించేను!

[అని పెదవి తెరుల్చును. ఆమె తిరుగ తన పెదవి నందిచ్చును]

విరజాజి: నీ పెదవినా నా పెదవినా అమృతబిందు వున్నది?

సుగుణా: ఉండు! ఎవరో వస్తూవున్నారు!

విరజాజి: ఎవరుంటారు నిన్ను వెతుక్కుంటూ వచ్చేవారు? మీ అమ్మగారు.

[రామామణి ప్రవేశించును]

సుగుణా: అమ్మా! ఇలా వచ్చి మాయిద్దరి మధ్య కూర్చో!

రామా: కూర్చోడానికిరా? వచ్చాను?

విరజాజి: మరెందుకు వచ్చారు? మమ్మల్ని కలవర పెట్టడానికా?

రామా: కలవర పెట్టడానికి మీరు నిద్రపోతుంటేగా?

సుగుణా: నిద్దరన్నది మాకు మరి లేదనుకో! మరి రాదనుకో!

విరజాజి: ఇతగాడివన్నీ వెఱ్ఱివెఱ్ఱి ఊహలు లేండి అత్తగారూ!

రామా: వెఱ్ఱి ఊహాల్ని కూడా ఒక్కొక్కప్పుడు మనం పరిగణించి తీరాలి మనోజ్ఞా!

విరజాజి: పరిగణించక ఏం చేస్తున్నారు మీరు?

రామా: మేం చేయడం సహజమే! నీవూ వాణ్ణి పూజిస్తూవున్నావు!

సుగుణా: అలాంటి భక్తి యీమె కెప్పుడూ లేదు.
ఏ జన్మమందునో
ఎన్నాళ్ళ క్రిందనో
ఇరువురం వాజమ్మలం.
ఎటునుంచి చదివినా
అంతేనటా—
ఇప్పటికి కూడాను
అంతేనటా—
ఎప్పటికి కూడాను
అంతేనటా—

విరజాజి: పప్పులో అడుగేశావోయ్! అయితే జంతువులం కావచ్చు కాని వాజమ్మలం మాత్రం కాము మనము.
తెలిసో తెలియకో
ప్రణయ తరంగిణి
లోఁబడిపోయే
మిరువురము—మే మిరువురము."

రామా: బాగావుంది మీ వరుస—ఆయనగారుకూడా ఇలా వచ్చేరు.

సుగుణా: అంటే నాయనగారా?

విరజాజి: ఆఁ—మామగారికి పునః నమస్కారము.

[సంక్రందనశర్మ ప్రవేశించును]

సం. శ: పునః నిన్ను దీవించేను. శీఘ్రమే సౌభాగ్యవతీభవ!—కాని యీ ప్రేమ, మీది, అమెరికన్ ప్రేమ కానట్టుంది; అఫ్రికన్ ప్రేమ కానట్టుంది; "భాయీ" అని అతగాణ్ణి నీవంటావు, "సిస్టర్" అని నిన్ను అతగాడు పిలుస్తాడు.

రామా: మాటల కేమిటిలెండి! అవి పడికట్టురాళ్లలా, వచ్చిపొయ్యేవే. చేతలు తెలుసుకున్నారా?

సుగుణా: తెలుసుకోడానికి మావల్ల తప్పిద మేమైనా వుంటేగా? చట్టవిరుద్ధంగా మే మేక కార్యమైనా చేస్తేగా?

విరజాజి: అంతగా చేస్తేమా, కొత్తచట్ట మొకటి మీరే అప్పుడు ఏర్పాటుచేస్తారు.

రామా: అందుకే భూపాలతేజ్, ఈ ప్రపంచమంతా నేడు వ్యక్తిగత ప్రపంచం అన్నాడు.

సం. శే: అనడానికేం? ఏమైనా అనవచ్చు ఎంత వ్యక్తిగత ప్రపంచమైనా సంఘం వొకటి ఉందంటావా లేదా?

రామా: లేకపోవడం ఏలా?—ఒకనికంటె ఎక్కువ సంఖ్య అవడంతోనే సంఘం అయి వూరుకుంటుంది. మీకూ నాకూ ఇష్టంలేని పని యీ సుగుణాలవాలుడు చేశాడా ఆ పని సంఘవిరుద్ధమైన పని అని మనం చాటవచ్చును.

సుగుణా: అయితే నేనూ విరజాజిమనోజ్ఞ ఏకమైనప్పుడు అదీ ఒక సంఘమే అయితీరుతుందిగా. అప్పుడాపని ఏమిటిగా మీరు నిరూపించగలరు?

విరజాజి: వేయక వేయక మంచి ప్రశ్నే వేశావోయీ భాయీ! నీ తల్లిదండ్రుల్ని నీవు!

సం. శే: ఇక మేం వీడికి తల్లిదండ్రుల మేమిటి?

రామా: అడ్డాల్లో బిడ్డలు గాని గడ్డాలు వచ్చాక బిడ్డలా?

సుగుణా: అదేమిటి ఇద్దరూ అలా అనుకొంటూ ఇద్దై పోయేరు?—ఊరికే 'లోకవరుస'లో అడిగానే గాని—ఇప్పుడు మేమిద్దఱం పెళ్లాడబోతున్నాం అని గాని, అన్యోన్యం ప్రేమించాం అని గాని, మీతో నొక్కి వక్కాణించడం లేదు. సంఘమో సంఘమో అని అంతగా మాతో మీరు సంఘర్షణపడనవసరంలేదు అనిమాత్రం సూచిస్తూవున్నాం. మీ సంఘం ఏలాంటిదో మా సంఘం అలాంటిదే అని తెలియడానికి అనేను.

రామా: మఱి నీ విప్పుడైనా వెళ్లమ్మా! మీ యింటికి.

విరజాజి: అతిగాడు సాయం రాకుండా నే నొక్కర్తెనూ వెళ్లలేను.

సుగుణా: నేనూ ఆమెను కొంతదూరమైనా సాగనంపకుండా మీ వెంట, వెంటనే రాలేను.

సం. శే: కొంత దూరమున్న మాటేం? పూర్తిగానే సాగనంపిరా!

[సుగుణాలవాలుడు విరజాజిమనోజ్ఞ నిష్క్రమింతురు]

రామా: అలాంటప్పుడు మనం ఇక్కడ నించోవడం ఎందుకు? వారిరువురు వెళ్లారు.

సం. శే: ఎవరు నించోమన్నారు నిన్ను?

రామా: అదే! మీ మాటే నేనంటూ వున్నది.

సం. శే:

చుక్కలోక వేనవేలుగా నెక్కొనియుండు
నింగిపై నెన్నొ! అన్నింటి నెగడజేయ
నన్ని చట్టంబు లెవ్వాని పున్నెమునను
అగునవో చెప్పుడా! వింతనగవు హెచ్చు!"
మొక్కలోక వేనవేలుగా నెక్కొనియుండు
భూమిపై నెన్నొ! అన్నింటి పొదలజేయ
నన్ని చట్టంబు లెవ్వాని పున్నెమునను
అగునవో చెప్పుడా! వింతనగవు హెచ్చు.
అక్కరిణి మానవులుగూడ నెక్కొనెదరు!
అందఱిని అన్ని విధముల పొందుపఱుప
నన్ని చట్టంబు లెవ్వాని పున్నెమునను
అగునవో చెప్పుడా! వింతనగవు హెచ్చు!

[ఇరువురు నిష్క్రమింతురు]

మూడవ రంగము

* * బహిరంగ ప్రదేశము; సమయం మఱి మోడురోజులై.

సాధూ: ఏమోయి! భూపాలతేజ! సంక్రందన శర్మ గారితో అసలు మా "భవాని" విషయమై "మూవ్" చేయడానికే పిలిచ్చింది కాదేమిటి?

భూపా: వాళ్ళింటిదగ్గఱ అదే వరస! అస్తమానం ఏదో తమరిది కానట్టు చర్చిస్తారు. వచ్చిన వారు ఏం పనిమీద తమవద్దకు వచ్చారో అన్నది కూడా విచారించరు.

సాధూ: మళ్ళీ అన్నీ తమరికే కావాలన్నట్టు అభిప్రాయాలమీద అభిప్రాయాలు వెలిబుచ్చేరు!

భూపా: అదే నాకు పట్టుకున్నదీని! ఓమాటు, అంతా విగ్రహారాధనలోనే వుందన్నట్టు, దేవాలయాలు సందర్శిస్తారు. మఱోమాటు నాస్తికుల మంటారు. ఒకమాటు ప్రభుత్వోద్యోగం చేయడం దాస్యవృత్తి అంటే

మళ్లో మాటు అందులో నేవుంది పగడ్బందీ అంతా అని అంటారు.

సాధూ: మఠీ సంఘం సంప్రదాయం ఇవన్నీ ఏమి టంటారు?— వాళ వారితో ఏలా మాట్లాడాలో తెలియక అడుగుతూ వున్నాను.

భూపా: ఇంతకూ మీ అమ్మాయి ఏం 'ప్యా'సయిందీ?

సాధూ: మా భవానియేనా? పి. హెచ్. డి.

భూపా: అలాంటప్పుడు ఆమె నే చూచుకోమనరాదూ ఒక వ్యక్తి నెవర్నో యుక్తవయస్సు వచ్చిన వాణ్ణి నొకణ్ణి?

సాధూ: దాని దదో "విలాపము"; హృదయాల తాకిడి కన్నా హృదయాల పోకడలో పోలికలుండాలట భార్యాభర్తలకు!

భూపా: అవి క్షణక్షణము మారుతూవుంటాయి. అని ఈనాటివాళ్లకు తెలియదు.

సాధూ: నీవన్న మాట నిజము—పూర్వపు వాళ్ళకు తెలిసినట్లు, ఇప్పటివాళ్లకు తెలియదు. స్త్రీ చపల అని ఊరికే అన్నారా ఆ యుగంలో వాళ్ళు?

భూపా: అందులో నేవుంది తికమక అంతాను. ఆ "స్త్రీ"ని అణచి పారేశాడనే, ఈ "స్త్రీ" ఇంతగా విజృంభించిపోతూ వున్నది. పూర్వం ఏ "స్త్రీ" అయినా పి. హెచ్. డి. అయింది ఉందా?

సాధూ: పి. హెచ్. డి. కాకపోతే మట్లో 'గార్గి' అయినవాళ్లు లేరంటావా?

భూపా: ఉన్నా అప్పటి భార్యాభర్తల మధ్య గుండె కాయల సామరస్యము వున్న.

సాధూ: నీవు లేదంటే పోతుందా? ఆ రోజుల్లో బారసాల పీటలమీద కూర్చునే భార్యాభర్తల పోలా రాజారాణీలకు గద్దెమీద కూడా అనుభోక్తవ్యమయ్యేది కాదు.— ఇప్పుడంటే వచ్చాయి ఈ గుండెల సామరస్యాలు కండకావరాలూను! ఆ రోజుల్లో అందఱూ నిండుకుండలు. తొణకేవారా ఒకరేనా? తొలగేవారా ఒకరేనా?

భూపా: అందుకే గాంధీ — అస్పృశ్యత వచ్చి పడిందో, పూర్వం మన జాతిలో లేని కళంకమిది—అని బ్రతికినన్నాళ్లూ ఘోషించాడు.

సాధూ: అలాగే మున్ను వసిష్ఠుడు అరుంధతిని పెండ్లాడాడు. మాలెతఅని త్రోసివేశాడా?

భూపా: అయితే మతంగ కన్నెలను హరిశ్చంద్రుడు పెండ్లాడాడా?

సాధూ: ఇక్కడ ఏకపత్నీ వ్రతం అడ్డు వచ్చిందని నా ఊహా!

భూపా: మన ఊహా లేం పనిచేస్తాయండీ?— ఉండుండి, ఆమె ఎవరో, పిల్లల తల్లి కాదంటూవున్నా పిల్లల తండ్రినీ వరించిందట!

సాధూ: అటాంటి వెఱ్ఱి వెఱ్ఱి పనులు దోహాకరములనే బహుభార్యా నిషేధచట్టం పుట్టుకొచ్చింది.

భూపా: చట్టము—సమస్య — చట్టము — సమస్య వీటితో మీరు తగులకుంటూవుంటారు. మళ్లో ఆమె అసలే పెండ్లి చేసికోదు. ఆమె నేం చేయగలరు?

సాధూ: తప్పకుండా పెండ్లిచేసుకుతీరాలి అని ఒక చట్టం ఏర్పాటవుతుం దప్పుడు!

భూపా: ఇలా ఈ చట్టాలవల్ల క్రమక్రమేపి వ్యక్తిగత స్వాతంత్ర్యం నమ్మయిపోతూ వుంది అంటారా లేదా తమరు?

సాధూ: నూతనంగా చట్టం రావడం, ఒకడుగు మనల్ని ముందుకు వేయించడమే నని రాజకీయవాదు లంటారు!

భూపా: అలాగే అంటారు వారు! తమరూ వారి వారి మాటలు నమ్ముతూవుంటారు, ఒక్క మీ అమ్మాయి విషయమై తప్ప!

సాధూ: అవునోయి! చదువు వచ్చింది; చదివించాను. చదివించినా, తగిన సంబంధం జతపడ్డం లే?

భూపా: ఆ మాటలో నేవుంది తగువు అంతా; తగిన సంబంధమనగా?

సాధూ: ఇతరదేశాల్లో జరుగుతోన్నట్టు, ఇక్కడ జరగడం లేదోయి పెళ్లిళ్ళు, వెయ్యి చెప్పు, లక్ష చెప్పు.

భూపా: ఆ దేశాల్లో కులవివక్షత లేదు. కోరిందే తడవుగా ప్రేయసీ ప్రేయసు లవవచ్చు నను కుంటాను.

సాధూ: తమరు పాశ్చాత్యదేశాలు వెళ్లివచ్చినారా?

భూపా: అన్నింటికీ స్వానుభవం కావాలా, ఏమిటి? పోనీ మీ అమ్మాయిచేత విశేషించి "స్కాలర్ షిప్"కు దరఖాస్తు పెట్టించకూడదూ? పి. హెచ్. డి. ప్యాసయింది కదా!

సాధూ: తోకు?

భూపా: ఆ దేశాల్లోను ప్రజలున్నారు.

సాధూ: ప్రజలుంటారన్న సంగతి నేనూ ఎరుగుదును. దేశమంటేనే ప్రజ! అయితే అక్కడి ప్రజకు ఇక్కడి ప్రజకు అక్కడి భోజనానికి ఇక్కడి భోజనానికి సరిపడదనుకుంటాను.

భూపా: ప్రపంచమంతా ఒకటే కుటుంబం అని అనుకునేవాళ్లకు సరిపడకపోవడ మేమిటి? నేను వెళ్లింది "ప్లేను"మీద "ఇటలీ" వస్తూవున్నాను. సంభ్రమసింగు లవ తెల్సుకొని, 'చైనా' వెళ్ళబోతున్నాడు, అక్కడి సంస్కృతి సంప్రదాయం తెలుసు కొంత సాధించడానికి.

సాధూ: మీ లిస్టులోకూడా వటువులున్నారే?

భూపా: వటువులంటే వరుడైనవాళ్ళనా!

సాధూ: ఆ మాటకే అర్థము తెలియని నీవు ఆ దేశం వెళ్ళి ఏం చెస్తావు?

భూపా: ఏమి చెయ్యాలో అదే చేస్తాను. విద్యను పెంపొందిస్తాను. వివేకం కొత్తది సంపాదిస్తాను.

సాధూ: వటువులంటే వరుడై పెళ్ళికి సిద్ధముగా నున్నవారన్న మాట.

భూపా: అసలు నే నెత్తింది ఒకటే జన్మ మళ్ళీ జన్మ ఎత్తలేను.

సాధూ: అదిగో నీవు నాలా ఘటికుడవే! మావాళ్ళు నాకు చాలా యేళ్ళక్రితం వటువు అనే ఒకానొక తంతు నడిపి, నన్ను ద్విజుణ్ణిగా చేశారు! ఆపైని నాకు పెళ్ళి అయింది.

భూపా: అలాంటి ద్విజుడే తనూ అని సంభ్రమసింగు గర్విస్తూవుంటాడు లెండి. కాని అతగాని కింకా పెండ్లి కాలేదు.

సాధూ: అంటే వొంటిపోచగానున్న మాట?

భూపా: ఏం పోచ ఏనాడు వేసికొన్నాడో! అతని వొంటిమీద నేనెప్పుడే పోచ చూడ్డం లేదు.

సాధూ: అసలు వొళ్ళంటూ చూపిస్తూవున్నాడా?

భూపా: చూశారుగా మొన్న! మనిషి 'బందోబస్తు'గా లేడూ?

సాధూ: లేకేం! మనిషి బాగానే వున్నాడు! అతగాడా ఇప్పుడు చైనా వెళ్లేది? బ్రాహ్మణుడైనే "సింగ్" అని పిలవబడుతూ వున్నాడేమో?

భూపా: పాడైపోతూ వుంది!—ఏమండోయి! సహదేవయ్యగారూ! ఇన్ని చూసి మీ అమ్మాయి పెళ్ళిచెయ్యాలీ అంటే మళ్ళీ కాదన్నమాటే.—పెళ్ళి అనేది అదో స్వేచ్ఛాభావము గాని, మానవుల్ని అస్వతంత్రుల్నిగా చేసేది కాదు. ముఖ్యంగా ఈ స్వతంత్ర భారతయూనియన్‌లో అసలే కాబోదు. మన ప్రణాళికలంతసీపూ సమస్త ప్రపంచంతోను సంబంధబాంధవ్యాలు చేసుకుంటూ, సర్వతంత్రస్వతంత్ర వాతావరణంలో మెలగ మొదలిడి కొనసాగుతూ వున్నాయి నేడు. మనకు మళ్ళీ వియోగభావాలుండకూడదు: విరోధభావాలు రారాదు.

సాధూ: అంత పుణ్యం ఎవరు కట్టుకోగలరు!

భూపా: ఒకరన్న మాటేమిటి! మీరూ నేనూ ఈ జనమంతా! నేడు వర్ణాలు లేవు. వాహనాలు లేవు. వ్యక్తిగతమైన అభిరుచి కొలిచే నమ్మకను పరస్పరం కరచాలనం గావించుకుంటూ గమ్యస్థానం చేరుకోవలసిందే!

సాధూ: అలాంటి రోజు నేను చూస్తాననుకోను.

భూపా: అటువంటి చట్ట మీనాడొస్తే చూడకేం చేస్తారు! మనమంతా చట్టబద్ధులం. శాంతిదూతలం. స్నేహబద్ధులం. ఒకే ఒక జెండా క్రింద నిలబడేవాళ్ళం.

సాధూ: ఆ వచ్చేవాళ్ళెవరో చూడండి!

భూపా: అదేమిటండోయి! మీరే, మీ అమ్మాయిని పోల్చలేకుండా వున్నారు!

[భవాని ప్రవేశించును ఒక జెండాతో]

భవాని: నాన్నగారూ! నమస్కారము! ఇలా ఈ క్రొత్త జెండాక్రిందకు రండు.

సాధూ: అమ్మా! అతగాడెవరు?

[సంభ్రమసింగు ప్రవేశించును]

భవాని: అతగాడూ ఈ జెండాక్రిందుండవలసిన వాడే! సంభ్రమసింగ్.

సాధూ: తమరా? నమస్తే! తమరు చైనా వెడతారని ఇప్పుడే భూపాలదేవ్ గారు చెప్పారు. నిండా సంతోషం. ఎప్పుడు ప్రయాణం?

సంభ్ర: ఇప్పుడేనండీ! నాతో కూడా మీ అమ్మాయి భవాని వస్తూవుంది.

సాధూ: ఇదంతా సర్కారువారి ఖర్చునేనా అమ్మాయీ?

భవాని: ఆఁ.—అక్కడి సంస్కృతికి ఇక్కడి సంస్కృతికి తారతమ్య మేమైనా వుందా అని పరిశోధించడానికి వెడుతూవున్నాము.

సాధూ: అక్కడా పురుషులూ స్త్రీలూ వుంటారను కుంటాను.

భూపా: వాళ్ళెంతటా వుంటారని ఈవలనే నేను తమకు నివేదించానుగా! అంతే కాకుండా ప్రజ అంటే మరో విషయం కూడా గ్రహించాలి తమరు. భావిపౌరులు కాబోయే పిల్లలుకూడా అని తెలుసుకోండి! మరేన్ని పాతాళంనుండి సత్యలోకంవరకు వున్న పదునాల్గు భువనాల ప్రజ ఒకటే అనే విషయంకూడా గుర్తించండి!—ఏదో మీ మాంసలో పడ్డారు?

సాధూ: అంతదూరం చూడగల మీరు, తిరుగ హిందూపురాణంలో చెప్పబడ్డ పాతాళం అని సత్యం అని ఉటంకించనేల?—అనే మీమాంసిస్తూ వున్నాను!

సంభ్రమ: మాకు వీడ్కోలు ఇవ్వడానికి కాబోలు సుగుణాలవాలును విరజాజిమనోజ్ఞ ఇలా వస్తూవున్నారు!

సాధూ: వా రిరువురే గాని సంక్రందనశర్మగారు రామామణిగారు రావడం లేదేం?

భూపా: ఆ ముసిలివాం డ్రిద్దరూ అస్తమానం ఈ *పడుచువాండ్ర వెనకాల వుంటారనా మీ* ఊహ?

సాధూ: అబ్బే! మరోమాటు ఫోనీ చెప్పిచూడా మని సంక్రందన శర్మగారితో మా అమ్మాయి విషయమై.

[సుగుణాలవాలును విరజాజిమనోజ్ఞ ప్రవేశింతురు]

భూపా: 'ప్లే' నెక్కబోయేవాళ్ళని మరి ఆపబోకండి. మీరూ మీరూ ఇవ్వగలిగితే ఒక కర చాలనము సంభ్రమసింగుగారి కివ్వండి! మరేన్ని మీ అమ్మాయిని ఆయనతోపాటు దీవించి సాగనంపండి.

అంతా: సుఖప్రయాణమగుగాక మీ యిరువురకు! —చక్కగా వెళ్ళిరండి!

సంభ్ర
భవాని : జైహింద్! [నిష్క్రమింతురు]

భూపా: ఇప్పు డెలావుంది అంటారు ఆ జంట?

సాధూ: అంటే—మా అమ్మాయి భవానీ ఆ సంభ్రమ సింగుగారి మాటేనా?

భూపా: ఆ మమకారమే కూడదంటాను. ఆ వ్యక్తిగత జంటను గురించి అడుగుతూ వున్నాను.

సాధూ: గుండెల సామరస్యం వున్నది వారిద్దరకు పరస్పరం; కాబట్టి బాగానే వుందనుకుంటాను. అయితే గుండెల సామరస్యానికి కూడా ఒక చట్టమో, ఒక సాంప్రదాయమో వుండాలి అంటారా అక్కర్లేదంటారా?

భూపా: ఆ సందర్భం ఈ పైనుండి సంక్రందన శర్మగారింటివద్ద చర్చిద్దాం! రాండి!

సాధూ: చర్చించడం ఏమి? ఒక తీర్మానం, అదే చట్టరూపం దాల్చేలా తయారుచేసి పంపిద్దాం!

సుగుణా: మా నాయనగారు ప్రస్తుతం ఇంటివద్దలేరు.

సాధూ: మీ తల్లిగారు?

విరజాజి: అంటే అత్తగారిమాటా అడుగుతున్నారు? ఆమె కూడా లేరు.

భూపా: మరెవరున్నారు?

సుగుణా: ఎవరూ లేరు. ఇప్పుడు మా యింట్లో.

సాధూ: అలాగే, ఇల్లు తాళంవేసి వచ్చినారా మీరు:

సుగుణా: అదీ చేయలేదు మేం. మేం వీధంట వస్తూవుంటే, ఆ తలుపులు బారెట్టే వున్నాయి.

విరజాజి: లోపలకు వెళ్ళి చూసినా ఎవరూ కనిపించ లేదు.

సుగుణా: తాళం వేసివస్తే తిరుగ వారు లోపలకు వెళ్లడ మేలాగు అని భయం.

సాధూ: పోనీ తలుపులు తెఱచుకు ఇంటిలోనే వుండి పోలేకపోయినారా మీ యిరువురు?

విరజాజి: ఈవలకువచ్చి వేయకపోతే వీధి ఏమౌతుందో అని భయం.

సాధూ: అందుచేతను వీధిలోంచి ఇంట్లోకి, ఇంట్లోంచి వీధిలోకి ఊరికే తిరుగుతూ వుంటారా మీరు?

భూపా: అలాగే చేస్తారనుకుంటాను, చట్టం వొకటి ఈయిరువురి సమస్యను పరిష్కరించేదాకా!

సుగుణా: చట్టం ఏనాటికీ మా సమస్యను పరిష్కరించ లేదు!

విరజాజి: ఇతగా డింకా పెఱటి దారినే వున్నాడు చట్టము అంటూ, సమస్య అంటూ.— మాకు మరే చట్టం లేదు, సమస్య లేదు. మేం ఈ లోకంలో వ్యక్తులం.

సుగుణా: సువ్యక్తులం!

విరజాజి: మమ్మల్ని గురించి, ఏ లోకం, ఆలోచించ నక్కఱ లేదు.

సుగుణా: మాకు మేమే!

సాధూ: సెలవు!

భూపా: సర్వేజనా స్సుఖినోభవంతు!

[తెర]

యక్షగానకవులు

శ్రీ నిడుదవోలు వేంకటరావు

తెలుగుభాషలో మధురకవితా శాఖకు జెందిన యక్షగాన రచనలను గూర్చియు తత్కర్తలను గూర్చియు నింతవఱకు పర్యాప్తమైన పరిశీలన జరుగలేదు. నేఁడా పరిశోధన ప్రారంభమైనది. యక్షగాన వాఙ్మయ చరిత్రమును తెలిసికొనుటకు, ముందు, వాఙ్మయమున నున్న యక్షగానములయొక్క, తత్కర్తలయొక్క యునంతము లెఱుగుట యావశ్యకము. కావున నా శాఖలోని కొన్ని యక్షగాన రచనలను గూర్చి, తత్కర్తల కాలనిర్ణయములనుగూర్చి భావి పరిశోధనకు దోహదము కల్పించునను తలంపున నీ వ్యాసము రచితమైనది. ఇందు క్రీ. శ. 1450 నుండి క్రీ. శ. 1850 వఱకు గల కాలమున వెలసిన తొమ్మిదింటిని గూర్చిన వివరణము గలదు.

1. లక్ష్మీకల్యాణము
ప్రోలుగంటి చెన్నమంత్రి

ప్రసిద్ధ లాక్షణికుఁడగు పెల్లంకి తాతంభటు తన [1]కవి చింతామణిలో నీ యక్షగానము నుదాహరించి యున్నాఁడు.

"లక్ష్మీకల్యాణములోని రేకులు."
"నీలజోదరు రాణి నీలవేణికిని."

యక్షగానములలో రేకు లనగా అర్ధచంద్రికలలోని పాదములు. అర్ధచంద్రికలు యక్షగానములలో ప్రయుక్తములగు రచనాభేదములలో నొకటి. ఇవి, ఆయా తాళముల పేరితో వెలయుచుండును. అనగా నే యర్ధచంద్రిక, ఏ తాళమున నుండునో, ఆ పేరితో నది వ్యవహరింపబడును. గుఱ్ఱము చిన కపోతయ్య రచించిన వీరచోడవ్వ చరిత్ర యక్షగానమున, 'మటెమె రేకులు' అని యీ యర్ధచంద్రికా రచనభేదము గలదు. మటెమె రేకులు అనగా మత్యతాళముతో పాడదగిన యర్ధచంద్రికలోని పాదములు అని అర్థము. ఉదాహరణములలో 'కళిక' అనగా చంద్రరేఖ అని అర్థము. కళికలో సగము అర్ధకళిక లేక ఉత్కళిక. అర్ధకళిక లేక ఉత్కళికయే అర్ధచంద్రిక అయినది. చంద్రికలోని అంశములు లేక కిరణములు చంద్రరేఖలు. రేఖాశబ్దభవము రేక. దీనికి రేకు అను రూపాంతరము గలదు. చంద్రికలోని భాగములు రేకలు గావున, నర్ధచంద్రికలోని భాగములకును రేకులని పేరు వచ్చినది.

ప్రస్తుతము మనకు కావలసినది లక్ష్మీకల్యాణము. తాతంభట్టు ఉదాహరించిన దానినిబట్టి అది యక్షగానమగుట స్పష్టమే. తాతంభట్టు క్రీ. శ. 1500 ప్రాంతమువాఁడు. కాబట్టి యీ లక్ష్మీకల్యాణ రచన మంతకుముందు గాని, అతని సమకాలికముగా గాని కాదగును. క్రీ. శ. 1490—1503 ప్రాంతముల నిమ్మడి నరసనాయకుని బదులుగా తానే రాజ్యతంత్రము నడపిన తుళువ నరసనాయకునికి కృతిగా నంది మల్లయ ఘంటసింగయ కవులు వరాహ పురాణమును రచించియున్నారు. అందు షష్ఠ్యంతములలో నీ లక్ష్మీకల్యాణ ప్రస్తావ మిట్లున్నది.

క. వాణీకర వీణా ని
క్వాణరతికి, వినయమతికి వరలక్ష్మీక

1. కవి చింతామణి అముద్రితము; సంఖ్య 1278; ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారము. ఆంధ్ర సాహిత్య పరిషత్తులో నీ గ్రంథము గలదు.

ల్యాణ నరసింహ విజయ పు
రాణ కథారమణతానురాగస్థితికిన్.

కరా. 1-4-6.

పైని పేర్కొనబడిన లక్ష్మీకల్యాణమే, శాతంభట్టు పేర్కొన్న లక్ష్మీకల్యాణమనుటకు సందేహము లేదు. తుళువనరస రాయనికి ముందు రాజ్యాధికారము వహించిన సాళ్వ నరసింగరాయనికి కృతిగొన్న పినవీర భద్రుని జైమిని భారతమునందలి శాతంభట్టు పద్యముల నుదాహరించుటచే తుళువనరస రాజునకు కృతినిచ్చిన గ్రంథము నుదాహరించుట సమంజసమే యగుచున్నది.

పై పద్యమున లక్ష్మీకల్యాణము అనగా నందఱకు సుపరిచితమగు మహాలక్ష్మీ పరిణయము (విష్ణుమూర్తి లక్ష్మీదేవిని పెండ్లియాడుట) గాక, నరసింహదేవునికి సంబంధించిన కల్యాణమని 'నరసింహ విజయ పురాణకథ రమణతానురాగస్థితికిన్' అను విశేషణము తెలుపుచున్నది. మఱియు నిది తుళువనరస నాయకునికి కృతియనికూడ స్ఫురింపజేయుచున్నది. దైవమగు, నృసింహదేవుకు నరసింహ విజయ పురాణకథా రమణుడు లేక కథానాయకుడు—కృతిపతియగు నరసింహుడు (నరసనాయకుడు) లక్ష్మీకల్యాణ రూపమైన నొక నృసింహ విజయపురాణ కథకు రమణుడు, అనగా నాయకుడు. దీనినిబట్టి లక్ష్మీకల్యాణము వరాహపురాణ రచనముకన్న ముందనియే చెప్పవలెను. కాగా పై పద్యమున ప్రతిపాదింపబడినది లక్ష్మీకల్యాణమే గాని, కొందఱు విద్వాంసులనుకొనునట్లు నరసింహ విజయపురాణము అను గ్రంథమెంతమాత్రమును కాదు.2 ఇందు ప్రతిపాదితమైనది 'లక్ష్మీకల్యాణ' మొక్కటియే యని విద్వద్వర్యులగు శ్రీ రామకృష్ణ కవిగారి యభిప్రాయము.

ఇక లక్ష్మీకల్యాణ యక్షగాన కర్తయెవరో కనుగొనవలసియున్నది. ఆ కాలమున విలసిల్లిన కవులలో అహోబల నరసింహస్వామికి కృతులనిచ్చి, నరసింగ రాయలచేత బహుమతులుగొని, నారసింహ పురాణ రచనము గావించిన ప్రోలుగంటి చెన్నశౌరి యను కవిచంద్రుడు కలడు. ఇతడు హరిభట్టు ఉత్తర నారసింహ పురాణమునకు కృతిపతియైన ప్రోలుగంటి రంగ మంత్రికి పినతాత కుమారుడు. అనగా వరుసకు పిన తండ్రి. రంగమంత్రి క్రీ. శ. 1520-1550 ప్రాంత మందుండుటచేత చెన్నశౌరియు క్రీ. శ. 1480-90 ప్రాంతముల నుండుట సమంజసమే యగుచున్నది. ఉత్తర నారసింహపురాణమున నితనిగూర్చియిట్లున్నది.

సీ. ఆ మంత్రిపుంగవుం డష్టభాషాకవి
చక్రవర్తి పొగడొందె వసుధయందు
ద్విపదగా నారసింహపురాణ మొనరించి
భక్తి నహోబిల భర్తకిచ్చె
బాలభారతి నాగ్ర్యశ్లాఘమౌ వచన కా
వ్యంబుసేసెను కావ్యగుణము మెచ్చ
సౌభరి చరితంబు జక్కుల కథ చెప్పె
లీలతో నరసనాయకనృపతికి

గీ. మఱియుఁ జెక్కు కృతులు మఱి రచించె
ఖ్యాతి నరసింగరాయలచేత గొనియె
నగ్రహారంబులను వివిధార్థములను
వెలసెఁ గొండము పెంక్లిగా విభవ మెసగ

అష్టభాషా కవిశ్వరుడగు నితని కృతులు ద్విపద నారసింహ పురాణము బాలభారతము, సౌభరి చరితము, అను మూడు పేర్కొనబడినవి.—'వినిలో' చిత రది సౌభరిచరితము. జక్కులపాట అనగా యక్షగానము—ఇచట 'సౌభరి' అనుదానికి సరియగు నర్థము కనుగొనబడదు.—పాఠముకూడ సరిగా నుండక పోవచ్చును. ఈ సందర్భమున, మనము ఉత్తర నారసింహ పురాణమునకు తాళపత్ర మాతృక యొక్కటియే యనియు, వేఱు ప్రతులింతవఱకు లభ్యము కాలేదనియు జ్ఞప్తిలో నుంచుకొనవలసి యున్నది. ఇచట శబరి చరిత్రంబు జక్కుల కథ.—అను పాఠమే యుండెడిదగును. శబరి, శాబరి, శౌబరి, సౌబరి యని యిత్యాదిగా నుచ్చారణ భేదముల నిది వ్యవహృతమగుచున్నది.

శౌబరి చరితంబు—లేక శబరి చరిత్రంబు అను ఒకయే సరసము, సాధుపాఠము. శబరి యనగా చెంచు కన్య. నృసింహస్వామి చెంచులక్ష్మిని పెండ్లియాడిన కథ తెనుగుదేశమున ప్రచారమున నున్న కథలలో నొకటి. ఆ చెంచులక్ష్మి కథనే చెన్నశౌరి లక్ష్మీ కల్యాణమను పేరుతో రచియించి యున్నాడు.

నరసింహ దైవతమును గూర్చిన గ్రంథములలో నీ చెంచులక్ష్మీ వివాహగాథ యున్నదానికి శబర

2. భారతి. సం. 18. సం. 1. (1941) పుట 20.

సంబంధమైన నామాంతరము ప్రచారములో నున్నట్లుగా నీ క్రింది విషయములవలన స్పష్టమగుచున్నది.

ఆంధ్రసాహిత్య పరిషత్పుస్తక భాండాగారములో 2616 సంఖ్యగల తాళపత్రగ్రంథము 'నృసింహ విలాసము' అను ప్రబంధము—వీరరాఘవ కవి రచితము నృసింహస్వామి చెంచులక్ష్మిని పెండ్లియాడిన కథ యిందు వర్ణితము. దీనికి శబరకన్యాపరిణయము అను పేరున్నట్లుగా తెలియును. "ప్రమాదీచ నామ సంవత్సర పుష్య శుద్ధ ౧౦ సరికి వ మాని వెంకట నరసు వ్రాసుకొన్న శబరకన్యాపరిణయం సంపూర్ణం." అని వ్రాసియున్నారు. (ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక సం. ౮. పుటలు 394. 396)

దీనినిబట్టి చెన్నశౌరి రచించిన సౌభరిచరితము—శబరి చరిత్రమనియు శబర కన్యయగు చెంచులక్ష్మి చరితమనియు, దానినే లక్ష్మీకల్యాణమని తాతంభట్టు పేర్కొన్నాడనియు, నది క్రీ. శ. 1490 ప్రాంతములలో రచితమగుటచే మనకు లభ్యమైన యక్షగానములలో ప్రాచీనతమమైనదనియు చెప్పనగును.

ఈ నమ్మకమునే వెలువరించిన దాక్షిణాత్యాంధ్ర సాహిత్యము అను గ్రంథమున 94 పుటలో "ఆంధ్ర భాషయందు గల యక్షగానములలో నెల్ల సుగ్రీవ విజయము ప్రాచీనతమమైనది." అని వ్రాయబడినది. అది రెంటో గురూహ్యముగ నున్నది.

సమకాలికుడును మహాలాక్షణికుడును నగు తాతంభట్టు తన లక్షణగ్రంథమున నీ యక్షగాన ముదాహరించుటచేత, యక్షగానములను గూడ, పూర్వ లాక్షణికులు కావ్యములతో పాటు ప్రామాణికములుగా గొనిరని నిస్సంశయముగా చెప్పవచ్చును. ప్రబంధ రచనలనే గాని ప్రాచీనులు యక్షగాన రచనలు మున్నగు దేశి రచనలను విస్మరించిరను నవీన వాఙ్మయ విమర్శకాభిప్రాయము లెంతమాత్రము సరికాదని పై విషయము వలన తెలియుచున్నది.

2. కృష్ణవిలాసము
ముద్దరాజు పెదరామన

భాగవత దశమస్కంధమునందున్న కృష్ణలీలలు వర్ణితమైన యీ యక్షగానము[3] యొక్క గ్రంథారంభమున నీ పద్యమున్నది:

"క. వశవశిగలిగిన యప్పుడె
పడయంగవలె విష్ణుభక్తి పదిలుండవైతే
విడువకు కృష్ణుని చరితలు
కడువేడుక వెన్నముద్ద గణపతి పెద్దా!"

దీని ననుసరించి గ్రంథ వివరణము చివర—'గ్రంథకర్త వెన్నముద్ద గణపతి పెద్దకవి' అనియున్నది. కాని గ్రంథకర్త వెన్నముద్ద గణపతి పెద్దకవి కాదు. ముద్దగణపతి పెద్దకవి - ప్రాత వ్రాతలలో వి, వి, వె, వె, అను వాని భేదము కనుగొనుటకు వీలు లేకుండ నుండును. కృష్ణుని చరితలు కడువేడుకలు -విన్న, ముద్దగణపతి పెద్దా" అని యుండవలయును. అప్పుడు గ్రంథకర్త పేరు "ముద్దగణపతి పెద్దా"అని యేర్పడును. ఇది ముద్దరాజు గణపతి పెద్దరామయ యనుదాని సంగ్రహరూపము. పింగళి సూరనార్యకృత రాఘవ పాండవీయమునకు రాఘవ పాండవీయాదర్శమను ప్రశస్త వ్యాఖ్యానము రచించిన ముద్దరాజు పెదరామ ధీమణియే యీ పెద్దయ-ఆ వ్యాఖ్యలోని గద్య యిది.

"ఇది శ్రీ మన్మదనగోపాల కృపా కటాక్ష సంప్రాప్త సారసారస్వత సంపదానంద నంద వరాన్వయ క్షీరపారావార రాకాసుధాధామ ముద్దరాజు గణపయామాత్య పెదరామధీమణి ప్రణీతంబైన రాఘవ పాండవీయాదర్శంబు"

దీనినిబట్టి ముద్దగణపతి పెద్దయనునది ముద్దరాజు పెదరామ ధీమణియే యనుట స్పష్టమగుచున్నది. మఱియు నితని సోదరుడును కవి సంజీవని గ్రంథకర్తయునగు రామభద్రకవి[4] తన గ్రంథములో నీ క్రింది విధముగ తన్ను గూర్చి చెప్పుకొన్నాడు.

సీ. అంచమా నికే మహోసుధానిధి నిరా.
ఘాట లాక్షణికతా కౌశలంబు
....
....

3. ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారము. యక్షగానములు సం. 1868. సం. *VIII* పుట. 2094-2097.

4. రాఘవ పాండవీయాదర్శవ్యాఖ్యా రచయితయు, కవి సంజీవని కర్తయు కవితరంగిణీకారులూహించినట్లు నొక్కరు కారనియు, వారిన్నదమ్ములనియు శ్రీ రావూరి దొరసామిశర్మగారు—పరిశోధన పత్రిక. వర్షర్తు సంచిక (8) పుట. 44-48 లో నిరూపించియున్నారు.

గీ. అంచు బుధులెల్ల వినుతింప నలరుముద్ద
రాజు గణపయ గర్భవారాశి పూర్ణ
చంద్రు పెదరామ, పినరామ సచివమణుల
కనుగు దమ్ముఁడు రామభద్రాఖ్య కవిని.

మఱియు కవిజన సంజీవని గద్యకూడ నీ పెద రాము ధీమణి గద్య ననుసరించియే యిట్లు వ్రాసి యున్నాఁడు.

"ఇది శ్రీ మన్మదనగోపాల కృపాకటాక్ష ప్రాప్త సారసారస్వత సంపదానంద సందివర కులా లంకార ముద్దరాజు గణపయామాత్య పుత్ర, పెద రామ సచివ సోదర రామభద్రప్రణీతంబైన కవి సంజీ వని యను లక్షణగ్రంథమున ప్రథమాశ్వాసము."

పై వానినిబట్టి పెదరాము అను పేరుగల వ్యక్తియే. పినరాముడను సోదరుడుండుటచే పెద్దయ్య యని వ్యవహృతుఁడగుట సమంజసమే యనుచున్నది. కాబట్టి ముద్దరాజు పెదరామధీమణియే దీనికి కర్త యని చెప్పనగును.

పెదరామధీమణి గద్యయందు మదనగోపాల స్వామి భక్తుడనని చెప్పుకొనుటయే కాక, రాఘవ పాండవీయాదర్శవ్యాఖ్యాప్రారంభమున కృష్ణునే స్తుతియించి యుండుటచేత, కృష్ణవిలాస యక్షగాన రచనము చేయుట సంభావ్యమే యనుచున్నది.

ముద్దరాజు పెదరామన క్రీ. శ. 1550—1580 ప్రాంతముల విలసిల్లి యుండెను—కావున నీ యక్ష గానమును నా కాలము నాటిదే.

ఆంధ్ర సాహిత్య పరిషత్తులో[5] నీ కృష్ణవిలాస యక్షగానము గోపాలవిలాసము అను పేర కలదు. సంఖ్య 135. అందు "కాళింగచరిత్రము" అని కూడ నిది వ్యవహృతమైనది. పరిషత్పుస్తక భాండాగార గ్రంథ సూచికయందును నిది 'వెన్న ముద్ద గణపతి పెద్ది'యని వ్రాయబడి యున్నది—బహుశః దీనిని చూచియే ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగార గ్రంథవివరణమున పూర్వోక్తకీర్తిని వ్రాయబడి యుండును.

ఈ యక్షగాన రచన ప్రశస్తమైనది—ఇందు అల్లోనేరేళ్ళు, వెన్నెలపదములు, గొబ్బిళ్ళు, మొద లగు దేశి రచనలు గలవు.

3. శ్రీరామ విజయము

వెణుతురుపల్లి విశ్వనాథకవి

తూర్పుగోదావరీమండలమున పెద్దాపుర సంస్థానాస్థాన విద్వత్కవియైన వెణుతురుపల్లి విశ్వ నాథ కవి తాను శ్రీరామ విజయమను నొక యక్షగాన మును రచించినట్లు శేషధర్మనులను గ్రంథమున నీ విధ ముగ జెప్పియున్నాఁడు.

సీ. సృజియించినాడవు శ్రీరామ విజయంబు
యక్షగానంబు చిన్నప్రుడె రూఢి
కల్పించినాడవు కవిజన శ్రవణ సౌ
ఖ్యమున గౌరీవివాహంబు ద్విపద
రచియించినాడవు ప్రచుర చాతురి నిరో
ష్ఠ్య ప్రబంధము హరిశ్చంద్రచరిత
కావించినాడవు శేవభావను పారి
జాతాపహరణమ్ము శాశ్వతముగ
గీ. అన్నిటను నీవ నేర్పరి వార్య వర్య
వర్ణనీయ కవిత్వ తత్త్వంబునందు
నిందు కోటీర చరణారవిందవంద
న ప్రభావనిధీ! విశ్వనాథసుకవి.

సంస్కృతిమున పారిజాతాపహరణము, నిరోష్ఠ్య ముగ హరిశ్చంద్రచరిత్ర, గౌరీవివాహము ద్విపద, శ్రీరామ విజయము యక్షగానము అను నీతని కృతు లేమియు గానరాకున్నవి. ఈతని శేషధర్మములు లభ్య మగుచున్నది.

ఈ శేషధర్మములు - పెద్దాపుర సంస్థానాధి పతియై ప్రసిద్ధికెక్కిన వత్సవాయి తిమ్మ జగపతిరాజు గారికి కృతి యీయబడినది. తిమ్మ జగపతి మహారాజు గారు డెబ్బదియారేండ్లు జీవించి, క్రీ. శ. 1555 మొదలు క్రీ. శ. 1607 వఱకును నేబది రెండేండ్లు పరి పాలించినారు.[6] కాబట్టి యీతనికి కృతినిచ్చిన విశ్వ

5. పరిషత్ప్రతి చివర
"చిత్రభాను నామసంవత్సర కార్తిక శు ౯ శని వారము కార్తికి నెల ౧౦ తేదీవరకు వ్రాసిన కాళింగ చరిత్ర గరటయ పెట్టికి ముత్తిరాజు కృష్ణయ్య వ్రాసి యిచ్చినది. దక్షిణ దేశప్రతి. అని వ్రాయబడియున్నది.

6. పెద్దాపుర సంస్థానచరిత్రము. వత్సవాయ రాయ జగపతి వర్మ—పుట 30.

నాథకవియు నా కాలమువాడేయని చెప్పవొప్పును. క్రీ. శ. 1650 ప్రాంతమున నీరుకుపల్లి భవానీశకవి యీతని పుత్రుడైన వెంకటరాయ కవిని పేర్కొనుట చేత నీతడు. క్రీ. శ. 1560—1620 ప్రాంతముల నుండి యుండును. శ్రీరామవిజయ యక్షగాన మీనాటికే, యచ్చటచేతను, నాతని కృతులలో ప్రాథమిక మగుట చేతను, క్రీ. శ. 1560-70 ప్రాంతము నాటిది కావచ్చును.

ఈ వెణుతురుపల్లి విశ్వనాథకవియే దిట్టకవి విశ్వనాథ కవియైనాడు. ఈతడు పెద్దాపుర సంస్థానమునందు వెలసిన యష్టదిగ్గజములలో నొకడు. ఈతని నాటనుండి వెణుతురుపల్లివారు 'దిట్టకవి' వారైనారు. ఈతని కొమారుడు దిట్టకవి వెంకటరాయ కవిని కూచిమంచి తిమ్మకవి, ఈదురుపల్లి భవానీశ కవి మున్నగు ప్రసిద్ధులు పేర్కొన్నారు. నేడు తూర్పు గోదావరి మండలమున రామచంద్రపుర ము తాలూకాలో నీ "దిట్టకవి" వారు దిట్టముగా నున్నారు.

ఈ యక్షగానము మనకు లభ్యముకాలేదు. ఇది యును సుగ్రీవవిజయము నాటిది యని చెప్పవచ్చును.

4. కన్యకా పురాణము
ఇటికెల తిమ్మయ్య

వైశ్యకుల దేవతయగు కన్యకాపరమేశ్వరి చరిత్రమును ఇటికెల తిమ్మయ యను కవి యక్షగానరూపమున రచియించెను. గ్రంథాంతమున తన్ను గూర్చి చెప్పుకొనిన యంశము లివి.

ఈతడు వాణిజ్య కులసంభవులలో చంద్రకుల గోత్రము వాడు.

ఇటికెల గురవయ
- చెన్నమసెట్టి (భార్య లక్ష్మమ్మ)
  - తిమ్మయ్యసెట్టి (గ్రంథకర్త)
    - బుచ్చన
    - సంగన
  - గురవయ

ఈతని కాలనిర్ణయము చేయుటకు సరియగు సాధారములు దొరకలేదు. కాని యీతడు క్రీ. శ. 1829 ప్రాంతములకు ముందున్నటుగా 7 కావలి వెంకటరామస్వామిగారు రచియించిన కవుల చరిత్ర నుండి తెలియుచున్నది.

అంత కెంతముందు వాడో తెలుసుకొనుటకు, కన్యకా చరిత్ర తాళపత్రప్రతులు తోడ్పడగలవు. ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారములోని ప్రతులలో రెండింటియందు విలేఖరులు తెలిపిన కాలముగలదు.

1. సంఖ్య. 1843. కావేరీ సముద్రము గోవిందప్ప. ప్రమోదూత నామసంవత్సర శ్రావణ శుద్ధ ప్రథమా బుధవారము.

2. సంఖ్య. *R* 1048.

కీలక సంవత్సర పుష్య బ 12 గురుగుంట్ల నాకం గురప్ప వ్రాసినది. కన్యక చరిత్ర.

3. ఆంధ్ర సాహిత్య పరిషత్తులో నీ కన్యకా చరిత్ర ప్రతి గలదు. సంఖ్య 1537.

పరాభవ నామసంవత్సర మాఖ శు ౨ లు చేబ్రోలి ఆదెప్ప కుమారుడు రామన్న వ్రాసిన ప్రతి.

పై వానిలో వారము పేర్కొనిన మొదటి విలేఖనము మనకు సాయపడును. ప్రమోదూత శ్రావణ శుద్ధ ప్రథమ బుధవారము క్రీ. శ. 1740 అగస్టు 18 తేదిఅగుచున్నది. కావున తిమ్మయసెట్టి అంతకు ముందున్నవాడని మాత్రమే ప్రస్తుతము మనము చెప్పగలము.

[సశేషము]

---

7. *Biographical Sketches of Deccan poets Cavalley Venkata Ramaswami 1829.*

ప్రవాసము

శ్రీ మురయా

ఇక నేనెట్లా బ్రతకాలి? నాకు దిక్కెవరు? నాకు దారేమిటి? అని మళ్ళీ మళ్ళీ అనుకొంటూ దీర్ఘ నిశ్వాసాలు విడుస్తూ పూరి గుడిసె ముందు కూర్చుని ఉండి పోయాడు పేరయ్య. పొర్లి పొర్లి వస్తున్న దుఃఖాన్ని ఆపుకోలేక వెక్కి వెక్కి ఏడుస్తూ మధ్య మధ్య కళ్ళ నీళ్ళు తుడుచు కొంటున్నాడు.

సూర్యుడు పగలంతా ఆకాశంలో ప్రయాణం చేసిచేసి పశ్చిమాన చింతతోపు వెనుకగా అస్తమించ బోతున్నాడు. చింతతోపంతా ఎఱ్ఱ వారింది. చింత చిగుళ్ళు ఎఱ్ఱని సూర్యకాంతులలో మెరసి పోతూ గాలికి కదులుతూ కులుకుతున్నాయి.

కాని, పాపం, పేరయ్యకు సూర్యుడ స్తమించ బోతున్నాడన్న విషయం పట్టనే లేదు. అవును సూర్యు డుదయించునప్పుడావిషయం పట్టిందా ఇతనికి, ఇప్పుడు ఈవిషయం తెలియడానికి. అసలు అతనికి తిండివిషయ మొకటే పనికి తేగదా ఇతర విషయాలు పట్టడానికి. తండ్రి పోయిన ఆరెండు రోజుల్నించీ అతనల్లాగే వున్నాడు.

పేరయ్య తండ్రి వెంకన్నకాపు మొదట్లో ఆస్తకలవాడే. రెండెకరాల స్వంతభూమీ, కవులుకు పుచ్చుకొన్నది మరి కొంతా కలుపుకొని వ్యవసాయం చేసుకొంటూ కృష్ణాపురంలో జీవనం గడుపుతూ వచ్చాడు. ఏమీ దిగుళ్ళు లేకుండా సంసారం సాఫీగానే సాగింది సాగినంతకాలం. పన్నాలుగేళ్ళ క్రిందట పుట్టిన పేరయ్య తరువాత మళ్ళీ సంతానం కలుగకపోయినా ఆవిషయమై వెంకన్న ఎన్నడూ ఏమీ అనుకోలేదు. అతనూ అతని భార్యా పేరయ్యను ఎంతో గారాబంగా పెంచుకొన్నారు.

కాని పాపం వరుసగా నాలుగేళ్ళు పొలాలు పండక పోయేసరికి వెంకన్న అప్పులపాలైపోయాడు. కష్టాలన్నీ ఒక్కసారే వచ్చాయి. భార్య జబ్బుపడి మంచాన పడ్డది. ఆమెకు వాడిన మందులకూ మాకులకూ బోలెడు ఖర్చయింది. చివరకో రోజున ఆమె తను గారాబంగా పెంచుకొంటున్న కొడుకునూ, తన జబ్బు నయం చేయించాలని తాపత్రయ పడుతున్న భర్తనూ వదిలి వేసి వెళ్ళిపోయింది.

అంతే—ఆవిడచావుతో కుటుంబం కూలి పోయింది. వెంకన్నకు అప్పటికే వయసూ మళ్ళింది. ఇటు భార్య మరణానికీ అటు అప్పులవాళ్ళు పెట్టే బాధలకూ వేగలేక అటు అప్పులు తీర్చే మార్గాంతరాలు కన్పించక, ఇటు ఇల్లు దిద్దుకొనే దారి తెలియక దిగులుపడి దిగులుపడి మంచాన పడ్డాడు. చివరకు తనకున్న పొలంఅంతా అప్పుల వాళ్ళకు వ్రాసి ఋణ విముక్తు డయ్యాడు. దాంతో దారిద్ర్య మా యింట్లో తాండవించింది. ఆతరువాత మూడు నెలలకు తాను దారిద్ర్యమనుభవిస్తూ దాన్నే కొడుక్కు ఆస్తిగా మిగిల్చి పరలోకాల్లో సంపదలూ, దారిద్ర్యమూ అనేవి ఉంటాయో ఉండవో చూద్దామని వెళ్ళిపోయాడు.

అప్పటిదాకా తల్లి దండ్రులచాటున గారాబంగా పెరిగి ఒక్కసారి దిక్కు లేనివాడై పోయేసరికి పేరయ్యకు ఏం చెయ్యాలో, ఈ ప్రపంచంలో ఎల్లా బ్రతకాలో పాలు పోలేదు. అందుకనే అతనల్లా ఏడుస్తూ కూర్చుండి పోయాడు. పొలంవెళ్ళి తిరిగి వస్తూ చింతతోపుకు దగ్గరగా వున్న వెంకన్న గుడిసెముందుగా వెడుతూ పేరయ్యను చూచారు రామయ్యగారు.

'అదేమిటిరా అబ్బీ! అసురసంధ్యవేళ అల్లా ఏడుస్తూ కూర్చున్నావు' అంటూ దగ్గరకు వచ్చి కాసేపు ఓదార్చి "చూడ్రా అబ్బీ! మనకోటివాళ్ళకు జరిగిపోయినదానికి ఏడుస్తూ కూర్చుంటే ఎల్లా గడు

స్తుందిరా? ... అదంతా మర్చిపోయి, పోయి ఏదైనా కష్టం చెయ్యి. భుక్తి గడుస్తుంది. లేలే!" అని అతని చేతిలో ఓరూపాయి పెట్టి రామయ్యగారు వెళ్ళిపోబోతుంటే పేరయ్య అమాయకంగా "ఏమండీ రామయ్యగారూ! ఎవర్ని అడగమంటారండీ? ఇప్పటివర్ని అడిగినా పని దొరికేటట్టు కన్పించటం లేదు. కాస్త మీరే ఎక్కడైనా నన్ను ఏదో పనికి కుదర్చండీ?" అని అడిగాడు. ఆయన కొంచెం విసుక్కుంటూ "అవన్నీ నే నెక్కడ చూస్తానూ! ఏదో పాపం అని ఓమాట చెప్పాను." అంటూ వెళ్ళిపోతూ నాలు గడుగులు వేసి మళ్ళీ వెనక్కి తిరిగి "చూడు పేరయ్యా! మనవూళ్లో మంచినీళ్ళకు చాలా ఎద్దడిగా వుందికదా!..... నువ్వు ఒపని చెయ్యొచ్చు; ఓ కావడి వేసుకొని, మనపొరుగున వున్న మంచినీటి బావికి వెళ్ళి నీళ్ళు తెచ్చి పదిమంది ఇళ్లల్లో పోస్తే ఆనో జీవనాధారం కాకపోదు. చూడూ అదే మంచిది—అల్లా చెయ్యి—నిజం కావాలీ అంటే కావడీ కుండలూ నేనిస్తానుగా—రా! ఈపూట మాయింట్లో నే భోజనం చేసి రేపు తెచ్చుకొందువుగాని" అని చెప్పి కిర్రుచెప్పులు చప్పుడు చేసుకొంటూ రామయ్యగారు వెళ్లి పోయారు.

రామయ్యగారు వెళ్లిపోయిన తర్వాత పేరయ్య కొంతసేపు ఆలోచించాడు. ఎంత ఆలోచించినా అంతకంటే వేరే ఉపాయం తోచలేదు. "సరే ఇప్పటికిదే బావుంది" అనుకొని అందుకు సిద్ధమయ్యాడు. మరునాడు ఉదయాన్నే దాని క్కావలసిన ఏర్పాట్లు పూర్తిచేసుకొన్నాడు.

ఊళ్లోకల్లా వీరయ్య చౌదరిగారూ, సుబ్బయ్య నాయుడుగారూ—ఈ యిద్దరే భాగ్యవంతులు. మూడోవాణ్ణి చెప్పుకోవాలీ అంటే అవూరి షావుకారును చెప్పుకోవాలి. పేరయ్య వీళ్లి ముగ్గురి విషయమై ఆలోచిస్తా—"ఈముగ్గురి యిళ్ళల్లోనూ కుదిరిందీ అంటే, ఇహ తిండి గడుస్తుంది" అనుకొంటూ ముందు నాయుడిగారింటికి వెళ్లాడు. ఆయన వీధి అరుగుమీద కూర్చుని పళ్లుతోముకుంటూనే "ఏరా పేరయ్యా ఇల్లా వచ్చావు... అవును పాపం అంతా అల్లా జరిగిపోయింది.... పాపం చివరి కల్లా జేసి పోయాడు వంకన్న—సరే [illegible]ని మరిప్పుడేం చెద్దామనుకుంటున్నావు?"

అంటూ పలకరించారు. పేరయ్య చేతులు కట్టుకొని నిలబడి చాలా వినయంగా తనువచ్చిన పని అంతా చెప్పుకొన్నాడు. ఆయన మారుమాట చెప్పకుండా "బిందెకు నెలకు రూపాయి యిస్తాను. ఓ ఐదు బిందెలు పోస్తూవుండు" అన్నారు నాయుడుగారు.

అదేవిధంగా వీరయ్యగారితోనూ చెప్పుకోగానే ఆయనా వెంటనే సరే అన్నారు. "బాగానే వుంది. చూడు పేరయ్యా అల్లాగే చెయ్యి—మన యింట్లో పది పన్నెండు బిందెలు పొయ్యి—చూడూ ముందిక్కడ పని అయ్యాక తర్వాత ఎక్కడైనా పోసుకోవచ్చును" అని చెప్పారు. పేరయ్య సంతోషంగా సరే నండీ అని షావుకారుదగ్గరకు వెళ్లాడు. కొట్టుమీద కూర్చున్న షావుకారు పేరయ్యను చూడగానే "ఏంరా పేరిగా! ఇల్లా వచ్చావూ! సరుకేమైనా కావాలా? పట్టుకెళ్లు; కాని అప్పుమాత్రం పుట్టదు. అసలు అప్పు ఇవ్వటమంటే నాకు గిట్టదని నీకు తెలుసుగా" అన్నాడు.

"అబ్బే అదికాదండీ - విషయమేమిటంటే... అంటూ తన సంగతంతా చెప్పుకొన్నాడు. అల్లాగని చెబుతూ చూడండి షావుకారుగారూ! ఏదో ఈవూళ్లో పుట్టి పెరిగాను; ఏదో విధంగా బ్రతకాలా ...వాళ్లిద్దరూ సరే అన్నారు; మీరో నాలుగు బిందెలు పోయించుకొన్నారంటే నాకేదోవిధంగా తిండికి గడుస్తుంది. "ఆ బాగానే వుంది; నేనూ అనుకొంటూనే వున్నా...; మొన్న వాడు లేడూ—ఆ గోపాలంగాడు వాడు పోస్తానన్నాడు. ఊళ్లో అందరికీ అవసరం కానప్పుడు నాకుమాత్రం నేనికి అని ఊరుకొన్నా—నువ్వేదో బ్రతిమాలుతున్నావా... సరే పొయ్యి నాకూ నాల్గు బిందెలు. బిందె అర్ధరూపాయికాడికి చేసి పొయ్యి" అన్నాడు షావుకారు.

అదేమిటండీ షావుకారుగారండీ! వాళ్లిక్కో రేటూ మీ కోరేటూనా అండీ... అది ధర్మమేనా! ఏదో నామీద దయవుంచి మీరూ ఆకాడికే పోయించుకోండి" అన్నాడు పేరయ్య బ్రతిమాలుతున్నట్లుగా.

"అబ్బే - ఆకాడికి నాకు గిట్టదురా!" అన్నాడు షావుకారు—అదీ ఒక వ్యాపారంలాగా నే. కాని పేరయ్య అతన్ని వదలలేదు. చివరకిద్దరికీ

ఒక ఒప్పందం కుదిరింది - బిందె ముప్పావలాకు పోసేటట్లూ ఆవార అతనికిచ్చే సరుకులో షావుకారు కాస్త లాభం తగ్గించుకొని ఇచ్చేటట్లూ.

ఆ మరునాటినుండే పని మొదలుపెట్టాడు పేరయ్య. తెల్లవారకముందే నాలుగు గంటలకల్లా లేచి బావికి వెళ్లి నీళ్లకావడి భుజాన పెట్టుకొని ఉరుకులు పరుగులు తీస్తూ, ఈల వేసుకొంటూ ఊళ్లోకి వచ్చేవాడు. పని మొదలు పెట్టాక విచారం అంతా పోయింది. మొదట్లో బావినుంచి పది పన్నెండు సార్లు తిరగడమంటే ఆట్టే కష్టమనిపించలేదు. అందువల్ల ఇంకా కొన్ని చిన్న చిన్న బేరాలు వస్తే కాదనలేదు. మొత్తం మీద నెలకో ముప్పయి రూపాయలు గిట్టుతూవచ్చాయి. పని ఎక్కువయినకొద్దీ పూర్వంకంటే ఇంకా పెందరాళే నిద్రలేవడం నేర్చుకొన్నాడు. ప్రొద్దున మూడు గంటలకు మొదలుపెడితే మధ్యాహ్నం పదకొండు గంటలకల్లా పని పూర్తయ్యేది. ఇంటికి వస్తూ దారిలో అక్కడా ఆక్కడా కాసేపు ఆగి పన్నెండు కాకముందు గుడిసె చేరుకొని అప్పుడు కాసిని బియ్యం పప్పు వుడకేసుకొనేవాడు.

పేరయ్యకు మొదట్లో - చిన్నదే అయినా బావురుమంటున్న ఆ గుడిసెలో ఒంటరిగా భోజనం చెయ్యడమన్నా, నిద్రపోవడమన్నా ఏదో దిగులుగా వుండేది. కాని క్రమంగా అలవాటయి పోయింది. మెల్ల మెల్లగా తన కింట్లో కావలసిన వస్తువులన్నీ ఒక టొకటి కొనుక్కున్నాడు పేరయ్య. ఒక నులకమంచం, రెండు గొంగళ్లూ, ఓజత ముతక పంచలూ అవీ కొనడం పడింది.

కావడి కుండల స్థానంలో తెల్లగా మెరుస్తున్న కడవలు వచ్చాయి. కావడిబద్దకు మధ్య మధ్య పట్టీలు వేయించుకొన్నాడు. తర్వాత నాయుడిదగ్గర పదీ పరకా దాచుకోవడం మొదలు పెట్టాడు.

నాయుడుగారు వారి పెద్దమ్మాయి వివాహం ఆయేడే చేశారు. ఆనాలుగు రోజులూ వచ్చిన చుట్టాలకూ స్నేహితులకూ నీళ్లు అవీ అందిస్తూ రాత్రింబవళ్లు అక్కడే గడిపాడు. ఆ నాల్గు రోజులకూ నాయుడుగారు మరో పదిరూపాయలు అదనంగా ఇచ్చారు. అట్లావచ్చిన పదీ గాకుండా పేరయ్యకు మరోకవిధంగా కొంత డబ్బు లభించింది అనుకోకుండా. నాయుడిగారి కొత్తఅల్లుడు స్నానానికి దొడ్లోకి వచ్చి రిస్టువాచీ తీసి బావిగట్టు మీద పెట్టి దానిమీద తువ్వాలుపడేసి స్నానంచేసి తువ్వాల చివాలున లాగేసరికి వాచీ బావిలో పడి పోయింది. అసలే పెద్దబావి. అందులోనూ ఉప్పు నీటి బావి కావడంచేత ఆ బావినీటి వాడకం తక్కువ. అందువల్ల అది చాలా లోతు.

కొత్త అల్లుడు చాలా గాబరా పడ్డాడు. వాచీ రెండు వందల ఖరీదు. పైగా పెళ్లిలో పెట్టింది. అప్పుడే పోయిందీ అంటే అందరూ నవ్వుతారు. అందుకని పేరయ్యను పిలిచి వాడికి అనేక విధాల చెప్పి "ఒరేయి నువ్వెగనుక వాచీ తీసియిస్తే నీకు పాతిక రూపాయల బహుమానం ఇస్తానురా" అన్నాడు. పేరయ్య భయపడుతూ భయపడుతూ బావిలో దిగాడు. మొదట్లో లోతు అంతుపట్టలా. అరగంటసేపు నానా అవస్థాపడి మొత్తంమీద ఆ పని సాధించాడు పేరయ్య. కాని ఆ అబ్బాయి డబ్బు యిస్తుంటే ఆడబ్బు చూడగానే అంత డబ్బు తనకు ఎంత కష్టపడితే వస్తుందా అని ఆలోచించాడు. "చూడండి చిన్నయ్యగారూ. డబ్బు మాత్రం ఇవ్వద్దు; అయ్యగారికి తెలిస్తే...అయ్య బాబో...అయినా నాకెందుకూ వద్దండీ" అని వెళ్లి పోతూంటే ఆ అబ్బాయి వెంట వెళ్లి బలవంత పెట్టి "తీసుకోరా! నువ్వు నిజంగా నా పరువు కాపాడావు—అయినా నేనేమైనా కష్టపడి సంపాదించానా ఏమన్నానా.—నాకు పదివేలు కట్నమిచ్చారు—అందులో ప్రస్తుతానికి నాకో వెయ్యి స్వంత ఖర్చులక్రింద చిక్కాయి. పుచ్చుకో... అయినా నేనెవరితోనూ అనను" అన్నాడు.

చివరకా డబ్బు పేరయ్య పుచ్చుకోక తప్పింది కాదు. ఆడబ్బు కూడా నాయుడిగారిదగ్గరే దాచుకొన్నాడు. ఆ యేడాది చివరిలో అంతా కలిపి నాయుడుగారతనికి తొంభై రూపాయ లిచ్చారు. ఆడబ్బు బొడ్డులో పెట్టుకొని ఓ రోజంతా ఎంతో ఆనందంగా తిరిగాడు. ఎంతో ఆలోచించాడు. ఓరోజు రాత్రి చౌదరిగారు భోజనానంతరం చుట్ట కాల్చుకొంటూ దొడ్లో మంచంమీద కూర్చున్నప్పుడు వారికి దూరంగా నేలమీద ఆయన కాళ్లి

దగ్గరగా కూర్చున్నాడు పేరయ్య. కొంతసేపయ్యాక పేరయ్య వినయంగా అయ్యగారూ - మీదయవల్ల భుక్తికి ఏలోటూ లేకుండా గడుస్తోంది. మీరందరూ నన్నెంతో దయగా చూస్తున్నారు. అందువల్లనే నాకు ఓ పదిరాళ్లు మిగిలినాయి. ఇప్పుడు నాదగ్గిర తొంభై రూపాయలున్నాయి. దానికి మీరు పదో పరకో కలిపితే నాకోపని చేద్దామని వుంది... ఓ చిన్న పీపాబండి కొందామని వుందండీ..."అంటూ చెప్పుతూ ఆశగా వారివంక చూస్తూ ఉండిపోయాడు పేరయ్య. చౌదరిగారు ఒక్క క్షణం ఆలోచించి "సరేపో వెళ్ళి మన వడ్రంగిని చెయ్యమను; నీదగ్గిర వున్నదంతా ఇచ్చేసి మిగతాది నే నిస్తానని చెప్పి చేయించుకో." అన్నారు.

పేరయ్యకు పట్టరాని సంతోషం కలిగింది. వారిని ఎల్లా అభినందించాలో అతనికి తెలియలేదు. "అయ్యగారూ! ఆ ఋణంలో కొంత భాగం నేను నీళ్ళు పోసి తీర్చుకొంటానండీ" అన్నాడు పేరయ్య. అన్నీ యేడ్చావులే పోరా! పోయి చెయించుకో తర్వాత చూద్దాం మిగతా సంగతులు—సరే ఇహ వెళ్ళు—పోయి పడుకో." అన్నారు చౌదరిగారు. అతనంటే వారికి ఎంతో జాలీ, ప్రేమా వున్నాయి.

పేరయ్య దారిపొడుగునా వీరయ్యచౌదరి గారి దయాగుణాన్ని వేయివిధాల పొగడుకొంటూ, వారికి సంపూర్ణమైన ఆరోగ్యమూ, సంపదా కలుగ చేయమని దేవుడికి పదిసార్లు మొక్కుకుంటూ నడిచి చేరుకొన్నాడు.

పేరయ్య ఊహించిన దానికంటే వెయ్యి రెట్లు అమరికగా కుదిరింది పీపాబండి. దాన్ని ప్రస్తుతానికి చేతులతోనే లాక్కుపోవడానికీ ముందు ముందు వీలుపడితే ఓచిన్న ఎద్దును దానికే కట్టుకోడానికీ కావలసిన ఏర్పాటుతోనే చేసి యిచ్చాడు వడ్రంగి.

ఒక మంచిరోజు చూచుకొని పీపాకు ముందు వైపు పసుపు కుంకుమలు రాచి, కొబ్బరికాయలు కొట్టి దాన్ని ఊళ్ళోంచి బావికి సంతోషంగా గర్వంగా లాక్కుని వెళ్లాడు పేరయ్య. అతని వయసువాళ్లే ఆ వూళ్ళో పోమరిపోతుల్లాగా తిరిగే కొందరు అతన్ని చూచి ముసిముసిగా నవ్వుకొన్నారు చాటుగా. మరి కొందరు అతని ముఖంమీదే నవ్వారు. కాని పేరయ్య వాళ్ళను అసలు లెక్క చెయ్యలేదు.

కడవలతో తోడిపోస్తే దాదాపు పాతిక కడవల నీళ్లు పట్టింది. చివరి కడవతో నీళ్ళు పీపా మూతిలోకి పోస్తూ "అమ్మ నాయనో—ఇంత బరువు నేను లాగ గలనా" అనుకొన్నాడు. కాని పది పన్నెండుసార్లు అటూ ఇటూ తిరగడం తప్పింది కదా అన్న సంతోషంతో దాన్ని బలంగా లాక్కుపోవడం మొదలు పెట్టాడు పేరయ్య. కాని కొంచెం దూరం పోయే సరికే అలుపు వచ్చింది.

ఆ దారినే ఎడ్లబండీమీద యింటికి పోతున్న రైతు ఇతన్ని చూచి క్రిందకు దిగివచ్చి "అట్లా కాదోయ్ పిచ్చిపేరయ్యా లాగుడుబండీ లాగడం" అంటూ భుజంమీద కాడి ఆనించి ముందుకు నడుస్తూ బండి లాగడం చూపించాడు. ఆ విధంగా చేసి చూసే సరికి పేరయ్యకు పీపా బండిలాగడం చాలా తేలికైన పని అని అనిపించింది. వారం గడవకముందే ఆ బండీ లాగడం అతనికి సులువుగా అలవాటయిపోయింది.

'కష్టపడి పనిచెయ్యాలే గాని ఏదోవిధంగా జీవితం గడవకపోదు' అనుకొన్నాడు పేరయ్య. భుజంమీద కాయలు కాయడం చూచుకొని అవి అప్పుడప్పుడు అసహ్య మనిపించినప్పుడల్లా 'పోనీలే మరేం ఫరవాలేదు. ఇంతలోకే నాకేమీ నామోషీ రాలేదు; కష్టపడి పనిచెయ్యడం నేర్చుకొన్నాను గనుక నే రోడ్లమీద అడుక్కొని తిరిగే దుర్గతి నాకు తప్పింది' అనుకొనేవాడు పేరయ్య. పీపా చేతికి వచ్చాక పేరయ్యకు బేరాలు ఎక్కువయ్యాయి. మొదట్లో ఒక్కసారి వెళ్ళివస్తే సరిపొయ్యేది. ఇప్పుడు రెండు మూడు సార్లుకూడా వెళ్ళిరావలసి వస్తోంది. పాతవాళ్లు తప్ప కొత్తవాడికలవాళ్లు డబ్బు కొంచెం తక్కువ యిస్తున్నారు. అయినా పేరయ్య సంతోషంగా వాళ్ళందరికీ నీళ్లు పోశాడు. ఏడాది తిరక్కముందే పేరయ్య నల్లగా పొట్టిగా బలంగా వుండే ఓ గిత్తను కొనేశాడు. గిత్తను బండికి కట్టి ఆ ఊరిముఖ్య వీధిలోంచి బండీ తోలుకొని పోతున్న రోజున వాడిహృదయంలో కలిగిన ఆనందం ఇంతా అంతా కాదు. గుడిముందు బండీనాపి—తాడు బండిచక్రానికి కట్టేసి గుళ్లోకి వెళ్లి దేవుడికి వెయ్యి నమస్కారాలు పెట్టి—ఎద్దుకు పసుపూ కుంకుమా

పెట్టి గర్వంగా దానికి తోలుకొనిపోయాడు పేరయ్య. బండీ పూరువదలి డొంకలోకి వచ్చాక దానిమీదకు ఎక్కి కూర్చుని 'అమ్మయ్య ఇప్పటికి నా కష్టాలు గట్టెక్కాయనే అనుకోవచ్చు' అనుకొన్నాడు.

ఒక్కొక్కరోజున ఆ డొంకలోంచి బండీ తోలుకొంటూ వస్తూ "భగవంతుడి దయవల్ల మా వూళ్ళోకి కంకరరోడ్డు పడితే ఎంత బావుండు" అనుకొంటూ వుండేవాడు. ఆ తర్వాత కొన్నాళ్ళు అతని జీవితం బాగా గడిచిందనే చెప్పాలి. నెలకో తొంభైరూపాయల దాకా గిట్టుతున్నాయి.

పేరయ్య కొత్త మంచి బట్టలు వేసుకొని తిరుగుతున్నప్పుడు ఆ వూళ్లో కొంతమంది చూసి నిజంగా సంతోషించారు.

'పోనీలే పాపం. ఓదారినిపడ్డాడు ఇక ఫర్వాలేదు' అనుకొన్నారు.

అతని యీడువాళ్లు కొంతమంది అతన్ని చూచి 'ఒరేయ్ నా డొట్టి పీనాసివెధవరా—కానీ పెట్టి ఓ బీడీకూడా కొనుక్కోడు—ఇంతకుముందెప్పుడైనా డబ్బులు చూసినవాడైతేగా' అనుకొనేవాళ్లు.

బలంకలవాడైనా తనయీడువాళ్ళతో సరదాకైనా దెబ్బలాట్లకుపోయేవాడుకాదు పేరయ్య. అందువల్ల పిల్లలు వాడు పిరికివాడని, కొంతమంది పెద్దవాళ్ళు వాడు చాలా బుద్ధిమంతుడనీ అనుకునేవాళ్లు. నాయుడిగారి పొలం చేస్తున్న పెద్దకాపుకొకరోజున ఓ మంచి ఆలోచనవచ్చింది. ఆ ఆలోచన తట్టినందుకు తనకుతానే అభినందించుకొంటూ గబగబా ఇంటికి వెళ్లి భార్యతో ఆ విషయం ప్రస్తావించాడు. రెండు నిమిషాలయ్యాక తానొక నిశ్చయానికి వచ్చేస్తూ 'చూడూ! వాడు చాలా బుద్ధిమంతుడు. వృద్ధిలోకి వస్తున్నాడు. మనకంతకంటే మంచి అల్లుడు దొరుకుతాడా!—కుటుంబం విషయమా వెంకన్న బావ విషయం మనం అందరం ఎరుగున్నదే. మన పెద్దమ్మాయి చాలా సుఖపడుతుంది. నువ్వు సంతోషంగా సరే అను" అన్నాడు.

ఆదివారోజే, వెంటనే వెళ్ళి తన అభిప్రాయం అంతా నాయుడిగారితో చెప్పి అందుకు ఆయన సహాయాన్ని అపేక్షించాడు. ఆయన 'సరే లేరా—నేను చెబుతాలే' అన్నారు. మరునాడు పేరయ్య వచ్చినప్పుడు నాయుడుగారు వాడితో 'చూడు పేరయ్య—ఇవ్వాళ నీతో విషయం చెప్పాలి. ఆ ఏంలేదు. నువ్వు ఇప్పటికో దారినపడ్డావు. ఏదో నాలుగురాళ్లు సంపాదించుకొంటున్నావు—ఇప్పుడే ఓ యింటివాడివికా. మరొకటి—నీకూ వెనక దిక్కూమొక్కూ లేరా—ఇప్పటికైనా సంసారం అంటూ ఏర్పడితే మంచిది. అదీగాక ఈ వయస్సులో నాలుగుడబ్బులు సంపాదిస్తున్నప్పుడు ఏ చెడ్డ వ్యసనాల్లో పడ్డావా—ఇక అంతే—అనుక నే చెప్పినట్టుగా పెళ్లిచేసుకో. మన వాడువచ్చి పిల్లనిస్తానంటున్నాడు. నువ్వు ఇంకేమీ మాట్లాడకు. ఆ తర్వాత సంసారానికి డబ్బు కావాలైనా ఇబ్బందివస్తే ఇటు నేనున్నాను—అటు రేపుకూడా చౌదరిగారున్నారు' అన్నారు నాయుడుగారు.

పేరయ్య ఒక్క నిమిషందాకా ఏమీ అనలేదు. అతని హృదయంలో తను ఎన్నడూ ఊహించని కొత్త ఆనందమేదో ఒక్కసారి పొంగివచ్చింది. కొంచెం సిగ్గుపడుతూ 'సరేనండీ' అన్నాడు. నాయుడుగారి విషయం చెప్పగానే వీరయ్యగారు విని నిజంగా ఎంతో 'సంతోషిస్తూ మంచిపనే నండీ...ఏదో మీరు పూనుకొని మన పేరయ్యను ఓ యింటివాణ్ణి చెయ్యండి.' అన్నారు.

అందరూ అనుకొన్నట్లుగానే పేరయ్యకు ఆ యేడే వివాహమయింది.

చౌదరిగారి దయవల్ల పేరయ్యగుడిసె ఒక చక్కనిపాకగా మారిపోయింది. వారింట్లో పనివాళ్లే వచ్చి పాకవేసి మట్టిగోడలూ దర్వాజాలూ పెట్టి వెళ్లారు.

పెళ్లిఅయిన కొద్ది నెలలకే పేరయ్యభార్య కాపరానికి వచ్చింది.

పేరయ్యభార్య నాగమ్మ చాలా చురుకైన పిల్ల. అందగత్తె కాకపోయినా చూడటానికి ముచ్చటగా వుంటుంది. మనిషి చామనచాయే అయినా వయసులో ఉన్నందున నాగమ్మ ఎఱుపనిపిస్తుంది. అన్నిటికంటే ఎక్కువగా పేరయ్య చూసి సంతోషించింది ఆమెలో సహజంగా వున్న సుగుణాలను.

'నాగమ్మ ఎంత మంచిదీ!—ఎంత పొదుపు గలదీ! ఎంత అనుకూలవతీ! ఇంతకంటే నాకేం కావాలీ' అనుకొనేవాడు పేరయ్య.

కాపురానికి వచ్చిన రెండు నెల్లల్లోనే సంసారాన్ని చక్కగా దిద్దుకుపోవడం నేర్చుకొంది. ఇంటికి కావలసినవన్నీ సమకూర్చుకొంది.

'నువ్వు వంట ఎంత బాగా చేస్తావే—నాకింత మంచి భోజనం దొరుకుతుందని నే నెప్పుడూ అనుకోలేదు', అంటూ తరచు మెచ్చుకొనేవాడు పేరయ్య.

పొదుపుగా వాడటంవల్ల మిగిలిన డబ్బుతో ఆ యేడాది చివరలో నాగమ్మ ఓ పాడి గేదెను కొనగలిగింది.

ఒకరోజున పేరయ్య గడ్డపెరుగు వేసుకొని తింటూ 'పెరుగు వేసుకొని తినేటంత భాగ్యం కలిగిందన్నమాట—ఓస్ పిరికేమిటి నువ్వు నాకు దొరకటం అచ్చంగా భాగ్యం కాదూ!' అన్నాడు పేరయ్య నాగమ్మవంక చూసి నవ్వుతూ. 'అహా! అల్లాగేం?' అంటూ ముసిముసి నవ్వులు నవ్వుతూ సిగ్గుపడింది.

పేరయ్యకు తనముందు ముత్యాలు వెదజల్లినట్లనిపించింది.

పేరయ్య సంపాదన నిరాటంకంగా సాగిపోతోంది. అరోజు కారోజు అవృత్తి లాభదాయకంగా కన్పిస్తూ వచ్చింది. తిండికి సరిపోగా తనకూ నాగమ్మకూ బట్టలు కొనుక్కోగా డబ్బు కొద్దిగా మిగులుతుండేది. కష్టపడినకొద్దీ లాభం కన్పించింది. లాభం కన్పించినకొద్దీ కష్టపడటం అలవాటు చేసుకొన్నాడు పేరయ్య. అక్కడి బావిదగ్గిర అన్ని కడవల నీళ్ళు తోడిపొయ్యడం—ఊళ్లో ఆ నీళ్లు మోసుకొనిపోయి ఇళ్లల్లో పొయ్యడం—ఇదంతా నిజంగా కష్టమైన పనే. కాని పేరయ్యకు అలవాటయిపోయింది. 'ఏదైనా ఇంతే—అలవాటులో వుంది. కష్టమేమిటి నా మొహాం; దేవుడు నాకు బలాన్నిచ్చింది కష్టపడటం కోసం కాదూ!' అనుకొనేవాడు పేరయ్య తను ఎక్కువ కష్టపడుతున్నానేమో అన్న ఆలోచన వచ్చినప్పుడల్లా.

అప్పుడప్పుడు అతని భార్య నాగమ్మకూడా ఆ విషయమై అంటూ వుండేది. 'నువ్వు మరీ ఎక్కువగా కష్టపడుతున్నావు. మరింక క్రొత్త చేరాలేమీ వొప్పుకోవద్దు. డబ్బు అవసరమేననుకో. చూడూ నీకో విషయం చెప్పాలనుకొంటున్నాను. ఇక్కడ నేను వెన్న తేలిగ్గా పోసుచేయగలను. అది కాచి బస్తీకి పట్టుకెళ్లి నాలుగయిదు ఇళ్లల్లో వాడుకలు పెట్టుకొనివస్తా. అందువల్ల తక్కువ శ్రమతో మనకు ఎక్కువ లాభం వస్తుంది. ఏమంటావూ?' అని అడిగింది నాగమ్మ.

'అబ్బే—అటువంటి పనులు నువ్వేమీ చెయ్యొద్దు. నే నేదో కొత్త సంపాదిస్తున్నానని మీ అయ్య నా చేతుల్లో పెట్టాకు సుఖపడతావని. ఈ పనులన్నీ ఆయనకు తెలిస్తే ఆయన చాలా నొచ్చుకొంటాడు. వద్దు—వద్దు—అంతగా మన కింకా డబ్బు అవసరమైతే—ఇంకా కొంత్త కష్టం నేనే చేస్తాను." అన్నాడు పేరయ్య.

ఆ విషయమై వాళ్లిద్దరి మధ్య కొంత వివాదం జరిగింది. కాని నాగమ్మ అతని కా విషయం కేవలం ఇష్టంలేదన్న సంగతి గ్రహించాక మళ్ళా ఏమీ అనలేదు.

తర్వాత వాళ్ళిద్దరూ ఆ విషయమై మర్చిపోయి మామూలు ధోరణిలో పడ్డారు.

ఆయేడే కృష్ణాపురంలో కొన్ని మార్పులు జరిగాయి. వీరయ్యగారూ సుబ్బయ్యగారూ ఇద్దరూ కలసి చాలా కృషిచేసి పైవాళ్లకు నచ్చచెప్పి కృష్ణాపురంనుండి బస్తీకివెళ్లే పెద్ద రస్తాకు రోడ్డు వేయించారు. కృష్ణాపురంకు దక్షిణంగా మైలుదూరం వెళితే బస్తీకి వెళ్ళే కంకరరోడ్డు వస్తుంది. అక్కడదాకా రోడ్డువేయించుకొనేసరికి కృష్ణాపురంనుంచి బస్తీకి సరాసరి రోడ్డుపడినట్లయింది.

దాంతో ఆ వూళ్ళో జనం అంతా పొంగిపోయారు. మరీ పేరయ్యకు పట్టరాని సంతోషం కలిగింది. తను నీటిబావికవెళ్లేదారే అది. దాదాపు మైలు దూరం హాయిగా రోడ్డుమీదే బండితోలుకొని పోవచ్చును. పూర్వం డొంకలోబడి రావడమంటే కొంత బాధగాఉండేది. కాని యిప్పుడో! బలే—చక్కగా రోడ్డుపడింది. "హైరయ్" అనంగా నే సజ్జులా పరుగెడుతోంది ఎద్దు. అందుకని పేరయ్య అందరితోనూ వాళ్లిద్దర్ని గురించీ గొప్పగా చెప్పుకోవడం మొదలుపెట్టాడు. ఊళ్లోఅందరూ చెప్పుకొంటూనే ఉన్నారు—కాని వాళ్ళల్లో కొందరు నాయుడుగార్ని మరికొందరు వీరయ్యగారినీ ప్రత్యేకంగా మెచ్చుకోవడం మొదలుపెట్టారు.

నాయుడిగారి అల్లుడూ—జిల్లాబోర్డు ప్రెసిడెంటుగారి కొడుకూ ప్రాణస్నేహితులు. సుబ్బయ్యగారు తన అల్లుడితో అతనికి చెప్పించి తద్వారా ఈ పని సాధించారు. లేకపోతే ఇది అయ్యేదా!" అని నాయుడిగార్ని గురించి మెచ్చుకొనేవాళ్లంటే— అదేం కాదోయ్ — వెర్రివాళ్లల్లారా — చూశారూ మన వీరయ్యగారి పెద్దకొడుకు—డాక్టరు చేస్తున్నాడే ఆయనా మన జిల్లా కలక్టరుగారూ మంచి స్నేహితులు. వీరయ్యగారు తద్వారా కలక్టరుగారికి చెప్పించి వారిచేత సరాసరి ఆర్డర్ వేయించేశారు. కాకపోతే మరొకరి తరమా!' అంటూ వీరయ్యగారిని మెచ్చుకొనేవాళ్ళు అనడం మొదలుపెట్టారు. ఇట్లా వివాదాలు కొన్ని తలలెత్తాయి.

ఈ మాటలు అనోటా అనోటా బడి వాళ్లదాకా కూడా వచ్చాయి. కాని వాళ్లిద్దరూ ఏమీ అనకుండా అల్లా అనుకొనేవాళ్ల అమాయకత్వానికి లోలోపల నవ్వుకొని ఊరుకొన్నారు.

కృష్ణాపురంనుంచి బస్తీకి రోడ్డు పడటంతోటే వచ్చినవని చెప్పాలి ఆ వూళ్ళో కలతలు. ఇప్పుడు అప్పుడప్పుడు బస్తీనుంచి చిన్నకార్లలో నాయుడిగారింటికో చౌదరిగారింటికో పెద్దవాళ్ళు రావడం మొదలుపెట్టారు.

సుబ్బయ్యగారింటికి గాని వీరయ్యగారింటికి గానీ కార్లో ఎవరొచ్చినా వూళ్ళోవాళ్ళ సంగతి ఎల్లా వున్నా పేరయ్యమట్టుకు ముందుగా సంతోషపడేవాడు.

"చూశావురా రోడ్డుపడింది గనుక మనవూరికి ఇంతమంది పెద్దవాళ్లు వస్తున్నారు" అంటూ కనపడిన వాళ్లందరితోనూ చెప్పేవాడు.

పోరా పిచ్చిపేరయ్యా—ఏమిటి మనవూరికి సరే పెద్దవాళ్లే వస్తున్నారనుకో—వస్తే మన కొరిగిందేమిటి అంట?" అనేవాళ్లు వాడి మాటలు విన్నవాళ్లంతా.

కాని పేరయ్యదృష్టిలో అల్లాకాదు. ఆ వచ్చిన వాళ్లు ఊళ్లో అడుగు పెట్టినప్పటినుంచి వెళ్లిపోయే దాకా వాళ్లకు తనకు చేతనైన సేవ అల్లా చేసేవాడు. వెంట తీసికొనివెళ్లి ఊరు నాలుగుమూలలూ చూపించి వచ్చేవాడు—తన ఊరునుగురించి వెయ్యివిధాల మెచ్చుకొంటూ. ఒకరోజున ప్రొద్దున్నే పట్నంనుండి పెద్ద ఇంజనీరు ఒకాయన తన బృందంతో పాటుగా వచ్చి తనకు బాల్యమిత్రుడు కావడంచేత నాయుడిగారింట్లో బసచేశాడు. వాళ్లు రెండు చిన్నకార్లల్లో వచ్చారు. వాళ్లవెంట రెండు పెద్ద లారీలుకూడా వచ్చి అక్కడే ఆగాయి.

పేరయ్యకు పట్టరాని సంతోషమైంది. ఆ వచ్చింది పెద్ద ఉద్యోగస్థుడని చూచాయిగా తెలుసుకొన్నాడు. ఇక వాడా రెండురోజులూ పడ్డ హడావిడి ఇంతా అంతా గాదు. వీరయ్యగారింట్లోంచి పెరుగు తప్పేలాలు సుబ్బయ్యగారింటికి చేరవేశాడు. పొలాల్లో అక్కడా అక్కడా పండించుకొంటున్న కూరగాయలు మోసుకొనివచ్చాడు. కొంతమందిచేత అనవసరంగా చివాట్లు తిన్నాడు.

రాత్రి ఒంటిగంటకే లేచి తన నీళ్లపని తెల్లవారి ఆరుగంటలకల్లా పూర్తిచేసుకొని వాళ్లు నిద్రలేచేసరికి అందరికీ వేడినీళ్లు పెట్టి స్నానాలకు సిద్ధంచేశాడు. వాళ్లు స్నానాలు చెయ్యంగానే వాళ్ల తువ్వాళ్లూ అవీ శుభ్రంగా వుతికి ఆరవేశాడు. ఆపూట మధ్యాహ్నం భోజనాలయ్యాక మిగతావాళ్లంతా వెళ్లిపోయారు. పెద్ద ఇంజనీరుగారొక్కరే ఆపూట అక్కడా వుండిపోయారు నాయుడిగారి బలవంతం మీద. సాయంకాలమంతా నా రావూరు నాలుగు ప్రక్కలా తిరిగిచూసి పొలాలకు పోయివద్దాం రావోయ్" అన్నారు. పేరయ్య ఆయన్ను వెంటబెట్టుకొని అన్నీ చూపించివచ్చాడు.

ఆరోజు రాత్రి ఆయనకు వసారాలో ప్రక్కదులిపివేసి, వారు దానిమీద నడుము వాల్చాక ఆయనకు కాస్త దూరంలో పేరయ్య కూర్చుని వున్నాడు. ఆయన పేరయ్యను హృదయంలో కొంత అభినందించాడు. అటువంటి నౌకరు దొరకడం నాయుడిగారి అదృష్టమనుకొన్నారు.

ఇంజనీరుగారికి అగ్గిపెట్టి అందిస్తూ పేరయ్య వినయంగా "ఏమండీ దొరగారూ!—మీరూ, ఎలక్ట్రీ దీపాలకు సంబంధించిన పెద్ద ఉద్యోగస్థులని మా అయ్యగా రన్నారండీ—నిజమేనాండీ" అని అడిగాడు. ఆయన నవ్వుతూ "అవును: అని ఓనిమిషం ఏదో ఆలోచించి—అవును—అయితే — నీకేమైన మా ఆఫీసులో పనేమైనా కావాలా?" అని అడిగారు.

"అబ్బా! అదేం! వద్దండీ—సుబ్బయ్యగారి దయవల్లా వీరయ్యగారిదయవల్లా నేను ఇక్కడే పొట్ట పోసుకొంటున్నాను. అది కాదండీ—మీతో చిన్న విషయం మనవి చేసుకొందామని వుంది..." అని భయపడుతూ ఆగాడు — తన మనస్సులో ఎన్నాళ్ళనుంచో తీరనికోరికగా వుంటూ వచ్చినవిషయాన్ని బయటపెట్టడానికి జంకుతున్నవాడిలా. "ఏమిటోయ్—అదీ" అన్నారాయన... వీరయ్య వెంటనే అందుకొని—"ఏం లేదండీ—మావూరికి మీ దయవల్ల ఎలక్ట్రీ తెప్పించేవుపాయ మేదైనావుందా అని తమర్ని అడుగుదామని అనుకుంటున్నానండీ" అన్నాడు కొంచెం నట్టుతూ.

"అదా సంగతి—ఊరివాళ్ళకోసం అడిగే విషయానికి నీకంతభయం దేనికీ— సరే వెళ్ళు అల్లాగేలే— మీ అయ్యగారితో మాట్లాడుతాన్లే."

ఇంజనీరుగారు వెళ్ళిపోయేటప్పుడా విషయమై నాయుడిగారితో ప్రస్తావిస్తూ ఇల్లా అన్నారు. "చూడండీ—మేమూ క్రొత్తలైను వేస్తున్నాము. అది బహుశా మీవూరికి ఒకటి రెండు ఫర్లాంగుల దూరంగా వెడుతుంది. మీరంతా—వూళ్ళో, ఓ వందమంది చాలు, సంతకాలుపెట్టి పిటీషను పెట్టుకొంటే మీవూరికి లైట్ల సదుపాయం లభిస్తుంది. అల్లా చెయ్యండి. నావల్ల ఏదైనా అవసరపడివుంటే—అది నేను చూసుకుంటాను. అదీగాక క్రొత్తప్లాన్ల ప్రకారం మెల్లమెల్లగా వస్తాయనుకోండి—మనం కాస్త ప్రయత్నించేస్తే తొందరగా వస్తాయి," అని చెప్పి ఆయన వెళ్ళిపోయారు.

ఆయన్నప్పుడు పంపించి సుబ్బయ్యగారు సరాసరి వీరయ్యగారింటికి వెళ్ళి వారితో విషయమంతా చెప్పారు. ఆయన చాలా సంతోషిస్తూ "అల్లాగే కానివ్వవోయ్—మనవూరికి అంత ఉపకారం జరగాలేగాని — అంతకంటె కావాల్సిందేముంది" అన్నారు.

వెంటనే ఆవిషయమై వాళ్ళిద్దరూ గట్టి ప్రయత్నాలు చేశారు.

మరో ఆరునెలలకల్లా కృష్ణాపురంలో విద్యుద్దీపాలు మొదటిసారిగా వెలిగాయి.

* * * *

ఊళ్ళోకి దీపాలు రావడంచూచి నలుగురూ నాల్గురకాలుగా మెచ్చుకొన్నారు.

వీరయ్యకిది హృదయంలో లోపల కొంత గర్వకారణమయింది. రాత్రి ఊరికి కొంచెందూరంగా వెళ్ళివస్తూ అక్కడక్కడా మెరుస్తున్న లైట్లవంక చూసి బ్రహ్మానందపడ్డాడు. నిజంగా తన తల్లికి తన కష్టార్జితంలోంచి తీసి విలువగల రత్నాలహారం చేయించి నట్లుగా భావించాడు.

వీరయ్యగారు సంతోషపడుతూ దాన్ని గురించి ఆలోచించారు. "విద్యుచ్ఛక్తి ఎల్లాగో ఊళ్ళోవుంది గదా, చక్కగా రేడియో ఒకటి అందరికీ అందుబాట్లో పెట్టించకూడదూ!" అనుకొన్నారు.

మరునాడు నాయుడుగార్ని పిలిపించి "చూడండీ ఎలక్ట్రీ ఎల్లాగో వచ్చిందా, నడిమిందున్న ఖాళీజాగాను చిన్న పార్కులా మార్చి అందులో రేడియో ఒకటి పెట్టుకొందాము"అన్నారు. నాయుడుగారు కొంచెం వెనకాడుతూ "అదంతా డబ్బుతో కూడిన వ్యవహారం—కాస్త జాగ్రత్తగా ఆలోచించండి"అన్నారు.

నాలుగువేలు నేనిస్తాను. మరో రెండో ఒకటో నువ్వు కలుపు. ఊళ్ళో కొంత వసూలు చెయ్యండి దాంతో అన్ని ఏర్పాట్లకు సరిపోతుంది. పార్కు మధ్యలో చిన్న గది ఒకటి వేయించి—పార్కుచుట్టూ గోడలు పెట్టించండి," అన్నారు వీరయ్యగారు. సుబ్బయ్యగారప్పటికే మాట్లాడకపోవడం చూచి వీరయ్యగారు మళ్ళీ ఇల్లాఅన్నారు. "చూడండీ మీ రేమీ వెనకాడవద్దు—డబ్బువిషయం భయపడకండి. అసలు మీరేమీ ఇవ్వనేవద్దు—అవును విన్నాను. మీ తూర్పు పొలం పండలేదనీ—కొంత అప్పుచేశారనీ—సరే—మరేం ఫర్వాలేదు. మనలో మనకేమిటి—కావల్సింది నేనిస్తాను. పని మీరు పూనుకొని చెయ్యండి—మీరు చూస్తునే వున్నారుగా నాకు క్షణం తీరిక లేకుండావుంది...కాని ఒక్క విషయం.—డబ్బు అంతా నేనిచ్చానని ఎవరితోనూ అనకండి—అయిన దాంట్లో కొంతకాకపోతే కొంతఅయినా బయట నుంచి రాబడదాము" అని వెయ్యివిధాల చెప్పి నాయుడిగార్ని ఒప్పించి వారిని ఆ పనికి పురమాయించారు.

ఒప్పుకొన్నాక నాయుడుగారూ పనిలో హృదయపూర్వకమైన శ్రద్ధవహించారు.

అనుకొన్న పనంతా మూడునెలల్లో అయిపోవాలన్న నిశ్చయానికి వచ్చారు. పేరయ్యను పిలిచి "ఒకేయ్—చూడూ—ఈపని వెంటనే కావాలి—నువ్వు కొంత శ్రమఅయినా చెప్పిన పనులన్నీ వెంటనే చేస్తుండు" అని చెప్పారు.

* * * *

ఈ వ్యవహారం మొదలుపెట్టినప్పటినుంచీ చివరిదాకా పేరయ్య నాయుడిగారివెంట తిరుగుతూ సమస్తమైన పనులూ చేసిపెట్టాడు. దగ్గరవుండి రాయి పట్టించుకొనిరావడం. గోడలు కట్టేటప్పుడు అవసరమైన నీరు సమయానికి అందించడం—ఒకటేమిటి అన్ని పనులూ చేశాడు.

అతను నీళ్లుకొంచెం ఆలస్యంగా పోస్తున్నాడని ఒకళ్లిద్దరు విసుక్కుంటున్నారు. కొందరు ఘట్టిగా కేకలేశారుకూడాను. కాని వీరయ్యగారికి విషయం తెలుసుగనుక ఏమీ అనలేదు. కాని వారింట్లో ఆడవాళ్లు ఊరుకోలేదు.

మొత్తంమీద ఆ మూడునెలల్లోనూ పేరయ్య వళ్ళు హూనం హూనం అయింది. భార్య కొంచెం విసుక్కుంటూ "ఏమిటయ్యా ఇది—ఊరికే వొళ్ళు విరుచుకొంటున్నావు—మన కేమన్నా ఒరుగుతుంది గనుకనా" అన్నది చాలాసార్లు. అనుకొన్నట్లుగా సరిగ్గా మూడునెలల్లో పని సమస్తమూ పూర్తయింది.

ఒకరోజున సుబ్బయ్యగారు వీరయ్యగారిని వెంటబెట్టుకొని వచ్చి పార్కూ—రేడియోగదీ—అన్నీ చూపించారు. ఇద్దరూ ఒకళ్ళనొకళ్ళు అభినందించుకుంటూ సంతోషించారు. మరు నిమిషంలో వెనక్కు తిరిగి వాళ్లకు దూరంగా నిలబడివున్న పేరయ్యను మెచ్చుకొన్నారు, వాడు పడ్డశ్రమకు.

పార్కుకు ప్రారంభోత్సవం చేయించడానికి సుబ్బయ్యగారు స్వయంగా వెళ్లి వీరయ్యగారి పెద్దకొడుకు—డాక్టరుగార్ని వెంటబెట్టుకొని తీసికొని వచ్చారు. ఆరోజు ప్రొద్దున్న బీదవాళ్లకు అన్నదానం చేయించారు. సాయంకాలం ఓ చిన్న సభకూడా ఏర్పాటు చేయించారు.

ఆ సభలో డాక్టరుగారు మాట్లాడుతూ మన గ్రామాన్ని ఇన్ని విధాల అభివృద్ధిలోకి తీసికొని వస్తున్న నాయుడిగారికి మా అందరితరఫునా నా హృదయపూర్వక అభినందనాలు అంటూ వార్ని వేయివిధాల పొగిడారు.

దాంతో ఆ వూళ్ళో అందరూ ఈ సత్కార్యాలన్నీ నాయుడుగారే సాధించారనీ—ఆయన దేవుడనీ చెప్పుకోవడం మొదలుపెట్టారు. మరీ ఆ వూళ్లోవున్న అమ్మలక్కలంతా విస్తారంగా చెప్పుకొంటూ నాయుడుగార్ని విపరీతంగా మెచ్చుకున్నారు. పదిరోజులపాటువుండి వెళ్దామని వచ్చి అక్కడేవుండిపోయిన వీరయ్యగారి పెద్దకోడలుకు వాళ్ల మాటలన్నీ వింటూంటే అరికాలమంట నెత్తికెక్కింది. అందరి దృష్టిలోనూ ఆ నాయుడుగారూ—ఆయన తోకలా తిరుగుతున్న ఆ పేరయ్యా మరీ యిష్టులైపోవడం ఆవిడకు ససేమిరా సరిపడలేదు.

అందువల్లనే వాడిమీద పితూరీలు ఈమధ్య మరీ ఎక్కువయ్యాయి. "అందరి యిళ్లలోనూ పోసీగాని వాడికక్కడ పొయ్యడంలేదండీ" అంటూ వీరయ్యగారికి వంటయింట్లోంచి పితూరీలు అందుతున్నాయి. వీరయ్యగారి పెద్దకోడలికి ఎందుకనో పేరయ్యమీద ఆగ్రహం కలిగింది. కాస్త అవకాశం కన్పించినప్పుడల్లా వాణ్ణి నాలుగూ గులిపేసేది. ఎడా పెడా చీవాట్లు పెట్టేది. అనవసరంగా నోరుపారేసుకొనేది. కాని పేరయ్య వినీ వినకుండా తలవంచుకొని వెళ్ళిపోయేవాడు.

అప్పుడప్పుడు "ఏమిటి ఆవిడగారు అల్లా దొరసానిగారల్లే తిట్టిపోస్తుంటే—సమాధానం చెప్పవేం" అని తన్నుతానే ప్రశ్నించుకొనేవాడు పేరయ్య.

"ఛా నేనేమీ అనకూడదు. పొరపాటున ఏమాట అన్నా అది వారికి చేరుతుంది. నిజానిజాల సంగతి వారికి తెలియదు. వారి మనస్సు కష్టపడుతుంది. నాకు ప్రాణాధారం కల్పించినవారికి అల్లా మనస్సుకు కష్టం కలిగిస్తానా!—వద్దు—ఏదో అంటూంది...అన్నంతమాత్రాన నాకేంపోయింది" అనుకొని సమాధానపడేవాడు పేరయ్య. అతను మళ్లీ ఇల్లా అనుకొనేవాడు.

అయినా నువ్వు నౌకరువు. అటు చూడూ కాడికి ఎద్దును కట్టేశావా—అదిఎప్పుడైనా కాడబద్ధకంగా నడిస్తే నువ్వు ఊరుకొంటావా? ఎన్ని తిడతావు! అంతే; నీ స్థితీ అంతే. అదెంత వినయంగా నడుచుకొంటుందో నువ్వూ అల్లాగే మెలగాలి" పేరయ్య

ఇల్లా అనుకొన్నప్పుడు కొంచెం బాధపడినా మరింత వినయంగా తయారయ్యేవాడు.

* * *

ఇంతలో ఎవరూ ఆశించకుండానే క్రొత్తగా వచ్చిన శాసనంద్వారా గ్రామపంచాయతీ ఎలక్షన్లు వచ్చిపడ్డాయి.

అన్ని వూళ్లలోలాగానే కృష్ణాపురంలో కూడా ఎలక్షన్ హడావిడీ హెచ్చిపోయింది. అనుకోకుండానే పార్టీలు ఏర్పడ్డాయి.

నాయుడిగార్ని నిలబెట్టాలని కొంతమందీ— వీరయ్యగారిని నిలబెట్టి గెలిపించాలని కొంతమందీ అనుకొంటూ రెండుగా చీలిపోయారు. దాంతో రెండు పార్టీ లేర్పడ్డాయి. కొంతకాలందాకా వాళ్లల్లో వాళ్లే తగాదాలు పడ్డారు. కాని యిటు నాయుడుగారు గానీ అటు చౌదరిగారు గానీ అస లీ విషయమే పట్టించుకోలేదు. వీరయ్యగారు నిల్చుంటారులే మనకెందుకని సుబ్బయ్యగారూ—సుబ్బయ్యగారు నిల్చుంటారులే మనకెందు కాశ్రమ అని వీరయ్యగారూ అనుకొని ఊరుకొన్నారు.

ఇంక ఎలక్షన్లు దగ్గిర పడ్డాయి. ఒక కక్షివాళ్లంతా కలసి నాయుడిగారింటికి వెళ్లి మీరు నిల్చోండి — మిమ్మల్ని గెలిపిస్తామని ఆమాటా ఈమాటా చెప్పి కొంతవరకు సుముఖుల్ని చేసుకొన్నారు.

చివరకు నాయుడుగారు "అయినా ఆయనకు తీరిక వుండదు. ఎల్లాగో నువ్వే వుండవయ్యా— ఆపనులన్నీ కాస్త చూస్తూవుండవయ్యా అంటారు వీరయ్యగారు. కనుక నాకెల్లాగో తప్పదు" అని యిల్లా అనుకొని వాళ్లతో "సరేలెండి" అన్నారు. ఆవిషయము తాను స్వయంగావెళ్ళి వీరయ్యగారితో చెప్పి వద్దామనుకొన్నారు. కాని ఏదో అశ్రద్ధవల్ల పడలేదు. ఎన్నిమార్లో అనుకొన్నారు. "పరవాలేదులే—వూళ్లో వున్న మనిషితో ఎంతలో చేప్పాలి—అందులో వీరయ్యగారితో ఒక్కమాటచెప్పడం ఏంభాగ్యమూ— ఆయన సరసుడు సరే అంటారు." కాని ఆయన ఇల్లా అనుకొంటూవుండంగానే అనుకోకుండా ఓ అఘాంతరం వచ్చి పడింది. అల్లుడికి జ్వరంగా వుందనీ వెంటనే రమ్మనీ మద్రాసునుంచి 'టెలిగ్రామ్' వచ్చింది. వెంటనే ఆయన వెళ్లిపోయాడు. వెళ్లి నెల రోజులదాకా అక్కడే వుండిపోయారు. ఆ నెల రోజుల్లో ఊళ్లో హంగామా అయింది. "నాయుడుగారు సర్వసమర్థుడనీ — ధర్మపరుడనీ — గ్రామోద్ధారకుడనీ—దీపాలు తెప్పించడం, రోడ్లు వేయించడం, పార్కు వేయించి రేడియో పెట్టించడం" అన్ని పనులూ ఆయనే చేయించారనీ — ఇల్లాగా ప్రచారం సాగిపోయింది. అందువల్ల ఆయన్ను లెక్కలేకుండా గెలిపిస్తామని వార్ని నిలబెట్టినవాళ్ళు తమ ఎదుటి కక్షివాళ్లను రెచ్చగొట్టారు.

వీళ్ళుమాత్రం ఊరుకొన్నారా? మెల్లగా ధైర్యం చేసి ఈ మాటలన్నీ వీరయ్యగారిదగ్గరకుపోసి నాలుగు కలిపి సాడీలు చెప్పారు. "చూశారండి వీరయ్యగారూ— ఆయనేం ప్రచారం చేయిస్తున్నాడో ... అన్ని ఘన కార్యాలూ ఆయనే సాధించాడట. అందుకని మీకు నిలబడే దమ్ములు లేక నిలబడటంలేదట" అని మెల్లగా పురి ఎక్కించారు. ఆయన మొదట్లో పొండయ్యా మీ మాటలకేం—సుబ్బయ్య అటువంటివాడు కాదు" అని వాళ్లను పంపించివేశారు. కాని వాళ్ళు పదిసార్లు ఆయనచుట్టూ తిరుగుతూ పదిరకాలుగా చెప్పేసరికి ఆయన మనస్సు మారింది. చివరకు "పోనీ నేను తనకు స్నేహితుణ్ణేకదా — ఇదుగోనండీ నేనుంటా ఈమాటని నాకు వచ్చి చెప్పకూడదూ!. చెప్పకుండా వెళ్లి మద్రాసులో కూర్చుని వీళ్లచేత ఇల్లా ప్రచారం చేయిస్తాడూ!" అని అనుకొన్నాడు.

"చూస్తాను ఎలాగెలుస్తాడో— నేను నిలబడితే నా కెదురుగా నిలబడే సాహసంఉందా అని" అనుకొంటూ ఆయన దాదాపు ఓ నిశ్చయానికి వచ్చారు. అల్లా అనుకొంటూ ఆయన లోపలకు వచ్చారు. అక్కడ భార్యా కోడలూ కలసి ఆ విషయమే ప్రస్తావించారు. కోడలు కాస్త ధైర్యంచేసి అత్తగారి చాటున నిలబడే ఇల్లా అన్నది. "మీరు మరేమీ అనుకోకుండావుంటే ఓ విషయంచెబుతాను. మన కింత ఆస్తివుండీ—ఇంత హోదావుండీ ఆ సుబ్బయ్యగారికి భయపడటమా! ఆ పేరయ్యమీద ఆధారపడటమా! అసలీ జరిగే ప్రచారానికి మూలకారణం పేరయ్య. వాడి దొంగ వినయంచూసి నేనూ మొదట్లో అందరి లాగే అనుకొని మోసపోయాను. సరే అదంతా ఎందుకు లెండి. ఆయనగారేదో సాధించారనే గదా చెప్పుకోం

టున్నదీ—అంతకంటే మంచిపని అందరికీ కన్పడేటట్టుగా మీరు చెయ్యండి!". "సరే బాగా చెప్పింది— అదే ఏంచేయమంటావ్" అన్నారు వీరయ్య గారేదో ఆలోచనలో పడి. "అదే నేనూ చెప్పబోతున్నా; మన వూరికి మంచినీటి కరువుందా—దాన్ని నివారించండి. దాంతో వూరువూరంతా మనవైపు తిరుగుతుంది. అంతేకాకుండా మాకేమో నాకిమీద—ఆ పేరయ్య మీదా ఆధారపడే అవస్థాతప్పుతుంది" అన్నది. "అయితే—ఇంతకీ ఏం చెయ్యమంటావమ్మా." అని మళ్ళీ అడిగారు వీరయ్య గారు.

"ఏ ముందండీ—నీటికరువు పోగొట్టడ మెంత సేపూ—ఆ బావివుందా—దాన్ని కొంచెం పెద్దదిచేసి అక్కడ మోటారుపెట్టి నీళ్ళపంపుచేస్తే ఊళ్ళోకొచ్చి పడతాయి నీళ్ళు. దాంతో ఊళ్ళో గంగ ప్రవహించినట్లవుతుంది. ప్రస్తుతానికి రబ్బరుగొట్టాలు పెట్టించండి. తర్వాత తర్వాత వూరిసొమ్ము పోగయ్యాక మంచివి వేయించుకోవచ్చు" అంటూ కోడలు ఉపాయం చెప్పింది. ఆయన మనస్సుకా ఉపాయం బాగా నచ్చింది. బావుందమ్మాయి—బాగా చెప్పావ్—ఎల్లాగైనా చదువుకొన్న పిల్లవుకదూ" అని మెచ్చుకొంటూ వాకిట్లోకి వెళ్ళి ఆ విషయం తనచుట్టూ తిరుగుతున్న వాళ్ళతో చెప్పారు. వాళ్ళంతా బావుందంటే బావుందన్నారు. అడక్కుండానే తలో అయిదు వందలూ వెయ్యీ చందాగా వెంటనే ఇచ్చేశారు.

అనుకొన్నపని వారం తిరక్కముందే పూర్తి కావాలని అందరూ పట్టుపట్టారు.

* * * *

బస్తీనుంచి ఒక ఇంజనీరుగారూ ముప్ఫైమంది కూలీలూ వచ్చి వీరయ్యగారు తలపెట్టిన పనిని అనుకొన్నదానికంటె ముందుగా చేసిపెట్టి వెళ్ళిపోయారు. ఊళ్ళో పెట్టించిన పంపులు వదిలిపెడుతూ ప్రారంభోత్సవం చెయ్యడానికి ఓ మంత్రిగారిని పిలుచుకొనివచ్చారు.

మంత్రిగారు మరో రెండురోజులకు ఎలక్షన్లువున్నాయనగా ఆవూరు వచ్చారు. పెద్దసభ ఏర్పాటు చేశారు వీరయ్యగారి తరఫు మనుష్యులు. ఆ సభలో ఆయన మాట్లాడుతూ వీరయ్యగారి దాతృత్వాన్ని వేనోళ్ళ కొనియాడుతూ ఆ వూళ్ళో అంతవరకుదాకా జరిగిన ప్రతి మంచిపనికీ ఆయనే కారకులనీ—ఆ విషయాలన్నీ తనకు మొదటినుంచీ తెలుసుననీ చెప్పారు. ఆ విషయమై రెండు నిముషాలు మాట్లాడి తన పార్టీని గురించీ దేశరాజకీయాలనుగురించీ ఒక పెద్ద ఉపన్యాసం ఇచ్చి చివరకు వీరయ్యగారు తన పార్టీ మనిషనీ వారిని గెలిపిస్తే నిజంగా తన్ను గెలిపించినట్టుగా భావిస్తానని చెప్పి ఉపన్యాసం ముగించారు. టాపులేని చిన్నకారులో ఆయన్ను ఊరేగించి ఘనంగా గౌరవించారా వూళ్లో.

మంత్రిగారు వచ్చిన రోజుననే సుబ్బయ్యగారు కూడా తన స్వగ్రామం తిరిగివచ్చారు. వచ్చీ రావడంతోనే ఆయన్ను, ఆయన్ను గెలిపిద్దామనుకొంటున్న వాళ్ళంతా వచ్చి కలుసుకొన్నారు. సుబ్బయ్యగారు, "నా కెందుకయ్యా ఈ గొడవంతానూ—నేను వెళ్లి వారితో చెప్పివస్తాను—నా కక్కరలేదీ పదవి అని" అన్నారు. కాని ఆయనతో" అదేమిటయ్యా ఇందాకా వచ్చాక ఇప్పుడు వెళితే నువ్వెంత లోకువైపోతావూ—అంతకంటె వెయ్యిరెట్లుగా మే మెంత చులకనైపోతామూ!" అంటూ ఆయన్నా రోజల్లా ఇంట్లోంచి బయటకు రానివ్వలేదు.

ఆరోజు సాయంకాలం సభ అయ్యాక విందులూ—భోజనాలూ చాలా కోలాహలంగా జరిగాయి. ఆ మరునాడే నీళ్లపంపులన్నీ ఒక్కసారే వదిలిపెడతారనీ—వీరయ్య గారింటిదగ్గిర వేసిన పందిట్లో నిలబడి ఒక చిన్నమీట నొక్కితే అన్ని పంపులలోనుంచీ గంగ ప్రవహిస్తుందనీ వూళ్లో ఆడవాళ్ళంతా వింతగా చెప్పుకొంటున్నారు. ఆరోజు సాయంకాలం వీరయ్యగారింటికి వెళ్ళాడు పేరయ్య. వీరయ్యగారి దర్శనమే కాలేదు. వారి కోడలు ఎదురుపడి 'ఒరేయి—పేరయ్యా!—నువ్వింక మా గుమ్మంలోకి రానక్కర్లేదు. నీ నీళ్ళూ అక్కర్లేదు నీసేవా అక్కర్లేదు. వెళ్ళు — వెళ్లి ఆ సుబ్బయ్యగారింట్లోనే పడివుండు" అని ఖచ్చితంగా చెప్పేసింది. నడవలో నిల్చున్న వీరయ్యగారిదగ్గిరకు వెళ్ళి పేరయ్య ఆవిషయమై చెప్పుకొన్నాడు.

ఆయన కోపాన్ని మింగుకొంటున్నట్టుగా కనపడ్డారు. అవును బాగానే చెప్పింది. వెళ్ళు. ఇవ్వాళతో నీకూ రేపటితో ఆ సుబ్బయ్యగారికీ తెలిసి వస్తుందిలే వెళ్ళు — నాకెదురుగా నిలబడి నా కాల్చే

కోపం తెప్పించకు" అని ఆయన చరచరా లోపలకు వెళ్లిపోయారు.

పేరయ్య విస్తాంతపోయి ఒక్క నిముషం అల్లాగే నిలబడి బరువై కృంగిపోతున్న హృదయంతో మెల్లగా బయటకు వచ్చేశాడు. మెల్లగా అడుగులో అడుగు వేసుకొంటూ నాయుడిగారిదగ్గిరకు వెళ్లి విషయమంతా చెప్పుకొన్నాడు. ఆయనా, ఆయనదగ్గిరవున్న ఆయన మిత్రులూ విని "ఏం ఫర్వాలేదులేరా నువ్వు విచారపడకు. మేం చూస్తాంలే" అంటూ ఓదార్చడానికి ప్రయత్నం చేశారు. కాని పేరయ్యకు హృదయం మరింత భారంగా బాధగా కన్పించింది. మాట్లాడకుండా బయటకువచ్చేసి పంచాసరి గుళ్లోకి వెళ్లి అక్కడే చాలాసేపు కూర్చున్నాడు.

రెండుగంటలవుతున్నా ఆకలి వేయలేదు పేరయ్యకు. అప్పటిదాకా గుళ్లో ఒంటరిగా కూర్చుని అంతసేపు తానేమి ఆలోచించాడో అతనికే తెలియదు. బయట అక్కడక్కడ కోలాహలంగా వుంది. షావుకారు కొట్టుకు వెళ్లి వద్దామని బయలుదేరాడు. అన్ని పంపులూ అంతకుముందే వదిలారు. చాలా మంది జనం అక్కడక్కడ గుంపులుగూడి సరససల్లాపాలు ఆడుకొంటూ అక్కడే కూర్చునివున్నారు. పేరయ్య వాళ్లందరినీ చూస్తూ చేతులు వెనక్కి కట్టుకొని మెల్లగా ముందుకు నడిచాడు. ఒకచోట కొంతమంది 'ఒరేయి పేరయ్యా' అని పిలిచి దగ్గిరకు వచ్చింతర్వాత ఏరా పీపాబండి పేరయ్యా—చూశావా మరి నీళ్ళు తెప్పించామ్' అంటూ ఎగతాళిచేశారు. పేరయ్య పెదిమ కదల్చలేదు. షావుకారుతో "నీకు నేనేమీ బాకీలేనుసుమా" అని చెప్పి మళ్లా వెనక్కి తిరిగి యింటిదారి పట్టాడు. 'ఓరి పిచ్చి పేరయ్యా—నువ్వు బాకీపడ్డావని ఎవరన్నార్రా" అన్నాడు షావుకారు.

పేరయ్య పార్కుదగ్గిర నిలబడి ఎదురుగా వున్న పంపుకేసి చూశాడు ఓ క్షణంపాటు.

అందరికీ అంగుబాటులోకి నీళ్లురావడం పేరయ్యకు కోరకంగా ఆనందంగానే వుంది. కాని ఇదంతా తన్ను—ఏడిపించాలని చేసినపని అని స్పష్టంగా తెలుసు.

ఒకసారి పంపుదగ్గరకువెళ్లి కొళాయితిప్పి ఇన్ని మంచినీళ్లు నోట్లో పోసుకొన్నాడు. దానికి గజం దూరంలోవున్న కుండు కన్పించింది. దానిలోకి తొంగిచూస్తూ పేరయ్య ఓ నిముషం అల్లాగే నిలబడి పోయాడు. ఆ కుండులో అప్పటికే సగానికి నీళ్ళున్నాయి. దానికి చిత్రంగా అడుగునుంచి నీళ్ళునింపే గొట్టంవుంది. అందులోంచి నీళ్ళు పైకి వస్తున్నాయి. కుండు వేడినీళ్ల కుండలాగా వుడుకుతున్నట్లుగా వుంది. బుడగలు వస్తున్నాయి.

పేరయ్య హృదయమూ అల్లాగేవుంది ఆ సమయంలో. అంతవరదాకా నిర్మలంగావున్న అతని హృదయంలో నిస్పృహా, నిరాశాభావాలు బుడగల్లాగా పైకి తోసుకొనివస్తున్నాయి. అతని హృదయం దుఃఖంతో కృంగిపోయింది. అంతలో కోపంవచ్చింది. మరుక్షణంలో ఆ కోపం మాయమయి దాని స్థానంలో నిస్పృహ ఆవరించింది. పేరయ్య పెద్దపెద్ద అంగలు వేసుకొంటూ తన గుడిసె చేరుకొన్నాడు—ఏదో ఒక నిశ్చయానికి వచ్చి దాన్ని క్షణాలమీద నెరవేర్చబోతున్నవాడిలాగా.

గుమ్మంలోనుంచే భార్యను పిలిచి "పదవే మనకింక ఈవూళ్లో తావులేదు. ఇవ్వాళతో ఋణం తీరిపోయింది. నన్ను దగ్గరకు తీసి ఆదరించిన పెద్దవాళ్లిద్దరూ అనవసరంగా మనఃకలహాలు పెంచుకొని చివరకు నన్నిల్లా చేశారు. పోదామ్‌పద—మరోవూరు పోదామ్. ఆ నాలుగు గిన్నెలూ ఓ గోతాంలో సద్దెయ్యి. గేదెను మీ పుట్టింటికి తోలేసిరా— మరోవూళ్ళో తలదాచుకొందామ్. రాజులకైతే ఒక వూరుగానీ అడుక్కునేవాళ్లకు ఒక వూరేమిటి.." అన్నాడు పేరయ్య. నాగమ్మ అతనికెదురుగా నిలబడి అతని కళ్లల్లోకి చూసింది. కనుకొలకుల్లో దాగివున్న కన్నీటిని తేలిగ్గానే గుర్తుపట్టింది. విషయమంతా అంతకుముందే విన్నది. కాని పేరయ్య అంతగా దిగులుపడతాడని అనుకోలేదు. అదేమిటయ్యా—అల్లా దిగులుపడితావ్—కష్టపడేవాళ్లం బ్రతకలేకపోతామా—ఇక్కడే వుందామ్" అన్నది నాగమ్మ.

"కాదు—నేనీవూళ్లో ఇంక తిరగలేను. పద వెళ్లిపోదామ్" అన్నాడు పేరయ్య.

"అదేమిటీ తిరగలేకపోవడమేమిటీ—నువ్వేం దొంగతనం చేశావా—ఎవరికైనా ఓ పిసరంత అపకారం చేశావా—దేనికీ అంత ఇదవుతావూ?" అని అడిగింది నాగమ్మ.

"అదేమీ కాకపోయినా — నే నుండలేను ఈ వూళ్లో. నా మూలంగా అనేక కలతలూ తగాదాలూ వస్తున్నాయి. అందువల్ల వెళ్లిపోవాలి" అన్నాడు పేరయ్య తేల్చి చెబుతూ.

"పోనీ అల్లాగే వెళదాం లే. రేపటిదాకా వుండి అదేదో ఎవరు గెలుస్తారో చూసివెళదాము. ఒకవేళ నాయుడుగారుగెలిస్తే నీకేదైనా దారి చూపిస్తారేమో!" అన్నది తన హృదయంలో వున్న ఆశాభావాన్ని వ్యక్తంచేస్తూ నాగమ్మ. ఆ మాటలు కొంచెం పరధ్యాన్నంగా వింటున్న పేరయ్య ఒక్కసారి ఉలిక్కిపడి ఇల్లా అన్నాడు. "అమ్మో వద్దు! నాయుడుగారు ఇంక నాకేమైనా చేస్తే అటు వీరయ్యగారికి కోపం వస్తుంది. ఆ తర్వాత వీరిద్దరిమధ్యా వైషమ్యాలు ఇంకా పెరుగుతాయి. వద్దు ఇవ్వాళే వెళ్లిపోదాము. వాళ్లిద్దరిలో ఎవరు గెల్చినా నాకొకటే—నాకీయన తల్లీ ఆయన తండ్రీ. నే—అవన్నీ సర్దేసెయ్యి."

"సరే—అల్లాగే వెళదామ్. ఎక్కడైనా బ్రతికలేకపోము. నీళ్లు పొయ్యడం కాకపోతే మరోపని చేద్దువుగాని. అవును పూర్వం నేనోసారి చెప్పానే, అదే, వెన్నె సెయ్యి అమ్ముకొని పొట్టపోసుకొందాం పద—ఒక్కగంటలో సామాను సర్దేస్తాను" అన్నది నాగమ్మ.

నాగమ్మ మాటలకు పేరయ్య సంతోషించాడు. ఆరోజు చీకటి పడుతుండగా సామానూ గోతామూ పీపామీద వేసి కట్టేసి చేతులో తాడుతో ముందు పేరయ్యా అతని వెనక నాగమ్మా బయలుదేరి ఊరిచివరకు వచ్చేశారు. ఊరు విడిచి రెండు ఫర్లాంగులు వచ్చాక అక్కడోసారి ఆగి వెనక్కు తిరిగిచూచి ఇద్దరూ కళ్లనంట నీరు పెట్టుకొన్నారు. నాగమ్మ తల్లితోనైనా చెప్పరాలేదు. పేరయ్య నాయుడిగారితో ఒక్కమాటైనా అనలేదు. ఊరివైపు చూడగానే పేరయ్యకు తను చిన్నతనంనుంచీ తిరిగిన ఆవూరి నాలుగు మూలలూ—వాటితో అల్లుకొనిపోయివున్న కష్టసుఖాలతో కూడుకొన్న జీవితాధ్యాయాలూ అన్నీ జ్ఞాపకం వచ్చాయి.

ఒక్కసారి అనుకోకుండా అతని చెక్కిళ్లపై నుండి కన్నీటి బిందువులు జారాయి.

నాగమ్మ చూడకుండా కువ్వాలకొంగుతో కళ్లు తుడుచుకొన్నాడు. బొంగురుపోతున్న గొంతుతో 'హాయ్!' అని. ఎద్దును అదిలించాడు.

అమెరికన్ చిత్రరచన

శ్రీ పి. యల్. నరసింహమూర్తి

గత మాసంలో అఖిలభారత లలితకళాసమితివారి ఆధ్వర్యాన, మద్రాసు మ్యూజియం సెంటినరీ హాలులో అమెరికన్ చిత్రకళాప్రదర్శనం ఒకటి జరిగింది. ఇది నీటిరంగుల చిత్రాలకు మాత్రమే పరిమితమైన ప్రదర్శనం. ప్రసిద్ధులైన ఏడుగురు అమెరికన్ చిత్రకారులు రచించిన 63 చిత్రాలను ఈ ప్రదర్శనంలో వుంచారు.

ఈ ఏడుగురిలో విన్‌స్లో హోమర్, మారిస్ ప్రెండర్ గాస్ట్, జాన్‌మారిన్, చార్లెస్ డిమత్— ఈ నలుగురూ కీర్తిశేషులు. మిగిలిన ముగ్గురిలో ఎడ్వర్డ్ హోపర్, చార్లెస్ బర్చ్‌ఫీల్డ్ — ఈ యిద్దరూ 60 ఏళ్లకు పైబడిన వృద్ధులు. ఏడవవారు ఆండ్రూ వైయత్, అందరికంటె చిన్నవాడు. ఈయనవయస్సు ముప్పయ్ ఎనిమిది సంవత్సరాలు. ఆండ్రూ వయత్ తండ్రికూడా చిత్రకారుడు. అందుచేత అనేక సాంకేతికవిషయాల అనుభవం, ఎక్కువ కృషి చేయకుండానే వారసత్వంగా ఆయనకు లభించింది.

నీటిరంగులకు సహజమైన లాలిత్యం వుంటుంది. నీటిరంగులు తైలవర్ణాలవలె స్తరుగా కంటికి బరువుగా తగులవు. లాలిపాటకూ, పల్లవిపాటకూ ఎలాటి తేడా వుంటుందో నీటిరంగు చిత్రాలకూ, తైలవర్ణ చిత్రాలకూ అలాంటి తేడా వుంటుంది.


మరొకవిషయం: కావ్యానికి వలె స్తరుగానే చిత్రకళకుకూడా "ధ్వని" జీవం; అట్టిధ్వనిని చార్లెస్ డిమత్ తన చిత్రాలలో విరివిగా స్ఫురింపజేశారు. రెండవది, చిత్రకళకు శాశ్వతత్వాన్ని ప్రసాదించేది 'కల్పన'. కల్పనాచాతుర్యం లోపించిన చిత్రకళ బ్రతుకదు. ముఖ్యంగా 'కలర్ ఫొటోగ్రఫీ' ప్రచారంలోకి వచ్చిన ఈనాడు, చిత్రకళలో కల్పనాచాతుర్యం లోపించితే, దాని కథే మాసిపోతుంది. ఈ ప్రదర్శనాన్ని దర్శించితే అమెరికన్ చిత్రకారులు ఈ విషయాన్ని చక్కగా గ్రహించి తగినశ్రద్ధ తీసుకున్నారనిపిస్తుంది.

ఈ చిత్రాలలో: చార్లెస్ బర్చ్‌ఫీల్డ్ చిత్రించిన "మకర సంక్రమణం" (*Winter Solistice*), చార్లెస్ డిమత్ చిత్రించిన 'ఉప్పరిగలు' (*House Tops*) హూపర్ చిత్రించిన 'కత్తెరరోడ్డు' (*Forked Road*), ప్రెండర్ గాస్ట్ చిత్రించిన 'ఖేలనవేళ' (*Playtime*), ఆండ్రూ వయత్ చిత్రించిన 'నీటికోంగ' (*Loon*) ముఖ్యటగా వున్నాయి.

వీరిలో చార్లెస్ డిమత్ కళాసృష్టి ఆత్మపరమై అత్యంత రమణీయంగా వుంది. నీటిరంగుల విన్యాసంలో ఈయన అత్యంత ప్రతిభాశాలి.


ఈ ఏడుగురు చిత్రకారులూ ఎవరికి వారు ప్రత్యేకమైన వ్యక్తిత్వం కలవారు. ఎవరిది వారిది ఒక ప్రత్యేకమైన బాణీ.

ఈ చిత్రకళా ప్రదర్శనాన్ని "ఆలిండియా ఫైన్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్సు సొసైటీవారు; 'అమెరికన్ ఆర్ట్ ఫెడరేషన్' వారి సహకారంతో ఏర్పాటుచేశారు. ఈ ప్రదర్శనంలో వుంచిన ఈ 63 చిత్రాలనూ అమెరికన్ చిత్రకళాసంచయంనుంచి అమెరికన్ ఆర్ట్ ఫెడరేషన్‌వారే ఎన్నికచేసి పంపారు. అందుచేత ఈ 63 చిత్రాలూ, అమెరికన్ చిత్రకళకు ప్రాతినిధ్యం వహించగల ఉత్తమచిత్రాలనే మనం అనుకోవచ్చు. వాటిని సరిగా పరిశీలించితే అమెరికన్ చిత్రకళ ఏ స్థాయిలో వున్నదో మనకు అవగాహన అవుతుంది. ఈ ప్రదర్శనం, భారతదేశపు ఇతర ప్రధాన నగరాలన్నిటిలోనూకూడా—ఢిల్లీ, బొంబాయి, కలకత్తా-- యేర్పాటుచేశారు. భారతీయ కళాకారులకూ, కళాభిలాషులైన ప్రజలకు ఇట్టి అవకాశాన్ని కలుగచేసిన, 'ఆలిండియా ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ సొసైటీ కార్యకర్తలు అభినందనీయులు.



ఉప్పరిగలు

చిత్రకారుడు: చార్లెస్ డిమత్



స్రవత్ హిమానీ

చిత్రకారుడు: చార్లెస్ బర్చ్‌ఫీల్డ్

పరాజితులు

శ్రీ అంగర సూర్యారావు

మానవుడు సృష్టించిన దారిద్ర్యంతో మానవుడే హోరాహోరీ పోరాడుతున్నాడు. తీవ్రపరాజయాలమధ్య నలిగి చివరకు నేలకొరిగి పోతున్నాడు. అతని సంతతి తిరిగి పోరాటాన్ని కొనసాగిస్తోంది. ఈ సంఘర్షణకు అంతమనేది వుందా ?

"నాజీవితం దుర్భరం. తినడానికి తిండిలేదు. నివసించడానికి కొంపలేదు. నామొర వినే వారెవరూ లేరు. చివరకు భగవంతుడితో మొర పెట్టుకునే అవకాశం కూడా లేదు. ఫల పుష్పాలు దక్షిణా లేనిదే భగవంతుడు కూడా నా మొర ఆలకించడు," అన్నాడు ఒక దరిద్రుడు.

అతని మాటలు విని రెండు అస్థిపంజరాలు నవ్వినై. వాళ్లిద్దరూ మృత్యుదేవత ఆహ్వానంకోసం ఎదురుచూస్తున్న క్షయరోగులు. వెన్నెముక విరిగిన ఒకమనిషి వానపాములా పాకుతూ వచ్చి ఆ గుంపులో చేరాడు. ఏడుస్తున్న వాళ్లు, మొత్తుకుంటున్న వాళ్లు, చేతులు విరిగినవాళ్లు, కాళ్లు విరిగినవాళ్లు రోగాల వల్ల శరీరంలోని రక్తమాంసాలు హరించిపోయి బొమికలు మిగిలినవాళ్లు అందరూ అక్కడకు చేరుతున్నారు. దారిద్ర్యదేవత అక్కడ నగ్నతాండవం చేస్తోంది.

అకస్మికంగా కోలాహలం ఆగిపోయింది. ఆ నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ బూట్ల చప్పుడు వినిపించింది. డాక్టర్లు వరుసగా ఎవరి గదులలోకి వారు వెళ్లారు. నర్సులు, ఆయాలు ఒక మూలనుంచి మరొక మూలకు తొందరగా తిరుగుతున్నారు.

ఆ భయంకర వాతావరణం మధ్య మృత్యుకోరల నడుమ చిక్కుకొని విల విల తన్నుకొంటున్న ఒక యువకుణ్ణి స్ట్రెచ్చర్‌మీద వేసి తీసుకువెడుతున్నారు. ఆ యువకుడు తెల్లగా పాలిపోయి వున్నాడు. అతని నల్లని జుత్తు చిందర వందరగా తెల్లని ఫాలంమీద పడి మెరుస్తోంది. పెదవులు రెండూ దగ్గరకు మూతపడి అతనిలోని గంభీరతను సూచిస్తున్నై. స్ట్రెచ్చర్ ఆపరేషన్ థియేటరులోకి వెళ్లింది. ఆ వెనుక భయ విహ్వలరాలై వస్తున్న యువతి గదిముందు ఆగిపోయింది.

రోగిని బల్లమీద వేశారు. అతను కళ్లు తెరచి చూశాడు. ధవళ వస్త్రధారులైన యిద్దరు డాక్టర్లు, ఇద్దరు నర్సులూ తళ తళ మెరుస్తున్న కత్తులను సర్దుకున్నారు. ఆ కత్తులు మరోక్షణంలో తన సుందర శరీరాన్ని చీల్చుతాయి. అతని ముఖంలో భయపడుతున్న చిహ్నాలేవీ కనిపించలేదు.

"మీకు బంధువు లెవరూ లేరూ ?" డాక్టరు ప్రశ్నించాడు. ఆ యువకుడు ఒకసారి నవ్వి "మీరు మాత్రం నాకు బంధువులు కారూ డాక్టర్ గారూ!" అన్నాడు. ఆ మాటలు నూతిలోని గొంతుకలోంచి వినిపించినట్లున్నై. డాక్టరు ముఖంలో ఆశ్చర్య చిహ్నాలు కనిపించినై. బహుశా అంతటి ధైర్యం కలరోగిని చూడడం ఆ డాక్టరుకు అదే మొదటి సారేమో ! నర్సు ఆపరేషన్ థియేటరులోంచి బయటకు వచ్చింది. పైటచెంగుతో కన్నీళ్లు తుడుచుకుంటున్న యువతిని సమీపించి "యిటువంటి సమయంలో అధైర్యపడకూడదమ్మా! ధైర్యంగా వుండు. నీభర్తను మృత్యుముఖంనుంచి తప్పించడంకోసం డాక్టర్ విశ్వప్రయత్నం చేస్తున్నారు."— ఆయువతిని బల్లమీద కూర్చొబెట్టి లోనికి వెళ్లిపోయింది నర్సు.

కొద్ది క్షణాలలో ఆనర్సు తిరిగి యేవార్త తెస్తుందో ! ఆమెకన్నీరు పొంగి ప్రవహిస్తున్న వాహినిలా పెల్లుబుకుతోంది. ఆమెకళ్లు కెంపుల్లా ఎర్రబడ్డాయి. నిండుచంద్రుణ్ణి కప్పిన మబ్బుల్లా ఆమె తెల్లని ముఖంలో విషాద ఛాయలు అలుముకొన్నాయ్. ఆమె చేతికి అమృతపాత్రనుయిచ్చి

చవి చూడకముందే తిరిగి ఎవరో తన్నుకుపోతున్నారు. జీవితంలో మాధుర్యంతోపాటు యింతటి చేదుకూడా వుండా?

ఇంతసేపటినుంచీ యీ దృశ్యాన్ని దూరాన్నుంచి పరిశీలిస్తున్న ఒక స్త్రీ ఈ యువతిని సమీపించింది.

"విచారించకమ్మా. జీవితంలో కష్టాలను తట్టుకోగలగడమే గొప్పతనం. — నీ పేరేమిటమ్మా?" బుజ్జగిస్తూ ప్రశ్నించింది ఆ స్త్రీ.

"శకుంతల!" చీరచెంగుతో కళ్లు ఒత్తుకుంటూ జవాబు చెప్పింది యువతి.

"ఆయన మీ భర్తా?"

అవునన్నట్లు తల వూపింది శకుంతల.

"మీకు పెళ్లయి ఎంతకాలం అవుతుందమ్మా?"

"ఇది మూడవ సంవత్సరం. యీ స్వల్పకాలంలోనే మా ఆశాసౌధాలు కూలిపోతున్నాయ్." వెక్కి వెక్కి యేడ్చింది శకుంతల.

"ఏడవకమ్మా! నువ్వు అచ్చంగా మా చెల్లిలా వున్నావు. నిన్ను చూస్తుంటే నాకు జాలివేస్తోంది. ఇంత కష్టకాలంలో కూడా మీ బంధువు లెవరూ రాలేదేం?"

"కొన్ని విచిత్ర పరిస్థితులనుబట్టి విశ్వం నేనూ కలుసుకొని వివాహం చేసుకున్నాం. గతమంతా ఒక చిత్రమైన కల అనిపిస్తోంది నాకు. జరిగిపోయిన ఆనందమయ జీవితాన్ని జ్ఞప్తికి తెచ్చుకుంటే మరింత విచారం కలుగుతుందేమోనని భయంగావుంది."

"నీభర్తకు యే ప్రమాదం కలగదని నా హృదయంలో ఎవరో చెబుతున్నట్లువుంది. భయపడకు శకుంతలా! యీ ప్రమాదంనుంచి తప్పించుకొని మీరు యిద్దరూ సుఖ సౌభాగ్యాలతో జీవితాలను కొనసాగించాలని నేను భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను. నీహృదయం తేలికవడంకోసమైనా మీవైవాహిక జీవితంగురించి నాకు చెప్పమ్మా! నాదగ్గర నీకు సంకోచమెందుకు? నేను నీకు అక్కలాంటిదాన్ని."

ఆమెమాటలలో ఎంతటి నైర్మల్యం లాలిత్యం వున్నాయ్! శకుంతల కళ్లెత్తి ఆ స్త్రీముఖంలోకి చూసింది. జీవన సంగ్రామంలో ఆరితేరిన యోధురాలులా కనిపిస్తోందామె. దుఃఖసముద్రంలో మునిగిపోతున్న తనకు చేయూతనిచ్చి కాపాడడానికి వచ్చిన దేవతలా కనిపించింది. ఏ జన్మాంతరంలోనో విడిపోయిన ఆత్మబంధువును తిరిగి కలుసుకున్నట్లనిపించింది శకుంతలకు.

"నేను చిన్నప్పటినుంచీ అల్లారు ముద్దుగా పెరిగాను. కష్టాలనేవి వున్నవని వినడమేకాని ఎప్పుడూ అనుభవించలేదు. ఊహ తెలియక పూర్వమే తల్లిదండ్రులను పోగొట్టుకున్నాను. అయినా ఆలోటు యేమాత్రం కనిపించకుండా మా అన్నయ్య నన్ను పెంచాడు. నేను నిండుయవ్వనంవైపు పురోగమిస్తున్నకొద్దీ మా అన్నయ్యముఖంలో విషాదరేఖలు అలుముకోసాగినై. ఎంత ప్రయత్నించినా పెళ్లికాలేదు. నాజీవితం ఎక్కడ పాడవుతుందో అన్న భయంతో మాఅన్నయ్య నా చదువు మానిపించలేదు. ఇరవైరెండు సంవత్సరాల వయసు వచ్చేసరికి నాచదువు పూర్తిఅయ్యింది. నా కాళ్లమీద నేను నిలబడగల శక్తి నాకు రాగానే మాఅన్నయ్యకు కొంత సంతోషం కలిగింది. — ఆరోజులలోనే మా అన్నయ్యకు విశ్వంతో పరిచయం కలిగింది. రోజులు గడిచేకొద్దీ ఆపరిచయం స్నేహంగా మారింది. మా యింటికి వస్తూవుండేవాడు. అతనిముఖంలో యెప్పుడూ విషాదరేఖలు కనిపిస్తూవుండేవి. జీవితంలో పెద్ద దెబ్బతిన్న మనిషిలా కనిపించేవాడు. మేం యెంత ప్రయత్నించినా అతనిచేత అతని గత వృత్తాంతాన్ని చెప్పించలేకపోయాం. — నాగురించి మాఅన్నయ్యకు కలిగిన విచారంలో విశ్వంకూడా భాగం పంచుకున్నాడు. ఇది కొంతకాలం గడిచేసరికి కలిగిన పరిణామం. వయసు దాటిన యువతిని, అందులోనూ ఉద్యోగం చేస్తున్నదానిని పెళ్లి చేసుకోవడానికి యెవరు అంగీకరిస్తారు? అంతటి సంస్కారవంతులు యెక్కడ దొరుకుతారు? యిటువంటి సందేహాల మీద చర్చించుకునేవారు ఆయిద్దరు స్నేహితులు. ఒకరోజు మాఅన్నయ్య నన్ను ఆకస్మికంగా ప్రశ్నించాడు.

"చూడు శకుంతలా! నీకు విశ్వాన్ని పెళ్లి చేసుకోవడానికేమైనా అభ్యంతరం వుంటుందా?"

హృదయంలో పుట్టి హృదయంలోనే పరిభ్రమిస్తున్న ఒకభావరేఖ పెల్లుబికి నాముఖాన్ని సిగ్గుతో నింపింది. సౌందర్యం, సహృదయం అన్నీ వున్న

యువకుణ్ణి భర్తగా వరించడానికి యే యువతి యిష్టపడదు ? కాని అతను అందుకు అంగీకరించవద్దా ?

"ముందు నీ అభిప్రాయం తెలుసుకోవడం అవసరం. నీవు అంగీకారమైతే అతరవాత విశ్వాన్ని ఒప్పించడానికి ప్రయత్నిస్తాను." అన్నాడు అన్నయ్య.

"విశ్వం యిందుకు అంగీకరిస్తాడని నేను అనుకోను !" అన్నాను, నాఅంగీకారాన్ని సూచనప్రాయంగా తెలియచేస్తూ !

"మనం యెంతకాలం ప్రయత్నించినా విశ్వం వంటి మంచివాణ్ణి సంపాదించలేం. కష్టాలను నీదరికి చేరనివ్వకుండా నిన్ను యింతకాలం పెంచి చివరకు తెలియనివాడి చేతులలో నిన్ను పెట్టడం నాకు యిష్టంలేదు శకుంతలా ! ఇంతవరకూ నీ జీవితాన్ని యెంత సుఖంగా గడిపావో యికముందుకూడా రెట్టింపు సుఖసౌభాగ్యాలతో నువ్వు జీవితాన్ని గడపగలగాలనే నా కోరిక. ఈ నా కోరిక నెరవేరాలంటే నిన్ను విశ్వం చేతులలో వుంచడంకంటే నాకు గత్యంతరం కనిపించడం లేదమ్మా !"

నేను సిగ్గుతో అన్నయ్యముఖంలోకి చూడలేకపోయాను. బయట గాలికి ఉల్లాసంగా తలలూపుతున్న చెట్లను కిటికీలోంచి చూస్తూ నుంచున్నాను.

ఆసాయంత్రం యెప్పటిలా విశ్వం వచ్చాడు. అయినా ఆరోజు అతను రావడంలో నాకేదో కొత్తదనం కనిపించింది. సిగ్గుతో లోనికి వెళ్లి పోయాను. అన్నయ్య, విశ్వం గదిలో కూర్చున్నారు. నేను బయట నుంచుని కిటికీలోంచి వాళ్లకేసి చూస్తున్నాను. అది నాభవిష్యత్తును నిర్ణయించే రోజు.

"విశ్వం! శకుంతలపెళ్లి కోసం ఎంతో ప్రయత్నం చేశాను. అదినీకూ తెలుసు. కాని ఆమెకు అన్నివిధాలా తగిన వరుడు నాకింతవరకూ యెక్కడా కనిపించలేదు. ఏక్షణంలోనైనా నాకు మనప్రాంతాలనుంచి బదిలీ అయ్యే అవకాశం వుంది. శకుంతలను ఒంటరిగా విడిచి వెళ్లడానికి నాకు యిష్టంలేదు. కూడా తీసుకుని వెడితే ఆపై ప్రాంతాలలో ఆమెకు యీజన్మలో పెళ్లి అవుతుందనే నమ్మకం నాకు లేదు. ఈ ఆపద నుంచి తప్పుకోవడానికి నాకేమీ ఉపాయం కనిపించడంలేదు." అన్నాడు అన్నయ్య.

"నిజమే; ఇది చాలా చిక్కు సమస్యగానే కనిపిస్తోంది. ఆమెకు పెళ్లిచెయ్యడంకంటే మార్గాంతరం కనిపించడంలేదు." అన్నాడు విశ్వం.

"ఆమెకు పెళ్లిచేస్తే యీచిక్కులన్నీ విడిపోతాయని నాకు తెలుసు.—విశ్వం ! నిన్నొక కోరిక కోరుతాను. అది చెల్లిస్తావా ?" ప్రాధేయపూర్వకంగా అడిగాడు అన్నయ్య.

"రాజా ! నాదగ్గర నీకు సంకోచమెందుకు? నీకోసం యెంతశ్రమనయినా భరిస్తాను. నీతో రాత్రింబవళ్లు తిరగమన్నా తిరుగుతాను. ఆమెకు పెళ్లి అయ్యేవరకూ నీతోపాటు నేను విశ్రాంతి తీసుకోను." అన్నాడు విశ్వం.

పాపం ! విశ్వం ఇంకా అన్నయ్య అభిప్రాయాన్ని అర్థంచేసుకోలేదు.

"నువ్వూ నేనూ శ్రమపడవక్కరలేకుండా శకుంతల జీవితం బాగుపడే ఉపాయంఒకటి చెబుతాను. అందుకు నువ్వుఅంగీకరిస్తావా ? "

"అంతకంటే మనకు కావలసిందేముంది రాజా! అదేదో వేగంచెప్పు. తగిన ప్రయత్నం చేద్దాం." అన్నాడు ఆతురతతో విశ్వం.

"శకుంతలను నువ్వు పెళ్లి చేసుకోవాలి! "

"నేనా !!!"—సుకుమారంగా పెరిగిన చంటి కుర్రాణ్ణి కొరడాతో కొడితే అతనిముఖం ఎలా వుంటుందో అలా వికృతంగా మారింది విశ్వంముఖం. అతని నుదుటిపై స్వేదబిందువులు ముత్యాల్లా మెరుస్తున్నాయ్. నాహృదయంలో ఆశాజ్యోతి—పెనుగాలిలోని దీపంలా—రెపరెప కొట్టుకోసాగింది. అది యేక్షణంలోనైనా ఆరిపోవచ్చు.

"నీకు కూడా శకుంతలను పెళ్లిచేసుకోవడం యిష్టంలేదా విశ్వం!"

అన్నయ్య మాటలలో దిగులు కనిపిస్తోంది.

"అదికాదు రాజా! నాకు యీ జీవితంలో అసలు పెళ్లిచేసుకోవడమే యిష్టంలేదు. దయచేసి నన్ను కారణంమాత్రం అడగకు," బాధగా అన్నాడు విశ్వం.

"ఏ కారణంవల్ల నువ్వు పెళ్లి చేసుకోనంటున్నావో ఆ కారణాన్ని నీహృదయంలోనే దాచుకో!

నాకు చెప్పనక్కరలేదు. కాని నువ్వు శకుంతల జీవితాన్నిమాత్రం ఆనందమయం చెయ్యి. నా యీ ఒక్క కోర్కె తీర్చు! నీకు జీవితాంతం కృతజ్ఞుడనై వుంటాను!" అన్నయ్య ప్రాధేయపూర్వకంగా అడిగాడు.

"నాకు ఆలోచించుకోవడానికి కొంత సమయం కావాలి!" అన్నాడు విశ్వం. తిరిగి నా హృదయంలో ఆశారేఖ మెరిసింది. అతను వెళ్లిపోయాడు.

తరవాత వారంరోజులకు మా యిద్దరికీ వివాహం అయిపోయింది. తలచినట్లుగానే మా అన్నయ్యకు బదిలీ అయిపోయింది. నన్ను విశ్వంచేతులలో వుంచి సంతోషంతో అన్నయ్య వెళ్లి పోయాడు. ప్రశాంత వాతావరణంలో రెండేళ్లు ఆనందమయ జీవితాన్ని గడిపాం. నాకు రవంతకష్టం కలిగినా ఆయన చూడలేకపోయేవారు. విశ్వం మనసుకు కష్టం కలిగేపని నే నెప్పుడూ చేసియెరుగను. కాని మా ఆనందాన్ని విధి చూడలేకపోయాడు. నా జీవితం యేమౌతుందో ..." చేతులలో ముఖం దాచుకొని వెక్కి వెక్కి యేడ్చింది శకుంతల.

"విచారించకు శకుంతలా! మీవంటి అదృష్టవంతులు ప్రపంచంలో అరుదుగా వుంటారు. జీవితాన్ని ఆనందంగా గడిపిన మీకు కష్టాలను తట్టుకోగల శక్తి తక్కువగా వుంటుంది. సుఖమంటే యెలావుంటుందో తెలియకుండా జీవితాల్ని దొర్లిస్తున్న మనుషులు యీ ప్రపంచంలో యెందరో వున్నారు. వాళ్లు నేరం చెయ్యకుండానే శిక్ష అనుభవిస్తున్నారు. ఉదాహరణకు నీకు తిన్నగా నేనే వున్నాను. నా జీవితంలో ఆనందం అనేదాన్ని నే నెప్పుడూ చవిచూడలేదు. నా బాధామయగాథవింటే నీకు కలిగిన యీ కష్టం —నా కష్టాలలో యెన్నోవంతో నీకు బోధపడుతుంది." అందా స్త్రీ, గడచిపోయిన గాథలను స్మృతిపథంలోకి తెచ్చుకుంటూ!

ఇంతలో ఆకస్మికంగా తలుపు తెరువబడింది. ఇద్దరూ ఆత్రంగా నర్సుముఖంలోకి చూశారు.

"ఆపరేషన్ జయప్రదంగా ముగిసింది. ఇంకా స్వస్థత రావడానికి రెండురోజులు పడుతుంది. నీభర్తకు ఇక ప్రమాదం వుండదని మేం ఆశిస్తున్నాం." అంది నర్సు శకుంతలతో.

"ఒకసారి నన్ను చూడనివ్వరూ?" ఆశగా అడిగింది శకుంతల.

"ఇటువంటప్పుడు చూడ్డం మంచిదికాదు. రేపటికి అతన్ను కొంచెం కోలుకుంటాడు. అప్పుడు చూడడం మంచిది. ఇక మరేం ఫర్వాలేదు. నిశ్చింతగా యింటికి వెళ్లి రేపు రా!"

నర్సు లోనికి వెళ్లిపోయింది.

"నేను యింటికి వెళ్లి యేం చెయ్యను? యీ స్థితిలో ఒంటరిగా ఆయన్ని వదిలిపెట్టి యెలా వెళ్లగలను?" ఆమె లోచనాలు తిరిగి అశ్రుపూరితాలైనాయి.

శకుంతల దైన్యస్థితికి ఆ స్త్రీహృదయంకూడా కలత చెందింది. ఆమె కళ్లలో నీరు తిరిగింది. ఒకరి కష్టాలకు మరొకరు కన్నీరు విడువగల నిర్మల హృదయాలు స్త్రీలకే వున్నవేమో!

"ప్రేమ అలా అనిపిస్తుందమ్మా! నీభర్తకు ఇక్కడేమీ ఫరవాలేదు. విచారాన్ని దిగమ్రింగి యింటికి పోయి—ధైర్యంగా తిరగగలశక్తి వుండేందుకైనా—కొంచెం భోజనంచేసి విశ్రాంతి తీసుకో! నిన్ను చూస్తుంటే నువ్వే జబ్బుపడిన మనిషిలా కనిపిస్తున్నావు. ఎన్నిరోజులనుంచీ భోజనం మానేశావో!" అందా స్త్రీ.

శకుంతలకు క్షణక్షణానికి ఆ స్త్రీమీద గౌరవం యెక్కువౌతోంది. నిజంగా ఆమె తనతో వున్నందువల్లనే యీ పరిస్థితిలో తను యింత ధైర్యంగా కూర్చోగలిగింది. ఇంతవరకూ తన హృదయ క్షోభవల్ల ఆమె యెవరో తెలుసుకోనేలేదు.

"ఈ కష్టకాలంలో నాలో ధైర్యాన్ని కలిగించిన మీ రెవరో నే నింతవరకూ తెలుసుకోనైనా లేదు. మీరు దేవదూతలా సరియైన సమయానికి వచ్చి నాకు సహాయం చేశారు." అంది శకుంతల కృతజ్ఞతతో ఆమెవైపు చూస్తూ.

"జీవితంలో కష్టాలను అనుభవించినవాళ్ళు మరొకరు కష్టపడుతూవుంటే చూస్తూ వూరుకోలేరమ్మా! జ్వరంతో హాస్పిటలులో వున్న మా తమ్ముణ్ణి చూసి వస్తూంటే యీ దృశ్యం నాకంట పడింది. మిమ్మల్ని చూచినవెంటనే మీ రెవరూ

సహాయం లేరని తెలుసుకున్నాను. ఇక యింటికి వెళ్ళలేకపోయాను.—చాలా ప్రొద్దెక్కింది. ఇక యింటికివెళ్ళి భోజనంచేసి విశ్రాంతి తీసుకో అమ్మా! నేను హాస్పిటలుకు యెప్పుడు వచ్చినా మిమ్మల్ని చూడకుండా వెళ్ళను. నువ్వేం అధైర్యపడకమ్మా! రేపు కలుసుకుందాం".—ఆమె వెళ్ళిపోయింది.

శకుంతల ఆ స్త్రీకి తన మనసులో నమస్కరించింది. బరువెక్కిన హృదయంతో యింటికి వెళ్ళిపోయింది.

లోకంలో యెందరో కరుణామయ హృదయులు వున్నారు. వారు పరులకష్టాలను తమ కష్టాలుగా భావించుకొని తమకు చేతనైన సహాయం చేస్తూ వుంటారు. కనీసం ఆ ఒక్క ఆశకూడా లేనట్లయితే దిక్కులేని వాళ్ళగతి యేం కావాలి? ఆ మర్నాడు శకుంతల ఆలోచిస్తూ హాలులో బల్లమీద కూర్చుంది. సూర్యుని ఉదయ కిరణాలు హాలులో యేటవాలుగా పడుతున్నాయి. కొందరు రోగులు చలిని భరించలేక ఆ యెండలో కూర్చున్నారు. డాక్టర్లు యింకా రాలేదు. క్షణక్షణానికీ శకుంతల హృదయంలో ఆరాటం యెక్కువౌతోంది. విశ్వం యెలాగువున్నాడు? యిప్పటికైనా కొంచెం కోలుకునివుంటాడా? చంటిపిల్లవాడిలా అమాయకపు చూపులతో యెప్పటిలా తన వైపు చూడగలుగుతాడా? అంత సుకుమారమైన శరీరాన్ని డాక్టర్లు కత్తులతో కోస్తూవుంటే యెలా ఓర్చుకోగలిగాడో! తమకు యిదేదో అగ్నిపరీక్షలా వుంది. లేకపోతే యే దిక్కూలేని తమకే యిలాంటి ఆపద రావాలా? యింతకూ విశ్వం కోలుకునేసరికి యెంతకాలం పడుతుంది? అసలు అతను యెప్పటి మనిషి అవగలుగుతాడా?—ఈ ఆలోచన వచ్చేసరికి ఆమె కన్నీటిని ఆపుకోలేకపోయింది.

"శకుంతలా! నీకు రోజురోజుకూ నశిపోతున్నట్లు కనిపిస్తోందమ్మా! యింకా ఒకమూల తెల్లవారిందో లేదో అప్పుడే వచ్చి యేడుస్తూ కూర్చున్నావ్? ఏడ్చి యేమైనా సాధించగలవా? కష్టాలను ధైర్యంతో యెదుర్కోగలగాలి. అంతేకాని నువ్వే ధైర్యాన్ని కోల్పోతే నిన్ను చూచి నీ భర్త యెంత అధైర్యపడతాడు? దానివల్ల యెంత నష్టంవుందో వూహించావా?"

చీరచెంగుతో కన్నీరు తుడుచుకొని ఆ స్త్రీ వైపు దీనంగా చూచింది.

"నా కష్టాలకు జాలిపడి యెవరో మిమ్మల్ని నాకు ధైర్యం కలిగించడానికి పంపారేమో ననిపిస్తోంది. మీది యీ వూరేనా? మీ భర్త యేం చేస్తారు?" ప్రశ్నించింది శకుంతల.

"రాతిహృదయాలనైనా కరిగింపజేసే నా విషాద గాథ చెప్పనా? అందువల్ల నీ హృదయం మరింత కలవరపడుతుందేమో! అయినా నీలాంటి దుర్బల హృదయులకు ధైర్యం కలిగించాలంటే నా జీవితగాథ లాంటి భయంకరమైన గాథలు చెప్పవలసిందే. ఏ పాపం చెయ్యని కొందరు అమాయకులు యెంతటి ఘోరమైన కష్టాలను అనుభవిస్తూ వుంటారో నీకు అర్థమౌతుంది.

మా తాత — అతడెలా వుంటాడో నాకు తెలీదు—దరిద్రుడట. అతని కొడుకు—మా నాన్నకు—ఆ వారసత్వం వచ్చింది. మా నాన్నకు నేను యేకైక పుత్రికను. మా నాన్న కళాకారుడు కావడంవల్ల, నిత్యం ఊహాజగత్తులో విహరిస్తూ, గాలిలో మేడలు కట్టుకుంటూ జీవితాన్ని దొర్లించసాగేడు. దరిద్రాన్ని లెక్కచేసే వాడుకాదు. నాన్న రాసిన బొమ్మలు సాధారణంగా యెవరూ కొనేవారు కారు. ఒకవేళ యెవరైనా కొన్నా తగిన ధర యిచ్చేవారు కారు. ఒక్కోరోజు భోజనం లేకపోయినా నాన్న ముఖంలో దిగులు రవంతైనా కనిపించేది కాదు. "మరేం ఫర్వాలేదు నీరజా! మనకు ఉజ్వలమైన భవిష్యత్తు వుంది. మనంకూడా సుఖపడే రోజులు త్వరలో వస్తాయి. కష్టాలను అనుభవించినవాళ్ళకే సుఖంలోని విలువ తెలుస్తుందమ్మా!" అనేవాడు నాన్న నాతో.

అవిఘంగా నాన్న "రేపు" వైపు ఆశతో చూస్తూ ప్రతిరోజూ గడిపేవాడు. అలాంటి "రేపు" లెన్నో గతంలో కలిసిపోయాయి. మేం కొన్ని సంవత్సరాల క్రితం యెక్కడ వున్నామో అక్కడే వున్నాం. ఒక అడుగుకూడా ముందుకు వెయ్యలేదు. మా స్థితిలో యెట్టి మార్పూ కలగలేదు. నేను నిండుయవ్వని నయ్యాను. దరిద్రుల పిల్లను దరిద్రుడే వివాహంచేసుకోవాలి. ఒక నిరుపేద కుటుంబంలోని అందమైన యువకుణ్ణి యేరి

మా నాన్న నాకు వివాహంచేసి నిశ్చింతగా కన్ను మూశాడు.

నా విషాదజీవిత చరిత్రలోని రెండవఘట్టం తిరిగి ప్రారంభమయింది. మా మామగారు ఒకానొకప్పుడు ధనవంతులట. కాలపరిభ్రమణంలో దరిద్రులుగా మారారు. నలుగురు కూతుళ్లకు వైభవంగా పెళ్లి చెయ్యడంతో వారిసంపద మట్టిలో కలిసింది. నేను అత్తవారింటిలో అడుగు పెట్టేసరికి ఆయింటి పరిస్థితులు కల్లోలంగా వున్నాయ్. ఏ పనీ చెయ్యలేని ముసలిమామగారు, గతకాలపు మంచి రోజుల్ని జ్ఞాపకం తెచ్చుకుంటూ ఒకమూల కూర్చుని వుండేవారు. ఆయన పెద్దకొడుకు ఉద్యోగంకోసం రోజూ శ్రమపడి తిరుగుతూవుండేవారు. పెద్దకోడలు తన నలుగురుపిల్లలను సముదాయించలేక నిత్యం యేడుస్తూవుండేది. చిన్నకొడుకుమాత్రం ఒక ఫ్యాక్టరీలో గుమాస్తాగా పనిచేస్తూ నెలకు అరవై రూపాయలు తెచ్చుకునేవారు. దారిద్ర్యాన్ని అనుభవించడం ఉగ్గుపాలతో నేర్చుకొన్నాను గనుక నేను—ఆయింటి చిన్న కోడల్ని—ధైర్యంతో మసలగలిగేదాన్ని. నాభర్త సంపాదించే అరవై రూపాయలతో యింత పెద్దకుటుంబం జీవించాలంటే యెన్ని కష్టాలను అనుభవించాలో ఆలోచించు. ఎంతటి నికృష్టజీవితాన్ని సాగించాలో ఆలోచించు. మా తోడికోడలికీ నాకూ తాతలనాటి చింకిచీరలు మినహా కట్టుకోవడానికి బట్టలు వుండేవికావు. మేం వీధిముఖం చూడడానికి సిగ్గుపడి యెప్పుడూ యింట్లోనే కూర్చునేవాళ్లం. మా బావగారి పిల్లలు చూచినవన్నీ కొనమని యేడ్చేవారు. వాళ్లకు భోజనమైనా పెట్టలేని తండ్రి ఆటవస్తువులు, బట్టలు యెలా కొనగలరు? ఆయన యెప్పుడూ దిగులుతో ఒకమూల కూర్చుని వుండేవారు. ఆ సమయంలో అప్పులవాళ్లు మా యిల్లు వేలంవేశారు. ఉన్నకొంప ఖాళీచేసి నిరుపేదలు నివసించే ఒకపేటలో చిన్నయిల్లు అద్దెకు తీసుకొన్నాం. ఇటువంటి పరిస్థితులమధ్య మా దాంపత్యజీవితం యేవిధంగా గడిచి వుంటుందో ఊహించు శకుంతలా! యీదుర్భర వాతావరణంలో ప్రణయం, సౌఖ్యం, ప్రేమ అన్నపదాలకు నిలవడానికి తావైనా వుంటుందేమో ఆలోచించు శకుంతలా! — నాభర్త నన్ను చూసి సిగ్గుపడుతూ వుండేవారు. నన్ను యెప్పుడూ తప్పించుకు తిరగడానికి ప్రయత్నిస్తూ వుండేవారు. నూతన వధువునైన నాకు ముద్దు ముచ్చటలేవీ తీర్చలేక పోతున్నందుకు ఆయన తనలోతాను బాధపడుతున్నారని తెలుసుకున్నాను. ఆయన మనస్తాపం పోగొట్టడమే నా కర్తవ్యంగా భావించుకున్నాను. ఒకనాడు నన్ను ఆయన తప్పించుకొని వెళ్లిపోతున్న సమయంలో ఆయన చెయ్యి పట్టుకున్నాను. ఆయన దిగులుగా నా ముఖంలోకి చూశారు. చంద్రకిరణాలు జాలినేస్తు ఆకుల్ని దూసుకొని మామీద పడుతున్నై. ఇంటిలో అందరూ అర్ధాకలితో నిద్రాదేవి కౌగిలిలో ఒరిగి పోయారు.

"మీరు యింత ప్రొద్దు పోయేవరకూ యేంచేస్తున్నారు? యీ మధ్య యింత ఆలస్యంగా వస్తున్నారేం?" అన్నాను.

"వేగంగా యిల్లుచేరుకున్నందువల్ల ఫలితమేముంది నీరజా! పిల్లలరోదనపు, అన్నయ్య విషాద వదనం, నాన్నబాధతో తనలోతాను చెప్పుకునే స్వగతం—యివన్నీ యెలా భరించగలను? అందుకు వూరు మాటుమణిగేవరకూ సముద్రపు ఒడ్డున కూర్చుని వస్తున్నాను."

"మీరు యింటికి రావడం ఆలస్యమయ్యేకొద్దీ నాహృదయంలో ఆరాటం యెక్కువౌతోంది. మీరు నాయందు దయవుంచి వేగం యింటికి వస్తే నాకు అదే చాలు. నాకు అన్నిసౌభాగ్యాలు లభించినట్లు సంతోషించగలను. మీరు యీమధ్య మరీ చిక్కిపోతున్నారు. కళ్లు లోతుకు పోయాయి. మీరు బెంగపెట్టుకున్నట్లు కనిపిస్తున్నారు."

"ఇంతటి చిన్నతనంలోనే నీకు కష్టాలను తట్టుకోవడం యెలా అలవాటయింది నీరజా!" అన్నారు నా ముంగురులు సవరిస్తూ. వారిముఖంలోకి ప్రేమతో చూశాను. ఎర్రటి పెదవులుకంపిస్తున్నై. ఏదో విచారాన్ని దిగమింగుతున్నారని భావించాను.

మరికొన్ని నెలలు బరువుగా జీవితాలను దొర్లించాం. ఇంతలో మరోఘోరవిపత్తు మామీదపడింది. ఒకనాటిఉదయం మేంలేచి చూసేసరికి మాబావగారి మృతదేహం నేలమీద పడివుంది. భార్యాబిడ్డలు పడుతున్న కష్టాలను చూడలేక—అప్పులబాధ భరించలేక—ఎంతకాలం జీవించినా జీవితంలో మార్పు వస్తుం

దనే ఆశలేక—తనజీవిత భారాన్ని మాకుటుంబంమీది నుంచి శాశ్వతంగా తీసివెయ్యడంకోసం తాను విషం తాగి ఆత్మహత్య చేసుకున్నానని ఒక ఉత్తరంరాసి తలక్రింద పెట్టుకున్నారు. పసిపిల్లలు తండ్రిమృతదేహం మీద పడి హృదయవిదారకంగా ఏడ్చారు. తన చేతులలో గారాబంగా పెరిగిన తన పెద్దకొడుకు — తను జీవించివుండగానే తనకళ్లముందు—ప్రాణాలను గోల్పోయినందుకు ఆముసలితండ్రి శవంమీద పడి కుమిలి కుమిలి యేడ్చాడు. మాతోడికోడలు భర్తమృతదేహాన్ని చూసీచూడడంతోనే స్పృహతప్పి పడిపోయింది. అగ్నిజ్వాలలమధ్య నుంచున్న పసికుర్రాడిలా నాభర్త వెర్రిచూపులుచూస్తూ వుండిపోయారు. అప్పుడు నాలోనేను అనుకున్నాను.

ఓభగవంతుడా! నువ్వునిజంగా వున్నావా? ఉంటే — నీపేరువెనుక దాగుకొని దరిద్రులనే ఒక తరగతిని సృష్టించిన స్వార్థపరులకేసిచూస్తూ వూరుకుంటావెందుకు? నీమీద ప్రజలకు నమ్మకం వున్నంత కాలం దరిద్రం యీలోకంనుండి నిర్మూలింపబడదా?

ఆనాటి సంఘటనతో మాయింటిలోని రవంత వెలుగు మాయమయింది. ఆశాజ్యోతులు ఆరిపోయాయి. గాఢాంధకారం వ్యాపించింది. ఇప్పుడు కాకపోతే మరోనాటికైనా తనఅన్నకుటుంబాన్ని నిర్వహించగలడనే ఆశ నాభర్తకు వుండేది. ఆ ఆశ ఆనాటితో అడుగంటిపోయింది. కుటుంబభారమంతా నాభర్త భరించవలసివచ్చింది. నలుగురుపిల్లలూ చిన్నాన్న యిల్లు చేరుకోగానే కౌగలించుకొని జేబులు వెతికేవారు. ఆజేబులలో అప్పుడప్పుడు చిల్లరడబ్బులు, చిరుతిళ్లు వాళ్లకు దొరుకుతూవుండేవి. చింకిచొక్కాలు తొడుక్కొని దైన్యం మూర్తీభవించినట్లున్న తండ్రిలేని పిల్లల్ని చూసి వారు కన్నీరు పెట్టుకునేవారు. నాభర్త లాంటి మంచివారికి యిటువంటి కష్టాలు కలుగుతున్నందుకు నేనెంతో బాధపడేదాన్ని. ఆయనది జాలిగుండె. ప్రతిచిన్న సంఘటనకు అది యిట్టే కరిగిపోయేది. కాని వారికష్టాలు అంతటితో ఆగిపోలేదు. తగిలినగాయానికే తిరిగి దెబ్బ తగిలినట్లు ఆపదలో మునిగివున్న నాభర్తకు కష్టపరంపరలు యెదురురాసాగినై.

వారిముసలితండ్రి బెంగతో మంచంపట్టాడు. ఇద్దరుచంటిపిల్లలకు ఒకేసారి విషజ్వరం వచ్చింది. వాళ్లను బ్రతికించుకోవాలంటే డాక్టర్లకు ఫీజు చెల్లించి వైద్యంచేయించాలి. ఒకపూటకు తిండివుంటే మరో పూటకు తిండిలేని దుర్భరస్థితిలో—మందులకు, డాక్టర్లకు డబ్బుయెక్కడినుంచి వస్తుంది? తనను కని పెంచిన తండ్రికి చివరికాలంలో తను యేవిధమైన సౌకర్యం కలిగించలేకపోయినందుకు నాభర్త యెంతో బాధపడేవారు. తండ్రిని కోల్పోయి తమ ఆశలన్నిటినీ తనమీదే కేంద్రీకరించుకొన్న పసిపిల్లలను రోగాలకు బలిచేస్తున్నందుకు కుమిలికుమిలి చింతించేవారు. నేను యెంత ప్రయత్నంచేసినా వారిలో ధైర్యాన్ని కలిగించలేకపోయేదాన్ని.

ఒకనాటి అర్ధరాత్రి భయంకరమైన దుస్స్వప్నంలోంచి వులికిపడిలేచి కళ్లు తెరచిచూశాను. రోగంతో బాధపడుతున్న మామగారు పక్కమంచంలోపడి మూలుగుతున్నారు. జ్వరంలో వళ్లు తెలియకుండా వున్న చంటిపిల్లలు యేస్వప్నభూమిలోనో విహరిస్తూ కలవరిస్తున్నారు. పాపం! వాళ్లాస్వప్నజగత్తులోనైనా ఆనందాన్ని అనుభవిస్తున్నారేమో! మరోదృశ్యం నాకంటికి కనిపించేసరికి కొరడాదెబ్బతగిలినట్లు 'కెవ్వు' మన్నాను. లోకం నిశ్శబ్దాన్ని వరించిన ఆ నడిరేయి నాభర్త దీపంముందు కూర్చుని యేదో రాస్తున్నారు. కళ్లనుండి అశ్రువులు సంతతధారాపాతంగా నేల రాలుతున్నై. తన అన్నగారిదారినే నాభర్త కూడా అనుసరించబోతున్నట్లు తెలుసుకున్నాను. ఈవూహ నాలో కలగగానే ఆకస్మికంగా లేచి వారు రాస్తున్న ఉత్తరాన్ని లాక్కొని ముక్కలు ముక్కలుగా చించి పారేశాను. నాభర్త చంటికుర్రాడిలా నాఒడిలో తలదాచుకొని వెక్కివెక్కి యేడ్చారు. "మీరు యెప్పుడూ ఆత్మహత్య చేసుకోనని నాకు మాట యివ్వండి. లేదా నేను మీకళ్లెదుటే విషంతాగి చచ్చిపోతాను." అన్నాను.

"నీరజా! ఎంతకాలం బ్రతికినా యీజీవితం యింతే. మంచిరోజులు వస్తాయనే ఆశ యేనాడో అంతరించిపోయింది. నేను యెంతకాలం జీవించినా యీనరకయాతన అనుభవించడంకోసమే జీవించాలి. ఈబాధలనుంచి తప్పుకోవడానికి మృత్యువును ఆహ్వానించడంకంటే మార్గాంతరంలేదు నీరజా!"

"మీరు ఆత్మహత్యచేసుకుంటే — మిమ్మల్ని చూచుకొని మీమీది ఆశతో ప్రాణాలను నిలుపుకొం

టున్న — యీ నిర్భాగ్యజీవులమాటయేమిటి? పసిపిల్లలతో సహా మాకందరికీ విషం పెట్టి మీరుకూడా ఆత్మహత్య చేసుకోండి. అప్పుడు అందరికీ నరకయాతన తప్పుతుంది".

"అబ్బ! ఆవూహనుకూడా నేను భరించలేను నీరజా !"

మనసు కలతపడివున్న ఆసమయంలో వారిని యిక యేమీ అనడం మంచిదికాదని వూరుకున్నాను. వారు నిద్రపోయేవరకూ వారిప్రక్కనే కూర్చున్నాను. తెల్లటి చెక్కిళ్లమీద కన్నీటి చారలు మెరుస్తున్నాయ్.

ఎంతజాగ్రత్తగా చూచినా ఏదోసమయంలో నా భర్త ఆత్మహత్యచేసుకు తీరతారు. వారి ఆశాసౌధాలు కూలిపోయాయి. ఇకవారు బ్రతుకరు. వారితర్వాత ముక్కుపచ్చలారని పిల్లలతో సహా అందరూ మలమల మాడి మృత్యువుకు బలిఅవుతారు. ఈఘోరాలను నేను కళ్లారాచూస్తూ వుండగలనా ? నాకుపాపం కలిగినా సరే ! నేను మహానరకంలోపడినా సరే అనుభవిస్తాను. యిక నేనీ బాధలను భరించలేను.—తక్షణం ఒక నిశ్చయానికి వచ్చాను. తెల్లవారకమునుపే ఆయిల్లు విడిచిపెట్టి విశాలవిశ్వంలో అడుగుపెట్టాను. ఆతరవాత యేంజరిగిందో — మాకుటుంబం ఏమయ్యిందో నాకింతవరకూ తెలీదు."

తనకథ ముగించి నిట్టూర్పువిడిచింది నీరజ.

"నాగుండె భయంతో యింకా కొట్టుకుంటోంది. యిలాంటి కష్టాలు యెలాఅనుభవించగలిగారమ్మా ?" జాలిగా ప్రశ్నించింది శకుంతల.

"ఇటువంటి కష్టాలను అనుభవించినది మాఒక్క కుటుంబమేకాదమ్మా! ఇంతటి నికృష్టజీవితాలను యెందరో గడిపి గతించారు. ఈనాటికీ యెందరో అనుభవిస్తున్నారు. దారిద్ర్యంతో మానవులు సాగించే యీపోరాటానికి యిక అంతమెప్పుడో తెలీదు" నీరజ నిస్పృహతో అంది.

ఎదుటిగదితలుపులు తెరువబడ్డాయి. నర్సు ముఖంలో గాంభీర్యం కనిపిస్తోంది. శకుంతల ఆతురతతో నర్సునడిగింది.

"ఎలావుందమ్మా వారికి?"

"ఇప్పుడే అతనికి స్పృహవచ్చింది. అదిమంచి లక్షణం కాదంటున్నారు డాక్టర్! జరగేది జరగక మానదు. ధైర్యాన్ని విడవకుండా ఒకసారి నీ భర్తను చూసిరా !" అంది జాలిగానర్సు.

నర్సువైఖరి చూసేసరికి ఆయిద్దరు స్త్రీలకు భయంకలిగింది. హృదయాలను కదిలించేవిచారాన్ని దిగమ్రింగుకుంటూ నర్సువెనుక గదిలోకి యిద్దరూ వెళ్లారు. రోగితనలోతాను నవ్వుకుంటున్నాడు. మధ్య మధ్య ఏమిటో మాట్లాడుతున్నాడు.

"అమ్మాయీ! నువ్వేదో ఆశలతో పుట్టావు. తీరని కోరికలకోసం యెదురు చూస్తూ జీవితంగడిపావు. ఉన్నతపథంకోసం చేతులు చాచి చాచి అథః పాతాళంలోకిపోయావు. జీవితంలో ఘోరపరాజయం పొందావు. నీకీ........."

"ఏమిటి మాట్లాడుతున్నారు ? ఇలా నాముఖంలోకి చూడండి!" భర్తముఖంకాస్త పట్టుకొని కన్నీటితో ప్రశ్నించింది శకుంతల.

శకుంతలకేసి రోగి తలతిప్పాడు. శకుంతల వెనుక అశ్రుపూరిత లోచనాలతో నిలచివున్న నీరజను రోగిచూశాడు. అతను కెవ్వుమని యేడ్చినంటి కుర్రాడిలా "నీరజా!" అని రోదనస్వరంతో అరిచాడు.

"మీ కష్టాలు యిప్పటికికూడా అంతం కాలేదా?" గద్గదకంఠంతో రోగిముఖాన్ని నిమురుతూ ప్రశ్నించింది నీరజ. విశ్వం పెదవులమీద బాధారేఖ విరిసింది. కళ్లు తిరగబడ్డాయి. అతనిలోని జీవనజ్యోతి ఆరిపోయింది. నీరజ వళ్లుతెలియని విచారంలో మృతదేహాన్ని కౌగలించుకొని కన్నీరు మున్నీరుగా యేడువసాగింది. శకుంతల వెర్రిచూపులతో నీరజకేసి, భర్తశవంకేసి చూస్తూ కూలబడిపోయింది.

కాంగ్రెసు మహాసభలు

శ్రీ గుడిపాటి శ్రీహరికృష్ణ

భారత జాతీయకాంగ్రెసు సంస్థ తన షష్ఠ్యబ్ది మహాసభను జనవరి 17 నుంచి 23 వరకూ మద్రాసు సమీపానగల ఆవడిలో ప్రత్యేకంగా నిర్మించిన సత్యమూర్తి నగర్ లో బ్రహ్మాండంగా జరుపుకుంది. మనలో షష్టిపూర్తి జరుపుకోవటం చాలా ఘనంగా భావించబడుతుంది. షష్టిపూర్తి ఉత్సవసందర్భంలో తిరిగి పెళ్లినాటి తంతు అంతా యథావిధిగా జరపబడగలదని వినికిడి. అరవైఏళ్లునిండిన ఒక వ్యక్తి తన జీవితానుభవాన్ని అంతా ఒక్కసారి పునశ్చరణ చేసుకొని, క్రొంగ్రొత్తదనంతో, ముందుకు పురోగమించటానికి ఉపక్రమించినప్పుడే ఈ ఉత్సవం అన్నివిధాలా సార్థకమౌతుంది. ఒక వ్యక్తికి ఈ సత్యం ఎలా వర్తిస్తుందో, అదేవిధంగా ఒక సంస్థకూ వర్తిస్తుంది. ముసలితనం మానసికంగా రానంతవరకూ ఏ వ్యక్తీ, ఏ సంస్థ నెవకపడటమంటూ, పాతపడటమంటూ ఉండదు. అయితే, వయస్సుతో నిమిత్తం లేకుండా, కాలమాన పరిస్థితుల కనుగుణంగా పురోగమించగల సాహసం, ధైర్యం, విజ్ఞత బహుకొద్దిమందికే ఉంటుంది. వృద్ధులు అందరికీ మార్పు చెందటం పూర్తిగా సాధ్యం కాదన లేం. మార్పు చెందగల శక్తిమట్టుకు అందరికీ ఉండదన్న మాట వాస్తవమే. బహుకొద్దిమందికే ఉంటుంది. అటువంటి శక్తి, ఇప్పుడు జవహర్ లాల్ నెహ్రూలో స్పష్టంగా ప్రస్ఫుట మవుతోంది.

జవహర్ లాల్ నెహ్రూ ప్రజాభిమతాన్ని బాగా ఆకళింపు చేసుకోగల వ్యక్తి. రాజనీతిజ్ఞుడు. జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులను బాగా అవగతం చేసుకొని, ఈనాడు దేశంలో జరుగవలసిన మార్పులను గుర్తించార నే విషయాన్ని జాతీయకాంగ్రెసు మహాసభ షష్ఠ్యబ్ది ఉత్సవాలలో బహిర్గతం చేశారు.

దేశంలోను, అంతర్జాతీయ రంగంలోను శాంతి యుతంగా వివిధసమస్యలను పరిష్కరిస్తూ, అభ్యుదయానికి దోహదంచేయటమే తమ లక్ష్యమని శ్రీ జవహర్ లాల్ నెహ్రూ ఆవడి కాంగ్రెసు సారధ్యసంఘ సమావేశంలో జనవరి 18 వ తేదీన స్పష్టపరచటం జరిగింది.

షష్ఠ్యబ్ది కాంగ్రెసు మహాసభలలో ప్రవేశపెట్టబడ్డ అతి ప్రధాన తీర్మానాలలో విదేశాంగ విధానానికి సంబంధించిన దొకటి; రెండు—కాంగ్రెసును సుక్షాళనంచేసి, అవాంఛనీయ శక్తులను తొలగించటానికి కఠినచర్యలు తీసుకోవటం; మూడు—సోషలిస్టు విధాన సమాజ నిర్మాణానికి పూనుకోవటం. మొదటి తీర్మానం కాంగ్రెసు ఎంతో కాలంగా అనుసరిస్తున్న స్వతంత్ర వైదేశిక విధానానికి చిహ్నమే. ఇక రెండవ తీర్మానం కాంగ్రెసుసంస్థను నైతికంగా సుక్షాళితం చేసి, ఆ సంస్థను పటిష్ఠంచేయటానికి ఉద్దేశించబడింది. ఇది కష్టసాధ్యమైన పనే. ఏమైనప్పటికీ షష్టిపూర్తి సందర్భంలో దేశవ్యాప్తంగా ప్రధాన రాజకీయ పక్షంగా పనిచేస్తున్న కాంగ్రెసును కట్టుదిట్టం చేసుకోవటానికి కఠినచర్యలు తీసుకోవాలనీ నిర్ణయించటం మెచ్చుకోదగ్గ విషయం. ఈ సందర్భంలో ఈ తీర్మానచర్చలో పాల్గొని నెహ్రూ అన్న ఈ వాక్యాలు అక్షరాలా నిజం "ప్రతిరాష్ట్రంలో, ప్రతి సంస్థానంలోగల సంస్థలోనూ విభేదాలు, తగాదాలు ఉన్నాయి—కాంగ్రెసుపార్టీ ప్రభుత్వాన్ని ఏర్పరచింది. చాలామంది కాంగ్రెసులో ప్రవేశించారు. వీరంతా కాంగ్రెసు సిద్ధాంతాలమీద భక్తి ప్రపత్తులతో చేరలేదు. కాంగ్రెసులో చేరితే లాభంఉంటుందని వచ్చారు" అన్నారు. కాంగ్రెసు సంస్థ క్షాళనం విషయంలో, సాధ్యాసాధ్యాల మాట ఎలాగున్నా, ప్రత్యేకశ్రద్ధ తీసుకుని, ప్రజలలో ప్రతినిత్యం దేశ పురోభివృద్ధికి అనువైన పద్ధతుల ప్రచారానికి శక్తివంత

మైన ప్రజాసంస్థగా రూపొందించటానికి కృషిసల్ప టానికి నిశ్చయించటం హర్షించతగ్గవిషయం. నెహ్రూగా అభిప్రాయాలను ఎంతవరకు కాంగ్రెసుసంస్థలు అమలులోకి తేగలవనే విషయాన్ని వేచిమాడవలసిఉంది.

ఇక దేశానికి ఆర్థికస్వాతంత్ర్యాన్ని సమకూర్చే విషయం అతిప్రధానమైంది. ఇదే నేటి ప్రధాన సమస్య. ఈ విషయంలో కాంగ్రెసు ఎట్టి విధానాన్ని అనుసరించవలచిందనేది గమనించవలసిఉంది. షష్ఠ్యబ్ది కాంగ్రెసు మహాసభలో ఇందుకు సంబంధించిన తీర్మానం ప్రధానమైంది. అతిప్రధానమైన రాజకీయపక్షంగా దేశంలో కాంగ్రెసు పనిచేస్తూ ఉండటంవల్ల; ఈ విషయంలో కాంగ్రెసువిధానం స్పష్టం చేయవలసిన అవసరాన్ని నెహ్రూ గుర్తించారు.

సోషలిస్టు పద్ధతి సమాజనిర్మాణానికి సంబంధించిన తీర్మానాన్ని కాంగ్రెసు సభలో ప్రతిపాదిస్తూ జనవరి 21 వ తేదీన నెహ్రూ యిలా అన్నారు: "మనం స్థాపించగోరుతున్న సోషలిస్టువ్యవస్థకై యిప్పటినుంచీ కృషిచేయవలసిన సమయంవచ్చింది. మనం చేసే ప్రతిపనీ ఈ లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకొని చేయాలి. ఈ వ్యవస్థ భారతదేశ సంస్కారానికి అనుగుణమైనదిగా ఉండాలి. శాంతియుతంగా సాధించాలి. ఇతరుల పద్ధతులను అనుకరించడమూ, ఇతరులు పడ్డకష్టాలు, వర్గపోరాటం మున్నగువానిని మనం కూడా అనుభవించడమూ కేవలం అవివేకం."

నెహ్రూ ఇంకా ఇలా వివరించారు: 1927 లో మద్రాసులో కాంగ్రెసు పూర్ణస్వరాజ్యానికి పునాదులు వేసింది. రెండుసంవత్సరాల అనంతరం రావీనదీ తీరాన స్వాతంత్ర్య ప్రతిజ్ఞతీసుకుంది. ఆ ప్రతిజ్ఞను మనం సంపూర్ణంగా పాలించాం. మనయాత్ర పూర్తికాలేదు...గాంధిమహాత్ముడు దరిద్రనారాయణులకు, అణగద్రొక్కబడిన వారికి చిహ్నంగా ఉండేవాడు. ప్రతివాని కంటినుండి జారే ప్రతి కన్నీటిబొట్టును తుడిచివేయడం తన ఏకైక జీవితలక్ష్యమని, గాంధియని ఆయన చెప్పారు"అని పేర్కొన్నారు.

సోషలిజంస్థాపనమునుగురించి వివరిస్తూ "తీర్మానాలవల్ల, శాసనంవల్ల, సోషలిజమును ప్రకటించటం వల్ల, సోషలిస్టువ్యవస్థ యేర్పడదు. కష్టపడి పనిచేయటంవల్ల, ఉత్పత్తి హెచ్చించటంవల్ల, ఈ ఉత్పత్తిని సమానంగా పంచడంవల్ల మాత్రమే సోషలిజం యేర్పడుతుంది. ఈ తీర్మానలక్ష్యం ఇదే" అని చెప్పారు.

దేశ ఆర్థికవ్యవస్థను సోషలిస్టుపద్ధతిలోకి క్రమేపీ మార్చటానికి లోకసభ గతసంవత్సరం డిసెంబరు 21 వ తేదీన శ్రీ ఎన్. ఎమ్. లింగం ప్రతిపాదించిన సవరణను ఆమోదించటం జరిగింది.

ఈ సందర్భంలో నెహ్రూ ప్రసంగిస్తూ సాధ్యమైనంత త్వరలో, అందరిసమ్మతి, సహకారాలతో, ప్రజాస్వామికపద్ధతిలో సోషలిస్టువ్యవస్థను నెలకొల్పేందుకు ప్రభుత్వం ప్రయత్నించాలని నెహ్రూ అన్నారు. అయితే, శ్రీ కృపలానీ ప్రభృతులు విమర్శించటంకూడా జరిగింది. ఒక్కటిమట్టుకు నిజం కాంగ్రెసు మహాసభ తీర్మానం సోషలిస్టు విధాన సమాజ నిర్మాణానికి అనుగుణంగా ప్లానింగు కమీషన్ రెండవప్రణాళికను రూపొందించటానికి మంచి అవకాశం సమకూర్చింది. నెహ్రూ ఈ లక్ష్యసాధనకు కృషి చేయటంలో ఏమాత్రం వెనుకాడరనేది వాస్తవమే. అయినా. కాంగ్రెసుసంస్థలు, వివిధ రాష్ట్రప్రభుత్వాలు నెహ్రూ,ఆశయాన్ని దేశప్రజల మనోరథాన్ని గుర్తించి, అందుకు అనుగుణంగా ముందుకు పురోగమించటానికి నిర్విరామంగా కృషిచేయగలప్పుడే ఈ తీర్మాన ప్రయోజనం పూర్తిగా ఫలిస్తుంది. ఈ లక్ష్యసాధనను శాంతియుతంగా, శాసనరీత్యా సాధించవలసి ఉన్నందున, అందుకు అవరోధాలుగా నిలిచే రాజ్యాంగ సూత్రాలను అవసరమైతే సవరించటానికి ఏమాత్రం పార్లమెంటు సంశయించకూడదు. లోకసభకూడా ఇదివరకే సోషలిస్టు సమాజ సూత్రాన్ని ఆమోదించటంవల్ల, ఈ ఇబ్బంది అంతగా ఉండకపోవచ్చు. అంతేకాకుండా రాష్ట్రాలలో ఈ విధానాన్ని అనుసరించగల సుస్థిర ప్రభుత్వాలు ఉండటం కూడా ఎంతైనా అవసరం. అట్టి ప్రభుత్వాన్ని స్థాపించుకోగల ఈ అవకాశం ప్రస్తుతంలో ప్రధానంగా ఆంధ్ర ప్రజానీకానికి లభ్యంకావటం జరిగింది.

ఈ సందర్భంలో శ్రీ ఢేబర్ జనవరి 20 వ తేదీన ఆవడినుంచి చేసిన విజ్ఞప్తిని గుర్తుకుతెస్తున్నాను:

"దేశాభివృద్ధి కృషి ఒక చరిత్రాత్మక ఘట్టంలో ప్రవేశిస్తున్న ఈ తరుణంలో ఆంధ్రశాసనసభ ఎన్నికలు జరుగనున్నాయి. నూతన సాంఘిక వ్యవస్థానిర్మా

...న్ని గురించి భారతదేశం ఆలోచించటానికి ఉపక్రమించింది. కొత్తశాసనసభ ఎన్నికలతో, ఈ నూతన ఘట్టాన్ని ఆంధ్ర ప్రజానీకం ప్రారంభించటానికి, ఇది చాలా అనుకూల ముహూర్తం" అని శ్రీ షేబర్ ఉద్బోధించిన విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తులో ఉంచుకోవలసిన సమయం ఆసన్నమైంది.

నేటి సాహిత్యము

శ్రీ కురుగంటి సీతారామయ్య

నవంబరు భారతిలో పై శీర్షికతో ప్రచురింపబడిన నా వ్యాసముపై ప్రతివిమర్శగా డిశంబరు భారతిలో శ్రీ తిరుమల రామచంద్రగారు వ్రాసిన వ్యాసము చక్కని పద్ధతిలో నడచినదనుటలో సందేహము లేదు. వారి భాషాస్వరశాస్త్రజ్ఞానమును, వారి బహుభాషా వేత్తృత్వము నా వ్యాసమునందు ప్రతిబింబించు చున్నవి. అది నాకుకూడ కొంత యుపకారకమైనందులకు నేను మిక్కిలి కృతజ్ఞుడను.

నేనుల్లేఖించిన యపభ్రంశములలో, కొన్ని యచ్చుతప్పులనియు, కొన్ని యపభ్రంశములే కావనియు, మరికొన్ని ప్రయోగసాధువులనియు, నింక కొన్ని స్వరభాషాశాస్త్రరీతుల సమంజసములనియు, సెలవిచ్చి యింకను కొన్నిటిని విడచినారు. వారి వ్యాసమునందలి కొన్ని విషయములనుగూర్చి కొలదిగా ముచ్చటింతును.

నేనొక ప్రచురిత గ్రంథమునుండి ప్రయోగములను గ్రహించితినని శ్రీవారు విమర్శించినారు. వెంటనే యా గ్రంథ "యఖిలాంధ్రకవుల కావ్యసంపుటియని" వారేయనినారు. "అఖిలాంధ్రకవుల" రచనలున్న గ్రంథమునుండి ప్రయోగములను గ్రహించుటలో తప్పేమియున్నదో నాకుగోచరించుటలేదు. అచ్చటచ్చట చెదిరియున్న రచనలు వేర్వేరుగా చదువుటకంటె, యందరి రచనలున్న యొక ముద్రితగ్రంథము నుండి ప్రయోగములను గ్రహించుట సులభమగుట చేతను, ప్రస్తుత కార్యకారియగుటచేతను నట్లు చేసితిని. దానియందలి రచనలన్నియు నొక్కటేకాలము నాటివి కావని శ్రీవారి వ్యాసముననే సాక్ష్యము కలదు. కావున "అఖిలాంధ్రకవులు" వ్రాసినట్టియు, కొన్ని సంవత్సరములలో వ్రాయబడినట్టియు, రచనలను ముద్రించిన గ్రంథమునుండి నేను ప్రయోగములను గ్రహించుటలో తప్పేమియున్నది? మరియు ప్రయోగములను నేను వర్గీకరణము చేసితిని. నేటి సాహిత్యములోని దాదాపన్నియు నావర్గములలో చేరునని నా యూహ.

అచ్చుతప్పులను గూర్చి నేను వివదింపను. తప్పొప్పులపట్టిక లేకపోవుటచే గ్రహించితిని. వానిలో కొన్నిటికి సాధురూపములను శ్రీ రామచంద్రగారే యిచ్చినారు. "ప్రత్యహపరివర్తన" అను సమాసమును సమర్థింపటూనినారు." రాజాహస్సఖిభ్యష్టచ్" అను సూత్రము తత్పురుష కర్మధారయములు మొదలైన కొన్ని సమాసములకే వర్తించును. ఇచ్చట మొదటిది యవ్యయీభావసమాసము, "అహని అహని ప్రత్యహం." తరువాత పరివర్తన శబ్దము సమసించవలెను. కావున నా సూత్రమున కిచ్చట ప్రసక్తిలేదు.

"దెయ్యి"మే సాధురూపమని శ్రీరామచంద్ర గారివాదము. నాకు "దెబ్బకు దయ్యము"నియే వచ్చును.

శ్రీరామచంద్రగారు కన్నడ భాషావేత్తలుకూడ గాన, తత్సంప్రదాయములే తెనుగునకు కూడ వర్తింపచేసి యుందురు. సంస్కృత ప్రాకృతపదము లన్ని భాషల యందును నొకే మర్యాదను గైకొనవలెనను నియమము లేదు. "దైవ"శబ్దమునందలి "ఐ"లోని మొదటియంశ "అ" యగుటచే, తరువాతి "య" అంశమును "వ"యు కలసి "య్య" అయినట్లు తెలియును. "దెయ్యము" శబ్ద మేయాంధ్రనిఘంటువునందును గానరాదు.

ఒక ప్రత్యేక ప్రయోజనము నుద్దేశించి వ్రాసిన శ్రీ సీతాపతి గారి యొక్కయు దాసు శ్రీరాములుపండితులు గారియొక్కయు ప్రయోగములను, ప్రమాణములుగా చూపినారు శ్రీరామచంద్రగారు. ఏదే నొక ప్రయోజనము నుద్దేశించి వ్రాసినప్పు డపభ్రంశములు కూడ రసపుష్టికలుగజేయు ననుటలో నెట్టి యభ్యంతరమును లేదు. గ్రామ్యమున వ్రాసిన చంద్రశేఖర శతకము రసవంతము కదా? అట్లని యఖిలాంధ్ర కవులును తమ యన్ని రచనల నా భాషలోనే వ్రాసిన నెట్లుండును?

పద్యమున నియమములకొరకై యుపయుక్తములకు హలంతములను చూపినారు శ్రీరామచంద్రగారు. కావున "ము" "మ్"గా నుండుట సమంజసమేనని వారు. మరియు తమిళ కన్నడములలో హలంతములే యున్నవనినారు. మన తెనుగు ద్రావిడభాషయైనను నజంతమైనది. కాదందురా? అజంతమగుటచేతనే తెనుగునకు "శ్రావ్యత" వచ్చినదని భాషావేత్తలందురు. ఏ నియమములును లేక వచన నిర్విశేషమైన, గేయ ప్రబంధములలో హలంతములే యుపయోగింపవలెనేమో? పద్యములందును "ర,ల,న"లు మాత్రమే హలంతములుగా వాడబడుట పరిపాటి.

శబ్దసిద్ధి లోకమువలన కలుగును. నిజమే! నియమము వలదా? సిద్ధించినది సిద్ధించినట్లు వాడతగునా? ఎవరు వాడు శబ్దములు భాషలోనికి సిద్ధించవలెను? మనది గచ్ఛద్భాష. కావున శబ్దసిద్ధి కాలానుగుణముగా కలిగిన వెనుక, వ్యాకరణముకూడ కాలానుగుణముగా మారుచుండును—మారుచుండవలెను. అంతియేగాని నియమమే యక్కరలేదనుట విశృంఖలత్వముకదా?

శ్రీవారును నా యభిప్రాయములు కొంతవరకు కలవారనుటకు నేను కొన్ని వాక్యముల ననువదింతును.

"అట్లని ప్రతి క్రుతికటు సమాసాన్ని సమర్థించడం కాదు."

"నేటి కవులలో భాషాజ్ఞానమే కాదు—కూలంకషమైన భాషాపాండిత్యం కలవారు చాలామంది ఉన్నారు."— కొందరకు లేదని దీని యందు ధ్వని.

"అపభ్రంశమన్నదే లేదని మా వాదము కాదు. అవి నేటి కవులలోనే కాదు. ఎవరు వ్రాసినా ఎందులో ఉన్నా తప్పే"

క్రొవడిని గూర్చి నన్ను హేళనచేసిన శ్రీరామచంద్రగారు "వ్రాసినా" అని యెందులకు వ్రాసిరో?

"గొంగళిలో తినుచు వెంట్రుకల నేరికొనుట" యను వాక్యము నేను నా స్వవిషయమున వ్రాసుకొంటినేగాని కవులను దూషించుటకు కాదు. అది తమ కన్వయించుకొని నాపై కోపగించినారు కొందరు విమర్శకులు. నా గ్రంథమునుండి యుదాహరణముల నియ్యనైతినని కొందరకు కోపము. నేను వ్రాసినంతమాత్రమున నపభ్రంశములు సాధువులగునా? శ్రీ ప్రభాకర శాస్త్రిగారి వాక్యములు నాకును నాదరణీయములే? సాహిత్యవేత్తలు సమాజమునకు గురువులవంటివారు. కావున వారి కర్తవ్యమును నెరవేర్చుటలో ప్రమత్తులుగా నున్నారని నా మనవి. వైశద్యప్రధానమైన వచనరచన యెట్లున్నను, భావప్రధానమైన పద్యగేయరచన లుదాత్తముగ నుండవలెననియే నాయభ్యర్థనము.

గ్రంథ విమర్శనము

ఆంధ్రపురాణము

రచన: శ్రీ మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి; ప్రచురణ కర్త: శ్రీ మధునాపంతుల సూరయశాస్త్రి, పల్లిపాలెము, (వయా) యానాం; మూల్యం: రు 8-0-0.

సాహిత్యరంగంలోనే కాక, ఆంధ్రజాతి చరిత్రలో ఒక అత్యంత ప్రధానమైనసమయంలో ఈ గ్రంథం వెలువడ్డది. రచయితను యిట్టి రచనకు ప్రోత్సహించింది కూడా చారిత్రాత్మకమైన యిట్టి అవసరమే అయివుండవచ్చు.

ఆంధ్రజాతి చరిత్రలో ఇది ఒక అత్యంత ప్రధానమైన ఘట్టం. యుగయుగాల బానిసత్వాన్నీ నైరాశ్య కశ్మలాన్నీ విదలించివేసుకుని, నూతన పక్షచ్ఛటతో, నూతనోత్సాహంతో ఈజాతి గగనోన్ముఖమై ముందుకు సాగబోతోంది. ఈ గమనానికి సాగేముందు తన శరీరంలో వున్న శక్తిసామర్థ్యాలేమిటో బలాబలాలేమిటో తనకు తాను తెలుసుకోవటం అవసరం. తన చరిత్ర తాను అవగతం చేసుకోని ఏ జాతికి గాని పురోగమనం అంటూ వుండదు. పూర్వమేమిటో, వర్తమానమేమిటో అవగతమైతేగదా పురోగమనం? ఈ దృష్ట్యా ఇది అత్యంత ప్రధానమైన గ్రంథం.

ఈ గ్రంథానికి చారిత్రకసిద్ధి వున్నదా? అంటే, ఈ ప్రశ్నకు ఔనని గాని కాదని గాని ఖండితంగా సమాధానం చెప్పలేము. కారణమేమిటంటే మనకు ప్రామాణికమైన చరిత్రే యింతవరకూ ఏర్పడలేదు. అసలు యింతవరకూ లభించిన చరిత్రే బహు పరిమితం. ఆంధ్ర చారిత్రక పరిశోధనకు నడుముకట్టి యీ కొలది చరిత్రాంశములనూ వెలికితెచ్చినవారికి పాలకుల దృష్టి తప్ప పాలితుల దృష్టి లేకపోయిన కారణంగా ప్రజా బాహుళ్యానికి సంబంధించిన విషయసేకరణ పూర్తిగా కొరవడిపోయింది. ఇక మిగిలిన రాజుల చరిత్రలనైనా నిర్దుష్టములుగా వుంచారుకారు. వారివారి స్వప్రయోజనాల కోసం తారీఖులను సహితం తారుమారు చేసివైచిన ఘట్టాలున్నయ్. ఈ విషయంలో పాశ్చాత్య పరిశోధకుల ధోరణి మరింత హాస్యాస్పదమైనది. ఆ యీ పరిస్థితులను అవగతంచేసుకుంటే ఆంధ్ర జాతీయ చరిత్రా నిర్మాణవిషయకంగా, యెంత కృషి జరుగవలసి వుందో మనకు బోధపడుతుంది. వ్యాప్తిలోవున్న చరిత్రాంశాలనే రచయిత సేకరించివుండటంచేత, చారిత్రకంగా అందందు కొన్ని అసందర్భములు కనిపించుతున్నా ఆదోషముల బాధ్యత చారిత్రక పరిశోధనారంగానికి చెందినవిగాని, రచయితవి కావు. రచయితకు అట్టి బాధ్యత లేదా అంటే, రచయిత ఈ గ్రంథానికి చారిత్రక ప్రామాణ్యం వున్నదని చెప్పినప్పుడు అలాంటి చిక్కు వస్తుందిగాని, కావ్యంగా మాత్రమే స్వీకరించినప్పుడు అలాంటి బాధలేదు. తటిల్లతలవలెనూ రేఖామాత్రంగానూ వ్యాప్తిలోవున్న ఈ పరిమిత చరిత్రనే తన ఉపజ్ఞాదక్షతతో అవగతం చేసుకుని రచయిత ఆంధ్ర హృదయాన్ని వెలుగులోకి తీసుకురావటానికి ప్రయత్నించి కృతకృత్యులయ్యారు. ఈకృషిలో రచయిత ప్రదర్శించిన ప్రతిభాసంపత్తి కొనియాడదగివుంది.

అరమఱుగు మేలిముసుఁగులో నందగించు
నాంధ్రచారిత్ర సురసుందరాంగి సొగసు
మనసు పండువుగా నెంచుకొనెడి సిరికి
నోఁచువాఁడె, రసజ్ఞత మోచువాఁడు.

అన్నారు రచయిత.

దీనికి కవిగారు పురాణమని పేరుపెట్టారేగాని నిజానికి రచన యావత్తూ 'రఘువంశము' ఫక్కీ కావ్యధోరణిలోనే నడిచింది. ఇది 'పంచలక్షణ లక్షితము గాదని' కవియే అంగీకరించుతున్నారు.

"ఒకనాటి బ్రహ్మముహూర్తమున తెలుగువారి చరిత్రసారంబు నవపర్వపరిమితంబుగా వింగడించుకొని 'యాంధ్ర పురాణ' కావ్యరచనకుం గడంగినాడ; సర్గ ప్రతిసర్గాది పంచలక్షణ లక్షితంబుగాని యీ పురాణమున నుదయ, శాతవాహన చాళుక్య కాకతీయ పర్వములు గల తొలుపాలు నేటి కిటుల వెలువరింప గలుసుమా, దాని కంగంబుగా కృత్యవతారిక సంతరించెదా' అన్నారు.

ఇక రచనా విషయము:

'ఈ రచన భావవిషయమున నన్నయగారిని మించినది' అన్నారు పీఠికలో శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు. నన్నయపట్ల మహాత్మ్యక్యంగల శ్రీ సత్యనారాయణగారినుంచే అలాంటి యోగ్యతాపత్రాన్ని అందుకున్న మధునాపంతులవారి రచనాదక్షతనుగురించి ఇతరుల మెచ్చుకోళ్ళు పునరుక్తులు! అయినా ప్రతి పర్వరసాంచితమై మోజుగొలుపుతున్న ఈ రచనను అచ్చటచ్చట కొంచెం చవిచూతాము.

హేలను గూర్చికవి:—

ప్రతి జీవాణువునందు ప్రాకృత సర
 స్వత్వంశ వీణాదర
శ్రుతులం జిందులు వోయ గంటెఅల యం
 చుల్ వంచకే చూచి యు
న్నతి నుల్లమ్మొక వెల్లివెల్లియయి హొం
 గన్ హేల భూపాలుడా
రతులెత్తున్: సరియెత్తు లేదనుచు దీ
 ర్ఘంజూచు నబ్బానకున్.

"ఉల్లమ్మొక వెల్లివెల్లియయి హొంగి"నది హేలనకో కవిగారికో ఊహించలేము. ఎందుచేతనంటే 'ప్రతి జీవాణువునందు ప్రాకృత సరస్వత్వంశ వీణాదర శ్రుతులం జిందులు వోయ గంటెరఅల యంచుల్ మోవకే చూచి' మురిసిపోతున్నది కవియే:

"కృష్ణ వెణ్ణా" తరంగిణీ తీరభూముల
 ప్రకృతిలో మూగవాచికము లెరిగి
పసిడిపచ్చని వరిపైరు పంటపొలాల
 పొలుపులో మెలపైన తలపులేటి

వలిగాలిలో గొంతువదలి పిట్టలజోపు
 పసుచుల పూపభావములు పట్టి
మాయమర్మము దలంపని కృషీవల దంప
 తుల పరియాచకమ్ములనుముట్టి...

తన్మయుం జేతున్నది మధునాపంతుల వారు గాని పోలుని నాటి ప్రాకృత కవులుగారు. 'వలిగాలిలో గొంతువదలి పిట్టలజోపు పసుచుల పూపభావములను సీతాశోక చిలుకలను వలె పట్టుకుని వినోదించుకున్న వాడు ఆంధ్ర పురాణకర్తయే గాని ప్రాకృత కవులు కానేకారు. శ్రీనాథుడు చెప్పినట్లు 'జొన్న కలి, జొన్న యంబలి, జొన్నన్నము, జొన్నకూడు జొన్నలె గానీ' సన్నన్నము చవిచూడగని, అనకట్టకు పూర్వదినాల పోలుని నాటికవులు 'కృష్ణవేణ్ణా' తీర భూముల...పసిడిపచ్చని 'వరిపైరు పంటపొలాల పొలుపు' లెట్లు చూచినారు!

ఆంధ్ర భారతీ దర్శన భాగ్యసమున్నతుడైన రాజరాజు:

అమృతప్రాయము నీ కటాక్షరుచి క
 మ్మా! దోయిలిం బట్టినా
రము; రారమ్ము జ్వలత్కృశాను శిఖలా
 ర్పన్నేర్పుమై; మా ప్రభు
త్వము బండింపుము నీ దయాతిశయమున్
 వర్షింపు మా శాంత దే
శము నీకోసర మల్లు సాచికొని వి
 శ్వాసంబు నిండారగన్

ఛందస్సుందరమైన పద్యకవితా
 సారస్వతంబన్న, మా
డెందంబూరి సముద్రమై పొరలి గొ
 ల్లింజేయ నానంద ని
ష్యందంబై; పసిలేని కూర్పులకు లో
 నైయున్న నీ కాకళా
సౌందర్యం బెటుగూరు! భారతి! భవి
 ష్యంబెంచి దుఃఖం బగున్

నవ కవితార్థగానము వి
 నన్ సకుతూహాలులై కళా పిపా
సువు లిట వేచియుండిరి; వి
 శుద్ధతర స్వరరీతి గీతికా
రవము విపంచికం జొనిపి
 రాగరస ప్రచురంబుగా న బా
డవె విధిరాజ్ఞి! మా యెదలు
 డక్కగొనం గరుణార్ద్రచిత్తవై!

ఈ రచనలో 'భారతావరణ' భాగం మాధురీమయమైన ఒక రసవద్ఘట్టం.

కాకతీయపర్వంలో ప్రతాపరుద్రుని శైశవాన్ని కవి ఇలా వర్ణించారు:

పసినోట ప్రేల్వాటి నవుకందు కేల్దోయి
 పానగబట్టుచు నుగ్గుపోయు వేళ

బసుపు మెరుంగద్దె పన్నీటితో బోరు
  కాడించి వెనదడి యార్చువేళ
మిసిమిమై తళుకొత్త వసలారుపువుధూళి
  యలది క్రొందావి చూఱాడువేళ
బసిడి తొట్టియలోన బవళింపగా బెట్టి
  వేడుక జోలలు పాడువేళ
గనులకు సుదాంజనం బాడికముగ నద్ది
పెదవి చప్పుడుచేసి, లేనుదుటి నడుమ
బొట్టు ముట్టించువేళ నా ముమ్మడంబ
కరగి కరుడయి బిడ్డలో గలసిపోవు.

తెలుగుతనం తొణికిసలాడే యిలాంటి పద్యాలు ఈ గ్రంథంనిండా కోకొల్లలు.

పద్యనిర్మాణ శిల్పంలో శ్రీ శాస్త్రిగారు ప్రాచీనాంధ్రకవుల అనుభవాన్నంతా పుణికిపుచ్చుకున్నారు. అత్యంతమూ శ్రద్ధవహించి ప్రతి పద్యాన్నీ ఒక శిల్పమూర్తిగా తీర్చిదిద్దుతారు.

కొందరు కవులు శబ్దాలంకారాలు వాడితే సుత్తి బుచ్చుకొని దెబ్బమీద దెబ్బ నెత్తిమీద కొట్టినట్టుంటుంది. శబ్దాలంకారాలు విన్యాసం చేస్తున్నట్టుకూడా అనుమానం తగలకుండా పూవులువిరజిమ్మినట్లు విరజిమ్ముకుంటూ పోగల మహామహుడు నాచనసోమన. శాస్త్రిగారి సీసపద్యాలను గమనించితే నాచనసోముడు ఆ పదజాలముల జాలవల్లికలనుంచి తొంగిచూస్తున్నాడా అని భ్రమకలుగుతుంది. మచ్చుకు:

తొలితొలి తిలకింపవలసిన పురుటింటి
  కీడు లేకడ లిందు జూడ, లేవు
అరయగా నిది మహారాజరాజ యో
  గము గాని సాధారణముగ లేదు
శాస్త్రప్రవేశము సర్వకళారక్తి
  చలముడింపని సాహసమ్ము పెంపు
పెండ్లి కేగినయట్లు పెనకువంజొచ్చుట
  బెబ్బులిపాల్పిండు నిబ్బరంబు
కలుగు గ్రహసంపుటమ్మిద్ది; కానియొకటి—
రాహువపకారిగానుండి యాహవముల
మునరిన తురుష్క సైన్యసమూహములను
దళచు తోలించి, కడసారి కులుచపలుచు.

నవ్యాంధ్ర సాహిత్యంలో అవతరించిన కొలది కావ్యాలలో ఇది ఒక అమూల్యమణి. ఆంధ్రపురాణం ఉత్తరభాగం కూడా త్వరలో వెలువడగలదని ఆశించుతున్నాం.

ఉత్తర గీత

శ్రీ మైదూరు తిరుమలాచార్యులవారు 'సరళ గరళా' యను ఛందస్సున, కన్నడమున రచించిన ఉత్తరగీతయను గ్రంథమునకు దండకరూపమున అనువాదము; అనువాదకులు శ్రీ కరణం అశ్వర్థరావుగారు; భారత యుద్ధానంతరము, మున్ను తా నుపదేశము పొందిన గీతాతత్వమును మరచి, అర్జునుడు రాజ్యపాలనము విషయసుఖమే యగునని విచారించుచుండ, శ్రీకృష్ణభగవానుడు మరల నొక కథావ్యాజమున తత్వోపదేశము నొనర్చెను. అది యీ ఉత్తరగీత. ప్రాప్తిస్థానము: గ్రంథకర్త, కలగోడు, రాయదుర్గం తాలూకా అనంతపురం జిల్లా. మూల్యం 0-4-0.

పుత్రవతీ హితోపదేశములు

రచన: శ్రీ యీశ్వర సత్యనారాయణశాస్త్రి

ప్రచురణ: శ్రీ శరద్వద వైద్యశాల, శ్రీకాకుళం. మాతృత్వ పరిపోషణమునకు, శిశుసంరక్షణమునకూ కావలసిన అనేక విషయాలు శ్రీ శాస్త్రిగారు యిందు ఉల్లేఖించారు. ఇంటింటా ఉండదగిన గ్రంథం; వెల 1-0-0.

12. టిస్యూ ఔషధములు

మూలం: డాక్టర్ షోయరిక్, డాక్టర్ ద్యూయీ; తెలుగు అనువాదం: డాక్టర్ శ్రీ వేమవరపు వేంకటరమణ శర్మ, కొత్తపేట, తూర్పుగోదావరిజిల్లా; వెల: 5-0-0.

మహర్షి జీవిత కథామృతము

ప్రాచీన భారతవర్ష మహర్షుల జీవితచరిత్రలు. (రెండవ భాగం). వచనం; రచన: శ్రీ బులుసు వేంకటేశ్వరులు; రామారావుపేట, కాకినాడ: వెల 2-0-0.

Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press,
No. 7. Thambu Chetty Street, Madras. Editor: S. Sambhu Prasad.